మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.12.2024



చైతన్య కిరణాలు

# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక, జనవరి, 2025 ₹ 50/-

ISSN 2454–4329



అందానికి



అలంకారమెందుకు?

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 36 సంచిక 1

జనవరి - 2025

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI — Since 1946 —

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR

**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

UGC Care

LCCN 91-903060

ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com

YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## జనవరి నెల సూచికలు...


అమెరికన్ ఈగల్ : ఎడిటర్ డైరి ... 3
అయ్యంగారి హంసలు! : ఎ.కె. ... 4
ఉపనిషద్విచారణ : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 10
లలిత సంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 16
కవిత్వ తత్త్వం : డా. గొట్టిముక్కల స్వర్ణలత ... 22
స్వీయరూప చిత్రం పుట్టుక - వ్యాప్తి : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ ... 29
ఆగాఖాన్ పాలెస్ : వేలూరి కృష్ణమూర్తి... 34
తెలంగాణ విద్యా కమిషన్ : డా. యన్. రాజశేఖర్ ... 36
మహారాణి మంగమ్మ : డా. సగిలి సుధారాణి ... 39
మొల్ల మహిళా దృక్పథం : మంగళ గౌరి ... 44
బోయి భీమన్న : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ...47
రావూరి భరద్వాజ భావుకత : డా. తలారి వాసు ... 50
వేల్స్‌లో ఒక వేసవి వారాంతం : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 55
రాజ్యాంగ శాసనసభ చర్చ : డా. ఎ.బి. సాయిప్రసాద్ ... 64
తిరుక్కురళ్ : ఆచార్య యన్. లక్ష్మీ అయ్యర్ ... 67
సూక్తి సురభి : రెంటాల సాంబశివరావు ... 69
కథాహృదయం–అడుగుజాడలు : వి. రాజారామమోహనరావు ... 70
జననాయక జయహే : వంకిరెడ్డి రెడ్డప్ప రెడ్డి ... 71
విషాదాంత జీవిత వి'శారద' : భమిడిపాటి గౌరీశంకర్ ... 75
దాశరథి సాహిత్యం/ఐరోపా చిత్రకళ : సి.ఎస్.రాంబాబు/**మిసిమి** ... 76
చదవండి : **మిసిమి** ... 79




రావూరి భరద్వాజ



శంకరంబాడి

**అట్టమీది బొమ్మలు**




ఆదిత్యుడు



అందానికి



అలంకారమెందుకు?



చైతన్య కిరణాలు

# అమెరికన్ ఈగల్

ఆగండాగండి–ఈమధ్య వాట్సాప్‌లో ఒక ముచ్చట వచ్చింది. ఒక ఫెయిల్డ్ పొలిటీషియన్, మాజీ ఐ.ఎ.ఎస్ దొర – తల్లిదండ్రుల్ని హెచ్చరిస్తూ "మీ పిల్లలకు పెళ్లిళ్లు చేయండి – వారి సంపాదనతో మీరు జల్సాలు చేయకండి" – ఇలాంటిదేదో ఒకటి..

నిన్న ఒక ఆంగ్ల దినపత్రిక మేగ్‌జైన్ సెక్షన్‌లో–ఒకప్పటి మధ్యతరగతి తల్లిదండ్రులు–ఎనభై, తొంభై దశకాలలో ఎన్నో త్యాగాలు చేసి, తలక్రిందులై తమ పిల్లలని అమెరికా పంపి, ఇప్పుడు వృద్ధాశ్రమాల్లో, అద్దె సహాయకుల సేవలో తరిస్తున్నారు అని..

నిజానికి 1980 నుంచి 2000 వరకు జరిగిన కథ చెబుతాను. కొన్ని ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కుటుంబాలు తమ సంతానాన్ని చదివించి, ప్రయోజకుల్ని చేయటానికి–తాము పడ్డ కష్టాలు వారు పడకూడదని, నగరాలకు వలస వచ్చి, తాటాకు పాకల్లో కాపురాలు పెట్టి, ఇంజనీరింగ్ కాలేజీలలో చేర్పించి ఆ తరువాత అమెరికా నగరాలకు పంపి కొంత సేద తీరారు. అయితే, బిడ్డలు పంపిన డాలర్ల, రూపాయల మారకాలతో భూములు, భవనాలు కొని, ఒకటో, రెండోసార్లు అమెరికా వెళ్లి, వారి వైభోగాన్ని చూసి, వస్తూ, వస్తూ, నైకీ బూట్లు, పోలో టీ షర్ట్‌లు తెచ్చుకుని వాకింగ్ చేసారు. బంగారు బిస్కట్లు తెచ్చి గాజులూ చేయించారు! డాలర్లయితే ఎన్.ఆర్.ఐ ఎకౌంట్‌కే వచ్చేవి. ఇటువంటి వారిని వేలమందిని చూసాను. బిడ్డలకు పెళ్లిచేస్తే తమ పెత్తనం కొత్తగా వచ్చే కోడలు, వియ్యపురాళ్లకు ధారాదత్తం చేయటం ఇష్టంలేక బంగారు బాతుల్ని ఈకలు ఊడేవరకు అలాగే ఉంచేవారు. ఆ తరువాత సీను మారిపోయింది. 2000 సంవత్సరం నుంచి బంగారు బాతులన్నీ అమెరికన్ ఈగల్‌గా మారిపోయారు. గిల్ట్ ఫీలింగ్‌ని అట్లాంటిక్‌లో కలిపి, భారత్‌వైపు రావటం మానేసారు. ఎన్.ఆర్.ఐ. ఎకౌంట్లన్నీ వెలవెలపోతుండేవి. కేవలం డెలివరీ బాయిన్‌ని ఆపని అయిపోగానే ఫ్లైట్ ఎక్కించి మళ్లీ సముద్రాలు దాటనివ్వలేదు. వారు వాడేసిన ఐఫోన్‌లు ఇచ్చి పంపారు. (అవి ఇక్కడ సరిగా పనిచేయవు) అది వేరే సంగతి. ఎందుకైనా మంచిదని – తామెప్పుడైనా వస్తే పనికొస్తుందని సిటీలో ఒక అపార్ట్‌మెంట్ కొని, కేర్ టేకింగ్ కోసం మనీ, ఒక మనిషిని పెట్టి ఇటు చూడటం మానేసారు. ఇదండీ ఇప్పటి కథ. వారిలో చాలామంది వృద్ధాశ్రమాలలో చేరటం అనేది తర్వాత పరిణామం – తమ బాధ్యతగా ప్రేమతో కాపాడుకుంటూ వచ్చిన కుటుంబ గౌరవం, కుటుంబ వ్యవస్థ, వ్యవసాయం కనుమరుగైపోవటానికి ఇవన్నీ కారణమే. తల్లిదండ్రుల త్యాగాలేమైనాయి? కుటుంబ సంబంధాలేమైనాయి? మూడోతరం ఐ హేట్ ఇండియా అని అంటే కూడా ఆశ్చర్యపోవట్లేదు. మరొకతరం పెళ్లా! అబ్బే అప్పుడేనా అని కొన్నాళ్లు, అయినా పెళ్ళెందుకని కొన్నేళ్లు, అయినా కలిసి బ్రతుకుతున్నామని మరి కొన్నేళ్లు ఇలా కాలం గడిపేస్తున్నారు. ఎవరి ప్రపంచం వారిది. ఎవరినీ తప్పు పట్టకూడదండోయ్!

– – – –




తరచూ వెళ్లే సాహిత్య, సంగీత, నాటక సభావేశాలకు భిన్నంగా రాత్రి అరుదైన పుస్తకావిష్కరణకు వెళ్లాం. మాట్లాడిన వారంతా భూసార విజ్ఞానంలో నిష్ణాతులు. నాబార్డ్ ఛైర్మన్ (పూర్వ) డా. చింతల గోవిందరాజులు, నామ్ డైరెక్టర్ డా. కె. శ్రీనివాసరావు, డా. అల్లూరి పద్మరాజు (పూర్వ వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం), రైతునేస్తం పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వర రావు – కొందరు డాక్టరేట్లు, కొందరు పద్మశ్రీలు. అయితే అందరి ఆవేదన భారతదేశ వ్యవసాయ భూములు ఎలా నిస్సారమైపోతున్నాయో, వ్యవసాయంలో సేంద్రీయ, సుస్థిరీకరణ ఎలా అంచెలంచలుగా అమలు చేయాలని రెండు గంటలు సాగిన ఉపన్యాసాలలో ఎంతో సమాచారం – విజ్ఞానం పంచిపెట్టారు. చాలా విషయాలు నేర్చుకుని ఇంటికి చేరాం. పాల్గొన్నవారిలో ఎక్కువ శాతం వ్యవసాయ విజ్ఞానంలో ఆరితేరినవారే. వలేటి గోపీచంద్ ఈ కార్యక్రమానికి కర్త, కర్మ, క్రియ.

–

# అయ్యంగారి హంసలు!

"మీ పైలెట్‌ని-రాజేష్‌ను మాట్లాడుతున్నాను. అరగంట ఆలస్యమైనందుకు క్షమాపణ - విచారం వ్యక్తం చేస్తున్నా. చెన్నైయ్ చేరటానికి గంటా పదినిమిషాలు పడుతుంది. ఆలస్యాన్ని కొంతవరకూ తగ్గించడానికి ప్రయత్నిస్తాను".
సామాన్యంగా ఎయిర్‌పోర్ట్ ప్రసారాలు - విమానవతులు చెప్పేది - నాకేమీ అర్థం కావు. చివరిలో ధన్యవాద్ అనో - థ్యాంక్యూ అని మాత్రమే తప్ప. రాజేష్ చాలా స్పష్టంగా విషయాన్ని వివరించాక - విమానం గాలిలో లేచింది - హైద్రాబాద్‌లో ఇంకా చాలా ఖాళీ స్థలాలున్నట్లు కనపడుతుంది - మధ్యలో టర్బులెన్స్ అని చెప్పారు కాని, అలాంటిదేమీ లేదు - చాలా సుతారంగా మద్రాసులో దింపాడు - నాకయితే రాజేష్‌ని విష్ చేయాలని వుంది - విమానవతి నవ్వుతూ నమస్తే చెప్పేసింది.
మీరు చెప్పితే నమ్మరు ఎక్కడో రోడ్డు పక్కన ఆపి బస్సులు పెట్టారు. అయ్యో చెప్పటం మర్చిపోయాను, ఇండిగో వారు గాలిలో మంచినీళ్లు కూడా ఇవ్వరు. టెర్మినల్ వన్‌లోకి తీసుకెళ్లారు. ఈగలు కూడా లేవు. నిర్మానుష్యంగా వుంది. ఒకచోట - ఒక్కచోటే వుంది, ఆగి కాఫీ తాగాలి - మూగ బాసల సైగలతో కాఫీ తాగాం. రెండు ఫిల్టర్ కాఫీ యాభైరూపాయలే. అదీ ఎయిర్‌పోర్ట్‌లో - హైద్రాబాద్‌లో - 200/- బెంగుళూర్‌లో 250/- ఇట్లా చెప్పుకుంటూ పోతే కడుపు - చించుకోవడమే!
ప్రొ. లక్ష్మి అయ్యర్ మాకోసం కారు పంపారు. సెంధిల్ మేము హైద్రాబాద్‌లో ఎక్కకముందు టెర్మినల్‌కి వచ్చి ఉన్నాడు - చివరికి సింధిల్‌ని పట్టుకుని - ఇన్నోవా ఎక్కాం - సార్ నేను చెప్తున్నా నమ్మండి! ఇది వయసుమళ్లిన నగరం! నాలాగే అనుకోండి. హైద్రాబాద్‌లా కళకళలాడదు - పారిస్‌లాగా వెలవెలపోతోంది చూడండి అన్నాను రాంబాబుతో! దగ్గర్లోని అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణం - ఓ వెయ్యి ఎకరాలుంటుంది - లోపల ఇంటర్నేషనల్ హాస్టల్ గెస్ట్‌హౌస్‌కి చేరాం - దానిపేరు ఫ్లోరా! ప్రత్యేక అతిథుల గదులు చాలా సౌకర్యంగా వున్నాయి - 8 గదులే వున్నాయి - మాది 105. మేము కారు దిగగానే ప్రొ. లక్ష్మి పాదాభివందనం చేస్తుంటే - నేను సిగ్గుపడ్డాను. గౌరవం అడిగితే ఇస్తారా? చక్కని భోజనం వడ్డించారు. కొంతసేపు నిద్రపోయి - సెమినార్ టీంతో ముచ్చటించాం - లక్ష్మిగారు రాజ్‌భవన్‌కి - ఇక్కడికి తిరుగుతూనే వున్నారు - ఒక డైనమో! మేము వచ్చామని వరుణుడు రెండుసార్లు చిలకరించి పలకరించి పోయాడు.
రాజభవన్! వెయ్యిపైన రెండువందల ఎకరాలు - పచ్చని లాన్స్ - తెల్లని భవనాలు - బంగారు రంగు విగ్రహాలు - ఎత్తు టోపీ సిపాయిలు - ఎప్పుడైనా పైన ఎగిరే విమానం - బోనుల్లో కాపలా జాగిలాలు! ఇచ్చోటనే కదా కీర్తిశేషులు రోశయ్య - జయలలిత - కరుణానిధిలతో ఆరేళ్లు ఆరళ్లు పడ్డారు!
మర్నాటిప్రోగ్రాం - గవర్నరు గారితో ప్రతినిమిషం వివరంగా ఇచ్చారు. పొంగల్ ఆరగించి తొమ్మిదింటికే రాజభవన ప్రాంగణంలోని భారతీయార్ సభా మండపానికి చేరాం.
భారతీయార్ సభా మండపం - రాజస్థాన్ పింక్ కలర్ స్కీమ్. రెండు పెద్ద షాండిలీర్లు వెలుగు లీనుతున్నాయి. పింక్ రంగు తెరలు విలాసంగా వేలాడుతున్నాయి. మండపంపైన ఆరునొక్క దర్జా కుషన్ కుర్చీలు ఆహ్వానం పలుకుతున్నాయి. జాగిలాలు వరండాలు వాసన చూస్తున్నాయి. లేత ఎండ ఆకుపచ్చని లాన్ మీద బద్ధకంగా వళ్లు విరుస్తోంది. నాలుగు విశాలమయిన మానిటర్లు సిద్ధంగా నిలుచున్నాయి. మైకాసురుడు చెక్ చెక్ అని చెక్‌తున్నాడు - ఎటువంటి పూల తోరణాలు లేవు. సభ్యులంతా సాంప్రదాయ దుస్తుల్లో పండగ వాతావరణాన్ని ఆహ్వానిస్తున్నారు - అందరూ ఆహ్వానంపై వచ్చిన అతిథులు, లేదంటే రాజభవన ప్రధాన ద్వారం దాటనివ్వరు! ఇంటర్ నేషనల్ - మల్టీ లింగ్వల్ సెమినార్‌కి విచ్చేసిన గాలక్సీ ఆఫ్ ప్రొఫెసర్లను కలిసి ముచ్చటించాము - ఏర్పాట్లన్నీ పక్కాగా వున్నాయి. తమిళ్ గీత రచయిత వానవల్ రవి గారు చాలా స్నేహపూర్వకంగా పలకరించారు - నిండైన విగ్రహం - ద్రవిడ జీన్సు కాదనిపిస్తుంది.

గౌరవనీయులు రాష్ట్ర గవర్నరు శ్రీ ఆర్.ఎన్. రవి గారు రాజువెడలె అన్నట్లు అంత ఆర్భాటంగా వచ్చారు. 'అవన్నీ పదవీ భూషణాలు! ప్రచ్ఛన్న తోరణాలు! 10.30 గంటలకు సెమినార్ – జనగణమణతో ప్రారంభమయ్యింది. మహాజ్యోతి ప్రజ్వలనతో వెలుగులు పూసింది – వేదికపైన గవర్నర్ గారితో మరొక ఆరుగురు మాత్రమే వున్నాం – (ప్రొ. సంజయ్ అరోరా, ప్రొ. లక్ష్మీఅయ్యర్, గీతరచయిత వానివల్ రవి, డా. లక్ష్మీకాంత శర్మ.) అందులో నాకూ పీఠం వేశారు ప్రొ. లక్ష్మి.

గవర్నర్‌ని లక్ష్మిగారు సన్మానించారు. గవర్నరు మా అర్గురుని పేరు పేరునా పంజాబీ అద్దాల శాలువా – మా బొమ్మ వున్న గౌరవప్రదమైన ఫ్రేము – గెస్ట్ ఆఫ్ ఆనర్ పత్రంతో సన్మానించారు. నన్ను 'గ్లోబల్ రైటర్' అని గవర్నర్‌కి లక్ష్మిగారు పరిచయం చేశారు. నేను **మిసిమి** నవంబరు సంచిక అందించాను. ఆయన **మిసిమి** పాలబుగ్గలను సవరించారు!



గౌరవ అతిథికి గౌరవ గవర్నర్ సత్కారం

ప్రొ. లక్ష్మి చాలా సందేశాత్మకంగా – ఉత్తేజభరితంగా ఝాన్సీలక్ష్మీ మాదిరి ఉద్రేకపూర్వకంగా ఉపన్యసించారు – భారతీయ భాషల భిన్నమైన ఔన్నత్యాన్ని, తిరుక్కురళ్, కబీర్, వేమన ప్రాశస్త్యం – వారు ప్రబోధించిన రేషనల్ ఆలోచనలు – మూఢనమ్మకాలను ఖండన వారి ఉపన్యాసంలో వివరించారు. గౌ. గవర్నర్ రవిగారు భారతీయ సంస్కృతి – భారతదేశ భౌగోళిక వైభవం – భారత ప్రజల నాగరిక సాంప్రదాయాలను వివరిస్తూ – చాలా విలువైన వుపన్యాసం ప్రసంగించారు. అప్పటికి 12.30 ని॥లు కావస్తోంది. జనగణమణతో ప్రారంభ సంచిక ముగిసింది గవర్నర్ నిష్క్రమణతో – అల్పాహారం అందించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు ద్రవిడ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ హరికృష్ణ, మద్రాసు తెలుగు సమాఖ్య నుంచి శ్రీమతి శివకుమారి, రాధిక గార్లు, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యవర్గ సభ్యులు శ్రీమతి ప్రసన్న లక్ష్మి, శ్రీమతి పార్వతి గార్లు.

ఒంటిగంటకు పత్ర సమర్పణ సమావేశంలో నన్ను అధ్యక్షునిగా ఆసీనుగావించి మరో నలుగురు ప్రొఫెసర్లను నాకు అండగా వుంచారు. హిందీ, తమిళ్, తెలుగు భాషలో తిరుక్కురళ్, కబీర్ – వేమన త్రయం – తులనాత్మక అధ్యయనం అంటూ పత్రాలు సమర్పించేవారు అయిదు నిమిషాలు మాట్లాడి పత్రాలు నాచేతికిచ్చి దిగిపోయారు – వేదికమీద ఉన్న మేము కూడా పత్రాలు చదివి సమర్పించాం – అవన్నీ పార్వతి గారు అందుకున్నారు – 2.30 గంటలకు భోజన విరామం తర్వాత – మళ్లీ నాలుగున్నర వరకూ పత్రాలు వస్తూనే వున్నాయి!

ఈ కార్యక్రమం రెండు హాల్సులో జరిగింది – ఒక వేదికను రేడియో రాంబాబు అలంకరించారు. సాయంత్రం అందరూ ఓ గంటసేపు ఇంటరాక్ట్ అయ్యారు. తెలిసివారు, తెలుపుకున్నవారు– చాలా చనువుగా మాట్లాడారు. తెలుగువారంతా మా చుట్టూ చేరారు. అంతటి సభలో గవర్నరు శాలువా కప్పారు కదా – ఆ రకంగా మొదటిరోజు ముగిసింది.

ఒక విషయం చెప్పాలి. కాఫీ ప్రియులకు మద్రాసు అనువైన ప్రదేశం – కాని – అతిథి గదులకు ఆ సౌకర్యం లేదు. ప్రాంగణంలో ఆ వసతి లేదు. రాంబాబు గారు వూరుకోరు! స్విగ్గీని పట్టుకుని ఎ2 భవన్ (ఎ2 బి రెస్టారెంట్ నుంచి అంటే అడయార్ ఆనంద భవన్ అన్నమాట!) నుంచి మాంచి కాఫీ ఏర్పాటు చేశారు. మేము రెండుసార్లు తాగి ఎదుట గది ప్రొ. శుక్లా గారికి కూడా ఇచ్చాం!

ప్రొ. శుక్లా గురించి రెండు మాటలు చెప్పాలి. ఆయన అలహాబాద్ యూనివర్శిటీ నుంచి 15 గంటలు విమానాలు మారి చెన్నైయ్ చేరారు. హిందీలో కబీర్ గురించి పత్ర సమర్పణ చేయటానికి ఆయన సొంత డబ్బుతోనే! రెండురోజులు మాకు తోడుగా లేకపోయినా – మాతో వున్నట్లే – ఒక విద్యార్థిలాగా ఈ పత్ర సమర్పణ కార్యక్రమంలో కూర్చుని నోట్సు రాసుకోవటం చూశాను! వచ్చిన ఎక్కువ శాతం ప్రొఫెసర్లు ఇదే పద్ధతిలో పాల్గొన్నారు – తెలుగు ప్రొఫెసర్లు ఎవ్వరూ రాలేదేమి? నేను, రాంబాబు గారు కాక – మరో నలుగురు వచ్చినట్లు లక్ష్మి గారు చెప్పారు – వారు మొదటిరోజు సాయంత్రం వెళ్లిపోయారని!

ఆదివారం ఆలస్యంగా తెల్లవారింది! రాత్రి రాంబాబు ఎస్కేప్ అయిపోయారు – అన్నగారింటికి. కారణం 16 నవంబరు ఆయన పెళ్లిరోజు! అన్నగారబ్బాయి బలవంతాన తీసుకుపోయాడు! ఆ కథ వేరే వుంది!

ఆదివారం ఉదయం కాఫీ లక్ష్మీప్రసన్న ఇచ్చారు (102) ఆమె అయిదు భాషలు అనర్గళంగా మాట్లాడగలదు – రాయగలదు – తెలుగింటి ఆడపడచు – దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యవర్గంలో వుంది. (కొడుకూ, కోడలు వుద్యోగమే – మనవడు – మనవరాలు ఈమె పెంచుతోంది) ఆమె భర్త ఆ గదిలో ఒక మినీ ఆఫీసు పెట్టారు – ప్రింటర్‌తో సహా – వీరు కూడా సెమినార్‌కి స్పాన్సర్ చేసినవారే – ఎందరో తలా చెయ్యి వేయబట్టీ, వాళ్లని ఇలా రాబట్టటం ప్రొ. లక్ష్మి హెచ్.ఆర్‌కి ఒక కలికి తురాయి –

ఆదివారం అల్పాహారం తర్వాత రాజభవన్ చేరాం – ఈరోజు నిన్నటి టెన్షన్ లేదు – అందరూ ఆహ్లాదకరంగా మాట్లాడుకుంటున్నారు – ఈ సంచికను ప్రొ. లక్ష్మీ ఉత్సాహభరితమైన ఉపన్యాసంతో ప్రారంభించారు – రెండు సభామందిరాల్లో. రెండు వేదికలు ప్రొఫెసర్లతో నిండి వున్నాయి – ఒక్క నేను తప్ప! రెండో వేదికపై తెలుగు పత్రాల కోసం నేను కూర్చోవాల్సి వుంది ముందస్తు ప్రోగ్రాం ప్రకారం – పత్రాలన్నీ హిందీ – తమిళ్‌లోనే వస్తున్నాయి. తెలుగులో ఒక్కటంటే ఒక్కటి లేదు – చివరికి వళ్లుమండి – ఆ పనేదో నేనే చేద్దామని – పల్లకీ దిగి – బోయీనయ్యాను – ఇది అన్యాయం – చాలా వెలితిగా ఉంది తెలుగులో ఎవ్వరూ లేకపోవడం అని, – తిరుక్కురళ్ – కబీర్ – వేమన ముగ్గురు గురించి – నాకు తెలిసింది చెప్పాను – సభానంతరం – ప్రొఫెసర్లు అశ్వినిగారు మీరు, చాలా విషయాలు చెప్పారు – అని మెచ్చుకుంటుంటే – 'బాగా చదివి వచ్చాను' అని నవ్వేశాను –

**మిసిమి**లో తిరుక్కురళ్ ప్రొ. లక్ష్మి అయ్యర్ ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

ఈ రెండు సమావేశాలు – 4 గంటల వరకు జరిగాయి – భోజన విరామంతో – అప్పుడు అసలు కలకలం మొదలయింది. ముగింపు సమావేశానికి – అన్నామలై విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ – మద్రాసు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్లు విచ్చేశారు. చక్కగా ఉపన్యసించారు. అందరూ శ్రద్ధగా విన్నారు కూడా – ప్రొ. లక్ష్మి అందరినీ పేరుపేరునా అభినందించారు. చివరిలో ఇప్పుడు గవర్నర్ గారి గ్రూప్‌ఫోటో వుంది, అని సూచన ఇచ్చారు! ఆ సమయం రానే వచ్చింది – నన్ను ఆమె పక్కన కూర్చోపెట్టుకున్నారు. ఆమె ప్రక్కన గవర్నర్ రవి గారు – కెమెరాలు క్లిక్కుమన్నాయి. మా వెనుక సెమినార్ డైరెక్టర్లు – కార్యకర్తలు – కలకలలాడుతూ – దీనితో రెండో సంచిక ముగిసింది! తర్వాత చక్కని రాజస్థాన్ స్వీటు, సమోసా – కాఫీతో అల్పాహారం.

*తిరువళ్ళువార్, కబీర్, వేమన ఒకే కాలానికి చెందిన వారు కాకపోయినా వారిలోని భావసారూప్యత ఈ సదస్సుకు మూల కారణం అని చెప్పవచ్చు.. అందుకే తులనాత్మక పరిశీలనగా వివిధ భాషల్లో పత్రసమర్పణ చేశారు వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులు.. హిందీ,తమిళం, తెలుగు, మళయాళం, కన్నడ భాషల్లో పత్రసమర్పణ జరిగింది.ఈ పత్రసమర్పణలో దేశంలోని అనేక ప్రాంతాల నుంచి వక్తలు పాల్గొన్నారు.*

*అధిక శాతం పత్రాలు హిందీ భాషలో ఉంటే ఆ తర్వాత స్థానం తమిళం భాషది.. తెలుగులో పత్ర సమర్పణ చేసినవారు చెన్నై నుంచి వచ్చారు.. కుప్పం విశ్వవిద్యాలయం, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలనుండి వచ్చారు.*

*మళయాళం, కన్నడం భాషల్లో కూడా పత్ర సమర్పణ జరగటం విశేషం.. దేశంలోనే మొదటి సారి ఈవిధమైన సదస్సు జరగటం విశేషమైతే భాష ఏదైనా భావం మాత్రం ఏవిధమైన సందేహం లేకుండా అందరికీ చేరటం ఈ సదస్సు సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు.*



ఝాన్సీలక్ష్మి

*సమాజాన్ని చైతన్యపరచిన ముగ్గురు చారిత్రిక పురుషులపై సదస్సు కోసం ప్రొ లక్ష్మి అయ్యర్ గారు చేసిన ఈ కృషి అమితాశ్చర్యాన్ని కలిగించింది. మొదటిసారిగా ఈ సదస్సు సువిశాలమైన రాజ్‌భవన్ ప్రాంగణంలో జరిగింది. ఆ రకంగా భాగస్వామ్యం పంచుకోవడం బహుశః దేశంలోనే మొదటిసారేమో. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో **179** మంది పాల్గొన్న ఈ సదస్సు నిర్వహణలో ప్రొ.లక్ష్మీ అయ్యర్ శ్రమ, శక్తి మాటల్లో వర్ణించలేనిది.*

*ఈ సదస్సు నిర్వహణలో పాలుపంచుకోవటానికి ముందుకు వచ్చిన ఇతర భాగస్వామ్యులు రాజస్థాన్ సెంట్రల్ యూనివర్శిటీ, పాలక్కడ్ తమిళ్ కల్చరల్ రీసెర్చ్ సెంటర్‌లను ఆవిడ ఏవిధంగా ఒప్పించారో కానీ ఆ రెండు రోజులు చెన్నై రాజ్‌భవన్ ఒక అపురూప దృశ్యమానమై సాక్షాత్కరించిదంటే అతిశయోక్తి కాదు. ఏ సదస్సు అయినా రక్తి కట్టాలంటే కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలి. ప్రొ. లక్ష్మీ అయ్యర్ గారికి దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యవర్గ సభ్యుల రూపంలో ఆ కార్యకర్తలు లభించారు. లక్ష్మీ గారు గల గల పారే ప్రవాహంలా సభాస్థలి అంతా కలియదిరగటమే కాదు – వచ్చినవారందరికీ సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయో లేదో అని సమీక్షించిన తీరు కూడా శ్లాఘనీయం.*

**కొన్ని హైలైట్స్ :** బల్లేపల్లి రమేష్ గారు – హైద్రాబాద్ – వేమన పద్యాలన్నీ సంగీత భరితంగా పాడి – రికార్డు చేస్తున్నారు – కొన్ని వినిపించారు కూడా – ఇప్పటికి 400 పద్యాలు పాడారు. "నీ గొట్టంలో" వున్నాయి వినండి! కొందరు తెలుగువారు – మద్రాసు – ఆ చుట్టుపక్కల స్థిరపడినవారు – మాతో మాట్లాడి చాలా ఆనందంగా ఫీల్ అయ్యారు – ఎక్కడెక్కడ నుంచి వచ్చారు! పాండిచ్చేరి నుంచి వచ్చిన సంగీత దర్శకుడు ఆనందన్ తెలుగువాడే. కుటుంబంతో సహా వచ్చారు – ప్రియదర్శిని – పద్మప్రియ – ఎందరో – తెలుగువారు – కలగలిసి పోయారు – పార్వతి గారు ఈమె ఒక క్రాంప్టన్ ఫాన్ – అవిశ్రాంంగా తిరుగుతూనే వున్నారు – చిదంబరం నుంచి శ్రీ జగన్నాథ రెడ్డిగారు – వారు ప్రేమగా కట్టుకున్న ఇంటిని చూడటానికి తప్పక రమ్మన్నారు! శనివారం రాత్రి పెళ్లిరోజంటూ వెళ్లిన రాంబాబు – చిన్నపాటి అతివృష్టితో వచ్చారండీ – సమావేశ మందిరానికి! ఎలాగో మందులు వేసి సరి చేశాం – మర్నాటికి ! ఆరోజు ప్రయాణం కదా – సోమవారం – మహాబలిపురం వెళ్లాలని అనుకున్నాము – సింధిల్ హడావుడిగా వున్నాడు – ఆరోజు సోమవారం – ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతారు – వద్దనే చెప్పారు– అందుకే ఉదయాన్నే సంగీత్‌కి వెళ్లి చక్కని టిఫిన్ చేశాం – గ్రాండ్ స్వీట్స్ అనీ అక్కడే చాలాసేపు తిరిగాం – తీరా వెళితే అది అవసాన దశలో వుంది– 'పెసర పప్పు వాల్వా' (మూంగ్‌దాల్ స్వీట్) చేయటం మానేశాం అన్నారు – ఉసూరుమంటూ ఒక ఆటో పట్టుకుని 'అన్నా'కి పొమ్మంటే వాడు సందులు, గొందులు తిరిగి వెనక ప్రక్కకు వచ్చాడు – అది వైస్‌ఛాన్సలర్ ఇంటి గేటు – సెక్యూరిటీ ఆపి, ముందు నుంచి పొమ్మన్నాడు – గిరగిరా త్రిప్పి ఆటో దింపాడు – వాడు చేసిన తప్పులకు మేమే పెనాల్టి కట్టాం –

విమానం సాయంత్రం 4 గంటలకు – 2 గంటలకు బైట పడాలి – అక్కడికి పది కూడా కాలేదు – ప్రొ. లక్ష్మి ఇంకా రాజభవన్ – రాకపోకలు సాగిస్తూనే వున్నారు – అలా వచ్చినపుడు భోజనానికి ఆపి – వీడ్కోలు చెప్పి – శలవు తీసుకుని – నూరేళ్లు వర్ధిల్లాలని దీవించాం! ఆమె మాకు పాదాభివందనం చేస్తుంటే నివారించలేకపోయాం – నాకు కన్నీళ్లు అసలు రావు! ఎప్పుడో ఎండిపోయాయి!

ఆగండాగండి – కథ ఇంకా అవ్వలేదు –

అన్నీ సర్దుకుని – మళ్లీ స్నానంచేసి – ఇది మూడోసారి.

క్యాబ్‌లో టెర్మినల్ 4కి వచ్చాం – నిన్ననే చెకిన్ చేసి బోర్డింగ్ పాస్ ఫోన్‌కి తెప్పించాం – ఆధార్‌లో రాంబాబును గుర్తుపట్టకపోతే (వీరు ఆధార్‌లో వెంకటేశ్వర స్వామి – ఇప్పుడు శంకరాచార్య) అప్పటికే లోపలికి వచ్చిన నన్ను బోర్డర్ సెక్యూరిటీ మేరీకామ్ పిలిచింది – ఆయన్ని గట్టెక్కించి – లోపలికి వస్తే – ట్రాలీ చెకిన్ చేస్తానని కౌంటర్‌కి వెళ్లారు రాంబాబు – అక్కడ ప్రింట్ బోర్డింగ్ పాస్ తెచ్చారు – చూస్తే 6 గంటలకు

డిపార్చర్ అని వుంది – అక్కడ తిరుగుతున్న ఎయిర్ ఇండియా సూపర్‌వైజర్‌ని పట్టుకుని మా డబ్బు ఇచ్చేయ్ – పోనీ హోటల్ ఇవ్వండి అని నవ్వుతూ అడిగాను. అయ్యా మీకు ఫ్రీ స్నాక్స్ ఏర్పాటు చేశాం – గేట్ నెం. 20కి వెళ్లండి అన్నారు – అక్కడ మాలాంటి వారు తప్ప ఎవ్వరూ లేరు – మూడు గంటలు ఊరికే గడిచిపోతాయా? ఆహారం అందుబాటులో లేదంటే ఆకలి ఎక్కువ వేస్తుంది. ఒంటి గంటకు తిన్న సాంబారన్నం ఎప్పుడో అరిగిపోయింది – ఎనౌన్సర్ గోల ఏమీ అర్థం కావట్లేదు – ధన్యవాద్ తప్ప!

అక్కడ వున్న స్నాక్‌బార్‌కి వెళ్లి రేట్లు చూస్తే కళ్లు బైర్లు కమ్మాయి.

రాంబాబు గారు – ఏమిటిది – టెర్మినల్ వన్‌కి వెళ్లి కాఫీ తాగి వద్దామా? అంటే చాలాదూరం– అని దిక్కులు చూస్తున్నారు – పోనీ పైకి వెళ్దాం పదండి – అంటూ లేవదీశాను – నా ట్రాలీ సెమినార్ సంచులు అక్కడే వదిలివెళ్లాం! రెండతస్తుల ఎస్కలేటర్ – ఎక్కి ఏవో గేట్ నెంబర్లకు వచ్చాం – అక్కడ అబిడ్స్‌లో వున్నట్లు రోడ్డుపక్క దుకాణాలున్నాయి. ఇదేమిటండీ అంటే ఇది గవర్నమెంటు ఎయిర్‌పోర్టండి – అని సమర్థించారు, ఒకప్పటి గవర్నమెంటు ఆఫీసరు ముందుకి – చాలా ముందుకెళ్లాం – డబ్బు పెట్టి తాగుదాం అని – అక్కడ ఎయిర్ ఇండియా వారి స్నాక్స్ అందిస్తున్న కౌంటర్ వుంది – బోర్డింగ్ పాస్ చూపించి స్నాక్స్ తీసుకున్నాం – దండిగానే ఇచ్చారు – కాఫీ కూడా బాగుంది. దగ్గర్లో బ్రిటీష్ ఎంపైర్ బార్ వుంది – ఎట్లాగో ఆరయింది – అట్లాగే ఆరున్నర అయ్యింది.




గవర్నర్‌తో గ్రూప్‌ఫోటో

ఇక్కడో విషయం చెప్పాలి – విమానాలు ఆలస్యం అవటం అరుదేమీ కాదు – ఇక్కడ మనం చూడాల్సింది ప్రయాణీకుల స్పందన – చాలా దేశాలు తిరిగాను – లెక్కలేనన్ని ఎయిర్‌పోర్ట్‌లు చూశాను – ఆలస్యం అనేది టైము తెలపటానికే. లుఫ్తాన్సా – స్విస్ ఎయిర్ – డెల్టా, ఇలా ఆలస్యం కాని ఎయిర్ లైన్ వుండదు! అందుకు అనేక కారణాలుంటాయి. బార్సిలోనాలో ఆరుగంటలు ఆలస్యం అయిన రెన్‌ఫే స్పీడ్ ట్రయిన్ ప్రయాణీకులు ఎవరూ కోపగించుకోవడం – వాదులాటకు దిగడం చేయలేదు – కాని – ఇక్కడ చాలాసార్లు చూశాను. బొంబాయిలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఆలస్యంగా వచ్చిన పైలెట్‌ను కొట్టబోయిన ప్రయాణీకులు – ఇండిగో స్టాఫ్ చేతిలో దెబ్బలు తిన్న ప్రయాణీకుడు – నిన్నటి రైలు ఇవాళ వచ్చినా ఫ్లాట్‌ఫాం మీద వీరంగం వేసిన పాసింజర్లు – ఇలా ఎన్నైనా చెప్పగలను – మన తిరుగుబాటు ప్రయాణాలకే పరిమితం – బయట ప్రపంచంలో – జరుగుతున్న అన్యాయాల్ని చూస్తూ వెళ్లిపోతాం. లంచాలు సంతోషంగా ఇస్తాం – సాంఘిక దురాచారాలతో పోట్లాడలేము – ఈ దేశంలో విప్లవం వస్తుందని కలలుకనే వారికి చాలా నిజాలు తెలియదు!




ప్రొ. లక్ష్మీఅయ్యర్,
చెన్నూరి రాంబాబు

ఆయనెవరో అన్నట్లు – విప్లవం పక్కనపెట్టండి – పునర్జీవ వికాసం కూడా కలగనలేము – అదేనండి రినయిజాన్స్ అంటామే అదన్నమాట!

ఎయిర్ ఇండియా టాటా వారు తీసుకున్న తర్వాత చాలాచాలా మార్పులు వచ్చాయి. ఇన్‌ఫ్లైట్ సర్వీస్ ఎంతో మెరుగయింది – ఆలస్యమైనందుకు పైలట్ ఒకటికి రెండుసార్లు సారీ చెప్పాడు – గంటలోనే హైద్రాబాద్‌లో స్మూత్ లాండింగ్ చేశాడు. మాకు ఎయిర్ హోస్టెస్‌లు ఎవ్వరూ కనపడలేదు. అందరూ పోతురాజులే సేవలందించారు! వీళ్లకి ఏ పేరు పెట్టాలి? ఎయిర్ హోస్ట్‌లందామా!

జేతవనంలో బుద్ధభగవానుడు మధ్యాహ్నం ప్రబోధ వచనాల తర్వాత చెట్లనీడలో నడుస్తుండగా ఒక శిష్యుడు - భంతే - ప్రయాణం ముఖ్యమా? గమ్యం ముఖ్యమా? అని వినయంగా అడిగాడు బుద్ధుడు చిరునవ్వుతో ప్రయాణంలో తోడు ముఖ్యం నాయనా! అన్నారు.



బుద్ధుడు మాట్లాడేముందు చిరునవ్వు నవ్వుతాడు

కృష్ణుడు మాట్లాడిన తర్వాత చిరునవ్వు చిందిస్తాడు.

15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 18 తేదీ రాత్రి 7 గంటల వరకూ నాకు తోడుగా ఎప్పుడూ నవ్వుతూ వున్న రేడియో రాంబాబు గారు - బుద్ధుడు చెప్పినట్లు ఈ ప్రయాణంలో నాకు గొప్ప కంపెనీ - ఒక అన్న తమ్ముణ్ణి ఎలా కాపుకాస్తాడో ఎయిర్‌పోర్టు పికప్ పాయింట్ దగ్గర చూశాను. క్యాబ్ బుక్ చేస్తుంటే 'సార్ అని వినపడింది' - అంతే ఇవ్వండి - అని చేతిలోని ట్రాలీ తీసుకుని పార్కింగ్‌కి నడిచాడు - అతని వెంటే వున్నతను రాంబాబు గారి ట్రాలీ తీసుకున్నాడు - కాబ్ దగ్గర బూట్‌లో రెండు ట్రాలీలు పెట్టి డోర్ తీసి కూర్చోండి సార్ అన్నాడు - అప్పుడు కారు తాళాలు తమ్ముడికిచ్చి జాగ్రత్తగా సార్‌ని కొండాపూర్ తీసుకువెళ్లు' అని చెప్పాడు - దారిలో అడిగాం - మీ అన్నయ్యా? అని అవును సార్ - అన్నాడు మా చక్రవర్తి!! మీ అన్నయ్యకి వేరేకారు వుందా? - అవునుసార్ - ఎప్పుడూ మొదటి రైడ్ నాకే ఇస్తాడు!!

**కొసమెరుపు :** ఇన్నాళ్ల నుంచి హైదరాబాద్‌లో పావురాలు తప్ప కాకులే కానరావు - మద్రాసులో, - అడయార్‌లో అయ్యంగారి కాకులు కోకొల్లలు! - అరుపులు - వినటానికి బాగోకపోయినా - మరిచిపోయిన గొంతులు పలకరించినట్టుంది!

\- [signature]

## బహుముఖ బనారస్

**బ**నారసీతనాన్ని దగ్గరగా చూసి, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్గుణ సంగీతం విని, గంగానది ఘాట్లపైన కవిసమ్మేళనంలో పాల్గొని, ఆ సంగీత సాహిత్య సాంస్కృతిక స్పృహలోంచి పుట్టినదే ఈ బహుముఖ బనారస్. కాశీ-సండితుల నగరం. ఈ నేలమీద పండిత పద్మాలు విరబూయటమే కాదు. పెహల్వానీ పనసపండ్లు కాస్తాయి. శారీరక, మేధోశక్తుల అద్భుత సంగమం ఈ నగరం. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం భారతదేశ ప్రజలకోసం, ప్రజలు ఇచ్చిన విరాళాల చేత కట్టబడిన తొలి విశ్వవిద్యాలయం.




కాశీ నృత్య సంగీత సంస్కృతిలో తవైఫ్‌లు - వారాకాంతలు - ముఖ్యపాత్ర నిర్వహించారు. ఒక తవైఫ్ పాడిన "మనసు ఆటవస్తువు-పగిలిపోయింది..." పాట బిస్మిల్లాఖాన్‌ను ఎంతో కదిలించింది. ఆయన ఆమెతో సంగీత సాధన చేశారు. ఆ పాటను షెహనాయితో అమరం చేశారు. స్మశానంలో హోలీ ఆడటం ఎక్కడైనా ఉంటుందా? కాశీలో దానినే మసాన్ హోలీ అంటారు.

ముక్తి అంటే భవబంధాల నుండి స్వేచ్ఛ పొందటం...
అన్నింట్లో ఉంటూ అన్నింటికీ అతీతంగా ఉండటం...
సౌభాగ్యంలో వైరాగ్యం. సంసారంలో సన్యాసం....

*మన్‌మే ఝూంకాతో గంగా మిలీ,*
*మన్‌మే దూబేతో శంకర్ మిలే*

మనసులోకి తొంగిచూస్తే గంగ దొరికింది.
మనసులో మునిగిపోతే శంకరుడు దొరికాడు.

**మిసిమి** ప్రచురణలు

# ఉపనిషద్విచారణ

**– కోదాటి వియ్యన్నరావు**

భారతీయ ఆధ్యాత్మిక వారసత్వ సంపదలో ఉపనిషత్తుల స్థానం ఎనలేనిది. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, పురాణాలు, సంహితాలు మొదలైనవి భారతీయ వాఙ్మయాన్ని పరిపుష్టం చేసినాయని చెప్పడంలో ఎటువంటి సందేహం ఉండనవసరం లేదు. ఉపనిషత్తులు వేదాలసారమని, మరింత సంగ్రహంగా, అర్థవంతంగా అవి క్రోడీకరించబడినాయని చెప్పబడింది. ఉపనిషత్తులకు సంబంధించి కాలానుగతంగా ఉదయించిన అనేక ప్రశ్నలు, సందేహాలు, సంశయాలలో కొన్నింటిని, ముఖ్యంగా వాటి కాలం, సంఖ్య, గ్రంథకర్తలు, చెప్పబడిన విషయాలకు సంబంధించిన సమాధానం, వెదికే ప్రయత్నంగా ఈ వ్యాసం కొనసాగుతుంది.

చింతనాత్మక సాహిత్యాన్ని బహుళ ప్రచారం చేస్తున్న **మిసిమి** మాసపత్రిక ద్వారా ఉపనిషత్తులపై అవగాహన కల్పించే ప్రయత్నం ప్రారంభించిన పప్పు వేణుగోపాలరావు గారు పరమపదించడం మేథోలోకంలో ఒక పెద్ద వెలితి. వారు ఉపనిషత్తులపై సమీక్షకు శ్రీకారం చుడుతూ, తమ మొదటి వ్యాసం "ఉపనిషత్ ఉద్యానవనం" (**మిసిమి**, జనవరి–2024 సంచిక) ద్వారా ఈ విషయాలపై కొంత చర్చ చేసినారు. వారి ఉద్దేశ్యంలో ప్రతివేదం నాలుగు భాగాలుగా విభజింపబడి ఉంది. మొదటి భాగం మంత్రం, రెండవది కర్మకాండ, మూడవది అరణ్యకం, నాల్గవది ఉపనిషత్తులు. ఇవి ప్రతివేదానికి చివరన (అంతాన) ఉన్నాయి కాబట్టి, వేదాంతాలు అనే అర్థంలో కూడా చెప్పబడ్డాయి. ఉపనిషత్తుల కాలానికి సంబంధించి వేణుగోపాలరావు గారు ఈ విధంగా పరిష్కారం చేశారు. "వేదాలు అతి ప్రాచీనమైన గ్రంథాలు. అవి ఎప్పుడు పుట్టాయో, ఎవరికీ తెలియదు. ఆధునికులైన పరిశోధకులు అవి కొన్ని వేల సంవత్సరాల క్రిందటివని నిర్ణయించారు. కొద్దిమంది అభిప్రాయం ప్రకారం అవి క్రీస్తుపూర్వం 1500–600 మధ్య కాలానికి చెంది ఉండవచ్చు. "ఈ విషయంగా వేణుగోపాలరావు గారు ఏ అభిప్రాయాన్ని సమర్థించను లేదు, వ్యతిరేకించను లేదు. వారి ఉద్దేశ్యంలో ఉపనిషత్తులు అతి ప్రాచీనమైన గ్రంథాలు". ఈ నేపథ్యంలో ఉపనిషత్తుల కాలానికి సంబంధించి చర్చను మరింత ముందుకు తీసుకొనిపోయే ప్రయత్నం చేస్తాను.

**ఉపనిషత్తుల కాలం :** పురావస్తు శాస్త్రజ్ఞులు జరిపిన తవ్వకాల ఆధారంగా సింధులోయ నాగరికత క్రీస్తుపూర్వం 4500 సంవత్సరాల కాలంలో విలసిల్లింది. ఈ నాగరికత దాదాపు మూడు వేల సంవత్సరాలు కొనసాగి, క్రీస్తుపూర్వం 1500 ప్రాంతంలో తన ప్రాభవాన్ని కోల్పోయిందని చరిత్రకారుల అంచనా. ఒక అభిప్రాయం ప్రకారం సుమారుగా ఇదే కాలంలో ఇండో ఆర్యన్ల రాకతో వేదకాలం మొదలైంది. అందుచేత వేదాలు క్రీస్తుపూర్వ 1500 సంవత్సరం తరువాత రూపుదిద్దుకొన్నాయి. భాషాపరంగా చూస్తే, వేదాలు సంస్కృతంలో వల్లె వేయబడ్డాయి. మౌఖికంగా ఒకరి నుండి మరొకరు నేర్వడం ద్వారా బదలీ చేయబడ్డాయి. అయితే వేదాలు వల్లెవేయబడ్డ సంస్కృత భాషకు ప్రస్తుతం వాడుకలో ఉన్న భాషకు చాలా వ్యత్యాసం ఉన్నదని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. కొద్దిమంది ఉద్దేశ్యంలో వేద సంస్కృతం, ప్రాచీన సంస్కృతం రెండూ వేరు వేరు. ఆ చింతనలో వేద సంస్కృతం క్రీస్తుపూర్వం 1500 నుండి 1200 వరకు కొనసాగింది. ఆ పైన ప్రస్తుతం మనం చెప్పుకొనే ప్రాచీన సంస్కృతం ఉద్భవించినది. 2004లో భారత ప్రభుత్వం దేశానికి సంబంధించిన కొన్ని భాషలకు ప్రాచీన హోదా కల్పించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ హోదా సాధించడానికిగాను ఆ భాష కనీసం 1500 – 2000 సంవత్సరాల నాడు పుట్టి ఉండాలి. ఇంతకు మునుపు ఈ నిబంధన 1000 సంవత్సరాలుగా ఉన్నది. దానికి రుజువుగా ఆ భాషలో ఆ నాటికి కొంత సారస్వతం వెలువడి ఉండాలి. ఈ అర్హతా ప్రమాణాలను పాటించి ఇప్పటి వరకు ఆరు (తమిళం, సంస్కృతం, తెలుగు, కన్నడ, మళయాళం, ఒడియా) భాషలకు ఈ విధమైన గుర్తింపు ఇవ్వబడింది. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ అభిప్రాయంలో వేదకాలం క్రీస్తు పూర్వం 1500 నుండి 600గా చెప్పబడింది.

ఈ అభిప్రాయాలకు భిన్నంగా, వేదాలకు అంతిమ భాగంగా చెప్పబడుతున్న ఉపనిషత్తులు క్రీస్తుపూర్వం 6వ శతాబ్దానికి ముందు ఉండే అవకాశం లేదని ఎ.బి. కీత్, ఎస్.ఎన్. దాస్ గుప్త, ఎ.ఎ. మెక్ డొనెల్, మాక్స్ ముల్లర్, వింటర్నిజ్ మరియు జాకోబ్ భావిస్తున్నారు. దీనికి తార్కణంగా కొన్ని ఉపనిషత్తులు అంతకు ముందుకాలం (అంటే క్రీస్తుపూర్వం 6వ శతాబ్దికి ముందు)లో పరిఢవిల్లిన జైనిజం, బుద్ధిజంల ప్రభావానికి గురికావడం. ఆయా గ్రంథాల విషయాన్ని ఉపనిషత్తులలో ప్రస్తావించడం. ఇ.డబ్ల్యు హాప్ కిన్స్, మండూక ఉపనిషత్తుపై జైన ప్రభావం స్పష్టంగా కనపడుతున్నదని వెల్లడించాడు. ఆ విధంగా చూస్తే, ఉపనిషత్తులు (క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెంది ఉండవచ్చు). అట్లే జె. హెర్టెల్, ఎం. వాలెసర్. మండూక ఉపనిషత్తు మీద బుద్ధిజానికి చెందిన 'మాధ్యమిక ఆలోచనా విధానం' యొక్క ప్రభావం స్పష్టంగా కనపడుతుంది.

ఎ.బి. కీత్ అనే స్కాటిష్ ఇండాలజిస్ట్ (ఇండాలజీ అంటే చరిత్ర అధ్యయనంగా, ముఖ్యంగా దక్షిణ ఆసియా (భారత ఉపఖండంగా చెప్పబడిన చరిత్ర సంస్కృతులకు సంబంధించిన అధ్యయనము). క్రీ.పూ. 6వ శతాబము తరువాత ఉద్భవించిన ఉపనిషత్తులలో 14 ఉపనిషత్తులను పురాతనమైనవిగా పేర్కొంటూ వాటిని ఈ క్రింది మూడు సమూహాలుగా విభజించవచ్చని పేర్కొన్నారు. అవి :

**మొదటి సమూహం :** 1. ఐతరేయ, 2.బృహదారణ్యక, 3. చందోగ్య, 4. తైత్రియ, 5. కౌశితకి, 6. కేన.

**రెండవ సమూహం :** 7. కన్వ, 8. ఈశ, 9. శ్వేతాశ్వతర, 10. మండూక, 11. మహానారాయణ.

**మూడవ సమూహం :** 12. ప్రశ్న, 13. మైత్రాయనియ, 14. మండూక్య.

ఈ విభజన ఆధారంగా మొదటి సమూహంలో పేర్కొనబడినవి, రెండవ సమూహంలో చెప్పబడిన వాటికంటే ముందుకాలంలో కూర్చబడినవిగా అర్థం చేసుకోవాలి. ఏమైనప్పటికీ, కీత్ ఉద్దేశ్యంలో పురాతన మైనవిగా పేర్కొనబడుతున్న ఈ 14 ఉపనిషత్తులు కూడా క్రీ.పూ. 6వ శతాబ్దానికి ముందుగా కూర్చబడినట్లు చెప్పడానికి ఆధారాలు లేవు. ఒక అభిప్రాయం ప్రకారం పైన పేర్కొన్న పురాతనమైనవిగా చెప్పబడుతున్న ఉపనిషత్తులు తప్ప, మిగిలిన అనేకమైనవి ఆ తరువాత కాలంలో కూర్చబడినవిగా తెలుస్తుంది. అందులోను, 16వ శతాబ్దంలో పరిపాలించిన మొఘల్ చక్రవర్తి అయిన అక్బర్ కాలంలో కూర్చబడినట్లుగా చెప్పబడుతున్నది. వాటిని అల్లా ఉపనిషత్తులుగా పేర్కొన్నారు. ఇవి అక్బరును ప్రవక్తగాను, దైవదూతగాను పేర్కొన్నాయి. వీటిలో అరబిక్ పదాలు వాడడం జరిగింది. ఇవి అల్లాను దేవుళ్ళకు దేవునిగా కీర్తిస్తాయి. అట్లే అల్లాను ఉపనిషత్తులో పేర్కొనబడిన 'వరుణ, మిత్ర, ఇంద్ర, ప్రాజ్ఞ, నెథర్' వంటి నామాలతో సంభోధిస్తాయి. నిజానికి ఇవి జన సామాన్యం దృష్టిలో ఉన్న ఉపనిషత్తుల కోవలోనికి రావని, కొద్దిమంది పండితులు ధనాశతో, అప్పటి మొఘల్ చక్రవర్తుల మెప్పు పొందడం కోసం తయారు చేసారని అభిప్రాయం. వీటిలో దేవుని స్త్రీ రూపంగా పేర్కొంటూ, తాంత్రిక విధానం ఎక్కువగా చెప్పబడింది. ఆసక్తికరమైన అంశమేమంటే మొఘలు చక్రవర్తి అయిన షాజహాన్ కుమారుడైన దారాషికో క్రీ.శ. 1656లో 'ముక్తిక ఉపనిషత్తు' అన్న పేర ఒక దానిని కూర్చినాడని చెప్పబడుతున్నది. ఒక అభిప్రాయంలో ఇది అంతవరకు ఉన్న 50 ఉపనిషత్తుల సారాన్ని క్రోడీకరించి, పర్షియన్ భాషలో దీనిని వెలువరించి నాడని నమోదు చేయబడింది. క్రీ.శ. 8వ శతాబ్దం (788వ సంవత్సరం)లో జన్మించి, అద్వైత తత్వాన్ని బహుళ ప్రచారం చేసిన, ఉపనిషత్తులకు భాష్యం వ్రాసిన ఆదిశంకరుని ఉద్దేశ్యంలో ఉపనిషత్తులు సుమారుగా క్రీ.పూ. 800–300 సంవత్సరాల మధ్యకాలంలో కూర్చబడినాయి. మరొక పార్శ్వమేమంటే, ఉపనిషత్తులకు మిగిలిన తత్వాలు లేదా మతాలకు ఉన్న సంబంధాన్ని బట్టి 'కాల నిర్ణయం' చేయడం, దీనికి సంబంధించి, జైనిజము, బుద్ధిజముల ప్రస్తావన ఎక్కువగా చేయబడినది.

దీనికి సంబంధించి రెండు భిన్న దృక్కోణాలు ఉన్నాయి. ఒక వాదన ప్రకారం ఉపనిషత్తులు 'కాలమానం, భాష లేదా చర్చించిన అంశాల పరంగా చూసినా 'జైనిజయం లేదా బుద్ధిజంలకు ముందు ఉద్భవించే అవకాశం లేదు. కాబట్టి ఉపనిషత్తులు ఆ తరువాతి కాలంలో ముఖ్యంగా క్రీ.పూ. ఆరవ శతాబ్దం తరువాతనే కూర్చబడ్డాయి. ఈ వాదనను సమర్ధించే గ్రంథకర్తల జాబితాలో ఎ.బి. కీత్, దాస్‌గుప్తా, మాక్స్‌ముల్లర్ వంటివారు ఉన్నారు. వారి వాదన ప్రకారం మండూక,

కథ, మైత్రాయనియ, శ్వేతాశ్వతర వంటి ఉపనిషత్తులలో జైన, బౌద్ధ గ్రంథాలలో చెప్పబడిన అంశాల ప్రస్తావన ఉన్నది. అట్లే మండూఖ్య ఉపనిషత్తులో బుద్ధిజానికి సంబంధించిన 'మాధ్యమిక ఆలోచనా విధానం' కనబడుతుంది. అంతేకాకుండా వేదకాలంలోని బ్రాహ్మణ వాదం అంతరించిన తరువాతనే వేదాల కూర్పు మొదలైంది. దీని ప్రకారం బ్రాహ్మణ వాదం సుమారుగా క్రీ.పూ. 3వ శతాబ్దంలో అంతమైనది. అంటే అంతకు మునుపు ఉపనిషత్తుల కూర్పు మొదలుకాలేదు. బృహత్కథను రచించిన పాణిని, ధర్మశాస్త్రాన్ని రచించిన కాత్యాయనుడు, శతపథబ్రాహ్మణను వెలువరించిన యజ్ఞవల్క్యుడు బ్రాహ్మణకాలంలో ఉండినవారు. వీరందరు క్రీ.పూ. 5వ శతాబ్దం తరువాతి వారే. వారి రచనలలో ఉపనిషత్తుల ప్రస్తావన లేదు. భాషాపరంగా పరికించినా ఉపనిషత్తులలో ఉపయోగించిన పదజాలం భారతీయ ఇతిహాస గ్రంథాలైన రామాయణ, మహాభారతాలతో సరిపోతుంది. ముఖ్యంగా మహాభారతంలోని భావజాలం, బుద్ధిజం ఆలోచనా భావానికి గుర్తైందనేది ఒక వాదన.

బింబిసారుని కుమారుడైన అజాతశత్రువు, బుద్ధుని సమకాలీనుడుగా చెప్పబడింది. ఇతని ప్రస్తావన బృహదారణ్యక, కౌశితకి ఉపనిషత్తులలో ఉన్నది. అందుచేత ఉపనిషత్తులు ఈ కాలానికే చెంది ఉంటాయి అన్నది వాదన. దీనికి భిన్నంగా బుద్ధిజంగాని, జైనిజంగాని ఉపనిషత్తుల తరువాత ఆవిర్భవించనవని, ఉపనిషత్తులలో వ్యక్తపరచ బడిన భావాలను, వాదాలను పై రెండు గ్రహించాయని, కాబట్టి ఉపనిషత్తులు క్రీ.పూ. 6వ శతాబ్ది కంటే ముందు నుండే ఉన్నాయి. ఈ వాదనను బలంగా ముందుకు తీసుకువచ్చిన వ్యక్తి భారతదేశానికి రెండవ రాష్ట్రపతిగా పనిచేసిన, ప్రముఖ తత్వవేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్. బుద్ధిజం హిందూమతం నుండి ఉద్భవించిన ఒక నమ్మకంగా పేర్కొంటూనే, దానిని ఒక హేరసీ (అంటే తంత్రము, అవాంతరమైన మతము, మత విరోధమైన సిద్ధాంతం)గా, హిందూమతంతో విభేదించిన శాఖగా చెప్పబడింది. అయితే, బుద్ధిస్ట్ సారస్వతంలో హిందూమత ప్రస్తావన గాని, దానిని తిరస్కరిస్తూ గాని, దూషిస్తూ గాని చేసిన వాదనలు ఏమీ కానరావు. ఈ వాదనను మరింత ముందుకు తీసుకొని పోతూ డా. రాధాకృష్ణన్ అభిప్రాయంలో బుద్ధుడు హిందువుగా పుట్టి, హిందువుగానే పెరిగి, హిందువుగానే మరణించాడు". అట్లే బుద్ధుడే తాను క్రొత్త మతాన్ని ప్రతిపాదించడం లేదనీ, అప్పటికే అమలులో, ప్రచారంలో ఉన్న కొన్ని ఆచరణలను మాత్రమే నిరశిస్తున్నానని బుద్ధుడు చెప్పినట్లుగా 'సంయుక్తనికాయ' గ్రంథంలో స్పష్టంగా చెప్పబడినట్లు పేర్కొంటూ, బుద్ధిజం అనేది హిందూమతం నుండి వేరుపడిన, విబేధించిన ఒక శాఖ మాత్రమే.

ఆధునిక చరిత్రకారులలో కూడా చాలా మందికి ఇదే అభిప్రాయం ఉన్నట్లు తెలుస్తుంది. విశేషమేమంటే బుద్ధుడు తాను దేవుడునని గాని, తానొక అవతారపురుషుడననిగాని, ముక్తి లేదా మోక్షం ప్రసాదించే దైవ దూతనని గాని చెప్పియుండలేదు. తాను కేవలం కొన్ని సత్యాలను తెలుసుకొన్నానని, అవి పాటిస్తే దుఃఖానికి దూరమై, నిర్వాణం పొందుతారని పేర్కొన్నాడు. దానిని ఎవరైనా తమ స్వీయ సాధన ద్వారా సాధించవచ్చని వెల్లడించాడు. అయినప్పటికీ, బుద్ధుని విష్ణువు లేదా కృష్ణుని యొక్క అంశగా గుర్తిస్తూ, దశావతారాలలో ఒకనిగా చేర్చడం జరిగింది. బ్రిటానికా వారి ఎన్‌సైక్లోపీడియాలో బుద్ధుని 9వ అవతారంగా చూపారు. అసలు దశావతారాలలో ఉన్న దేవుళ్ళు ఎవరు అన్న విషయంగా స్పష్టత లేదు. సుమారు క్రీ.శ. 3వ శతాబ్దంలో రచించబడినదని భావిస్తున్న 'మత్స్య పురాణంలో' దశావతారాలు ఈ విధంగా చెప్పబడ్డాయి. (1) ధర్మ (2) నారసింహ (3) వామన (4) దత్తాత్రేయ (5) మాంధాతృ (6) పరశురామ (7) రామ (8) వేదవ్యాస (9) బుద్ధ (10) కల్కి. అదే ఆ తరువాతి కాలంలో అంటే క్రీ.శ. 783లో ఆచార్య జనసేనుని చేత వ్రాయబడిన హరివంశంలో, దశావతారాలు ఈ విధంగా ఉన్నాయి. (1) నారాయణ, (2) విష్ణు (3) వరాహ, (4) నారసింహ (5) వామన (6) దత్తాత్రేయ (7) జమదగ్ని (8) రామ (9) కృష్ణ (10) కల్కి. ఈ చర్చకు పరిష్కారమన్నట్లుగా మొత్తం అవతారాలలో కొన్నింటిని పూర్ణావతారాలుగా (ఉదా: నారసింహుడు), కొన్నింటిని అంశావతరాలుగా (ఉదా: వ్యాసుడు), కొన్నింటిని అర్చావతారాలుగా (ఉదా: శ్రీ వెంకటేశ్వరుడు) పేర్కొనడం జరిగింది. అయితే కలియుగ దైవంగా భావింపబడుతున్న శ్రీ వేంకటేశ్వరుడు ఈ

దశావతారాలలో లేదు. తిరుమల-తిరుపతి దేవస్థానం వారు ప్రకటించిన దశావతారాల జాబితాలో కూడా శ్రీ వేంకటేశ్వరుడు లేదు.

డా. రాధాకృష్ణన్ తరువాత ఇదే అభిప్రాయాన్ని డా. పి.వి. కేన్ వంటి ఆధునిక చరిత్రకారులు కూడా వ్యక్త పరిచారు. మొత్తంగా వారు చెప్పదలచిన విషయం 'ఉపనిషత్తులు, బుద్ధిజం లేదా బుద్ధుని కంటే ముందునుండే ఉన్నాయి. కాబట్టి ఉపనిషత్తులు క్రీ.పూ. 6వ శతాబ్దం తరువాత మాత్రమే కూర్చబడినాయన్న వాదన సరికాదు. ఏది ఏమైనప్పటికీ, ప్రపంచం మొత్తం మీద బౌద్ధం ఒక మతమని గాని, తత్వ విచారమని గాని నమ్మే వారి సంఖ్య సుమారుగా 50 కోట్ల వరకు ఉంటుందని అంచనా. విశేషమేమంటే బౌద్ధాన్ని అనుసరించే జనాభా చైనాలో (దరిదాపు 20 శాతం) ఎక్కువగా ఉన్నది. అట్లే ప్రపంచం మొత్తం మీద సుమారుగా 10,000 వరకు బౌద్ధారామాలు ఉంటాయని అంచనా. భారతదేశంలో ఉద్భవించి, కనుమరుగైనప్పటికీ, నేటికి దేశం మొత్తం మీద జనాభాలో 2 శాతం వరకు ఆచరిస్తున్నారని అంచనా. విద్యాధికులలో బౌద్ధం నేటికీ ఒక బలమైన భావనే. భారతీయ మేధావులలో ఒక్కరైన డా. బి.ఆర్.అ బేద్కర్ తన చివరి దశలో హైందవాన్ని వీడి, నాలుగు లక్షల మంది అనుచరుల సమక్షంలో ది.14-10-1956న బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆ సందర్భంలో ప్రసంగిస్తూ 'బౌద్ధం ఒక్కటే సశాస్త్రీయమైన మతం' (The most scientific religion) అని, బుద్ధుని 'దమ్మ పథం' ఆచరణ నీయమని, దేశంలోని తాడిత, పీడిత వర్గాలకు ఇదే సరైన మార్గమని పేర్కొన్నాడు. హైందవాన్ని త్యజిస్తూ, తాను హిందువుగా జన్మించినా, హిందువుగా చనిపోనని శపథం చేసాడని చెప్తారు.

**ఉపనిషత్తులు ఎన్ని?:** సంఖ్యాపరంగా చూస్తే ఉపనిషత్తులు ఎన్ని అన్న అంశంగా ఏకాభిప్రాయం లేదు. కొద్దిమంది ఉద్దేశ్యంలో అవి 110కి పైగా ఉన్నాయి. మరి కొద్ది మంది అభిప్రాయంలో ముఖ్యమైనవి, ప్రముఖంగా ప్రస్తావించ బడుతున్నవి డజనుకు మించి ఉండవు. ఇంతకుముందు చెప్పినట్లు, కీత్ ఉద్దేశ్యంలో పురాతన ఉపనిషత్తులుగా చెప్పబడుతున్నవి కేవలం 14 మాత్రమే. మిగిలినవి అనేకం ఆ తరువాతి కాలంలో కూర్చబడ్డాయి. ఉపనిషత్తులకు భాష్యం వ్రాసిన ఆదిశంకరుడు కూడా ముఖ్యమైన ఉపనిషత్తులు పది మాత్రమే అని పేర్కొన్నాడు. వాటి వరకే ఆయన భాష్యం వ్రాయడం జరిగింది. భగవద్గీతను కూడ ఉపనిషత్తుగా పరిగణించి ఆ జాబితాలో చేర్చినవారు కొందరు కలరు.

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇందిరాగాంధి జాతీయ కళల కేంద్రం (Indira Gandhi National Centre for the Arts, Ministry of Culture, Govt. of India) వేదిక్ హెరిటేజ్ (Vedic Heritage) విభాగం వారి ప్రకారం వేదాలకు సంబంధించి 13 ఉపనిషత్తులు ప్రధానమైనవి. వాటిని ఈ దిగువన పేర్కొన్న విభజన ద్వారా చూడవచ్చు.

**I. ఋగ్వేదానికి సంబంధించినవి.** 1. ఐతరేయ, 2. కౌషితకి

**II. శుక్లయజుర్వేదానికి చెందినవి.** 3. బృహదారణ్యాక 4. ఈశ

**III. కృష్ణ యజుర్వేదానికి చెందినవి :** 5. తైత్తిరీయ 6. కథ 7. శ్వేతాశ్వతర 8. మైత్రాయనియ

**IV. సామవేదానికి సంబంధించినవి :** 9. చండోగ్య 10.కేన

**V. అథర్వవేదానికి చెందినవి :** 11. మండూక 12. మండూఖ్య, 13. ప్రశ్న

ముక్తికోపనిషత్తు ప్రకారం ఉపనిషత్తుల సంఖ్య 108. అవి నాలుగు వేదాల పరంగా ఈ దిగువన పేర్కొన్న విధంగా విభజింపబడ్డాయి.

1. ఋగ్వేదానికి చెందినవి - 10 2.శుక్ల యజుర్వేదానికి చెందినవి - 19 3. కృష్ణ యజుర్వేదానికి చెందిదినవి - 32 4. సామవేదానికి చెందినవి - 16 5. అథర్వవేదానికి చెందినవి - 31 భారతదేశ రెండవ రాష్ట్రపతిగా సేవలందించిన ప్రముఖ భారతీయ తత్వవేత్త డా. ఎస్. రాధాకృష్ణన్ అభిప్రాయంలో ప్రధానమైన ఉపనిషత్తులు 18. వారు 1953లో ఎలెన్ & అన్విన్ సంస్థ ద్వారా ప్రధాన ఉపనిషత్తులు అన్న పేర మూడు సంపుటాలుగా తన గ్రంథాన్ని వెలువరించారు. ఆ గ్రంథంలో దిగువ పేర్కొన్న ఉపనిషత్తులలో ఉన్న విషయాన్ని చర్చించడం జరిగింది. అవి : 1. బృహదారణ్యాక 2. చండోగ్య 3. ఐతరేయ 4. తైత్తిరియ 5. ఈశ, 6. కేన, 7. కథ, 8. ప్రశ్న 9. మండూక 10. మండూక్య 11. శ్వేతాశ్వతర 12. కౌశితకి 13. మైత్రాయని 14. సుబాల 15. జాబాల 16. పైంగల 17. కైవల్య 18. వజ్రాశుశిక. ఈ గ్రంథానికి

అనుబంధంలో రాధాకృష్ణన్ గారు రబీంద్రనాథ్ ఠాగూర్ మరియు ఎడ్మడ్ హోమ్స్‌ల దృక్పథాలను జత చేయడం జరిగింది.

**ఉపనిషత్తులలో ఏమి చెప్పబడింది?** చర్చలో మూడవ అంశంగా, ఉపనిషత్తులలో ప్రముఖంగా ప్రస్తావించబడిన అంశాలు ఏమిటి అన్న విషయాన్ని చేపడదాము. స్థూలంగా 'వేదాల సారమే ఉపనిషత్తులని చెప్పబడింది'. ఉపనిషత్తులలో పదింటికి భాష్యం వ్రాసిన ఆదిశంకరుని ఉద్దేశ్యంలో వేదాలలో ఉటంకించబడిన కర్మకాండలకు అతీతంగా, ఉపనిషత్తులు స్వతంత్ర జ్ఞానాన్ని కలుగజేస్తాయి. బ్రహ్మాన్ని గూర్చిన జ్ఞానం ఉపనిషత్తులను శోధించడం ద్వారా ఏర్పడుతుంది. అట్లే ఆత్మ, పరమాత్మ వేరు కాదని, నేను బ్రహ్మను అనే తత్వం బోధపడుతుంది. ఆపైన అవి వేదన నుండి విముక్తికి, మోక్షసాధనకు, పునర్జన్మ లేకుండా ఉండడానికి తోడ్పడతాయి. సామాన్య ప్రజలు తమను తాము తెలుసుకొనేటందుకు సహాయకారిగా నిలుస్తాయి.

డా. రాధాకృష్ణన్ 1924లోనే ఉపనిషత్తుల తత్వం అనే గ్రంథాన్ని వెలువరించారు. "మనిషి యొక్క ఆత్మను విశ్వం యొక్క ఆత్మతో అనుసంధానించడమే ఉపనిషత్తులు మనకు బోధించేది" అని చెప్పడం జరిగింది.

ప్రకృతి, మనిషి, భగవంతుని ఐక్యతను ఏ విధంగా సాధించగలుగుతామో తెలియజేస్తాయి. హిందూ తత్వాన్ని వ్యక్తం చేయడంలో వీటిది ప్రముఖపాత్ర. భారతదేశంలో ఉద్భవించిన మతాలన్ని కూడా ఉపనిషత్తులలోనే తమ మూలాలను కలిగి ఉన్నాయి. ఉపనిషత్తులు మానవునికి శాంతి, స్వేచ్ఛ, స్వాంతన కలిగించడంలో కృషి చేస్తాయి. ఉపనిషత్తులు ఒకే కాలానికి, ఒకే గ్రంథకర్తకు చెందకపోయి నప్పటికీ, భారతీయ ఆధ్యాత్మిక చింతనకు మౌలికమైన ప్రాతిపదికను ఏర్పాటు చేసాయి. ఆకాలంలో మతాలకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రోది చేసాయి. అసలు విశ్వం యొక్క స్వభావాన్ని, తత్వాన్ని తెలుసుకోవడంలో ఉపనిషత్తులది ఒక నిర్మాణాత్మకమైన పాత్ర.

ఇదే గ్రంథానికి ముందుమాటను వ్రాసిన నోబుల్ బహుమతి గ్రహీత, ప్రముఖ సాహిత్యకారుడు డా. రబీంద్రనాథ్ "ఉపనిషత్తులు కేవలం వేదాంత పరమైన తార్కికం మీద కాకుండా అవి ఆధ్యాత్మిక జీవనంపై ఆధారపడి చెప్పబడ్డాయి (Upanishads are based not upon theological reasoning, but on experience of spiritual life). ఇక్కడ జీవనమంటే మనిషికుండే ఊగిసలాటలు, ద్వంద్వవాదం, ఏకవాదం, నిర్దిష్టమైనవి, నిర్దిష్టం కానివి, అనంతమైనవి వంటి ఎన్నో అంశాల కలయిక. అదే విధంగా ఉపనిషత్తులు ఏ ఒక్క వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక అనుభవం (spiritual experience)గా కాకుండా, ఎంతోమంది అనుభవపూర్వక జ్ఞానోదయం (Enlightenment) ఫలితంగా అవతరించాయి. ఎంత లోతుగా అధ్యయనం చేసినా, మరింత కొత్త అర్థంతో విరాజిల్లుతాయి. శాశ్వతత్వం లేదా నశింపులేని స్థాయిని చేరడానికి ఉపనిషత్తులు మార్గదర్శనం చేస్తాయి. ఈ విధంగా ఎన్నో విషయాలను స్పృశిస్తూ, విద్యార్థులకు వాటిని బోధించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేసారు.

ఉపనిషత్తులు ఈ జ్ఞానాన్ని పొందే మార్గాన్ని సూచిస్తాయి. ఇవి శృతులలో భాగంగా ఉంటాయి. వేదాలలో ఈ భాగానికే ఎక్కువ ప్రాధాన్యత ఉన్నదని కొద్దిమంది అభిప్రాయం. ఉపనిషత్తులను చదవడం, అర్థం చేసుకోవడం ద్వారా మనిషి తన గురించి, తన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి అవగాహన ఏర్పరచుకుంటాడు. నేనెవరు? మరణించిన తరువాత ఏమౌతాను? తిరిగి జన్మిస్తానా? వంటి ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. అట్లే విశ్వం గురించి, విశ్వంలో ఉన్న జీవరాశులు గురించి, సృష్టి, స్థితి, లయ్యల గురించిన అవగాహన కలుగుతుంది.

నిజానికి ఉపనిషత్తులన్ని స్థూలంగా పై విషయాలపైనే దృష్టి కేంద్రీకరించినా విడివిడిగా ఒక్కొక్క ఉపనిషత్తు ఒక ప్రత్యేకమైన అంశాన్ని విపులీకరిస్తాయి. ఉదాహరణకు ఈశావాశ్య ఉపనిషత్తు (ఉపనిషత్తులన్నింటిలో ఇది తలమానికమైనదిగా ప్రస్తావించబడింది). ఈ ప్రపంచ మంతా భగవంతునితో నిండి ఉన్నదని, నేను నాది అనే అహంకారం కూడదని, కర్మ చేయడం వలననే జ్ఞానం కలుగుతుందని వెల్లడిస్తుంది. ఒక విధంగా భగవద్గీతలో ఉన్న విషయాలు ఇందులో మనకు కనపడతాయి. కాలమానం ప్రకారం చూస్తే ఉపనిషత్తులు ముందు, ఆ తరువాతనే మహాభారత కాలంగా చెప్పవచ్చు. ఉప నిషత్తులలో ఉన్న విషయాలనే శ్రీకృష్ణుడు మరొకసారి పునఃశ్చరణ చేసినట్లు భావించవచ్చు. అట్లే ఇది 'ఆత్మ' యొక్క స్వభావాన్ని తెలియజేస్తుంది. కోరిక, మోహము లేని ఆత్మానుభూతిని పొందే మార్గాన్ని సూచిస్తుంది.

కేనోపనిషత్తు సృష్టి రహస్యాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేస్తుంది. ఎవరిచేత ఈ సృష్టి జరిగింది? ఎవరు

దీనిని నిర్వహిస్తున్నారు? ఆత్మ అంటే ఏమిటి? ఆత్మతత్వాన్ని ఎలా తెలుసుకోవాలి? ఈ సాధనలో ఇంద్రియాల యొక్క పాత్ర ఏమిటి? భగవంతుని అనుగ్రహం పొందడం ఎలా? అన్న విషయాలను విపులీకరిస్తుంది. అట్లే ఇంకొకటైన కఠోపనిషత్తు చాలా ఆసక్తికరమైన ప్రశ్నకు సమాధానం వెదికే ప్రయత్నం చేస్తుంది. అదే 'మరణానికి' సంబంధించినది. మరణం అంటే ఏమిటి? మరణించిన తరువాత ఏమౌతుంది? మరణం లేకుండా ఉండాలంటే ఏమి చేయాలి? మొదలైన అంశాలను ఒక కథారూపంలో వివరిస్తుంది. నచికేతుడనే ముని కుమారుడు యముని దగ్గరకు వెళ్ళడం, యముడే మరణానికి సంబంధించిన జ్ఞానాన్ని కలుగజేయగలడని భావించడం, సదరు జ్ఞానాన్ని పొందడం దీని ఇతివృత్తం. నిజానికి వేదాలవలెనే ఉపనిషత్తులు కూడా కొంత మంత్రాల రూపంలోను, కొంతవచన రూపంలోను, కథాగమనంతో సాగుతుంటాయి.

ఐతరేయోపనిషత్తు వేదాలకు సంబంధించిన తత్వాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేస్తుంది. ముఖ్యంగా ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని తెలియజేస్తుంది. ప్రపంచమంతా విజ్ఞానంతో నిండి ఉన్నదని, ఆ విజ్ఞానమే బ్రహ్మమని చెప్తుంది. బ్రహ్మ మొక్కటే అంతిమ జ్ఞానమనే స్పృహ కలిగిస్తుంది. అట్లే, మండూక్యోపనిషత్తును గమనిస్తే మనిషి జాగృతంగా ఏ విధంగా ఉండాలి అనే విషయాన్ని బోధిస్తుంది. ముఖ్యంగా, మెళకువ కలిగి ఉండడం, స్వప్నావస్థ, సుషుప్తి ఆ పైన చేతనత్వం ఎలా పొందాలి అన్న విషయాలను తెలియజేస్తుంది. మెళుకువ కలిగి ఉండడమంటే, చుట్టూ ఉన్న ప్రపంచానికి సంబంధించిన జ్ఞానం, దేహానికి సంబంధించిన జ్ఞానం, అంతిమంగా బ్రహ్మాన్ని గూర్చిన జ్ఞానం. నిజానికి మొత్తం ఉపనిషత్తులలో ఇది అతి తక్కువ నిడివి కలిగి, మొత్తం అంతా వచనంలో ఉంటుంది. విషయపరంగా చూస్తే ఉపనిషత్తులలో పునశ్చరణ ఎక్కువగా కనబడుతుంది. అయినప్పటికీ, దేని ప్రత్యేకత దానిదే అన్న ఉద్దేశ్యంతో వీటిని పఠనం చేయాలి.

**గ్రంథకర్త ఎవరు?:** చివరిగా, నాల్గవ అంశంగా ఉపనిషత్తులకు ఎవరైనా గ్రంథకర్త ఉన్నారా అన్న విషయాన్ని చూద్దాం. వేదాలకు సంబంధించి కనీస జ్ఞానం ఉన్న అందరికి తెలిసినది, వేదాలను ఎవరు వ్రాయలేదు, వేదాలను ఋషులు దర్శించారు. ఆ దర్శించిన అంశాలను తమ శిష్యులకు ముఖతః బోధించారు. ఆ విధంగా వేదాలు ఒకరి నుండి మరొకరికి మౌఖికంగా బదలీ చేయబడ్డాయి. అచ్చు యంత్రాలు లేని కాలంలో తాళపత్రాలపై గ్రంథాలు వ్రాయబడ్డాయి. ఆ విధంగా వేదాలను కూడా గ్రంథస్థం చేసే ప్రయత్నం జరిగింది. ఇటువంటి కొన్ని ప్రతులను మొదటగా క్రీ.శ. 1040లో నేపాల్ ప్రాంతంలో కనుగొన్నట్లు తెలుస్తుంది. భారతదేశంలో ఎక్కువ భాగం దేవాలయాలలో నిక్షిప్తం చేసినట్లు తెలుస్తున్నది. వాటినన్నింటిని సేకరించి ప్రస్తుతం కాపాడే పనిని 'భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'నేషనల్ మిషన్ ఫర్ మాన్ స్క్రిప్ట్స్' చేపట్టింది. ప్రభుత్వం దీనిని 2003లో ప్రారంభించింది. వేదాలకు సంబంధించి పూణేలో ఉన్న 'భండార్కర్ ఓరియంటల్ పరిశోధన సంస్థ' వద్ద కొన్ని ప్రతులు ఉన్నట్లు తెలుస్తున్నది.

ముద్రాపణ మొదలైన తరువాత 1806 ప్రాంతంలో కలకత్తాలో వేదాలను మొదటగా ముద్రించినట్లు సమాచారం ఉంది. ఆపైన అనేక ధార్మిక సంస్థలు, దేవాలయ ట్రస్టులు ఈ పనిని చేపడుతున్నాయి. కాబట్టి వేదాలకు అంతిమ భాగమైన ఉపనిషత్తులకు కూడా ప్రత్యేకంగా గ్రంథకర్తలు ఉండే అవకాశం లేదు. అయితే వేదాలను దర్శించిన ఋషుల పేర్లతో సూక్తాలు ఉన్నాయి. అందుచేత, ఏదైనా వేద మంత్రం ఉచ్చరించేటప్పుడు ఆ ఋషి పేరు, ఛందస్సు చెప్పడం ఆనవాయితీ. ఉపనిషత్తులకు సంబంధించి, కొన్ని ఉపనిషత్తులను కొద్దిమంది ఋషులకు ఆపాదించి, వారిని గ్రంథకర్తలుగా చెప్పడం జరుగుతున్నది. ఆ ప్రక్రియలో భాగంగా యజ్ఞవల్క్యుడు, ఉద్దాలకుడు, శ్వేతకేతు, శాండిల్య, ఐతరేయ, చాలకి, పిప్పలాద, సనత్‌కుమార, మైత్రేయి, గార్గి వంటి వారల పేర్లను ఊటకించడం జరుగుతున్నది. అంతమాత్రం చేత వారిని గ్రంథకర్తలు లేదా సృష్టికర్తలుగా చెప్పే అవకాశం లేదు. ఉపోద్ఘాతంలో చెప్పినట్లుగా ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం చర్చను ప్రేరేపించడమే తప్ప అంతిమ నిర్ణయం చేయడం కాదు. విజ్ఞులు దీనిని గమనించి మరింత సమాచారాన్ని ప్రోది చేసి చర్చను ఫలప్రదం చేస్తారని ఆశ.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
(పూర్వ ఉపకులపతి), ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
సెల్ నెం : 70932 60655

# లలిత సంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– ఎమ్. పురుషోత్తమాచార్య

*చాలా సభల ప్రారంభానికి ముందు – సినీ విభావరి – అంటూ సినిమా పాటలు మంచి పాటగాళ్లు – పాటగత్తెలు గొంతెత్తి పాడుతుంటారు – ఎక్కువగా ఘంటసాల – లీల – జిక్కి – సుశీల గార్ల పాటలు పద్ధతిలో శ్రావ్యంగా వినపడుతుంటాయి – అలాంటి సభలో ఒకసారి నాకు మాట్లాడే అవసరం కలిగింది – శ్రీమాన్ పురుషోత్తమాచార్య గారు వున్నారు – వారితోనే – సభకుల సమక్షంలో నా బాధ వెలిబుచ్చాను. "ఈ సినిమా పాటలు ఎప్పుడంటే అప్పుడు – ఎక్కడంటే అక్కడ వింటున్నాం – ఇప్పుడు పాడినవారు ఎంత బాగా పాడినా – ఒరిజినల్‌కి దాదాపు దగ్గరగా చేరటం అసాధ్యమే – దానికి ఎన్నో కారణాలుండవచ్చు – వీరి ప్రతిభను లలితగీతాల ద్వారా వెలికి తేవచ్చు – అది వారికి ప్రత్యేకతను సంతరిస్తుంది. మరొకరితో పోల్చవలసిన పనివుండదు – వీరు రికార్డు చేసి యూట్యూబ్‌లో పైకి పంపవచ్చు కదా. ఆచార్యా కాస్త ఆలోచించండి – అలాగే మన లలితగీతాలలో సంగీత విశిష్టతను మీరు వివరించవచ్చుగదా" అని సూచించాను. – నా అభ్యర్ధనను మన్నించి శ్రీ పురుషోత్తమాచార్యులు నా సూచనను సానుకూలం చేసి ఈ ప్రసాదం మనకందించారు. ఆస్వాదించండి.*

*– ఎ.కె.*

**ప్రవేశిక :** అరవైనాలుగు కళలలో ఐదింటిని వేరుపరచి వాటిని మనం 'లలితకళలు' అని వ్యవహరిస్తున్నాం. అవి సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం. వీటిలో మొట్టమొదట చిత్రలేఖనం పుట్టిందని, తరువాత ధ్వన్యనుకరణతో సంగీతాలాపన జన్మించిందని, ఆ పిదప నాట్యం, భాష పుట్టాయని కొందరు విజ్ఞుల అభిప్రాయం. చిత్రలేఖనమే కాలక్రమాన వికాసం పొంది శిల్పానికి దారితీసిందని మరొక అభిప్రాయం కూడా ఉన్నది.

సంగీతం అనేది మొట్టమొదట ఆదిమానవుడు పశు పక్ష్యాదుల అరపుల వల్ల రూపొందించుకున్న కళ అంటూ కొందరు, వేదం నుండి ఉద్భవించిందని మరికొందరు, ప్రకృతిలోని ప్రతి ఒక్క ధ్వనిని ఆనాటి మానవుడు అనుకరించి సుశ్రావ్యమైన శబ్దాలను గుర్తించి స్వరాలుగా తయారు చేసుకున్నాడని మరికొంతమంది అభిప్రాయ పడినారు. అందుకే సంగీతపు పుట్టుక గురించి ఇప్పటికీ ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోతున్నాం ఆదిమానవుని కాలంలో ఆటవికులు "ప్రకృతి పాట కచేరీ" చేసేవారని ప్రొఫెసర్ మేరియస్ ష్నేడర్ అనే పరిశోధకుడు అభిప్రాయ పడినాడు. ఆయన అటువంటి కచేరి గురించి పరిశోధన చేసి ఇలా అన్నాడు.

"ఒక్కో పాటకు ఒక్కో ధ్వనిని అనుకరించేవారు. సముద్రపు అలలు, హోరుగాలి, ఊగే చెట్టు, భయపడిన జంతువుల అరుపులు, పక్షుల కలకలం వంటి ఎన్నో శబ్దాలను అనుకరిస్తూ, 20,30 మంది కలిసి బృందంగా ఆలపించేవారు" ఇదే భావాన్ని రుజువు చేస్తున్నట్లుగా 1880లో డాక్టర్ వాల్టర్ ఫ్యూక్స్ ఫోనోగ్రాఫ్‌ను కనిపెట్టి ఆదిమజాతులవారు పాడుకునే పాటలను సేకరించగా, హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ బెంజమిన్ గిల్మన్ అనేవారు ఆ పాటలను ప్రచురించినారు. ఆ పాటల్లో ఎక్కువ భాగం రెండు స్వరాల్లోనే ఉండడం ఒక చెప్పుకోదగ్గ విశేషం. వాటిని లోతుగా పరిశీలించి వాటి సందర్భాలను గురించి ఆయన ఆదిమజాతుల తెగల వారిని ఇంటర్వ్యూ చేసి చాలా విషయాలు తెలుసుకుని ప్రకటించారు. దాని ప్రకారం చూస్తే అప్పటి మానవులు జీవితంలోని ఆయా ఋతువులలో, కాలాలలో జరిగే అంశాలకు అనుగుణంగానే; ఆకలి, నిద్ర, బాల్యం, యౌవనం వంటి అనుభూతులకు తగినట్లుగాను ధ్వనులను ఎంచుకుని ఆలపించేవారని తెలుస్తున్నది. ఈ పాటలే కాలక్రమంలో భాష పుట్టాక 'పల్లెపాటలు'గా పరిణమించాయని చెప్పవచ్చు. తరువాత వచ్చిన దేశవిదేశీయ శాస్త్రజ్ఞులు

సంగీతకళను గొప్పగా గౌరవించారు. "విశాలవిశ్వంలో ఏ గణితశాస్త్ర సూత్రాలకు అనుగుణంగా గ్రహగోళాలు తిరుగుతున్నవో ఆ సూత్రాలే నాదాన్ని, లయను కూడా నడిపిస్తున్నాయి. సంగీతం విశ్వంపై తన ప్రభావాన్ని చూపి, దాన్ని మార్చగలిగిన శక్తిమంతమైన సాధనం అవుతుంది" అన్నారు పైథాగరస్. అరిస్టాటిల్, ప్లాటోలాంటి ప్రముఖ తాత్త్వికులు కూడా "సత్యం, సౌందర్యా న్వేషణలో నిమగ్నం కావడానికి సంగీతం ఎంతో ఉపకరిస్తుంది" అన్నారు.

చైనాలో 'ఏ సంగీతం ఎప్పుడు వాడాలి' అనే విషయాలను స్థిరీకరిస్తూ చట్టాలు కూడా చేసేవారు. ఇది ఆదిమానవుల ప్రకృతి పాటకచేరీల ప్రభావమేనని అందరూ అంగీకరించారు. "ఉత్తమగాయకుని సంగీతం మార్దవం గాను, శ్రోతలను ఉత్తేజపరిచేదిగానూ ఉంటుంది. అటువంటి గాయకుని మనస్సులో రాగద్వేషాలకు చోటు ఉండదు. హృదయంలోని వివేకమే సంగీతం." అని అన్నారు ప్రసిద్ధ వేదాంతి కన్‌ఫ్యూషియస్. ఇదంతా పూర్వరంగం. తరువాతి కాలంలో పల్లెపాటలు పండితుల దృష్టిలో పడి శాస్త్ర రీతులతో మార్పులు చెంది కొన్ని సూత్రాలతో బంధింపబడి శాస్త్రీయసంగీతంగా రూపుదాల్చింది. దాంతో సంగీతం సామాన్యులకు దూరమై రాజాస్థానాలకు పరిమితమై పోయింది. కాలక్రమేణ రాజులు, రాచరికాలు అంతరించి పరాయి పాలనలోకి దేశం జారిపోగా ఆ కాస్త సంగీతం కూడా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. అప్పుడు స్వాతంత్ర్య ఉద్యమం, వ్యావహారికభాషా ఉద్యమం, సంఘసంస్కరణోద్యమం, సాహిత్యంలో భావకవిత్వ ఉద్యమంలాంటి ఉద్యమాల ప్రభావం సంగీతం మీద గణనీయంగా పడింది. సామాజికపరిణామాలకు'మాటలతో నిండిన పాట' అవసరమైంది. 'లైర్' అనే ప్రాచీన సంగీత వాద్యానికి అనుగుణమైన మాటల్ని పొదుగుతూ పాట అవతరించింది. దాన్నే ఇప్పుడు మనం 'లిరిక్స్' అంటున్నాం.

ఈ మార్పును మరింత పటిష్ఠం చేస్తూ దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, రాయప్రోలు, నండూరి సుబ్బారావు, బసవరాజు అప్పారావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, అడివి బాపిరాజు మొదలైన కవులు గీతరచనలో విజృంభించారు. వాటిని బాణీ చేయడానికి స్వరకర్తలు పుట్టుకువచ్చారు. బి.వి.నరసింహారావు, వింజమూరి సీత, అనసూయ, బందా కనకలింగేశ్వరరావు మొదలైనవారు ఆ గీతసాహిత్యాలకు ప్రాణం పోసి ప్రజల్లోకి తీసుకువెళ్ళారు. క్రమక్రమంగా ఈ పాటల స్వరకల్పనల మీద ధార్వాడ, పూనాశాంగ్లీ, బాలీవాలా, సోహ్రాబ్ మోడీ మొదలైన రంగస్థల నాటక కంపెనీల ప్రభావం ఆవరించడం మొదలైంది. ఈ విధంగా శాస్త్రీయసంగీతం, జానపదసంగీతం, రంగస్థలసంగీతం అనే ఈ మూడు శక్తుల సమాహారంగా ఒక క్రొత్త సంగీతప్రక్రియ ప్రారంభమైంది. అదే మన "లలిత సంగీతం". మన దేశంలో మొట్టమొదట లలిత సంగీత గేయాలను వ్యాప్తిలోకి తెచ్చింది ఆనాటి మద్రాసు ఆకాశవాణి. 'గీతావళి' పేరుతో రజని, కృష్ణశాస్త్రి మొదలైన ప్రముఖుల గీతాలను టంగుటూరి సూర్యకుమారి, కమలా చంద్రబాబు, ఎస్.వరలక్ష్మి, ఆర్.బాల సరస్వతి, సరళ, కోమల, ఎమ్మెస్.రామారావు, ఎస్.రాజేశ్వరరావు, ఘంటసాల మాస్టారు మొదలైన వారంతా ఆలపించగా మదరాసు ఆకాశవాణి ప్రసారం చేయడం ముమ్మరం చేసింది. తరువాత విజయవాడలో రేడియో కేంద్రం ఏర్పాటైనప్పుడు వింజమూరి శివరామారావు, కందుకూరి రామభద్రరావు మొదలైన కవులు; బాలమురళీకృష్ణ, వోలేటి వెంకటేశ్వర్లు, శ్రీరంగం గోపాలరత్నం, వింజమూరి లక్ష్మి మొదలైన గానకోవిదులు పరిచయమయ్యారు. 1955లో హైద్రాబాదులో రేడియో వచ్చాక దాశరథి, సినారె, బాపురెడ్డి, బోయి భీమన్న మొదలైనవారు శ్రోతల హృదయాలను చూరగొన్నారు. ఈ ప్రకారంగా సమాజంలోకి ప్రవేశించిన పాట ఎన్నో ప్రక్రియలతో సహవాసం చేసింది. జానపదం, శాస్త్రీయం, లలితం, భక్తి, దేశభక్తి, వైరాగ్యం, తాత్త్వికం, ఆధ్యాత్మికం, సినిమా, రాక్&రోల్, డిస్కోపాప్, ఇండీపాప్, రాక్ ఇలా ఎన్నో రూపాలుగా పాట మనలో ఇమిడి పోయింది. ఈ పరిణామం వల్ల పాట మౌలికస్వరూపం నేడు పోల్చుకోలేనంతగా మారిపోయి సినిమాల్లో విహారం చేస్తున్నది. ఇప్పుడు దీన్ని 'పాట' అనేట్టు లేదు.

నేటి సినిమా పాటలను ఒక సంగీతాభిమాని ఇలా నిర్వచించాడు సరదాగా. "వీటిలో అరుపులు ఎక్కువ ఉన్నాయి . కనుక వీటిని తెలుగులో 'క్యాటలు', ఇంగ్లీషులో 'క్రయాంగ్స్', హిందీలో 'చిల్‌గీత్' అని అనొచ్చునేమో!" ఇదొక చమత్కారమే సుమా! ఎవరూ బుజాలు తడుము కోనక్కరలేదు. శాస్త్రరీతులను ఆధారం చేసుకుని, జానపదలక్షణాలను అవలంబించి, లాలిత్యంగా అంటే, సుకుమారంగా ఆలపించిన సంగీతాన్ని 'లలితసంగీతం' అనవచ్చు. ఈ రకమైన సంగీతపు పాటలలో వస్తువు

"భావసంచారం,ఊహ,భక్తి,దేశభక్తి,ప్రబోధం, ఆధ్యాత్మికం" మొదలైన ధోరణులతో సాగుతుంది. అలా సాగే రకరకాలైన లలితగీతాలు కోకొల్లలుగా ఉన్నాయి. వాటిలో కొన్నిటిని మాత్రమే విశ్లేషిస్తూ మీ ముందుకు తీసుకురావడం జరుగుతున్నది. సినిమాపాటకు దారి చూపి,గురుస్థానంలో నిలబడిన ఈ లలితగీతాలను ఒకసారి గుర్తు చేసుకుని గౌరవించడం కృతజ్ఞత అవుతుంది.

**1. మా తెలుగుతల్లికి**

**రచన : శంకరంబాడి సుందరాచారి**

**సంగీతం: ఆర్.సుదర్శనం**

**గానం : టంగుటూరి సూర్యకుమారి**

**మిశ్ర భీంప్లాస్–ఝంప**

**మా తెనుగుతల్లికి మల్లెపూదండ**
**మా కన్నతల్లికి మంగళారతులు ॥మా॥**
**కడుపులో బంగారు,కనుచూపులో కరుణ**
**చిరునవ్వులో సిరులు దొరలించు నా తల్లి ॥మా॥**

**1. గలగలా గోదారి కదలిపోతుంటేను**
**బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటేను**
**బంగారుపంటలే పండుతాయి**
**మురిపాల ముత్యాలు దొరలుతాయి ॥మా॥**

**2. అమరావతీగుహల అపురూపశిల్పాలు**
**త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు**
**తిక్కయ్య కలములో తియ్యందనాలు**
**నిత్యమై,నిఖిలమై నిలచియుండేదాక**
**రుద్రమ్మ భుజశక్తి,మల్లమ్మ పతిభక్తి**
**తిమ్మరసు ధీయుక్తి కృష్ణరాయని కీర్తి**
**మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక**
**నీ పాటలే పాడుతాం,నీ ఆటలే ఆడుతాం**
**జై తెలుగుతల్లి జై తెలుగుతల్లి॥**

ఈ పాట రికార్డుగా విడుదలయ్యేంత వరకు కూడా శంకరంబాడి సుందరాచారి అంటే ఎవరో ఎవరికీ సరిగా తెలియదు. తరువాత కూడా చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. 1975లో ప్రపంచతెలుగు మహాసభల వేదిక మీద సూర్యకుమారి గారు తంబుర చేత్తో పట్టుకుని ఈ పాటను ఆలపించాక ఈ రచయితను గురించి తెలుసు కోవడానికి చాలామంది ఉత్సాహపడ్డారు.

శ్రీశంకరంబాడి సుందరాచారి (1914–1977) తిరుపతిలో జన్మించారు. మాతృభాష తమిళమే అయినా మదనపల్లిలో ఇంటర్ చదివేప్పుడు తెలుగుభాషపై మక్కువ పెంచుకున్నారు. పంతానికిపోయి ఇంటిని వదిలేసి, హోటల్ సర్వరుగా, రైల్వే కూలీగా పనిచేస్తూ నానా కష్టాలు పడ్డారు. తరువాత కాలంలో 'ఆంధ్రపత్రిక'లో ప్రూఫ్ రీడరుగా పనిచేశారు. ఉపాధ్యాయునిగా, పాఠశాలల పర్యవేక్షకునిగా కూడా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రేమించి పెళ్ళాడిన వేదమ్మాళ్ మరణించినప్పటి నుండి తాత్త్విక జీవితానికి అలవాటుపడినారు. "బలిదానం, సుందర రామాయణం, సుందర భారతం, శ్రీనివాస శతకం, జపమాల, బుద్ధగీతి, ఏకలవ్యుడు, కెరటాలు, సుందరసుధా బిందువులు, అపవాదు, పేదకవి, నా స్వామి, నేటి కవిత్వం, కార్వేటినగర నీరాజనం" అనే గ్రంథాలను రచించారు. ఇవికాక రవీంద్రుని గీతాంజలిని తెలుగులోనికి అనువదించారు. ''మహాత్మాగాంధి, బిల్హణీయం, దీనబంధు" అనే డాక్యుమెంటరీ చిత్రాలకు పాటలు రాశారు. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, విశ్వనాథ, గడియారం వేంకటశేషశాస్త్రి, రాయప్రోలు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ మొదలైన ప్రముఖులు సుందరాచారిగారి రచనలను ఎంతగానో ప్రశంసించారు. వీరికి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు "ప్రసన్నకవి" బిరుదును ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు ఆయన విగ్రహాన్ని తిరుపతిలో స్థాపించగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆ విగ్రహం దగ్గర 'మా తెలుగుతల్లి' పాటను నిరంతరం వినిపించే ఏర్పాటు చేశారు.

తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు అన్నీ కలబోసినట్లైతే ఆ రూపం 'తెలుగు తల్లి' అవుతుంది. ఆమె కరుణ, వైభవం, అన్నపూర్ణత్వం అన్నీ ఈ పాటలో వర్ణించబడినాయి. కృష్ణా గోదావరుల చల్లని ఆశీస్సులు అందించే బంగారు పంటలు, ప్రసాదించే ముత్యాల సిరులు మొదలైనవన్నీ మొదటి చరణంలో చక్కగా చెప్పారు. అమరావతీవైభవం, త్యాగరాజ సంగీతసంపద, తిక్కనాదికవుల కవితా మాధుర్యాలు తెలుగుసీమలో పుష్కలంగా కనిపిస్తాయి. రుద్రమదేవి పరాక్రమం, బొబ్బిలి రంగరాయసతి మల్లమ్మ పాతివ్రత్యశక్తి,అప్పాజీ ధీశక్తి, శ్రీకృష్ణదేవరాయల సంగీతసాహిత్య విక్రమఘనశక్తి ఎప్పుడూ మన చెవుల్లో మారుమ్రోగుతూ ఉంటాయి. తెలుగుతల్లి స్వరూపాన్ని, వైభవాన్ని ఈ పాటలో కవి మనోహరంగా వర్ణించారు.

1942లో తీసిన 'దీనబంధు' సినిమా కోసం సుందరాచారి గారు ఈ పాటను రాశారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ పాటను సినిమాలో ఉపయోగించక పోవడం వల్ల సుదర్శనం-గోవర్ధనం జంట సంగీత దర్శకులలో ఒకరైన సుదర్శనం గారు దీనికి బాణీ కట్టగా గ్రామఫోను రికార్డుగా టంగుటూరి సూర్యకుమారి గారి గాత్రంతో విడుదల చేశారు. తరువాత సాహిత్యంలో చిన్న మార్పులు చేస్తూ 1943లో మద్రాసు రేడియోలో సూర్యకుమారిగారి చేత పాడించారు.

సుదర్శనంగారు ఈ పాటను ప్రధానంగా భీంప్లాస్ రాగంలో ప్రారంభించారు. ఇది హిందూస్తానీ రాగం. భీం, పలాస్ అనే రెండు రాగాల కలయికతో ఇది ఏర్పడింది. భీం రాగం సగమపనిస అనే మూర్ఛన గల ఔడవ రాగానికి చెందినది. పలాస్ రాగం సంపూర్ణరాగం ఈ రెండు రాగాలూ కాఫీ థాట్ నుంచి ఉద్భవించాయి. వీటిలో ఆరోహణ వరకు భీంను, అవరోహణకు పలాస్‌ను తీసుకుని కలిపి వ్యవహరిస్తున్నందు వలన 'భీం పలాస్' అని వ్యవహారంలోకి వచ్చింది. దీనికి సమాంతరంగా కర్ణాటక సంగీతంలో 'అభేరి' అనే రాగం ఉంది. 'వజ్రకాంతి' అనే మరో రాగం కూడా ఈ లక్షణాలనే కలిగి ఉన్నది. కొంతమంది దీన్ని 'కర్ణాటకదేవగాంధారి' అని కూడా వ్యవహరిస్తున్నారు. ఈ రాగాలన్నీ 'ఖరహరప్రియ' రాగజన్యాలు.

ఝంపతాళంలో ఈ పాట సంచారాన్ని రూపొందించారు. ఈ తాళాన్ని కర్ణాటక సంగీత విద్వాంసులు 'ఖండచాపు' అని వ్యవహరిస్తున్నారు. ఆ తాళం సామాన్య శ్రోతలకు అంతగా ఇష్టం ఉండదు. అందరూ పాడుకునే సౌలభ్యం ఈ తాళంలో కనిపించదు కనుక పాట సర్వజనామోదం పొందలేకపోయింది. చతురస్రంలోనో, త్రిశ్రగతిలోనో పొందించివుంటే అందరి మెప్పు సంపాదించుకునేదేమో అని చాలామంది లలిత సంగీతాభిమానులు అభిప్రాయ పడుతున్నారు. పాట ప్రారంభంలో 'సాగామపామగస' అనే స్వరసంపుటిని వీణతో చాంటింగ్ చేయిస్తూ ఉండగా వయొలిన్‌ను సాకీ మాదిరిగా సంచారం చేయించారు. ఏడు ఆవర్తాల తరువాత పంచమం నుండి పల్లవిని ఎత్తుకున్నారు. రెండవసారి పల్లవిని పాడుతూ 'పూదండ' కాగానే అనుపల్లవిని ప్రారంభించి మొదటి పంక్తిని రెండుసార్లు పాడారు. 'బంగారు, కరుణ' పదాలను పాడుతున్నప్పుడు ఆమె లేతగొంతు సంగతులు ఎంతో స్పష్టంగా, ఆకర్షణీయంగా వినిపించాయి. 'నాతల్లి' పాడాక పల్లవి మొదటి పంక్తిని మాత్రమే తిరిగి పాడారు. తరువాత ఏ బిట్‌వర్కు లేకుండానే మొదటి చరణం 'గలగలా గోదారి'ని స్వరాక్షరపద్ధతిలో గాంధారం నుండే ప్రారంభించారు. మొదటి పంక్తిలోని 'పో' దగ్గర ఆమె కలవాటైన చిరుగమకాన్ని వినిపిస్తూ ఆ పాదాన్ని రెండుసార్లు పాడారు. రెండవ పాదాన్ని పాడాక మూడవ పాదాన్ని పంచమం దగ్గర ప్రారంభించి 'పండుతాయి'లో 'తాయి' అక్షరాలను విచిత్రంగా అన్యస్వరమైన కాకలినిషాద సమ్మేళనంతో కొత్త రంగును సంతరింపజేసే సంగతిని వినిపించారు. ఇది స్వరకర్త చేసిన స్వరచమత్కారం. ఈ పాదాన్ని రెండుసార్లు యథాతథంగా పాడారు. తరువాత చివరి పాదాన్ని అందుకుని చరణాన్ని ముగించి పల్లవిని పాడారు.

తరువాత అయిదు ఆవర్తాలలో వయొలిన్స్, వీణల కలయికతో భాగేశ్వరి రాగస్వర సంపుటిని వినిపించి తారషడ్జమం దగ్గర వదిలేశారు. ఈ రాగం కూడా కాఫీ థాట్‌కు చెందినదే. దీనిలో పంచమం స్పర్శామాత్రంగా ఉంటుంది. కాని దీనిలో పంచమాన్నే ప్రముఖంగా వినిపించారు. 'అమరావతీగుహల'ను తారషడ్జమంలో ప్రారంభించి అదే పంక్తిని రెండు సార్లు పాడారు. తరువాత నుండి ఏ పాదాన్నీ తిరిగి పాడకుండా ఏకబిగిన చరణం అంతా పాడారు. 'అమరావతీ, అపురూప, శిల్పాలు' పదాల దగ్గర కమ్మని సంగతులు పలికారు. 'గొంతులో, కలములో, తియ్యందనాలు, కృష్ణరాయని, పాటలే' దగ్గర కూడా చక్కని అనుస్వరాలను వినిపించారు. 'జైతెలుగుతల్లి' ని మొదటిసారి మధ్యమం దగ్గర, రెండోసారి తారషడ్జమం దగ్గర వదిలేశారు. దీని తరువాత మద్రాసు ఆకాశవాణిలో పాడుతున్నప్పుడు కళాకారులకు రికార్డు కంటె కొంత స్వేచ్ఛ లభించింది. రికార్డు 3 ని॥ల లోపుగా అయిపోవాలి కనుక బిట్‌వర్క్, రిపిటీషన్స్‌కు అవకాశాలు లభించలేదు. రేడియోలో కొంత వెసులుబాటు దొరికింది. అయితే, రేడియోకు పాడుతున్నప్పుడు సంగీతసాహిత్యాలలో చిన్నచిన్న సవరణలు చేశారు.

ప్రారంభంలో బిట్టును సంక్షిప్తం చేశారు. పాట నడకను కూడా రికార్డులో కంటె కొంత వేగాన్ని తగ్గించారు. మొదటి చరణానికి ముందు బిట్టు ఇవ్వలేదు. రెండో చరణానికి ముందు నాలుగు ఆవర్తాల బిట్టును ఇచ్చారు. అమరావతిలో గుహలు లేవు కనుక 'గుహలు' మార్చి 'నగర'

అని పాడించారు. మొదటి పాదాన్ని రెండుసార్లు పాడారు. తరువాత రెండో పాదాన్ని కలుపుకుని రెండుసార్లు పాడారు. 'తిక్కయ్య కలములో' పంక్తిని పాడాక వయొలిన్స్‌తో 4 ఆవర్తాల బిట్టునిచ్చాక మళ్ళీ ఆ పాదాన్నే పాడారు. 'నిత్యమై' పాదాన్ని కూడా రెండు సార్లు పాడారు. ఈసారి 'తిమ్మరుసు, కృష్ణరాయలు' అని పాడారు. 'మా చెవుల రింగుమని' ని రికార్డులో లేని కొత్త సంగతిని ఎలుగెత్తి రెండుసార్లు ఆలపించారు. 'జైతెలుగుతల్లి' ని రెండుసార్లు రికార్డులో లాగానే పాడి పాటను ముగించారు. మళ్ళీ పల్లవిని అందుకోలేదు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
(జాతీయ పురస్కార గ్రహీత)
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

## మల్లెపూదండ – శంకరంబాడి సుందరాచారి

దేశ భౌగోళిక, సాంస్కృతిక వైశిష్ట్యాన్ని కీర్తిస్తూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జాతీయగీతం 'జనగనమన... లాగే, ఆంధ్రప్రదేశ్‌కొక రాష్ట్ర గీతాన్ని అందించిన గొప్పకవి *శంకరంబాడి సుందరాచారి.* ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి వేరుపడి తమ అస్తిత్వాన్ని రక్షించుకొనే ఆరాటంతో, ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రం కోసం వ్యూహాత్మక పోరాటం ప్రారంభించిన నేపథ్యంలో 1946లోనే *"మా తెలుగు తల్లి మల్లెపూదండ...."* గీతాన్ని రచించారు ప్రసన్న కవి సుందరాచారి. హెచ్.ఎం.రెడ్డి నిర్మించిన 'దీనబంధు' చిత్రం కోసం రచించిన ఈ మహత్తర గీతం. సాంకేతిక కారణాల వలన హెచ్.ఎం.రెడ్డి దూరదృష్టి సంస్కారం వలన ఏనాటికీ తెలుగుజాతి పాడుకొనే గొప్ప గీతంగా మిగిలిపోయింది.


శంకరంబాడి సుందరాచారి

తమిళుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న తెలుగువారిలో స్ఫూర్తిని నింపడానికి, తమిళం మాతృభాషగా కలిగిన శంకరంబాడి సుందరాచారి ఈ గీతం రచించడం విశేషం. శంకరంబాడి సుందరాచారి 1910వ సంవత్సరం ఆగష్టు 10వ తేదీన తిరుపతిలో జన్మించారు. బాల్యంనుండీ స్వేచ్ఛాభావనలు కలిగి, సంప్రదాయ చట్రంలో ఇమడలేని తనం. ఆత్మవిశ్వాసంలో, ఆత్మ గౌరవం కాపాడుకోవడం కోసం, జీవనాధారమైన ఆర్థిక అవసరాలను సైతం ఎన్నోసార్లు తృణప్రాయంగా వదులుకొన్న మొండి మనస్తత్వం ఆయనిది. ఇది తెలుగు కవులలో అరుదుగా కనిపించే అంశం. తన సామాజిక వర్గ సంబంధమైన, సనాతన సాంప్రదాయాలను పాటించే విషయంలో తండ్రితో వచ్చిన విభేదాల కారణంగా, యవ్వనదశలోనే కుటుంబానికి దూరమయ్యారు. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి ఆంధ్రపత్రికలో కొంత కాలం పనిచేశారు. తర్వాత చిత్తూరు జిల్లాలో ఉపాధ్యాయునిగా కొంతకాలం స్కూళ్ల ఇన్‌స్పెక్టరుగా ఉద్యోగం చేశారు. ఒకసారి జిల్లాస్థాయి అధికారి తొందరపాటుకు మనస్తాపం చెంది, ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకున్నారు. తన రచనలు చాలా వరకు తానే అచ్చువేసుకొని, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందికి అమ్ముతూ, వచ్చిన ఆదాయంతోనే జీవనం గడిపిన ఆత్మాభిమాని. సినిమా కథలాంటి వైవాహిక, సంసార జీవితం సినిమాలాగే ముగిసిపోయింది. కంచిలోని 'కంచిగరుడసేవ' చూడాలనే కాంక్షతో ఓసారి కంచి వెళ్లి దైవదర్శనం ముగిసిన తర్వాత, ఆ రాత్రి ఓ ఆచార్యుల ఇంటి అరుగుమీద నిద్రపోయారు. అర్ధరాత్రివేళ ఆ ఇంటి యజమానులైన దంపతుల ఆవేదనాభరితమైన సంభాషణ విని, తలుపు తట్టి, విషయం తెలుసుకున్నారు. మతిస్థిమితం లేని తమ కుమార్తె పెళ్లి ఆగిపోయిన సంగతి విని, ఉద్వేగంతో అప్పటికప్పుడే నిర్ణయించుకుని ఆ అమ్మాయిని (వేదమ్మాళ్) వివాహం చేసుకున్నారు. కొద్ది కాలానికే ఆమె మరణించడంతో, నిరాశ నిస్పృహలకు లోనై ఆజన్మాంతం ఆవేదనాభరితంగానే గడిపిన దురదృష్టవంతుడు. ఆ దయనీయ స్థితిలోనే మద్యపానం వంటి బలహీనతకులోనయినా, తన రచనా వ్యాసంగాన్ని వీడని కవితా సంపన్నుడు. తన సహోద్యోగి, ఆప్తమిత్రుడు అయిన సాహిత్యాభిలాషి, మంచి పౌరాణిక నటుడు వై.కె.వి.ఎన్. ఆచార్య సహకారంతో చాలా రచనలు చేశారు. ఈ అంశంలో కేవలం వ్యక్తిగత వర్తన వలన శంకరంబాడికి దూరం కాకుండా, ఆయనలోని కవితాశక్తిని ఆరాధించి, దాదాపు నాలుగు దశాబ్దాలపాటు శంకరంబాడితో సహవాసం చేసిన వై.కె.వి.ఎన్. ఆచార్యకు తెలుగు సాహిత్యాభిమానులు ఋణపడి వుంటారు. అలాగే సుందరాచారి వద్ద చదువుకున్న కృతజ్ఞతతో, సాహితీ సంస్కారంతో ఆయనకు ఏడేళ్ల పాటు తన ఇంట్లో ఆశ్రయమిచ్చి ఆదరించిన ఎస్.వి.ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డా. మన్నవ భాస్కరనాయుడు కుటుంబానికి, ఆ మహాకవి

అభిమానులందరూ ఋణపడి వుంటారు. *సుందర రామాయణం, సుందరభారతం, ఏకలవ్యుడు, సుందర సుధాబిందువులు, జపమాల, బలిదానం, బుద్ధగీతి, ఆస్వామి* వంటి కావ్యాలు, వచన రచనలు చేశారు. చిత్తూరు వి. నాగయ్య ప్రోద్బలంతో చలనచిత్ర పరిశ్రమలోకి ప్రవేశించి బిల్హణీయం, దీనబంధు చిత్రాలకు పాటలు రాశారు. భారత రాష్ట్రపతులు బాబూ రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారిని, తన సాహితీ ప్రతిభతో మెప్పించి బహుమతులందుకున్నారు. లోక్‌సభ తొలి స్పీకర్ అనంతశయనం అయ్యంగార్‌కు దేహబంధువైనా ఏనాడూ ఆ పరపతిని తన స్వప్రయోజనాలకు వాడుకోలేదు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రసన్నకవి బిరుదుతో సత్కరించింది. శంకరంబాడి సుందరాచారి 90వ జయంతి సందర్భంగా, 2004వ సంవత్సరంలో టి.టి.డి. ఆధ్వర్యంలో ఆనాటి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, రచయిత పులికంటి కృష్ణారెడ్డి ప్రత్యేక శ్రద్ధతో తిరుపతిలో కాంశ్య విగ్రహ స్థాపన చేసారు. రచయిత, సినీ నటుడు గొల్లపూడి మారుతీరావు సహకారం వలన, అయిదువేల ఆటవెలదిలతో కూడి నాస్వామి కావ్యాన్ని తి.తి.దే 2009లో పునర్ముద్రించింది. 1975లో జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా "*మా తెలుగుతల్లికి.....*" గీతాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించారు. దాంతో ఆ మధురకవికి రాష్ట్రవ్యాప్త గుర్తింపు వచ్చింది. శంకరంబాడి సమకాలికులు, వయసులో పెద్దవారు అయిన తెలుగు సాంప్రదాయకవులు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యన్నారాయణ, గడియారం వేంకట శేష శాస్త్రి వంటి వారు సుందరాచారి రచించిన పలు కావ్యాలను ప్రస్తుతించి, ప్రశంస పత్రాలు అందించారు. కొందరు శంకరంబాడి సత్కార సభలలో పాల్గొని వీరిని సత్కరించారు. శంకరంబాడి రాసిన "*మా తెలుగుతల్లికి....*" గీతాన్ని టంగుటూరి సూర్యకుమారి చేత హెచ్.ఎం.వి.వారు పాడించి రికార్డు చేశారు. అయితే ప్రచారార్భాటం లేని శంకరంబాడి పేరుకు బదులు ఆ గీతాన్ని దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించినట్లు చాలాకాలం ప్రచారంలో వుంది. స్వయంగా శంకరంబాడి పూనుకొని ఆ విషయాన్ని హెచ్.ఎం.వి.వారి దృష్టికి తీసుకురాగా, వారు సరిదిద్దుకుని, రచయితకు నూటపదహారు రూపాయలు పారితోషకం ఇచ్చి గౌరవించుకున్నారు.

తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ సందర్భంలో తెలంగాణావాదులు, ఈ గీతం గురించి అది పూర్తిగా ఆంధ్రప్రాంతం, కవులు, ప్రముఖుల గురించే తప్ప, తెలంగాణా గురించి ఏమీ స్పృశించనిది, ఆ గీతాన్ని ఇన్ని దశాబ్దాలుగా మాపై రుద్ది మాచేత ఆలపింపజేస్తున్నారు. "ఇకపై మేం ఒప్పుకోం. తెలంగాణా ఏర్పడితే వేరొక రాష్ట్రగీతం ఎంపిక చేసుకుంటాం" అని నిర్ద్వందంగా ప్రకటించారు. అయినా ఆ గీతం పట్ట గీత రచయిత పట్ల నవ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఈ ప్రాంతంలోని విశ్వవిద్యాలయాలు, సాహితీ సంస్థలకు తగిన గౌరవం, అవగాహన లేదని చెప్పవచ్చు. 2014వ సంవత్సరం శంకరంబాడి సుందరాచారి శతజయంతి సందర్భంగా కూడా ఆ ప్రసన్న కవికి ప్రభుత్వపరంగా తగిన నివాళి లేకపోవడం విచారకరం. అదే సందర్భంలో చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఒక జాతీయ సదస్సు నిర్వహించడం అభినందనీయం. అలాగే చెన్నైలోని 'జనని' సంస్థ శ్రీ గుడిమెట్ల చెన్నయ్య సారధ్యంలో శంకరంబాడి శతజయంతి ప్రత్యేక సంచిక ముద్రించి నివాళులర్పించింది. 2015 శతజయంతి ముగింపు సంవత్సరం. (తమిళ) సుబ్రహ్మణ్యం భారతి, (బెంగాలీ) రవీంద్రనాధ్ ఠాగూర్, బకించంద్ర ఛటర్జీ, (హిందీ) భారతేంద హరిశ్చంద్ర వంటి భాషా కవులతో పోల్చదగిన, శంకరంబాడి సుందరాచారి పేరిట ఏటా వారి జయంతినాడు ఒక తెలుగు కవికి బిరుదు ప్రదానంతో సత్కరించడం ద్వారా వీరి స్మృతిని కలకాలం నిలిపేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి రాష్ట్రావతరణ వేడుకలలాగే జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రతి ఏటా శంకరంబాడి జయంతి జరిపేలా ఆదేశాలు జారీ చేయాలి. అనేక సాహితీ సంస్థలు, సాహిత్యవేత్తల కృషి వలన కొన్ని రచనలు లభ్యమైనా, ఇంకా కొన్ని లభించని స్థితి. తి.తి.దే., తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థల ద్వారా అలభ్యంగా వున్న శంకరంబాడి రచనలు అందుబాటులోకి వచ్చే దిశగా కృషి జరగాలి. (రాష్ట్రగీత రచయిత రచనల్నే అందుబాటులో వుంచలేని ప్రభుత్వాలు, ఏదో అద్భుతాలు సృష్టిస్తామంటే అతిశయోక్తిగానే వుంటుంది) ఈ శతజయంతి ముగింపు సందర్భంగా ప్రభుత్వం అసంపూర్ణమైన కార్యక్రమాల జయప్రదం చేయడానికి పూనుకొంటేనే శంకరంబాడి స్మృతిని కాపాడినవారవుతారు. తెలుగు జాతిలో స్ఫూర్తిని నింపే శంకరంబాడి 1977 ఏప్రిల్ 8వ తేదీన అమరులైనారు.

*- నాటక బంధం - బి.వి. అప్పారావు జ్ఞాపకాలు*

# కవిత్వ తత్త్వం

– గొట్టిముక్కల స్వర్ణలత

ఇప్పుడొస్తున్న కవిత్వాన్ని వచన కవిత్వం అని, వచన పద్యం అని, పద్యం అనీ రకరకాలుగా వ్యవహరిస్తున్నప్పటికీ వాటన్నిటి అర్థం Free -Verse అనే. వచన కవిత యొక్క ధ్యేయం కవిత్వం యొక్క నిజతత్వాన్ని మరుగుపరిచే ఛందస్సు మొదలైన లక్షణాలను వర్జించడం ద్వారా దాని నిజతత్వాన్ని నిరూపించడమే తప్ప కవిత్వాన్ని వచనం స్థాయికి దిగజార్చడం కాదు. అయితే పద్యానికి గణయతి ప్రాసాది నియమాలున్నట్లే వచన కవితకూ అర్థవంతమైన ఎత్తుగడ, పూర్వాపర సమన్వయంతో కూడిన వస్తు నిర్వహణ, సార్థకమైన ముగింపు, ఔచిత్యమంతంగా అలంకృతమైన సాపేక్ష నిర్మాణం ఉండాలన్న దృష్టితోనే వచన కవితను వచన పద్యమనీ, పద్యమనీ వ్యవహరిస్తున్నట్లు అనుకోవచ్చు.

"ఆకలి కవిత్వం రాయి, ఆవకాయ కవిత్వం రాయి మాకు తగాదా లేదు. కానీ నీవు అసలు కవిత్వం రాయాలి. ఇదీ ఈనాడు తలయెత్తే ప్రశ్న. కవిత్వం రాసే విధివిధానాల మీద పట్టుదలలు వదిలిపోయిన ఈ రోజు కవిత్వం రాసేవాళ్ళకి మరింత ప్రమాదం ఏర్పడిందేగాని మరింత సౌలభ్యం దొరికిందనుకోవడం పొరపాటు'' అన్న శేషేంద్రశర్మగారి అభిప్రాయంలో భాషను భావాన్ని కవిత్వ రూపంలో అనువదించే ప్రక్రియను విశిష్టమైనదిగా భావించవచ్చు. కళా రహస్యం భావవ్యక్తీకరణలోనే ఉంటుంది అన్న అభిప్రాయం గానీ one is not a writer for having choosen to say certain things, but for having choosen to say them in a certain way అనే పాశ్చాత్య అభిప్రాయంగానీ శేషేంద్రశర్మగారి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తూ వ్యక్తీకరణ విధానాన్ని నొక్కి చెబుతున్నట్లు తెలుస్తుంది. అంటే వస్తువునో, విషయాన్నో, ఆలోచననో, భావోద్వేగాన్నో కవిత్వంగా మలిచేక్రమం ప్రధానమైనది అన్నమాట. దీన్నే కవిత్వ నిర్మాణ పద్ధతి అనవచ్చు. ఒక్కో కవీ తన ఆలోచనను ఒక్కో నిర్మాణ పద్ధతిలో కవిత్వీకరిస్తాడు. కవిత్వ స్వభావాన్ని బట్టికూడా కవిత్వ నిర్మాణ పద్ధతులు భిన్నమైనవిగా ఉండొచ్చు. ఉదాహరణకు భావ కవిత్వానిదొక వ్యక్తీకరణ విధానమైతే అభ్యుదయ కవిత్వానిది మరొక విధానం. చలం తన యోగ్యతాపత్రంలో "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని వ్యాఖ్యానించడం వారి కవితా మార్గాలను బట్టే. మరోకవి అన్నట్లు

**"పద్యం రాయడానికి ఏవీ అక్కరలేదు**
**మహత్తర, మహోన్నత సాధన సామగ్రి అక్కరలేదు**
**ఒక శబ్దం చాలు**
**ఒక చూపు చాలు........రాలుతున్న ఆకు చాలు**
**ఎగురుతున్న గడ్డిపోచ చాలు...**

నువ్వు బతికుంటే చాలు"– బతికుండడమంటే కేవలం నజీవత్వం కాదు. Artistic creation is to a considerable extent based on a state of emotion, i.e on being shaken in every aspect of the personality by an object, an idea or a goal అని ఒక విమర్శకుడు అన్నట్లు ఉద్వేగ లక్షణాన్ని కాపాడుకోవడమే బ్రతికుండడమంటే. అది కవికి కావాల్సిన ప్రాథమిక లక్షణం. అప్పుడే కవిత్వంలో చైతన్యం తొణికిసలాడుతుంది.

**"ప్రజ్ఞా నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా**
**తదనుప్రాణనాజ్జీవ వర్ణనా నిపుణః కవిః"!** క్షణ క్షణాన క్రొంగొత్త మెరుగులు చిమ్మే ప్రజ్ఞే ప్రతిభ. అదే కవిత్వానికి (చైతన్యం గల వర్ణన) కారణం అన్న పూర్వ ఆలంకారికుల మాట ఏ కాలానికైనా అన్వయిస్తుంది. కనుకనే ప్రతిభావంతుడైన కవికి ఆకాశమే హద్దు.

**"న కావ్యార్థ విరామోస్తి యదిస్సాత్ ప్రతిభా గుణః"** అని ఆనందవర్ధనుడు చెప్పినా **"కాదేదీ కవితకనర్హం"** అని శ్రీశ్రీ చెప్పినా కవి ప్రతిభ అతనికి అనంతమైన విషయాలను / వస్తువులను అందించడమే కాక ఆ విషయాలను పాఠకులకు రకరకాల పద్ధతులలో నవనవోన్మేషంగా

అందిస్తుంది. కవి తన కవితల్లో అనేక నిర్మాణ పద్ధతులను ఉపయోగిస్తాడు. అలాగే ఒక కవితలోనూ అనేక నిర్మాణ పద్ధతులను ఉపయోగించే కవులూ ఉన్నారు. ఈ నిర్మాణ పద్ధతులు కవికి తెలిసి ఉపయోగించవచ్చు. తెలియకుండానే వాడి ఉండొచ్చు కూడా. సహృదయుడు / విమర్శకుడు ఆయా కవుల కవిత్వ నిర్మాణ పద్ధతులను వివరించడం ద్వారా పాఠకులకు కవిత్వాన్ని అర్థం చేయించగల సామగ్రిని అందించడమే కాక కవిత్వ రచనపట్ల ఆసక్తి ఉన్న వారికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చిన వారవుతారు. కొన్ని కవిత్వ నిర్మాణ పద్ధతులను క్రింద చర్చిద్దాం.

**1. Objective Correlative (వస్తు సంబంధి) :** ఈ పదాన్ని మొట్టమొదట వాడినవాడు T.S Eliot. "The only way of expressing emotion in the form of art is by finding an objective correlative in other words a set of objects, a stimulation, a chain of events which shall be the formula of that particular emotion అంటాడు ఎలియట్. అంటే కవి తన ఆలోచననూ, భావాన్నీ నేరుగా కాక ఒక ఉద్రేకపూరిత వాతావరణం ద్వారా, అనుభూతి ద్వారా, ఒక మూడ్ ద్వారా వ్యక్తం చేస్తాడు. తన భావంతో సంబంధమున్న మానసిక స్థితినీ, ప్రకంపననీ సృష్టించగల వస్తు సముదాయాన్నీ, సన్నివేశాన్నీ ఘటనల గొలుసునీ వాక్యాలలో ఏర్పరచడం ద్వారా భావాన్ని కవిత్వంగా మలచవచ్చని ఈ పద్ధతి చెబుతుంది.

**"బహుశా ఈరోజు ఎవరూ రాకపోవచ్చు**
**పిట్టల తోడు లేకుండా ఈ చెట్టు పడుకుంటుంది కాబోలు**
**ముఖపత్రాలన్నీ అక్షరరహితాలుగా తెల్లబోతాయి కాబోలు"**

అంటూ కె.శివారెడ్డి పిట్టల తోడు లేని చెట్టునీ, అక్షరాలు లేని ముఖపత్రాలనీ వాడుకొని వాటిద్వారా ఒంటరితనానికి సంబంధించిన ఒక అనుభూతిని అందించారు. ఈ కవిత్వ నిర్మాణ పద్ధతిని తెలుగు విమర్శకులు "వస్తు సంబంధి" గా వ్యవహరిస్తున్నారు.

**2. Language of gesture (సైగల భాష):** కవి తనకున్న ఆలోచనను సైగరూపంలోనో, ముఖానికీ చేతులకీ సంబంధించిన భంగిమ రూపంలోనో ఒక నాటకీయ వాతావరణం ద్వారానో ప్రవేశపెట్టినప్పుడు కూడా కవిత్వం వెలువడుతుంది. భావం తాలూకు భౌతిక సూచనలో భాగమైన సైగనీ, భంగిమనీ సమగ్రంగా వ్యక్తం చేయగల మాటలు, పదాల వ్యవస్థని Language of gesture అంటారు.

**"నీ కనుకొలకుల నుండి ఒక్క కన్నీటి బొట్టు రాలనీకు**
**నాయీ దోసెడు దీక్షాజలంలో కనిపించే**
**నీ ప్రతిబింబం చెదిరిపోతుందేమోనని భయం**
**ప్రియతమా" – ఈ రెండు వ్యక్తీకరణల్లోనూ ఉన్న ముఖభంగిమను గుర్తించవచ్చు.**

**3. Auditory Imagination (శబ్దకంపన పద్ధతి) :** తాను చెప్పదలచుకున్న భావాన్ని ఒక శబ్దవాతావరణం ద్వారా అందించడానికి కావలసిన ఇమేజెస్‌నీ, మాటల్నీ పోగు చేసుకొని వాక్య నిర్మాణం చేసే పద్ధతిని ఆడిటరీ ఇమాజినేషన్ అంటారు. అంటే శబ్దప్రతిమలను ఉపయోగించి ఆలోచనను కవిత్వం చేసే పద్ధతిని శబ్దకంపన పద్ధతి అంటారు. వేగుంట మోహనప్రసాద్ కవిత్వంలో ఆడిటరీ ఇమాజినేషన్ టెక్నిక్‌ని చూడవచ్చు.

**"కీచురాళ్ళలో నరాల సూదులవాన**
**రాత్రంతా అలా నరాలు కురుస్తోన్నప్పుడు**
**నా శిరస్సులోకి రాజేసుకున్న**
**నిప్పులకణికల మీద మొక్కజొన్న కండెలా**
**హృదయాన్ని తిప్పుకుంటూ వేపుకుంటున్నాను"**

అంటాడు "మో". కీచురాళ్ళ ప్రస్తావన, నరాల సూదుల వాన ప్రస్తావన పాఠకుడి శ్రవ్య తంత్రుల్ని తట్టిలేపుతాయి.

**4. Misplacements of things (వస్తు స్థానభ్రంశం):** కవి తాను ఆశించిన భావానికి సంబంధించిన మూడ్‌నీ కంపన వాతావరణాన్నీ సృష్టించడానికి అందుకు సరిపడే వస్తువుల్ని ఎన్నుకొని వాటిని భిన్న ప్రదేశాల్లో భిన్న వస్తువుల్తో కలపడంలోనే కవిత్వ సృష్టి జరుగుతుంది. " Poetry removes things from their proper place and leave them in an atmosphere quite alien to them" ఈ నిర్మాణ పద్ధతిని Misplacements of things అనీ వస్తుస్థానభ్రంశం అనీ అంటున్నారు.

**"రోజూ చూస్తూనే ఉన్నాను.**
**ఆ కన్నుల వెనక ఉమ్మెత్త చెట్లను, ఊసరక్షేత్రాలను"**

అంటూ ఆధునిక మానవుడి దైన్యాన్ని, భీతిని చెప్పడానికి ఉమ్మెత్త చెట్లనూ, ఊసరక్షేత్రాలను వాటికి భిన్నమైన వాతావరణంలో వదలటం వలన కవిత్వం ఏర్పడింది.

**5. Defamiliarisation (అపరిచయీకరణ):** పరిచయమున్న వాటిని పరిచయం లేనివాటిగా

ప్రవేశపెట్టడం, అంతకు ముందు చూసినవాటిని గురించి ఎన్నడూ చూడని స్పృహతో మాట్లాడటం, అనుభవంలోకి ఎప్పుడో వచ్చిన ఘటనని తొలిసారి కనుగొన్న భ్రమను కలిగించే వాతావరణాన్ని ఏర్పరచడం ద్వారా విషయాన్ని కవిత్వంగా మార్చవచ్చు Poetry makes familiar objects appear as if they were not familiar అని షెల్లీ ఈ పద్ధతిని పేర్కొన్నప్పుడు దీన్నే Defamiliarisation అనీ అపరిచయీకరణ అనీ అంటున్నారు.

**"పాట వెలుతురై నన్ను గంధం చెక్కలా కరగదీస్తూ వుంటే**
**నేను కన్నీటి కొండనై పెరుగుతూ ఉంటాను.**
**ఏదో వేదన ఎలుకలా నన్ను తొలుస్తూ ఉంటుంది".**

పాట తన అంతరంగాన్ని కదలిస్తున్న వాస్తవాన్ని నన్ను గంధం చెక్కలా కరగదీస్తూ వుందనటం ద్వారా అవాస్తవీకరించడం, తనలో దుఃఖం కట్టలు తెంచుకుంటుందనే పరిచయ వ్యక్తీకరణను నేను కన్నీటి కొండనై పెరుగుతూ ఉంటాను అంటూ అపరిచయీకరించడం వల్ల పై వాక్యాలు కవిత్వమయ్యాయి.

**6. Image (భావచిత్రం) :** సాహిత్యం అంటే భావ ప్రతిమల్లో ఆలోచించడంగా నిర్వచించినవాళ్ళు ఉన్నారు. కవి తన అనుభవానికి / భావానికి అనుగుణమైన దృశ్య నిర్మాణం చెయ్యడం మరో కవిత్వ నిర్మాణ పద్ధతి.

**"ఇన్నాళ్ళ నుంచి చావిట్లోనే వుంది**
**పుట్టినదగ్గర నుంచీ మేకుకు కట్టేయబడే వుంది**
**కోడెదూడ బయటముఖం చూళ్ళేదు!**
**బయట కట్టేద్దామని - అవును**
**బయట కూడా కట్టేద్దామనే తీసుకొస్తుంటే**
**ఒక గుద్దు గుద్ది -ఎత్తి పడేసి**
**దేశాల మీద పడ్డది" -** స్వేచ్ఛ కోసం తిరుగుబాటు చేయడం అనే భావాన్ని యజమానిని ఒక్క గుద్దు గుద్ది ఎత్తి పడేసి, దేశాల మీద పడ్డ కోడెదూడ ద్వారా వ్యక్తం చేశాడు కవి. అంటే తిరుగుబాటు అనే భావానికి సంబంధించిన ఒక భౌతిక వాతావరణాన్ని, భౌతిక మూర్తినీ చిత్రించగలిగే భాషా నిర్మాణాన్ని చేయడం ద్వారా ఇక్కడ కవిత్వం ఏర్పడింది.

**7. Dramatic Monologue** (స్వగతం) : కవి చెప్పదలచిన భావాన్ని ఒక నాటకీయ స్వగతంగా ప్రవేశపెట్టడం అనేది మరో కవిత్వ నిర్మాణపద్ధతి. నందిని సిధారెడ్డిగారు 'బాలుని ఆత్మగీతం' అనే కవితలో బాల శ్రామికుల దుస్థితి మనసును కదిలించే స్థాయిలో చిత్రించాడు.

"సార్ మీరైనా నన్నానవాలు పట్టలేదా సార్! నిజమే సార్
**జీవితం శపించి ఉండకపోతే**
**మీ సన్నీతో క్రికెట్టాడుకోవల్సిన వాణ్ణి**
**మీ సుజ్జీతో కాన్వెంటు కెళ్ళాల్సిన వాణ్ణి.......**
**నన్నానవాలు వడితే మీ ఆనవాళ్ళు తల్లకిందులవుతాయి**
**అందుకే సార్**
**మీరు నన్ను ఆనవాలు పట్టరు**
**పట్టరు గాక పట్టరు"** అంటూ ముగిసే ఈ కవిత ఒక శ్రామిక బాలుడు తన చేత కష్టం చేయించుకొని తనను గుర్తించని పెద్దమనిషితో చేసే నాటకీయ ప్రసంగంలా సాగుతూ గుండెను పిండేస్తుంది. నాటకీయ స్వగతమే ఈ కవితకు ప్రాణం.

**8.Personification (మానవ గుణారోపణ) :** వస్తువులకీ, అమూర్తభావాలకీ, జంతువులకీ ప్రకృతి విషయాలకీ మానవ స్వభావాన్ని, రూపాన్ని, లక్షణాలనూ ఆపాదించడం ద్వారా కవిత్వం చెప్పే టెక్నిక్‌ని Personification లేదా మానవ గుణారోపణ అని అంటున్నాం. ఖాదర్ 'పుట్టుమచ్చ' పుస్తకంలోని సంధ్య కవిత ఈ నిర్మాణ పద్ధతిలోనిదే.

**"వెలుగు చీకట్ల**
**పల్టీలు వేస్తూ**
**ఎర్ర లంగోటా చుట్టుకొని**
**కాలం వేసిన**
**శీర్షాసనం**
**ఈ సంధ్యా సమయం"** కాలం ఎర్రలంగోటా చుట్టుకోవటం, శీర్షాసనం వేయడం లాంటి వ్యక్తీకరణలు మానవగుణారోపణ పద్ధతిలోనివే.

**9.Paradox (విరోధాభాసం) :** పైకి అసంబద్ధంగా కనబడుతూ లోపల ఒక అనుగుణ్యతనీ, సత్యాన్నీ కలిగి ఉండే వాక్యాల్ని తయారు చేయడం ఒక కవిత్వ నిర్మాణ పద్ధతి. దీన్నే ఆంగ్లంలో Paradox అంటారు. Paradox is a poetic device found in an apparantly self contradictory statement that on a closer examiantion is shown to have a basis of truth " Martin stephen ఈ పద్ధతిని నిర్వచించాడు.

**"చావు మనకు రోజూ కొద్ది కొద్దిగా గోరు ముద్దలు తినిపిస్తుంది.**
**రోజూ చావునే నములుతుంటాం**
**అదే మనల్ని నెమరేస్తుంది."**

ఆధునిక మానవుడిని ఆవరించిన అభద్రతాభావం, మృత్యుశంక Paradox ద్వారా పై వాక్యాల్లో కవిత్వం అయింది. Paradoxను ఉపయోగించి శక్తివంతమైన వాక్యాన్ని, సంక్షిప్తతనీ సాధించిన తెలుగు కవులు చాలా మంది ఉన్నారు.

**"నిదురపోవడం కోసం ఆయుధం అనవరతం మేలుకొని ఉండాలి.**
**విశ్రాంతి కోసం ఆయుధం వినమ్రంగా శ్రమించాలి**
**నిలకడ కోసం ఆయుధం నదీప్రవాహంలా చలించాలి**
**నీడకోసం ఆయుధం ఎండలు వర్షాన్ని కురిపించాలి."**

నిద్ర– మేలుకోవడం, విశ్రాంతి – శ్రమ, నిలకడ – చలనం, నీడ– ఎండ పరస్పర విరుద్ధ విషయాలు. కానీ ఒక్కో వాక్యంలో ఒక్కొక్క జతని కలపడం ద్వారా Paradox వచ్చింది. అందరూ సుఖపడడం కోసం (నిద్రపోవడం కోసం) విప్లవోద్యమం జాగ్రత్తగా (మేలుకొని) వ్యూహం అల్లాలి. రాబోయే విశ్రాంతి కోసం ఈ వేళ శ్రమించాలి బతికి బట్టకట్టడం కోసం (నిలకడ) ప్రజలు పోరాడాలి (చలించాలి) సౌకర్యప్రదమైన జీవితం కోసం ( నీడకోసం) విప్లవోద్యమం ద్వారా నిప్పుల్ని (ఎండలో వర్షాన్ని) కురిపించాలి. కఠోరమైన పోరాటమే మంచి జీవితానికి మార్గమని చెప్పడానికి కవి Paradoxని వాడుకున్నాడు.

**10. Conversation (సంభాషణ) :** ఒక్కోసారి భావం కవిత్వంగా మారడానికి కవి సహజ సంభాషణను ప్రయోగిస్తాడు. జీవితంలో ఉపయోగించే నుడికారాన్ని, యాసనీ, మాట్లాడే అలవాట్లనీ వాడుతూ ఒక సంభాషణను నిర్మించడం వల్ల కవిత్వం పుడుతుంది.

**"వద్దంటే దినెటోదు**
**బుక్కెడన్న దింటలేదు**
**జరకడుపు జూడుండ్రిదొరా**
**మీపేరు జెప్పుకుంట**
**మిమ్ముల మతికి పెట్టుకుంట**
**పేదరాలి రొదవిని**
**తలపైకెత్తాడు డాక్టరు**
**మీవోనికి రోగమేం లేదు**
**Malnutrition**
**అంటే తిండి గావాలె**
**మంచి తిండి" (ఎన్.గోపి)**

అనారోగ్యానికి అతి ముఖ్య కారణం పేదరికమనే భావాన్ని పేదతల్లికీ డాక్టరుకీ మధ్య జరిగే చిన్న సంభాషణగా మలిచాడు కవి.

**11.Descriptive Poetry (వర్ణన) :** వాస్తవ జీవితం నుండి తాను పొందిన ఒక భావాన్ని వాస్తవ జీవితంలోని ఒక ఘటనగానో, ఒక దృశ్యంగానో వర్ణించడం ద్వారా కవి కవిత్వాన్ని సృష్టించడం మరో నిర్మాణ పద్ధతి.

**"అప్పటికి**
**నాకు మీసాలు కూడా రాలేదు.**
**అలా నుంచొని వుండగా**
**ఆమెని గట్టిగా కౌగిలించుకున్నాను.**
**ఒక లెంపకాయ వేసివుంటే**
**ఎలా తయారై వుండే వాణ్ణో**
**కానీ ఆమె నా తల నిమురుతూ అంది**
**నన్నందుకునేందుకు నువ్వింకా ఎదగాలి".**

ప్రేమించి ఆ ప్రేమను అర్ధవంతంగా నిలుపుకోవటానికి మానసిక పరిపక్వత అవసరమని చెప్పడానికి ఈ చిన్ని ఘటనను వర్ణించాడు కవి. ఇందులోని చివరి వాక్యం కవి భావాన్ని సూచించే ప్రధాన వ్యక్తీకరణ. దీన్ని తొలగిస్తే వర్ణన వర్ణనగా మిగిలిపోతుంది తప్ప కవి భావం పాఠకుణ్ణి చేరదు. అలాగే వర్ణన లేకుండా కేవలం నన్నుందుకునేందుకు నువ్వింకా ఎదగాలి అన్న భావం తెలియవచ్చేమో గానీ అది కవిత్వంగా మారదు. ఈ రకపు కవిత్వాన్ని Descriptive Poetry అంటున్నారు.

**12. Symbols (ప్రతీకలు) :** ఒక శబ్దం గాని, శబ్ద సముదాయంగాని ఒక వస్తువునో క్రియనో, సంఘటననో సూచిస్తూ అది తిరిగి వేరొక అంశాన్ని సూచించినప్పుడు అది ప్రతీక అవుతుంది. ఆ శబ్దాలు ఏ సాధారణార్థాన్ని సూచిస్తాయో ఆ ఆవరణను దాటి ఉన్న అంశాలను అది ధ్వనింపచేస్తుంది. సాంస్కృతిక, సామాజిక జీవితంలో అభివ్యాప్తమై ఉన్న భావాలన్నింటినీ ఉపయోగించుకుంటూ కవి వీటిని ప్రతీకలుగా మలుస్తాడు. కొందరు కవులు స్వయంగా, సరికొత్తగా కొన్ని ప్రతీకలను సృష్టించుకుంటారు కూడా. ఇది మరో శక్తివంతమైన నిర్మాణ పద్ధతి. విప్లవోద్యమ కవులు ఈ పద్ధతిని విరివిగా, సమర్థవంతంగా వాడుకున్నారని చెప్పవచ్చు.

**"కొయ్యగుఱ్ఱం భూమ్మీద నడవదు**
**ఇనపనాడాల్తో చెక్క హృదయంతో ధనమదంతో**
**అలగాజనం భుజాల మీద స్వారీ చేస్తుంది**
**బరువుకి కుంగిపోతూ తలలెత్తితే**
**భీషణంగా సకిలించి అణగదొక్కుతుంది" (నగ్నముని)**

హృదయంలేని ఈ వ్యవస్థ కష్టజీవుల్ని దోచుకుంటుందనీ ఎదురు తిరిగిన వాళ్ళను అణచివేస్తుందనీ చెప్పడానికి కవి ప్రతీకలను వాడినట్లు పై వ్యక్తీకరణలో అర్థమవుతుంది. కొయ్య గుఱ్ఱం దోపిడీ వ్యవస్థకు ప్రతీక. ఇనుపనాడాలూ, చెక్క హృదయం క్రూరత్వానికి, నిరంకుశత్వానికీ ప్రతీకలు. ఇలా భావానికి అనుగుణమైన ప్రతీకల్ని అమర్చడం ద్వారా కవిత్వాన్ని ఏర్పరుస్తున్నాడు కవి.

**13. Irony (వ్యంగ్య కవిత) :** పైకి కనిపించే అర్థానికీ, లోపలి సారాంశానికీ మధ్య కవి చెబుతున్నట్టనిపించే దానికీ కవి ఉద్దేశించిన దానికీ మధ్య ఒక వైరుధ్యం, వ్యత్యాసం కనబడడం, వ్యంగ్య కవిత నిర్మాణ పద్ధతి. ఈ పద్ధతినే ఆంగ్లంలో Irony అంటారు. "Irony occurs where a word or phrase has one surface meaning and another contradictory meaning beneath this surface" అని దీని నిర్వచనం. దీన్నే మనం వ్యంగ్యం అంటున్నాం.

**"సంభోగమే నీ పరమార్థం. సంసారమే నీ సరిహద్దు..**
**కల్లోలంగా వీస్తున్న గాలులకి దూరంగా పేకాటాడుకో**
**చర్చలూ వద్దు. చంక్రమణాలు వద్దు**
**పిల్లల్ని పదిలంగా వీడియోలో బంధించు**
**ఐదేళ్ళకొకసారి వోటెయ్".** మధ్యతరగతి యువకుడికి మంచి బుద్ధులు చెబుతున్నట్లుగా పైకి కనిపిస్తుందీ కవిత. కానీ ఏ ఆశయమూ ఏ ఘర్షణా, ఏ అభిరుచీ, ఏ సామాజిక స్పృహ లేకుండా స్వార్థపరుడిగా సోంబేరిగా తిరుగుతున్న మధ్యతరగతి యువకుణ్ణి అసహ్యించుకుంటున్నాడు కవి. బుజ్జగింపో, తిట్లో తెలియనంత జాగ్రత్తగా వ్యంగ్య పదాల్ని, మాటల్ని వాడాడు. కానీ కవిత చివర్లో తన ఉద్దేశాన్ని పట్టిచ్చే వాక్యాల్ని నిర్మిస్తాడు.

**"కోడిపెట్టలా డబ్బుని పొదుగు**
**మృత్యువు నిన్ను ముద్దాడినప్పుడు**
**నీటిమీద రాతలా చెరిగిపో**
**భూమి బరువెక్కించే, వ్యర్థజీవి**
**వెళ్ళిపో, మేట్నీ చూసిపో."**

తనపని తాను చేసుకుంటూ, తన కుటుంబ సభ్యుల కోసం, తన కోసం బతుకుతూ, ఏ వివాదాల్లోనూ, ఏ రాజకీయాల్లోనూ తలదూర్చకుండా ఐదేళ్ళకొకసారి ఓటు వేసుకుంటూ, డబ్బు సంపాదించుకుంటూ, సినిమాలు చూసుకుంటూ బతికేవాడు సమాజం దృష్టిలో బుద్ధిమంతుడు, యోగ్యుడు. కానీ ఈ కవితలో అలాంటివాడు వ్యర్థజీవి అని తేల్చాడు కవి. ఈ పని చేయడానికి వ్యంగ్యం బాగా ఉపయోగపడింది. మేట్నీ చూసిపో అన్న చివరి మాటలో ఇలాంటి యువకుల పట్ల కవికున్న జుగుప్స మొత్తం బయటపడింది.

**14. Prose Poem (వచనంలా కనిపించే కవిత) :** ఒక వాక్యం కింద మరో వాక్యం నిర్మిస్తూ రాయడం కాకుండా వాక్యాలను పక్కపక్కనే నిర్మిస్తూ అక్కడక్కడా వివరణలతో, భావ చిత్రాలతో, లయతో, ప్రాసలతో అచ్చుల్నీ, హల్లుల్నీ పునరావృతం చెయ్యడం ద్వారా శ్రావ్యతను సాధించడం లాంటి లక్షణాలన్నీ ఈ కవిత్వ నిర్మాణ పద్ధతిలో కనబడతాయి. In the prose peom there is so much going on , in a surreal way. It's almost like you have to give the reader a break give her a more comfortable, familiar style like prose" అని అమెరికన్ రచయిత్రి Kristy Neilson 'prose poem'" నిర్వచించింది.

"నువ్వు చెప్పు నన్నెందుకు మధురభక్తిలోకి జారవిడవాలో ఏ పసిపిల్లో పోతూ పోతూ నీ వేపుకి దారి చూపించింది. దాని గుండె కూడా నా దేహంలోనే కొట్టుకుంటుంది ఏ మార్గమూ గమ్యాన్ని చేర్చదు మధ్యలోనే ఆగిపోతాయి ఈ మనిషిలోకి మీరెందుకు రహస్యంగా వస్తారో నాకు తెలీదు ఏమి చూస్తారు వచ్చి వొత్తి శూన్యాన్ని తప్ప, చీకటివినా ఇక్కడేమీ వుండదు. రండి ఈ రంగు రంగుల చీకట్లోకి ఈ చీకటి అవతల వెలిగే చీకట్లోకి పోదాం అనాగరికులమై సంచరిద్దాం. గుండెకు కట్టిన గుడ్డల్ని విప్పుకొని అనాకారి ఆత్మల్ని దేహాన్ని వదలిపెట్టి రండి. పుస్తకాల్లోకి పోదాం ఏమీ లేని తనాల్లోకి వెనక్కి తిరగకుండా ప్రయాణిద్దాం. ఎక్కడో ఏదో వాక్యంలో మీ మర్మాంగాలను తప్ప ఇంకేమి చిత్రించను. నాకున్న ఒకే ఒక రహస్యాంగమయిన గుండె చుట్టూ తిరుగుతారా".

సిద్ధాంత చట్రాలనీ, నియమాల గళ్ళనీ, నాగరీక భ్రమల్నీ వదిలి మనిషి సహజసిద్ధంగా సరయిన స్పందనతో

బతకాల్సిన అవశ్యకత గురించి కవి మాట్లాడుతున్నాడిక్కడ. అందుకు అవసరమైన భావచిత్రాల్ని అధివాస్తవికంగా ప్రవేశపెడుతున్నాడు. "రంగు రంగుల చీకటి" గుండెకు కట్టిన గుడ్డలు అధివాస్తవిక చిత్రాలే కాక వరుసగా భ్రమాజనిత జీవితానికి కృత్రిమత్వానికి భౌతిక భాష్యాలు. మర్మాంగాలను తప్ప ఏమీ చిత్రించను అన్నప్పుడు సహజ జీవితాన్నే ఆధారంగా తీసుకుంటానని భావం చెప్పుకోవచ్చు. Kristy Nielson చెప్పిన అధివాస్తవిక వాతావణంతో పాటు పాఠకుడికి అవసరమైన సౌకర్య వంతమైన వచనశైలి కూడా ఇందులో ఉంది.

**15. Allusive Technique (ఉల్లేఖనా పద్ధతి) :** చారిత్రక విషయాల నుంచీ, ఇతర పుస్తకాల నుంచీ అవసరం మేరకు ఉల్లేఖించటం ద్వారా కవిత్వాన్ని నిర్మించే పద్ధతి ఇది.

**"అర్ధరాత్రి**
**అంతఃపురం వొదిలి తల్లిదండ్రుల్ని వొదిలి**
**పెళ్ళాం బిడ్డల మధ్యగా పెనవేసుకున్న పేగు తెగ్గోసుకొని**
**సకల సంపదల్నీ పరిత్యజించిన సిద్ధార్థుణ్ణి**
**రాజ్యం పొలిమేర వరకు చేరవేసి తిరిగొచ్చిన అశ్వం**
**అశృనయనాల్తో నాగార్జున కొండలో ఇంకా నిలబడే ఉంది**
**మానవుడి మనసులో మాత్రం మహాబోధి ఎప్పుడో కూలిపోయింది".**

సిద్ధార్థుణ్ణి రాజ్యం పొలిమేర వరకూ చేరవేసి తిరిగొచ్చిన అశ్వం మనిషికి అవసరమైన గుండె తడికి చిహ్నం. జ్ఞానానికి ప్రతీక అయిన మహాబోధి మానవుడి మనసులో మాత్రం ఎప్పుడో కూలిపోయింది' అనడం ద్వారా ఆధునిక జీవితంలోని అజ్ఞానాన్ని బయటపెట్టాడు. రాజ్యాన్నీ అయినవారినీ వదలి విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టిన సిద్ధార్థుడు సామాజిక స్పృహకీ, విశాల హృదయానికీ ప్రతీక. అశ్రునయనాలతో నాగార్జున కొండలో నిలిచివున్న అశ్వం కరుణకి ప్రతిరూపం. చరిత్రకి సంబంధించిన ఈ విషయాలని ఆధునిక మానవుడి మానసికలేమిని కవిత్వీకరించడానికి వాడాడు నగ్నముని. ఆంగ్లంలో ఈ కవితా నిర్మాణ పద్ధతిని Allusive Technique అని అంటున్నారు.

**16. Mythopoeie (పురాణ సంబంధిత నేపథ్యం):** కవులు తాము చెప్పదలచుకున్న విషయాన్ని పురాణ సంబంధిత వాతావరణం ద్వారా కవిత్వం చేసే ఈ పద్ధతిని ఆంగ్లంలో Mythopoeie అంటున్నారు.

**"యముని మహిషపు లోహ ఘంటలు**
**మబ్బుచాటున**
**ఖణేల్‌మన్నాయి**
**నరకలోకపు జాగిలమ్ములు**
**గొలుసుత్రెంచుకు**
**ఉరికిపడ్డాయి**
**ఉదయ సూర్యుని సప్తహయములు**
**నురుగులెత్తే**
**పరువు పెట్టేయి**
**కనకదుర్గా చండసింహం జూలు దులిపి ఆవులించింది**
**ఇంద్రదేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ సవాల్ చేసింది!**
**పుడమి తల్లికి**
**పురిటి నెప్పులు**
**కొత్త సృష్టిని స్ఫురింపించాయి".**

ఒక కొత్త ప్రపంచం పుట్టుకకు తగిన పరిస్థితులు నెలకొన్నాయని అందుకు అవసరమైన విప్లవ కార్యాచరణ భీభత్సంగా ఉంటుందనే విషయాన్ని కవి స్ఫురింపజేశాడు. ఇందుకోసం వాడిన ప్రతీకలన్నీ పురాణ పాత్రల నుండి, ఘటనల నుండి, గాధల నుండీ తీసుకున్నవే. శ్రీ శ్రీ కవిత్వం నిండా Mythopoeie నిర్మాణ పద్ధతి కనిపిస్తుంది. తన భావాల్ని నేరుగా కాక పురాణ పాత్రలకీ, ఘటనలకీ ఆపాదించి చెప్పడం వల్ల వైయుక్తికత నుంచి కవిత దూరమై వీలైనంత Impersonalise చేసే అవకాశం ఈ పద్ధతిలో ఉంది. అంతేకాక పురాణాల్లోని పాత్రల పట్ల, ఘటనల పట్ల పాఠకుల్లో వున్న సెంటిమెంట్లను సృష్టించడం ద్వారా చదివించే గుణాన్నీ సాధించే అవకాశం కూడా ఈ కవిత్వ నిర్మాణ పద్ధతిలో ఉంది.

**17. Conceit (అసాధారణ పోలిక) :** అసంబద్ధ విషయాల మధ్య, ఘటనల మధ్య పోలిక నేర్పుగా చేయడం ద్వారా భావాన్ని చిక్కని కవిత్వంగా మార్చే పద్ధతి ఇది. ఈ పద్ధతిని ఆంగ్లంలో Conceit అంటారు "Conceit is a poetic device which establish an elaborate comparison between two dissimalar things and situations " అని Samuel Johnson నిర్వచించాడు. దీన్నే మనం అసాధారణ పోలిక అంటున్నాం. చీకటిపడి అంతా నిద్రకు ఉపక్రమించారనే విషయాన్ని యాకూబ్ కవిత్వంగా మార్చిన పద్ధతిలో 'అసాధారణ పోలిక' ఉంది.

**"వెలుతురు కప్పను మింగుతున్న పాములా**
**ఆక్రమించుకుంది చీకటి**
**రాత్రి కలుగులోకి నిద్ర ఎలుకలాగా దూరుతుంది**
**అంతటా నిద్రవాసన".**

వెలుతురూ - కప్ప, చీకటీ - పామూ అలాగే రాత్రీ - కలుగు, నిద్ర - ఎలుక పరస్పర అసంబద్ధ విషయాలైనా వాటి మధ్య పోలికను పెట్టి కవిత్వాన్ని సృష్టించాడు. యాకూబ్, సీతారాం, ప్రసేన్, ఇస్మాయిల్ మొ॥న కవులు ఈ నిర్మాణ పద్ధతిని విజయవంతంగా వాడి కవిత్వాన్ని సృష్టించారు.

**18. ఒకే కవితలో అనేక నిర్మాణ పద్ధతులు:** కవితలను నిర్మాణ వ్యూహం దృష్టితో పరిశీలిస్తే సాధారణంగా ఒక నిర్మాణ పద్ధతి కనిపిస్తుంది. అలాగే ఒకే వ్యక్తీకరణలోనూ ఒకటి కంటే ఎక్కువ నిర్మాణ పద్ధతులూ కలిసివుండే అవకాశం కూడా ఉంది. A poem is a harmonious whole of various parts అన్నాడు coleridge. పాటిబండ్ల రజని రాసిన "రాజీవనాలు" కవితలో ఒకటి కంటే ఎక్కువ నిర్మాణ పద్ధతుల అస్తిత్వాన్ని చూడవచ్చు. ఇందులో సంస్కారవంతమైన భార్యాభర్తల మధ్య ఘర్షణలూ, వివాదాలు రావడం, తాత్కాలిక రాజీలు కుదరడం అనే విషయాన్ని కవిత్వీకరించింది. Objective correlative పద్ధతిని ప్రధాన కవితా నిర్మాణ పద్ధతిగా వాడుతూ అపరిచయీకరణ, అసాధారణ పోలిక, ఉల్లేఖనా పద్ధతులను కూడా అవసరం మేరకు స్థాయీ భేదాలతో ఉపయోగించింది.

**"బంగారు పుట్టలో చీమ**
**ఎవరిని ముందుగా కుట్టిందో గుర్తుండదు**
**ఏడో చేప ఎందుకెండలేదో**
**తార్కికంగా యోచించే ఓపిక అస్సలుండదు**
**లో ఓల్టేజి ఫ్యాను గాలి**
**వాయుగుండమవుతుందని**
**ఏ వాతావరణ కేంద్రమూ హెచ్చరించదు**
**కార్టూన్ చిత్రాలమై ప్రవర్తించడమూ**
**ప్రభబండి ఊరేగింపుకి చిందులు తొక్కడమూ మనకూ వచ్చని**
**చూసే మూడో వాడికి తప్ప మనకు తెలియనే తెలియదు.**
**ఒకరి కంఠం**
**ఆవేశపు బీటలిచ్చి జీరపోయినప్పుడు**
**ఒకరి అసహనం**
**ఖడ్గతిక్నమై వీధిలోకి నిష్క్రమించినప్పుడు**
**ఒక అంకానికి అర్ధరాహిత్యంగానే తెరపడుతుంది.**
**ఖాళీ కాపలాలేని కర్ఫ్యూ విధించబడుతుంది.**

బంగారు పుట్టలో చీమ, ఏడో చేపలో ఓల్టేజి ఫ్యాను గాలి, వాయుగుండం మొదలైన భావచిత్రాలను వరుసగా అమర్చడం ద్వారా భావాన్ని కవిత్వీకరించింది కనుక ఈ పద్ధతి Objective correlative అవుతుంది. అలాగే ఏడు చేపల కథ నుంచి బంగారు పుట్టలో చీమని, ఎండని ఏడో చేపని ఉల్లేఖించింది. (ఉల్లేఖనా పద్ధతి). కార్టూన్ చిత్రాలు, ప్రభబండి ఊరేగింపుకి చిందులు తొక్కడం అంటూ Defamiliarisation ని వాడుతుంది. భార్యాభర్తల ఘర్షణతో వేడెక్కిన ఇంటిని ఖాళీ కాపలాలేని కర్ఫ్యూతో పోల్చడం Conceit. ఇలా ఎన్నో నిర్మాణ పద్ధతులు ఈ కవితలో చోటుచేసుకున్నాయి.

ఈ వ్యాసం మొదట్లో పేర్కొన్నట్లు కవి ప్రతిభకు ఆకాశమే హద్దు.

**"అపారే కావ్య సంసారే**
**కవిరేవ ప్రజాపతిః**
**యథాస్మైరోచతే విశ్వం**
**తథేదం పరివర్తతే"** అని సాహిత్య జగత్తులో కవియే బ్రహ్మ. ఈ విశ్వాన్ని తనకెలా నచ్చితే అలా మలచు కుంటాడు కవి అంటాడు ఆనందవర్ధనుడు.

అలాగే విలియం బ్లేక్
'He sees a world in a grain of sand
And a Heaven in a wildflower
Holds infinity in the palm of your hand
And Eternity in an hour" అంటాడు. అంటే మహాకవి రచనకు పరిమిత సమాజపు సరిహద్దులు లేవు. పాత కొత్తల పొలిమేరలు లేవు. అతడు ఏ నిర్మాణ పద్ధతిని అనుసరించినా దానిలోని శబ్దసృష్టి వాచ్యార్థానికి దూరమై కళాధర్మసిద్ధిని కలిగిస్తుంది. అది సహృదయుడిని సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. వచనానికి వ్యాఖ్యానం అవసరం లేదు గాని వచన కవిత్వానికి సహృదయుని వ్యాఖ్యానం అత్యంతావశ్యకం.

డా. గొట్టిముక్కల స్వర్ణలత
ఎస్.జి.కె. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, వినుకొండ
ఫోన్ : 9951095636.

# స్వీయరూప చిత్రం పుట్టుక - వ్యాప్తి

*- టి.వి. ప్రసాద్*

ఆర్టిస్టు తన రూపాన్ని తాను చిత్రిస్తే అది సెల్ఫ్ పోర్ట్రేట్ అవుతుంది, అదే స్వీయచిత్రం లేదా స్వీయ రూప చిత్రం. ఎవరి రూపాన్నైనా ఇతరులు చిత్రిస్తే అది పోర్ట్రేట్ అవుతుంది. స్వీయ చిత్రంలో సాధారణంగా ఆర్టిస్టు ముఖం, ఛాతీ పైభాగం మనకు ఎదురుగా మనవైపు చూస్తున్నట్లుగా ఉంటుంది. స్వీయ చిత్రాన్ని ఏ భంగిమలోనైనా, ఏ మాధ్యమంలోనైనా చిత్రించవచ్చు. డ్రాయింగు, పెయింటింగు, మట్టి బొమ్మ, శిల్పం, ఫొటోగ్రాఫ్, వీడియో లేదా వీటన్నిటి కలయికగానైనా చిత్రించే సౌకర్యం వుంటుంది. ఇది వ్యక్తి ప్రాధాన్యత కలిగిన కళాకృతి. స్వీయచిత్రం దాన్ని రచించిన ఆర్టిస్ట్‌కు ప్రతినిధిగా వుంటుంది.

ఆదిమానవుల నుండే స్వీయరూప చిత్ర కళ ఉండేదని చెప్పడానికి ఆధారాలు కనబడతాయి. నాటి మనుషులు పుర్రెలకు అలంకరణ చేసి వాటిని సజీవ వ్యక్తులుగా కనబడేట్టు చేసి ఆనందించేవారు. కొండ అంచుల వెంట, గుహల లోపల స్వీయ చిత్రాలు కన్పించిన దృష్టాంతాలున్నాయి. రఫ్‌మోర్ పర్వతంపైనా, కొండ రాళ్ళ మీదా కన్పించే బొమ్మలు ఇందుకు సాక్ష్యం. ఆ తర్వాత ప్రాచీన ఈజిప్ట్ కాలం నాటినుండే పోర్ట్రేట్లు కన్పిస్తాయి. నాడు ఈజిప్ట్‌లో స్వీయచిత్ర రచన నేరంగా పరిగణించబడింది. పాలకులకు (ఫారోలకు) మాత్రమే స్వీయచిత్రాల హక్కు వుండేది. పిదప ఉన్నత వర్గీయులు, మఠాధికారులకు ఈ సౌకర్యం కల్పించబడింది. మధ్యయుగాల్లో పోర్ట్రేట్ ఉనికి దాదాపు కనుమరుగై పోయింది. ఐరోపా పునరుజ్జీవన దశ 15వ శతాబ్దం నుండి పోర్ట్రేట్లు అభివృద్ధి చెందాయి. గతంలో లేని వ్యక్తి ప్రాధాన్యత, వ్యక్తి స్వేచ్ఛ, సృష్టిలో మానవుడే కేంద్ర బిందువు అన్న స్పృహ పోర్ట్రేట్ పుట్టుకకు కారణమైంది. అప్పటినుండి పోర్ట్రేట్లు కళాత్మక వ్యక్తీకరణకు సంకేతాలుగా మారిపోయాయి. ముందు పోర్ట్రేట్ పుట్టే దాన్ననుసరించి సెల్ఫ్ పోర్ట్రేట్లు పుట్టుకొచ్చాయి. లాటిన్ నుండి వచ్చిన పోర్ట్రేట్ అనే మాటకు వెలికి తీయడం అని అర్థం. ఆర్టిస్టు పోర్ట్రేట్ ద్వారా ఇతరుల రూపాన్ని చిత్రించినట్లే స్వీయచిత్రం ద్వారా తన రూపాన్ని, తనలోని భావాల్ని వెలిబుచ్చ గలుగుతాడు. అనంత కాలవాహినిలో మనిషి జీవితం అల్పమే ఐనా, తనకు తాను ప్రాధాన్యతనిచ్చుకుంటూ, శాశ్వతంగా ఉండిపోవాలన్న కోరిక స్వీయచిత్రాల వెనక వున్న ఉద్దేశం కావచ్చు. కొండ రాళ్ళు, కట్టడాలు, స్కూలు బెంచీలు, చెట్ల మెదళ్ల మీద తమపేర్లు చెక్కుకోవడం, సంతానానికి తాత తల్లిదండ్రుల పేర్లు పెట్టుకోవడం ఇందులోని భాగమే. వానలో తడవని వ్యక్తి, అద్దంలో తనను తాను చూసుకోని వ్యక్తి ఉండడు. స్వీయ రూప చిత్ర రచన కూడా అలాంటిదే. స్వీయానురక్తి, స్వీయరూప కాముకత (narcism) స్వీయచిత్రాలకు కారణం అన్నది మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుల వివరణ. అంతరంగ వ్యక్తిత్వానికి బాహ్యరూపం, గుర్తింపు, శాశ్వతత్వానికి స్వీయచిత్రం ఆలంబనం.

**స్వీయచిత్రాల ఉత్పత్తి దశ :** సి.ఈ.1400 నాటికి పోర్ట్రేట్లు చిత్రించడం ప్రారంభమైతే కొంచెం అటు ఇటుగా 1450 నుండి స్వీయ చిత్రాల రచన మొదలైంది. కళాచరిత్రలో స్వీయచిత్ర రచన సాధారణాంశంగా మారిపోయింది. ఇతరుల పోర్ట్రేట్లు చిత్రించడం మోడల్ సహకారంతోనే సాధ్యమౌతుంది. వృత్తిపరమైన మోడళ్ళను భరించడం ఖరీదైన వ్యవహారం. అందరికీ సాధ్యంకాని పని కనుక పెయింటర్‌కు తనకుతానే మోడలుగా చేసుకుని స్వీయ చిత్రాలు రచించడం సులభమైన పని. శాడ్ బాయ్‌గా పేరు పొందిన విన్సెంట్ వాంఘోది విషాద జీవితం. అనేక స్వీయచిత్రాలు రచించి, సెల్ఫీ బాయ్‌గా పేరు తెచ్చుకున్నాడు. వాంఘో అధిక సంఖ్యలో స్వీయ చిత్రాలు రచించడానికి అతడు మోడల్‌ను భరించలేక పోవడం ఒక కారణమైతే మోడల్‌గా ఎవరూ సహకరించకపోవడం మరో కారణం. అందుకే తనకు పరిచయమైన పోస్ట్‌మన్. వైద్యం చేసిన డాక్టర్‌ల పోర్ట్రేట్లు, వాటితోపాటు స్వీయచిత్రాలూ వేశాడు. ఆర్టిస్టుకు తన రూపాన్నే గాక భావోద్రేకాల్ని ప్రకటించడానికి స్వీయచిత్రం అనువైన మాధ్యమంగా ఉపకరిస్తుంది. యుగధర్మాన్ని బట్టి ఉద్యమాలు, వాటిననుసరించి చిత్రకళలో మార్పులు వచ్చినట్లే స్వీయచిత్ర రచనలోనూ మార్పు సహజంగా చోటు చేసుకుంది. వివిధ ఉద్యమ దశలు బరోక్, ఇంప్రెషనిస్ట్, క్యూబిజం, న్రి యలిజం, ఆబ్‌స్ట్రాక్ట్ దశల్లోని స్వీయ చిత్రాల్లో ఆయా ఉద్యమ లక్షణాలు కన్పిస్తాయి. ఉదాహర ణకు లియోనార్డో డావించీ, రూబెన్స్, రెంబ్రాంట్ ఏడ్వర్డ్‌మానే, పికాసో,



జాన్ వాన్ ఐక్ స్వీయ చిత్రం

సెయిజాన్, ఫ్రిదాకాలో, కసామాల స్వీయ చిత్రాలు కళాకారులు కళకోసం, వ్యాపార నిమిత్తం, తమ కళాప్రతిభను చాటుకోవడం, ప్రచారం చేసుకోవడం, వివిధ భావోద్రేకాలను వ్యక్తీకరించడం కోసం స్వీయరూప చిత్రాలు రచిస్తారు, అని ప్రముఖ కళాచరిత్ర కారుడు ఎర్నెస్ట్ గోంబ్రిక్ అంటాడు.

**జాన్ వాన్ ఐక్ (1390–1441) :** మేన్ ఇన్ రెడ్ టర్బన్ (1434) స్వీయ చిత్రాన్ని రచించిన మొదటి వాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. కానీ అదే తొలి పోర్ట్రేట్ అని చెప్పడానికి కచ్చితమైన ఆధారాలు కన్పించవు. ఆల్బ్రెక్ట్ డ్యూరర్ (జర్మనీ) సి1500 వేసిన ఫర్ కాలర్‌తో వున్న స్వీయచిత్రం, ఇంకా డజన్‌కు పైగా స్వీయ చిత్రాలు వేయడం వల్ల సెల్ఫ్ పోర్ట్రేట్‌కు ఆద్యుడుగా 'ఫాదర్ ఆఫ్ సెల్ఫ్ పోర్ట్రేట్‌గా' కీర్తించబడ్డాడు. ఆల్బ్రెక్ట్ డ్యూరర్ 29 సంవత్సరాలు నిండక ముందే చిత్రించిన సెల్ఫ్ పోర్ట్రేట్‌ను కళాచరిత్రకారులు పూర్తి వ్యక్తిగత చిత్రంగా, ఐకానిక్, సంక్లిష్ట స్వీయచిత్రంగా కీర్తించారు. డ్యూరర్ స్వీయచిత్రంలో మత చిత్రాల్లో కన్పించే నిర్మాణ పద్ధతి, గాఢ రంగుల మిశ్రమాన్ని గమనించవచ్చు. ఛాతీ పైభాగంలో వీక్షకుల్ని దీవిస్తున్నట్లున్నట్లుగా క్రీస్తు పోలికలను చూపించాడు. అదే కాలంలో ఇటలీ పెయింటర్లు స్వీయచిత్రాలను ప్రత్యేకంగా వేయకపోయినా తమ పెయింటింగుల్లోని ఎక్కడో ఒక చోట గుంపులో కన్పించేవారు – మసాకియో బ్రాన్‌కాంచి ఛాపెల్ కుడ్య చిత్రంలో (1426) దైవదూతల్లో ఒకడిగా, బోటి చెలి 'అడరేషన్ ఆఫ్ మేజి' (1481) లోనూ, రాఫేల్ 'స్కూల్ ఆఫ్ ఏథెన్స్' పెయింటింగులోని గుంపులోని ఒకడుగా కన్పిస్తారు. వెనిస్ పెయింటర్ టిషన్ తన రూపాన్నేగాక, తన కుమారుని రూపాన్ని కూడా 'అలగరీ ఆఫ్ ప్రూడెన్స్' (1565–70) చిత్రంలో చూపించాడు. ఫ్లోరెం టైన్ ఆర్టిస్టులు లియో నార్డో డావించీ, జెంటైల్ బెలినీలు తమ పోర్ట్రేట్లనే చిత్రించారు.

**బరోక్, రోకోకో, నియోక్లాసికల్ దశ (1600–1800) :** అంతవరకూ రినైసన్స్ తొలిదశలో బైబిల్ పౌరాణిక చిత్రాలకు, రాజుల పోర్ట్రేట్లకే పరిమితమైన చిత్రకళలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈజిల్ (easel) పెయింటింగు, తైల వర్ణాలు కాన్వాస్ వాడకంతో అన్ని రకాల పోర్ట్రేట్లు – కుటుంబం, స్నేహితులు, గ్రూప్ పోర్ట్రేట్లు, సెల్ఫ్ పోర్ట్రేట్లు చిత్రించడం సాధారణాంశంగా మారిపోయింది. ఎల్‌గ్రెకో, వెలాజ్ క్వజ్, నికోలస్ పౌసిన్, ఫ్లెమిష్ మాస్టర్ పెయింటర్ రూబెన్స్, ఆంటనీ జాన్ ఐక్, రెంబ్రాంట్ల్ ఈ దశలోని ప్రముఖ సెల్ఫ్ పోర్ట్రేట్లు వేసిన వారిలో కొందరు. రెంబ్రాంట్ నలభైకిపైగా స్వీయ చిత్రాలు, కుటుంబ సభ్యుల, తన భార్య చిత్రాలు రచించాడు.



బరోక్ స్వీయ చిత్రం

**19వ శతాబ్దపు పోర్ట్రేట్లు :** ఈ శతాబ్దిలోని దాదాపు అందరు ఆర్టిస్టులూ తమ తమ స్వీయ రూప చిత్రాల్లోనూ, గ్రూపుల్లోనూ ప్రత్యేకంగా కన్పిస్తారు. ఫ్రాన్సిస్కో గోయా (1800), యూజీన్ డెల్‌క్రా (1837), జేమ్ మెక్‌నీల్ విసిలర్ (1872), ఎడ్వర్డ్ మానే (1879), పాల్‌సెయిజాన్ (1881), టూలూజ్ లాట్రెక్ (1883), గుస్తావ్ కూర్బేలు వారిలో కొందరు.

**20వ శతాబ్దపు సెల్ఫ్ పోర్ట్రేట్లు :** ఈ దశలో స్వీయచిత్ర రచనా శైలిలో వచ్చిన మార్పు గమనార్హం. హెన్రీ మాటిస్ (1906), పియర్ ఆగస్ట్ రెన్వా (1910), పాల్‌క్లీ (1922); ఎడ్వర్డ్ ముంక్ జీవితకాలంలో తాననుభవించిన కష్టాలను, అవమానాలను వరసక్రమంలో స్వీయచిత్రాల్లో చూపించాడు జర్మనీ ఇంపెషనిస్ట్ లవిస్ కోరింత్ తన ప్రతి పుట్టిన రోజున స్వీయచిత్రం రచించేవాడు. 1896లో చిత్రించిన సెల్ఫ్ పోర్ట్రేట్ విత్ స్కెలిటన్ (1896) (అస్తిపంజరంతో తాను) ప్రత్యేక మైంది, చాలా ప్రసిద్ధి గాంచింది. మెక్సికన్ ఆర్టిస్టు ఫ్రిదాకాలో (1907–54) ప్రమాదంలో గాయపడిన తర్వాత జీవితకాలంలో 50కి పైగా, వివిధ అలంకరణలతో, భావోద్రేకాలతో సెల్ఫ్ పోర్ట్రేట్లు వేసింది. అవన్నీ ఆమె అల్లకల్లోల జీవితానికి దర్పణాలు. ఆస్ట్రియా న్యూరోటిక్ ఆర్టిస్ట్ సర్ ఇగాన్‌షీలి 1890–1918 వచ్చి శృంగార చిత్రాలతోపాటు



రొకోకో స్వీయ చిత్రం

మనిషిలోని జంతు లక్షణాలను, తన నగ్న స్వీయచిత్రాల్లో చూపించినవిపరీత చిత్త ప్రవృత్తి ఇతనిది. భయానక స్వీయచిత్రాలకు ప్రసిద్ధుడు.

ప్రపంచ ప్రఖ్యాత పెయింటర్ పాబ్లో పికాసో (1881–1973) స్వీయచిత్ర రచనలో కూడా కొత్త ఒరవడి సృష్టించాడు. సెల్ఫ్ పోర్ట్రేట్లలో తన జీవిత కథను చూపించిన వైవిధ్యభరిత పెయింటర్. కళాకారుడిగా ఎన్నెన్ని ప్రయోగాలు చేశాడో సెల్ఫ్ పోర్ట్రేట్లలో కూడా అన్నన్ని ప్రయోగాలు చేశాడు. సాల్వడార్ డాలి అధివాస్తవిక (సర్రియిలజమ్) శైలిలో వేసిన స్వీయ చిత్రాలు ప్రత్యేకతను కలిగి వుంటాయి. క్యూబిజం, సర్రియిలిజం శైలుల్లో వైపరీత్యంతో వేసిన కారికేచర్ల లాంటి స్వీయ చిత్రాలు మనకు ఆశ్చర్యం కలిగిస్తే, విమర్శకులకు చికాకు కల్గిస్తాయి. వాటిలో 'సెల్ఫ్ పోర్ట్రేట్ విత్‌ఫ్రైడ్ బాకన్' (1941) చిత్రం విలక్షణమైనది. డాలీ ఇతర చిత్రాల్లో ఎక్కువగా కన్పించే ప్రతీకల్ని చిత్రంలో కన్పించే వివిధ వస్తువుల ద్వారా తెలుసుకోవచ్చు. కావాలని ఈ పద్ధతిని పాటించిన డాలీ చిత్రాలు గూఢార్థాలతో నిండి రంజింపజేసే విచిత్రాలు.

వర్తమాన స్వీయచిత్రాలు మాధ్యమాలన్నిటా వెలువెత్తాయి. పాప్ ఆర్టిస్ట్ ఆండీ వార్ హెూల్, ఫ్రాన్సిస్ బేకన్‌ల అధివాస్తవిక పోర్ట్రేట్లు, అమెరికా ఆర్టిస్ట్ చుక్ క్లోజ్ చిన్న చిన్న చదరాల సెల్ఫ్ పోర్ట్రేట్లు ప్రముఖమైనవి. జాన్‌మిరో, ఫ్రాంక్ ఆర్ బాక్, విల్లెమ్ డి కూనింగ్, ఆబ్‌స్ట్రాక్ట్ సెల్ఫ్ పోర్ట్రేట్లు వేసిన వారిలో ప్రసిద్ధులు. మహిళా పెయింటర్ల స్వీయచిత్రాలను కలపకుండానే వందలాది పెయింటర్ల స్వీయ చిత్రాల్లో పైన చెప్పుకున్నవి కొన్ని మాత్రమే! ఐనా ఇవన్నీ కళాపరంగా చూసినా, వ్యక్తీకరణ పరంగా చూసినా అత్యంత విలువైనవి. స్వీయచిత్రాల్లో ఆర్టిస్టులు వారి వారి మనస్తత్వాలను, నాటి కళా ధోరణులను ప్రతిబింబించారు. భిన్న శైలుల్లో, తమ కళా ప్రతిభతో, వారి జీవితాలకు శాశ్వతత్వం కలిగించారు.

**మహిళా పెయింటర్లు – స్వీయచిత్రాలు :** పునరుజ్జీవన కాలం నుండి నేటి దాకా స్వీయచిత్రాలు రచించిన మహిళా పెయింటర్లు ఎందరో. వారిలో అత్యంత ప్రముఖ పెయింటర్లు కొందరిని చూద్దాం.

**కాథరీనా వాన్ హెమిసెన్ (1528–1565) :** ఫ్లెమిష్ (ఆన్‌ట్వెర్ప్) పునరుజ్జీవన దశలో కాలానికి ఎదురీద వలసి వచ్చింది. స్త్రీలకు ప్రాతినిధ్యం లేని రోజుల్లో అకాడమీలో ప్రవేశం లేక, సొంత స్టూడియోలు లేక పోయినా అప్రెంటీస్ షిప్ చేసే అవకాశం లేకున్నా, స్వీయ చిత్రాన్ని రచించి తన స్థాయిని నిరూపించుకున్న తొలి దశ పెయింటర్. పాశ్చాత్య స్వీయ చిత్రాలలో మొదటిసారిగా సమకాలీన కళా మర్మాన్ని తెలుసుకుని చరిత్ర సృష్టించింది. 1548లో స్వీయ చిత్రం వేసే నాటికి ఆమె వయసు 20 సంవత్సరాలు.

**లవీనా పోస్టానా :** లవీనా తండ్రి ప్రాస్పరో కూడా చిత్రకారుడు అవడం చేత, అతనికి మగ సంతానం లేనందువల్ల, తండ్రికి వారసురాలిగా చిత్రకళారంగ ప్రవేశం చేసింది. మహిళలు పురుషుల నగ్న చిత్రాలను వేయడంపై నిషేధం ఉన్నప్పటికీ పురుషుల నగ్న శిల్పాలను చూసి చిత్రకళ నభ్యసించిన ప్రతిభావంతురాలు. ఉన్నత వంశీయుల, మత పెద్దల పోర్ట్రేట్లు చిత్రించింది. చిత్రకళలో గడించిన నేర్పు, నూతన ప్రయోగాలు చేయాలన్న తపనతో అనేక స్వీయ చిత్రాలను రచించింది. ఆమె స్వీయచిత్రాలన్నిటా ఆత్మవిశ్వాసాన్ని చూపించింది. అంద మైన దుస్తుల్లో, మంచి అలంకరణతో పియానో లాంటి ఆనాటి 'క్లావికోర్డ్'ముందు కూర్చుని, వెనక పరిచారిక నిలబడి ఉండగా, కిటికీ దగ్గర ఈజిల్‌తో వున్న స్వీయచిత్రం ప్రత్యేకమైనది. తన పెండ్లి ప్రయత్నానికి ముందు (1577) కాబోయే భర్తకు, అత్త వారికి తన ప్రత్యేకతను సాంఘిక హెూదాను, ప్రతిభను చాటడానికీ, ఉన్నత వంశీయుడైన బీద యువకుడితో తన పెండ్లి జరిగితే వధువుకు కుటుంబ భారం మోసే సామర్థ్యం ఉందని తెలియ జేయడానికి ఈ స్వీయ చిత్రాన్ని పంపించింది. కట్నకానుకలు బెడద దేశ కాలాతీతం అని కూడా ఈ స్వీయ చిత్రం తెలియజేస్తుంది.



లవీనా పాస్టానా స్వీయ చిత్రం

**ఆర్టిమీసియా జెంటిలిస్కీ :** 17వ శతాబ్దపు ఫ్లోరెన్స్ అధునాతన పెయింటర్. బహుశా లండన్‌లో చిత్రించిన స్వీయచిత్రం కావచ్చు. ఆడపిల్లలు చర్చికి తప్ప బయట అడుగు పెట్టడానికి వీలులేని పరిస్థితుల్లో తండ్రి స్టూడియోలో చిత్రకళ నభ్యసించి మేటి ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందింది. తనపై జరిగిన అత్యాచారానికి ప్రతీకగా జూడిత్ హోలో ఫెర్నీస్‌ను వధిస్తున్న చిత్రాన్ని వేసి సంచలనం సృష్టించింది. పెయింట్ చేస్తున్నట్లుగా చిత్రించిన స్వీయచిత్రంలో అందమైన యువతిగా నల్లని కురులు, విల్లులాంటి కనుబొమలు, మెడలో బంగారు గొలుసుతో ఆకర్షణీయంగా కన్పిస్తుంది.

**ఎలిజబెత్ విజీ లేబ్రాన్ (1755–1842) :** స్ట్రాహేట్ ధరించిన స్వీయచిత్రంతో ప్రసిద్ధురాలైన ఫ్రెంచి పెయింటర్. కుమార్తె జూలితో చిత్రించిన మరో స్వీయచిత్రంతో కలిపి 40 ఏండ్ల పెయింటర్ జీవితంలో 17 స్వీయ చిత్రాలు రచించిన పెయింటర్. రూబెన్స్ చిత్రకళా ప్రభావితురాలు.

**ఫ్రిదాకాలో :** శారీరక బాధను, మానసిక వేదనను, ఒంటరితనం నుండి విముక్తి కొరకు స్వీయచిత్రాల నాశ్రయించిన మెక్సికో పెయింటర్. తొలి యవ్వనదశలో జరిగిన ప్రమాదం వల్ల కలిగిన శారీరక లోపాన్ని అధిగమించి అనేక స్వీయచిత్రాలు రచించింది. అవి ఆమె విషాదానికి ప్రతీకలు. వాస్తవం, భ్రమల మిశ్రమ ఫలితం ఫ్రిదాకాలో స్వీయచిత్రాలు. స్వీయ చిత్రాల్లో కన్పించే మెక్సికో సంస్కృతి, స్వాప్నిక భ్రమ వల్ల వాటిలో అధివాస్తవిక లక్షణా లుంటాయి. జీవిత కాలంలో 140కి పైగా వేసిన చిత్రాల్లో 55 స్వీయ చిత్రాలుంటాయి. ఆకారణంగా ఫ్రిదాకాలోకు 'క్వీన్ ఆఫ్ సెల్ఫ్ పోర్ట్రేట్' గౌరవం దక్కింది. ఇద్దరు ఫ్రిదాలు, హమ్మింగ్ బర్డ్‌తో వున్న ముళ్ళహారం ధరించిన స్వీయచిత్రం. ప్రియుడు, భర్త రివేరా పోర్ట్రేట్ వున్న ముఖంతో స్వీయచిత్రం ప్రముఖమైనవి. నాకు బాగా తెలిసిన వ్యక్తిని నేనే, అందుకే స్వీయ చిత్రాలు రచించాను అని చెప్పుకుంది. మానవ జీవితం – మరణం ఇతి వృత్తాలుగా స్వీయ చిత్ర రచనలో పికాసో, వాంఘోలను మించి పోయింది.


ఆర్టిమీసియా జెంటిలిస్కీ స్వీయచిత్రం


ఫ్రిదాకాలో స్వీయచిత్రం

**అమృతాషేర్ గిల్ :** తన మనోస్థితిలోని కోణాలను అనేక (మూడ్సును), మరులు గొల్పే స్వీయచిత్రాల్లోకి అనువదించిన ప్రతిభా వంతురాలు. అమృతా చిత్ర సంపద హంగరీ, భారతదేశ సంస్కృతుల ఫలితం. చీరలో వున్న అందమైన యువతిగా తాహితీ మహిళగా నడుంపైభాగం అంతా నగ్నంగా వున్న స్వీయ చిత్రం అమృత 19 స్వీయ చిత్రాల్లో ప్రముఖమైనది. స్వల్పకాలమే జీవించినా భారత చిత్రకళపై చెరగని ముద్ర వేసింది.

**పాల్ మోడర్ సోన్ బెకర్ :** జర్మనీ మోడర్నిస్ట్ పెయింటర్. 1906లో చిత్రించిన నిలువెత్తు స్వీయచిత్రం. మెడలో పూసల దండ, గర్భిణి అని చెప్పే పెరిగిన పొట్ట, ఆచ్ఛాదనలేని వక్షభాగాన్ని చూపిస్తూ మెత్తని చూపులతో మనల్ని పలకరిస్తూ వుంటుంది. చిత్రం మీద 'ఇది నా 30వ ఏట, 6వ పెండ్లి రోజున చిత్రించింది' అని అక్షర బద్ధం చేసింది. మహిళా పెయింటర్లు చిన్న చూపు చూడబడుతున్న సందర్భాన్ని, తన గర్భాన్ని ప్రదర్శించడానికి కాకుండా సృజనను చూపించడానికి చిత్రించిన మొదటి నగ్నచిత్ర పెయింటర్‌గా పేరు తెచ్చుకుంది.

పై వారిలా కాకుండా అతి తక్కువ స్వీయచిత్రాలు రచించిన కెనడాదేశ పెయింటర్ ఎమిలీకార్ స్వీయచిత్రాలు వేయడాన్ని అసహ్యించుకుంది. అందమైన ప్రకృతి దృశ్యాలను చిత్రించడమంటే ఇష్టం అని ప్రకటించింది. చివరగా చెప్పుకుంటున్నా – వర్తమాన సజీవ పెయింటర్ యయోయ్ కసామా.

**యయోయ్ కసామా :** చివరగా చెప్పుకుంటున్నా చిత్ర సృజనలో ప్రథమ శ్రేణి పెయింటర్. జపాన్‌కు చెంది అమెరికాలో స్థిరపడిన వర్తమాన సజీవ ఆర్టిస్టు. 95 ఏండ్ల సుదీర్ఘ జీవితకాలంలో సుమారు 50 స్వీయ చిత్రాలు వేసింది. బాల్యజ్ఞాపకాలు, అణచివేత, హింసల వల్ల కలిగిన మానసిక అసమతౌల్యత, లైంగిక ఆందోళన మొదలైన అంశాలు ఆమె స్వీయచిత్రాలకు ముడి సరుకు. పోల్కా చుక్కలు ఆమె చిత్ర కళా లక్షణం. లోకమంతా మెచ్చుకునే

వర్తమానకాల అభిమాన ఆర్టిస్టు. ఆర్ట్‌బ్రట్, అబ్‌స్ట్రాక్ట్ శైలుల్లో చిత్రాలు వేసిన విజయ వంతమైన ఆర్టిస్టు.

**ఫొటోగ్రాఫిక్ స్వీయచిత్రాలు :** దాదాపు స్వీయ చిత్ర పెయింటింగు స్థానాన్ని ఆక్రమించిన ఫైన్ ఆర్ట్ ఫొటోగ్రఫీది ప్రస్తుత నూతన కళాధోరణి. ఈ కళలో విరివిగా స్వీయచిత్రాలు సృజించిన సిండీషెర్మన్‌ది ప్రథమస్థానం. ఈమె 69 సర్రియలిస్ట్ ఫొటోగ్రాఫ్‌ల్ని న్యూయార్క్ మోడరన్ ఆర్ట్ మ్యూజియం ఒక మిలియన్ డాలర్లకు సొంతం చేసుకుంది. ఈ పోర్ట్రేట్ ఫొటోగ్రాఫర్లలో సిసిల్ బీటన్, యూసఫ్ కార్ష్, డయానా అర్బస్, డేవిడ్ బెయిలీ, ఆనీ లీబోవిజ్‌లు ప్రముఖులు.



యయోయ్ కసామా స్వీయచిత్రం

ఆధునిక కళా జగతిలో పోర్ట్రేట్లు, మరీ ముఖ్యంగా సెల్ఫ్ పోర్ట్రేట్లు వేసే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఫొటోగ్రఫీ లేని రోజుల్లో రూప చిత్రాలు ఒక్కటే మార్గం. కేమెరా రాకతో ఎవరైనా ఎదుటివారి పోర్ట్రేట్‌ను క్షణాల్లో తీయవచ్చు. స్మార్ట్ ఫోన్‌తో అది మరింత సులువై సెల్ఫీలు తీసుకోవడం (ప్రాణాంతక) వ్యసనంగా మారిపోయింది. ఒకనాటి సెల్ఫ్ పోర్ట్రేట్ ఆధునిక రూపమే నేటి సెల్ఫీ. A1 ఆర్టు ప్రవేశంతో చిత్రకళలోనే సమూలమైన మార్పు వచ్చింది. ఇప్పుడు సెల్ఫ్ పోర్ట్రేట్ కావలసిన శైలిలో కావలసిన రూపంలో చిటికెలో సృష్టించుకోవచ్చు.

**అత్యంత అధిక ధరకు అమ్ముడు పోయిన స్వీయచిత్రాలు :** ఫ్రిదాకాలో భర్త డీగో రివేరాను తన నుదిట పై చూపించిన స్వీయచిత్రం 1949లో న్యూయార్క్ సథబీజ్ వేలంలో 35 మిలియన్ డాలర్ల ధర పలికింది. ఏ మెక్సికన్ పెయింటర్‌కూ దక్కని గౌరవం అది.

- విన్సెంట్ వాంఘో గడ్డం లేకుండా వున్న స్వీయచిత్రం 1990 క్రిస్టీస్, న్యూయార్క్ వేలంలో 85.2 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోవడం మరో రికార్డు.

- 1931 లండన్ సథబీజ్ వేలంలో అమృతాషేర్ గిల్‌ది అరుదైన స్వీయచిత్రం. 49 కోట్ల రూపాయలకు అమ్ముడు పోయింది. ఇది భారతీయ మహిళా పెయింటర్‌గా అమృతకు దక్కిన గౌరవం.

**పోర్ట్రేట్ల సేకరణ – మ్యూజియాలు :** లండన్ నేషనల్ పోర్ట్రేట్ గాలరీ రెండు లక్షల పోర్ట్రేట్లు, వాటిలో వేల స్వీయచిత్రాలు ఉంటాయి. తర్వాత స్వీయ చిత్రాలకు ఫ్లోరెన్స్, ఐర్లండ్ మ్యూజియాలు నిలయాలు. ఐర్లండ్ సెల్ఫ్ పోర్ట్రేట్ సేకరణలో 400 మంది ఐరిష్ పెయింటర్ల స్వీయచిత్రా లుంటాయి. వాషింగ్టన్ నేషనల్ పోర్ట్రేట్ గాలరీలో కూడా పేరుగాంచిన సెల్ఫ్ పోర్ట్రేట్లను చూడవచ్చు.

**సెల్ఫ్ పోర్ట్రేట్ – ఆసక్తికర అంశాలు**

- స్వీయ చిత్రాలకు మారు పేరు విన్సెంట్ వాంఘో, మూడు సంవత్సరాల వ్యవధిలో 30 స్వీయ చిత్రాలు వేశాడు. అతని జీవితంలో జరిగిన నిరంతర మార్పుకు అవి దర్పణాలు.
- పికాసో సుదీర్ఘ జీవితకాలంలో వేసిన 30 స్వీయ చిత్రాలు అతని కళా ప్రస్థానంలోని వివిధ దశల్లో చేసిన ప్రయోగాలకు సాక్ష్యాలు.
- వాంఘో, పికాసోలను మించి ఫ్రిదాకాలో 55 స్వీయచిత్రాలు రచించింది. అవన్నీ వేసింది తన ఒంటతనాన్ని, శారీరక మానసిక సమస్యలను మరచి పోవడానికే అని చెప్పుకుంది.
- క్వీన్ ఆఫ్ సెల్ఫ్ పోర్ట్రేట్స్‌గా ఫ్రిదా కీర్తించబడితే, రెంబ్రాంట్ కింగ్ ఆఫ్ సెల్ఫ్ పోర్ట్రేట్‌గా కీర్తించబడ్డాడు. నలభై దాకా స్వీయ చిత్రాలు వేశాడు.
- విలియం ఊటెర్ మోలెన్ అల్జీమర్స్, డిమెన్షియాల బాధితుడు. తన జ్ఞాపకశక్తి సన్నగిల్లుతున్నదని తెలుసుకుని తన ముఖాన్ని గుర్తించగలిగినంతకాలం స్వీయచిత్రాలు రచించాడు.
- అమెరికన్ ఆర్టిస్ట్ సిండీ షెర్మన్ అనేక సందర్భాల్లో ఫొటోగ్రాఫిక్ స్వీయ చిత్రాలను తీసింది. తనను తాను వివిధ ఊహాజనిత పాత్రల్లో డైరెక్టర్‌గా, రచయితగా, మేకప్ ఆర్టిస్టుగా మోడల్‌గా నలుపు తెలుపు ఫోటోల్లో చూపించింది.
- పాల్‌గుగేన్ స్వీయచిత్రం (1889) తలపైన వలయం, పొట్ట మీద పాకుతున్న పామును చేతిలో పట్టుకుని వేలాడుతున్న ఆపిల్స్‌తో రచించిన చిత్రం. క్రైస్తవ సంకేతాలతో వున్న చిత్రం ఆంతర్యం ఏమిటో అంతుపట్టదు. స్వీయచిత్రాల్లో ఇదొక అపూర్వ చిత్రం.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# ఆగాఖాన్ పాలెస్



– వేలూరి కృష్ణమూర్తి

పూనా పట్టణంలోని దర్శనీయ స్థలాలలో ఆగాఖాన్ పాలెస్ కూడ ముఖ్యమైనది. కారణం, మన స్వాతంత్ర్యోద్యమంతో అది ముడిపడి వుంది. ఆగాఖాన్ పాలెస్ ఒక భవ్యమైన సుందర భవనం. ఈ భవనం బ్రిటిషు వారి పరిపాలన సమయంలో కారాగృహమై వుండేది.'క్విట్ ఇండియా' సమయంలో గాంధీజి ఫాసిస్టులతో లోలోనే, రహస్యంగా ఒప్పందం చేసుకొన్నారన్న బ్రిటీషువారి ఆపాదనకు నొచ్చుకొన్న గాంధీజి 21 నెలల కాలం గాంధీజీ ఈ చెరచెరసాలలో గడిపారు. గాంధీజి ఆ సమయంలో ఉపవాసంలో వుండేవారు. క్విట్ ఇండియా పోరాటం 1942 ఆగస్టు 8న 'క్విట్ ఇండియా' పోరాటం ఘోషింపబడుతుంది. దానికి ముఖ్య కారణం రెండవ ప్రపంచ మహాయుద్ధం స్థితిగతులు, అలాగే ఇండియన్ నేషల్ కాంగ్రెస్ సమాజవాదుల ఆసరా. యుద్ధం ప్రారంభంలో ఫాసిస్ట్ శక్తులైన జర్మనీ, జపాన్ దేశాలిస్తున్న తొందరలను ఎదుర్కోవడానికి బ్రిటిష్ ప్రభుత్వం అమెరికా సహాయం కోరుతుంది. దానికి జవాబుగా స్వాతంత్ర్యం కోరుతున్న భారత్‌లాంటి దేశాల సార్వభౌమత్వపు హక్కులను గౌరవించేదయితే తాను సహాయం చేయడానికి సిద్ధమని అమెరికా తెలుపుతుంది. ఈ విషయాలకు సహాయకారిగా ఈ రెండు దేశాల మధ్య చరిత్రార్ధకమైన 'అట్లాంటిస్ ఒప్పందం' కుదిరి దాని ప్రకారం సంధానం చేయడానికి భారత దేశానికి వచ్చిన స్టాఫర్డ్ క్రిప్స్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యుద్ధంలో సహకరిస్తే భారత దేశంతో అక్కడి యితర రాజ సంస్థానాలు విలీనమయ్యే ఎన్నికను ఆయా సంస్థానా లకు యివ్వబడుతుందని బ్రిటిష్ ప్రభుత్వం తెలుపుతుంది.

స్టాఫర్డ్ క్రిప్స్ జరిపిన వికృతమైన సంధానం, అలాగే ప్రపంచ రాజకీయాలలో వచ్చిన అనీరిక్షితమైన మలుపులు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో భయం పుట్టించాయి. అపుడు కాంగ్రెస్ బ్రిటీషువారి విరుద్ధంగా 'భారతదేశం వదలి వెళ్ళండి' అన్నపిలుపుతో అంతిమ పోరాటం చేయడానికి నిర్ణయిస్తుంది. విరిగిపోయి ముక్కలు ముక్కలైన భారత దేశం మాకు వద్దు, ఇపుడే మా పాటికి మమ్ములను విడువండి. మా సమస్యలను మేమే పరిహరించుకొంటామని ఖచ్చితంగా తెలుపుతారు. మాటలు విరిగిపోతాయి. 1942, ఆగస్టు 8న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ 'క్విట్ ఇండియా' పోరాటానికి పిలుపునిస్తుంది. డు ఆర్ డై అన్న క్రాంతి ఘోష దేశంలో అన్నిచోట్లా మార్మ్రోగు తుంది. దీనితో ఉగ్రులైన బ్రిటీషువారు, పోరాటం ప్రారంభమవడానికి ముందుగానే ఎందరో క్రాంతి కారులను బంధిస్తారు. దానితోపాటు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రముఖ నాయకులనందరినీ వేరు వేరు చెరసాలలలోనికి తోస్తారు. ఆగస్ట 9న గాంధీ పరివారాన్ని పాడుబడ్డ 'ఆగా ఖాన్ పాలెస్'ను చెరసాలగా మార్చి దానిలో బంధిస్తారు. గాంధితోపాటు పత్ని కస్తూర్బా, సరోజినీ నాయుడు, మహదేవ దేశాయ్, మీరాబెన్ మరియు గాంధి ఆప్త సహాయకుడు ప్యారెలాల్ కూడా బంధింప బడతారు. చెరసాలలో వేసిన ఐదు రోజులలోనే (ఆగస్టు 15న) గాంధి గారి ఆప్తుడు మహదేవ దేశాయి మరణిస్తాడు. బయట జరుగుతున్న హింసాచార బాధ్యతను గాంధీపై వేయడానికి ఆనాటి బ్రిటీషు ప్రభుత్వం వామ మార్గం దారిపట్టి గాంధి అహింసా తత్వానికి కళంకం తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. ఇలా చేయడంతో గాంధి ఖిన్నుడై 21 రోజుల ఉపవాస సత్యాగ్రహానికి నాంది అవుతుంది. ఈ ఉపవాస సమయంలో గాంధి రెండు మార్లు చావుకు దగ్గరపడినా కస్తూర్బా, మీరాబెన్ వారి ఉపచర్యలతో కోలుకొంటారు. చెరసాలలోని మొనాటనీతో పాటు వయో

సహజమైన అనారోగ్యాలు ఈ పోరాటగార్లను చాలా బాధపెడుతాయి. ఈ కారణాలవల్ల బంధింపబడిన 7వ నెలలో సరోజినీనాయుడును విడుదల చేస్తారు. మీరాబెన్ మరియు కస్తూర్బా గార్ల ఆరోగ్యం కూడ క్షీణించసాగింది. కాని, బ్రిటిష్ ప్రధాని విన్ స్టన్ చర్చిల్ హఠమారితనంవల్ల ఎలాంటి సహాయం చేయలేక వైస్ రాయ్ వేవెల్ నిస్సహాయుడవుతాడు. ముమ్ముందు కస్తూర్బా ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తుంది. వైద్యుల సలహా అనుసరించి చర్చిల్ విరోధాన్ని కూడ లెక్క చేయక వైస్ రాయ్ వేవెల్, మే 6, 1944న గాంధీని విడుదల చేస్తారు. ఆగాఖాన్ పాలెస్ నిర్మాణం నేపథ్యమేమిటి?

ప్రస్తుతం భారతీయ పురాతత్వ శాఖ అధీనంలో వున్న ఈ పాలేస్‌ను ఆగాఖాన్ 1892లో నిర్మించాడు. ఖాన్ కుటుంబం జనానురాగిగానూ, సమాజముఖిగానూ వుండేది. అపుడు పూనా నగరం చుట్టుప్రక్కలంతా భీకరమైన క్షామం తాండవమాడింది. ప్రజలు ఆకలితో మాడి తత్తరిల్లిపోతుండేవారు. అలా బాధపడుతున్నవారికి ఏదైనా పని యిచ్చి ఆదుకోవాలన్న సంకల్పంతో ఈ రాజమందిరం నిర్మించే పనికి పూనుకొన్నాడు ఖాన్. దీనిని నిర్మించడానికి అయిన ఖర్చు 12 లక్షల రూపాయలు. ఈ భవన నిర్మాణం పూర్తవడానికి ఐదు సంవత్సరాలు పట్టింది. ప్రస్తుతం ఆగాఖాన్ పాలెస్‌ను జాతీయ స్మారకంగా భారత ప్రభుత్వం ఘోషించింది. ఈ ఘోషణ నేపథ్యంలో ప్రజల పోరాటానికి చెందిన ఒక పెద్ద కథ వున్నది. సరియైన నిర్వహణ లేక శిథిలమైపోతున్న ఈ పాలెస్‌ను కేంద్ర ప్రభుత్వం తమ అధీనంలోనికి తీసుకొని రక్షించాలని 1999లో పూనా నగర ప్రజలు ఆమరణాంతర నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ పోరాటం జరిగిన అనంతరం కొంతవరకు ఈ భవనం నివాసయోగ్యంగా పనులు నిర్వర్తించారు. నయన మనోహరంగా వున్న ఈ భవనంలోన వేరు వేరు విశాలమైన హాళ్ళలో గాంధి దంపతులు రోజూ వాడుతున్న వస్తువులను పేర్చి వుంచారు. కస్తూర్బా తనకున్న తీవ్రమైన ఉబ్బసాన్ని తగ్గించడానికి తన గుండెకు అదుముకొని పడుకొని వుండిన మేజా కూడ వున్నది. చరిత్ర తెలిసిన ఎవరికైనా దానిని చూచినపుడు బాధ కలుగకుండా వుండదు. కలబుర్గికి చెందిన గొప్ప పేరున్న ఒక కళాకారుడు స్వర్గీయ ఎస్.ఎం. పండిట్, కస్తూరిబాయి, గాంధి తొడపై తలవుంచి పడుకొని వుండగా ఆమె ప్రాణ పక్షి ఎగిరిపోయినప్పటి తైల చిత్రాన్ని చూచినపుడు వీక్షకుల కళ్ళలో నీరూరక మానవు. ఆగాఖాన్ పాలెస్ విశాలమైన బయలులో ఉద్యాన వనం, గ్రంథాలయం, ఖాది వస్తువులు విక్రయించే దుకాణం అలాగే కుటీర పరిశ్రమల తరబీదు కేంద్రం కూడ వున్నది. ఆకు పచ్చని ప్రశాంతతలో గాంధీజి, కస్తూరిబాయి అలాగే మహదేవ దేశాయి వారి చితా భస్మపు స్మారకాలు కూడా వున్నాయి.

వేలూరి కృష్ణమూర్తి
మైసూరు, 9448977877

## కమ్మతెమ్మెరలు



*మిసిమి పత్రిక మేలిమి*
*పఠనం లో చెలిమి*
*సాహిత్యంలో బలిమి*
*అదే కొందరికి కలిమి.*

*డిసెంబరు మాసపు **మిసిమి** అందిన వెంటనే చకచకా చదివేసాను. ముందుగా పుస్తకపరిచయాలుపై దృష్టి మళ్ళింది. రాంబాబు గారి పుస్తకపరిచయం, గార రంగనాథంగారి కవితాసంకలన పరిచయం ఆకట్టుకున్నాయి.*

*గొలుసునవల, తోంభైవత్సరాలనాటి భానుమతి నవలపై విశ్లేషణ హృదయంగముగా వుంది. నవంబరు నెలలో కృష్ణరాయలచాటువులపై విమర్శ బాగుంది. దానిపై రచయిత్రి ప్రతిస్పందన వస్తుందేమో చూడాలి. తదుపరి అంశాలు విశేషంగా అలరించాయి. సంపాదకీయంతోపాటు చిత్రాలు రసరమ్యంగా రాణించాయి. ఒక చక్కని పత్రికను చదివింపజేసినందుకు **మిసిమి** నిర్వాహకులకు ధన్యవాదాలు.*

***దోసపాటి వేంకటరామచంద్రరావు, విజయనగరం, ఫోన్ : 7780594995.***

# తెలంగాణ విద్యా కమిషన్

**- యన్. రాజశేఖర్**

**తెలంగాణ విద్యా కమిషన్ – ఏర్పాటు :** తెలంగాణ విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సెప్టెంబర్ 3, 2024 రోజున తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలను (G.O. Ms. No. 27) జారిచేసింది.

రాష్ట్రంలోని అన్ని స్థాయిలలో గల విద్యా సంస్థలలో విద్యా నాణ్యతను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ, NAS (నేషనల్ అచీవ్మెంట్ సర్వే) 2021 గణాంకాలు రాష్ట్రంలో క్రమంగా పాఠశాల విద్యలో అభ్యాసన సామర్థ్యల క్షీణతను తేటతెల్లం చేస్తున్నాయన్న విషయాన్ని, విశ్వవిద్యాలయ స్థాయిలో క్షీణిస్తున్న పరిశోధనా ప్రచురణలను, లోపభూయిష్ట పరిశోధన ఫలితాల వినియోగిత (రీసెర్చ్ ఔట్పుట్) ను మరియు విద్యార్థులలో ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాల లేమిని నొక్కి వక్కానిస్తూ, క్షీణతకి అడ్డుకట్ట వేస్తూ విద్యా నాణ్యతను మెరుగు పరిచే మార్గాన్వేషణకై ప్రస్తుత పరిస్థితి యొక్క సమగ్ర అవగాహన తొట్టతొలి ప్రాధామ్యమని చెబుతూ, విద్యారంగాన్ని పునరుద్ధరించడం, సంస్కరించడం అనివార్యమని పేర్కొంది.

భోధనాభ్యసన విధానాలలో వస్తున్న నూతన ఒరవడులను, ప్రభావవంతమైన భోధన పద్ధతులను, అభ్యసన సామర్థ్యాల మదింపు, గణాంక ఆధారిత పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, 'విద్యారంగ ప్రాభవాన్ని ప్రభావితం చేయగల వివిధ విద్యా సంస్థల పెరుగుదల లేదా కుదింపు' యొక్క అవసరాన్ని అంచనా వేయడం, మొదలగు అంశాలను అనునిత్యం, ప్రత్యేక దృష్టితో సునిషితంగా అధ్యయనం చేయడాన్ని 'విద్యారంగ పునరుద్ధరణ' అనివార్యం చేస్తుందనేది ప్రభుత్వ దృక్పథమని పేర్కొంది. అందుకు గుణాత్మక విద్యపై ప్రభావం చూపగల గతిశీల మార్పులను మదింపు చేయడం అవసరం. విద్యా రంగలోని ప్రస్తుత తీరుతెన్నులకు అనుగుణమైన సంసిద్ధతాలేమి భవిష్యత్తరాలపై ప్రతికూల ప్రభావం చూపగలదు. వీటి దృష్ట్యా, పూర్వ ప్రాథమిక స్థాయి నుండి సాంకేతిక విద్యతో సహా, విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఒక సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించడానికి తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేయబడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత సుమారు దశాబ్ద కాలానికి తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు దాని ఆవశ్యకతను తెలియచేస్తున్నది.

**తెలంగాణ విద్యా కమిషన్ యొక్క లక్ష్యాలు :**

1. ప్రస్తుత విద్యారంగంలో వస్తున్న గతిశీల మార్పులను అధ్యయనం చేస్తూ, విద్యా రంగంలో ప్రభుత్వానికి మేధో వనరుగా నిలవడంతోపాటు, విధానపరమైన నిర్ణయాలలో సూచనలు చేయడం.
2. మేధోమథనాలను నిర్వహిస్తూ, భావజాల రూపకల్పన (ideation), విద్యా విధానాల రూపకల్పనకు సంప్రదింపులు జరపడం, మార్గదర్శకాలు, నిబంధనల రూపకల్పన, మొదలగునవి.

**క్రింది అంశాలను అధ్యయనం చేసి, సిఫార్సులు చేయుట :**

1. ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను సార్వజనీనం చేయుట.
2. విద్యార్థుల పరిపూర్ణ వికాసం పై ప్రత్యేక దృష్టితో పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్యను అందించుట.
3. గుణాత్మక ఉన్నత విద్య అందించటంతో పాటు అప్రెంటీస్షిప్/ఉపాధి నైపుణ్యాల పెంపుదలకు ఉన్నత విద్యాసంస్థలతో సమీకృతమై విద్యను అందించుట.
4. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు విద్యార్థులలో ప్రాథమిక సామర్థ్యాల సాధనకు కృషి చేయుట.
5. సమతా వాద భవనాధారిత విద్యను (Egalitarian Based Education) అందించుట ద్వారా విద్యార్థులను బాధ్యతాయుత విశ్వ పౌరులుగా రూపుదిద్దుట.

6. కాలానుగుణంగా విద్యను ప్రభావితం చేయగల మరే ఇతర అంశాన్నైనా పరిశీలించి, అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగు సూచనలు చేయుట.

**తెలంగాణ విద్యా కమిషన్ కూర్పు :** తెలంగాణ విద్యా కమిషన్‌లో ఒక ఛైర్పర్సన్, ముగ్గురు సభ్యులు మరియు ఒక సభ్య కార్యదర్శి ఉంటారు.

1. ఛైర్పర్సన్ – ఆకునూరి మురళి, ఐఏఎస్

2. విద్యారంగంలో నిపుణులైన ముగ్గురు సభ్యులు – ప్రొఫెసర్ పీ.ఎల్. విశ్వేశ్వర్‌రావు
చారుగొండ వెంకటేష్
జ్యోత్స్న శివారెడ్డి

3. కమిషన్ కార్యకలాపాలను సమన్వయ పరిచేందుకు ఒక సభ్య కార్యదర్శి (నియామకం కావలసి వున్నది)

భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు జరిపిన పిమ్మట కమిషన్ సిఫార్సులు చేస్తుంది. రాష్ట్రంలో ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యా సంబంధిత అంశాలను అధ్యయనం చేయడం, క్షేత్ర స్థాయి వాస్తవిక పరిస్థితులను లోతుగా పరిశీలన చేయడం, తదనుగుణంగా విద్యా సంబంధిత కార్యక్రమాల రూపకల్పనకు మార్గదర్శనం చేస్తూ ప్రణాళికల రూపకల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి తోడ్పాటునందించే బృహత్తర లక్ష్యంతో తెలంగాణ విద్యా కమీషన్ ఏర్పాటు జరిగింది.

**లక్ష్యాలెన్నో.. సవాళ్ళూ అన్నే :** 2021 నేషనల్ అచీవ్మెంట్ సర్వే (NAS 2021) గణాంకాల ప్రకారం పాఠశాల స్థాయిలో వివిధ అభ్యసనా ఫలితాల సాధనా సగటు జాతీయ స్థాయి కన్నా చాలా తక్కువగా నమోదవడం రాష్ట్రంలో విద్యా ప్రమాణాల స్థాయిని తేటతెల్లం చేస్తున్నాయి. విద్యా విషయిక అంశాల ఆధారంగా ఒక రాష్ట్రాన్ని అంచనా వేయడానికి కొలమానాలు వైవిధ్య భరితమనే విషయం సుస్పష్టం. అందులో పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు 'విద్యా ప్రమాణాల సాధన' ప్రప్రథమమైన గీటురాయి. ఇదే తెలంగాణ విద్యా కమిషన్ కు మొట్టమొదటి లక్ష్యం, సవాలు.

**NEP 2020 అమలు :** డా. కస్తూరి రంగనాథ్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న జాతీయ విద్యా విధానం-2020 అమలు అనివార్యమవుతున్న ఈ దశలో తెలంగాణ విద్యా కమిషన్ ముందు అనేక సవాళ్ళు నిలవనున్నాయి. ముఖ్యంగా NEP 2020 సూచించిన విధంగా 5+3+3+4 నమూనాకు అనుగుణంగా విద్యా స్థాయిల పునరనిర్మాణం కీలకం కానుంది. అందుకు, ప్రస్తుతం ఉన్న అంగన్వాడి కేంద్రాలను ప్రిప్రైమరి పాఠశాలలుగా పాఠశాల స్థాయికి అనుసంధానం చేయడం అనివార్యమనేది సుస్పష్టం. ప్రి ప్రైమరీ స్థాయిలో తగిన అర్హతగల ఉపాధ్యాయుల నియామకం, సౌకర్యాల ఏర్పాటు, నిర్వహణ మొదలగు అంశాలు ప్రత్యేక శ్రద్ధను చూపవలసిన అంశాలుగా ఉండనున్నాయి. "అంగన్ వాడీలను ప్రీ స్కూల్స్‌గా మార్చి వాలంటీర్లను తీసుకొని వారికి శిక్షణ ఇచ్చి పూర్వ ప్రాథమిక విద్యకు అవసరమైన శిక్షణ ఇచ్చేలా తీర్చిదిద్దాలనే యోచన చేస్తున్నట్లు", "మూడో తరగతి వరకు ప్రీస్కూల్‌లో బోధన అందేలా చూసి, నాలుగు నుంచి 12వ తరగతి వరకు సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు" ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారు ఇటీవల విద్యావేత్తలతో సమావేశంలో పేర్కొనడం గమనార్హం. దశాబ్దాలుగా కీలకంగా ఉన్న SSC పరీక్షలను, ఇంటర్మీడియేట్ విద్యను, NEP 2020 సూచనలకు అనుగుణంగా మార్చుతారా? అన్నది అస్పష్టం.

**అవసరాలకు తగ్గట్టుగా విద్యా సంస్థల మార్పు :** "మండలానికి ఆరు నుండి పది పాఠశాలలు పెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై, సౌకర్యాలు మెరుగై విద్యాప్రమాణాలను పెంపొందుతాయి" అని ఇటీవల ఒక వార్తా పత్రికలో ప్రచురితమైన వ్యాసంలో తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ శ్రీ ఆకునూరి మురళి, ఐఏఎస్ గారు అభిప్రాయం వ్యక్తం చేయడాన్ని బట్టి చూస్తే పాఠశాలల సంఖ్య కుందింపుపై ఒక అవగాహనకు వచ్చినట్టు అర్థం చేసుకోవచ్చు. "నాణ్యమైన విద్యకు ఖరీదైన గురుకుల పాఠశాలలు పరిష్కారమే కాదు. గురుకుల పాఠశాలలో చదివే పిల్లలు వారి బాల్య హక్కులను, తల్లిదండ్రులు పిల్లలతో గడపాల్సిన సంతోష కాలాన్ని కోల్పోతున్నారు" అని అభిప్రాయపడటం కూడా రానున్న మార్పులకు అద్దం పడుతుంది. ఇబ్బడి ముబ్బడిగా అరకొర వసతులతో సతమతమవుతున్న గురుకులాలను సెమీ రెసిడెన్షియల్స్ గా మర్చి, సమీప ప్రాంతాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించే అంశం పరిశీలనలో ఉందనేది సుస్పష్టం.

"మండలానికి ఆరు నుండి పది పాఠశాలలుపెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై మంచి సౌకర్యాలు, మెరుగైన సమీక్షల ద్వారా విద్య ప్రమాణాలను పెంపొందించుకోవచ్చు" అని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ హోదాలో ఉన్న శ్రీ ఆకునూరి మురళి గారు అభిప్రాయం వ్యక్తం చేయడం గుణాత్మక విద్యకు తీసుకోనున్న చర్యలకు తార్కాణం.

ఇక విశ్వవిద్యాలయ స్థాయిలో, సమస్యల పరిష్కారం, ఆచార్యుల నియామకం, పరిశోధనల నాణ్యత పెంపు, నిధుల కేటాయింపులు, ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (GER) పెంపు, విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులలో నైపుణ్యాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు, పరిశ్రమలకు అనుసంధానిత పాఠ్యాంశాల రూపకల్పన మరియు అమలు మొదలగు అంశాలన్నీ ప్రధానమే. సాంకేతిక విద్యలో విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు దోహదపడే అంశాల మేళవింపుతో పాఠ్యాంశాల కూర్పు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల పెంపు, ఉద్యోగిత (ఎంప్లాయబిలిటీ) మొదలగునవి నిత్య సవాళ్ళు. కాలను గుణంగా సమాజ అవసరాలకు సరిపడే విద్యను అందించడం, సాంకేతిక విద్యలో మరో ప్రధాన అంశం. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న ఆవిష్కరణలు, తదనుగుణంగా వస్తున్న మార్పులు, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్ మొదలగు నూతన అధ్యయనాంశాలు మరియు కోర్సులను భవిష్యత్తరాలకు ప్రభావవంతంగా అందించి సఫలీకృతులను చేయడం సాంకేతిక విద్యకు శిరోదార్యం. అందుకు తగిన విధంగా సాంకేతిక విద్యను పటిష్టం చేయడం అత్యంత కీలకం.

**కంటిన్యూయస్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్ – వృత్యంతర విద్యా కీలకమే :** శాస్త్ర సాంకేతిక రంగాల్లో శర వేగంగా వస్తున్న మార్పులు అన్ని రంగాలను, అంతిమంగా సమాజాన్ని, సమాజ అవసరాలను అంతే వేగంగా ప్రభావితం చేస్తున్న నేటి ప్రపంచంలో, ప్రతివృత్తిలో నిత్యం మెరుగయ్యేందుకు, మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకునేందుకు వృత్యంతర విద్యా అవకాశాలను కల్పిస్తూ, ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారుచేసుకోగలగడం ఏ విద్యా వ్యవస్థకైనా అత్యంత ఆవశ్యకం.

**విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు అత్యంత ఆవశ్యకం:** విద్యా వ్యవస్థను మెరుగు పరచాలన్న ఆశయ సాధన, విద్యా వ్యవస్థకు కేటాయించే బడ్జెట్పై పరోక్షంగా ఆధారపడి ఉంటుంది. అరకొర బడ్జెట్ కేటాయింపులతో అద్భుతాలు సాధ్యపడవనేది జగమెరిగిన సత్యం. మౌలిక సదుపాయాల కల్పన మొదలుకుని, నాణ్యతా ప్రమాణాల పెంపు వరకు ప్రతి అంశం ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో విద్యకు కేటాయించే బడ్జెట్కు ముడిపడి ఉంటుంది. విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడం వలన మెరుగైన ఫలితాల సాధన సులభతరమవుతుందని, అరకొర బడ్జెట్తో ఉత్తమ ఫలితాల సాధన సాధ్యపడదని గుర్తించడం అత్యంత ఆవశ్యకం. విద్యకు వెచ్చించే ధనాన్ని భవిష్యత్కు పెట్టుబడిగా భావించినపుడే అది సాధ్యమవుతుంది. తెలంగాణ విద్యా కమిషన్ ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపుల పెంపులో సఫలీకృతమవుతుందని ఆశిద్దాం.

**ముగింపు :** విద్యా ప్రమాణాలను మెరుగు పరిచే కృత నిశ్చయంతో ఉన్న తెలంగాణ విద్యా కమిషన్ క్షేత్ర స్థాయిలో వివిధ వర్గాల భాగస్వాములతో సంప్రదింపులు మొదలు పెట్టింది. స్వయంగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ సాధారణ ప్రజలతో క్షేత్ర స్థాయిలో సంభాశిస్తూ అభిప్రాయాలను సేకరించడం, క్షేత్ర స్థాయిలో వాస్తవిక పరిస్థితులను పరిశీలించడం విద్యా కమిషన్ భవిష్యత్ కార్యాచరణ, పనితీరుకు అద్దం పడుతున్నాయి. నాణ్యమైన విద్య అందిచడమే ధ్యేయంగా ఏర్పాటైన తెలంగాణ విద్యా కమిషన్, ముందున్న సవాళ్ళను అధిగమించి తన క్రతువులో కృతకృత్యం కావాలని, తెలంగాణ భావితరాల భవిత విద్యాభరితం కావాలని, జ్ఞాన సంపన్నం కావాలని సగటు తెలంగాణావాది ఆకాంక్ష.

డా. యన్. రాజశేఖర్
(ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత)
టిజిటి, UGC-JRF(Education),

# మహారాణి మంగమ్మ

– సగిలి సుధారాణి



మధుర మహారాణి మంగమ్మ

దక్షిణాపథ చరిత్రలో నాయక రాజుల వంశంలో ప్రముఖురాలు మధుర మహారాణి మంగమ్మ. మధుర నాయక పాలకులలో మంగమ్మ గొప్ప పాలనాదక్షత చూపి, చరిత్రలో నిలిచిపోయింది. స్వర్ణాక్షరాలతో లిఖించ దగిన మహోన్నత ఘట్టం ఆమె పరిపాలన.

ప్రాచీన సంగంకాల యుగం నుండి ఆంధ్రనాయకుల పాలన వరకు దక్షిణాపథ చరిత్రలో తనదైన శైలిలో జనరంజకంగా పాలించిన వ్యక్తి రాణి మంగమ్మ. కానీ ఈమె గురించి చాలా తక్కువమందికి తెలుసు!

**మధురకు తెలుగుజాతికి విడదీయరాని సంబంధం!**

మధుర పేరులోనే మాధుర్యం ఉంది. తమిళనాడుకు సాంస్కృతిక రాజధానిగా వెలుగొందుతున్న మధుర ఒకప్పుడు తెలుగు పాలకులు ఏలిన నేల. దక్షిణ భారత దేశానికి తలమానిక్యమైన సాంస్కృతిక నగరం! ద్రావిడ సంస్కృతి చరిత్రలో మూల మలుపు అనదగిన సంగం పునరుజ్జీవానికి పుట్టినిల్లు. సుప్రసిద్ధమైన మీనాక్షి, సుందరేశ్వరుల ఆలయం అక్కడే ఉంది. ప్రసిద్ధ కావ్యం 'శిలప్పదిగారం' అక్కడే రచించబడింది. తమిళంలో తొలి వ్యాకరణ గ్రంథం 'తొల్‌కాప్పియం' అక్కడే పుట్టింది. నేటి తమిళనాడు పరిపాలన రాజధాని చెన్నై అయితే సాంస్కృతిక రాజధాని మాత్రం మధుర.

మధుర అంటే 'మధ్య కూడలి' అని అర్థం కూడా ఉంది. (మధురకు ఉత్తరాన–తిరుచునాపల్లి, తంజావూరు; దక్షిణాన – కన్యాకుమారి, తిరునల్వేలి; తూర్పున–శివగంగ, రామేశ్వరం; పశ్చిమాన–బోడినాయకనూరు, దేవారం, తేని ప్రాంతాలు ఉన్నాయి) కొన్ని వేల తెలుగు కుటుంబాల వారు తంజావూరు, మధుర తెలుగు పాలకుల ఆదరణతో రాజ్యపాలన, వ్యవసాయం, వివిధ చేతివృత్తులు చేపట్టి దక్షిణాది ప్రాంతంలో ప్రసిద్ధులైనారు. మధురను పాలించిన నాయక రాజుల జ్ఞాపకాలెన్నో ఇప్పటికీ అక్కడ నిక్షిప్తమై ఉన్నాయి. మధురలో నేటికి మన చరిత్ర వెలుగుతోంది. తరతరాల తెలుగువారి చరిత్ర అక్కడ వేళ్ళూనికొని ఉంది.

**నాయకరాజులు (1529–1736) :** విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరు, మధుర, పుదుక్కోట, సెంజి, మైసూరు పరిపాలకులు స్వతంత్రులైనారు. తెలుగు నాయకరాజులు విశాలమైన మధుర సామ్రాజ్యాన్ని 1529–1736 మధ్యకాలంలో మధుర, తిరుచ్చి రాజధానులుగా చేసుకొని పరిపాలించారు. పరాయి పాలకుల దాడులను ఎదుర్కొంటూ, మధుర నాయక రాజుల పాలన 1741.సం.లో పూర్తిగా ఆర్కాటునవాబుల పాలన కిందికి వెళ్ళేవరకు దాదాపు రెండు శతాబ్దాలకు పైగా దక్షిణాపథంలో కొనసాగింది. మధుర నాయక పాలకుల్లో విశ్వనాథనాయకుడు, తిరుమల నాయకుడు, చొక్కనాథ నాయకుడు, మహారాణి మంగమ్మ ముఖ్యులు. చివరి పాలకురాలు రాణి మీనాక్షి పాలనా కాలంలో అంతఃపుర కలహాలు ఏర్పడి నాయకరాజుల పాలన అంతరించిపోయింది.

**మహారాణి మంగమ్మ పరిపాలన :** మంగమ్మ గొప్ప రాజకుమారి కాదు! సామంత రాజకన్య కాదు! విజయనగర సామ్రాజ్య దళపతి తుపాకుల లింగమ నాయకుని అనుంగు తనయగా పుట్టింది. కొన్ని రాజకీయకారణాలతో లింగమ నాయకులు చంద్రగిరికోట దళపతిగా నియమితులైనారు.

వారు కుటుంబంతో చంద్రగిరికి (ప్రస్తుతం తిరుపతి జిల్లా) వచ్చి కుదురుకొన్నారు. తండ్రి ప్రోత్సాహంతో ఆమె చిన్నప్పటి నుండే విల్లు, వేట, యుద్ధ విద్యలలో, సైనికవ్యూహాలలో, యుద్ధ ఎత్తుగడలలో ఆరితేరింది.

**చంద్రగిరి నుండి మధుర దాక :** తన ధైర్య సాహసాలతో, గుణగణాలతో నాయకరాజు చొక్కనాథ నాయకుని ఆకట్టుకొని, ఆయన పినతల్లి విశ్వాసాన్ని కూడా చూరగొన్నది. చొక్కనాథ నాయకునితో ఏడడుగులు నడచి నాయకరాజ వంశానికి కోడలై మధుర మహారాణి అయ్యింది. ఈమె రణరంగంలో కృపాణం చేబూనలేదు కానీ క్షాత్రోచిత నిర్ణయాలన్నింటిలో ఆమె బుద్ధిబలమే శక్తివంతమైన రాజదండమై నిలిచింది. ఆనాడు చోళపాండ్య నాడులు వంచక విద్రోహుల వల్ల బలహీనమైనాయి. మంగమ్మ తన తంత్రంతో తిరిగి రాజ్యాన్ని చేజిక్కించుకొనేలా చేసింది. కానీ దురదృష్టం! భర్త ఆకస్మిక మరణం తనను కృంగదీసింది. ఆనాటి రాజకుటుంబాలలో సతీ సహగమనం పరిపాటి! అంతకుముందు కాలంలో తంజావూరులో విజయ రాఘవ నాయకుడు వీరమరణం పొందినపుడు అంతఃపుర స్త్రీలందరూ చితిపేర్చుకొని ప్రాణత్యాగం చేశారు. తిరుమల నాయకుడు స్వర్గస్థులైనపుడు ఆయన పట్టపు రాణులు సహగమనం చేశారు. మహారాణి మంగమ్మ తాను గర్భవతి అయిన కారణంగా చొక్కనాథునితో పాటు సతీసహగమనం కాలేక పోయింది. ఆమె సామ్రాజ్య రక్షణార్థం, ప్రజాహితార్థం జీవించి, తన ఏకైక కుమారునికి పట్టాభిషేకం చేసి రాజ్యనావకు చుక్కానియై సహకరించింది.

మహారాణి మంగమ్మను దురదృష్టం వెంటాడుతూనే ఉంది. తన కుమారుడు కూడా అనంత లోకాలకు చేరుకొన్నాడు. నిండు చూలాలైన కోడలు ముత్తులక్ష్మికి కూడా అదే పరిస్థితి ఎదురైనపుడు సతీసహగమనానికి సిద్ధమైంది. అన్నెం పున్నెం ఎరుగని పసిబిడ్డకు అన్యాయం చెయ్యడం మహాపాపమని ఆ ప్రయత్నం విరమింపజెయ్యాలని శతవిధాల మంగమ్మ నచ్చజెప్పింది. కానీ, బిడ్డ కనేంతవరకు ప్రాణాలతో ఉండి, పసిబిడ్డను వదలి ఆత్మహత్యకు పాల్పడినది ముత్తులక్ష్మి. కన్నకడుపు శోకానికి తోడు కోడలిని కోల్పోయినా తట్టుకుని ఆ పసిబిడ్డకు మహారాణి మంగమ్మే కన్నతల్లైంది. స్వర్గస్థులైన మహారాజు పేరువచ్చేలా 'విజయరంగ చొక్కనాథుడ'ని నామకరణం చేసింది. క్రీ.శ. 1689 సం.లో తన పౌత్రునికి ప్రతినిధిగా సింహాసనమధిష్టించింది. తన పౌత్రుని సంరక్షణార్థం రమారమి 18 సంవత్సరములు కీర్తివంతంగా రాజ్యపాలన చేసిన వీరనారీ మణి మహారాణి మంగమ్మ.

**సామంతుల తిరుగుబాటులను చాకచక్యంతో అరికట్టిన గొప్ప రాజతంత్రి :** మహారాణి మంగమ్మ తన రాజ్యంలో అరాచకం ఏర్పడని విధంగా జాగురూకతతో, వేయికండ్లతో రాచ కార్యాలను నిర్వహించిన దిట్ట! స్త్రీయైనా మారువేషంలో రాత్రులు నగర సంచారం చేసి తన రాజ్యప్రజల యోగక్షేమాలను, కోర్కెలను, కొరతలను గ్రహించి మెలగడమే గాక, విద్రోహుల కుట్రలను కూడా తెలుసుకోగల్గిన వీరనారి! రాజ్యపరిపాలనా భారమకుటాన్ని ధరించి త్యాగమయ జీవనం గడిపిన గంభీర హృదయ! స్త్రీ ఏం చేస్తుందిలే అని నిన్న మొన్నటిదాకా వినయ విధేయులుగా ఉన్న సామంతులు స్వతంత్రులు కావాలని ఆశించారు. ఒకవైపు తంజావూరు రాజులు! మరోవైపు రామనాథ సేతుపతులు! ఇంకోవైపు మైసూరు పాలకులు! అటువైపు నుండి తిరువాన్కూర్ పాలకులు! గోరుచుట్టుపై రోకటి పోటువలె మొగల్ పాదుషా దక్షిణాపథాన్ని స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలు! వెరసి రక్త మాంసాలు ధారపోసి తమ పూర్వులు పాలించిన రాజ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యం ధీర మహారాణి మంగమ్మది. వీరి రాజ్యపరిపాలనాకాలంలో మూడు గొప్ప యుద్ధాలు జరిగాయి. అవి 1. తిరువాన్కూర్ రవివర్మతో ఘోర సంగ్రామం. 2. చీటికీ మాటికీ యుద్ధాలు చేసే మైసూర్ చిక్కదేవరాయలతో భీకర యుద్ధం. 3. రామనాథపుర కిళవన్ సేతుపతితో భీషణ సంఘర్షణ. శత్రువులను రణరంగంలో తాను నేరుగా ఎదుర్కోకుండానే తన కుశాగ్ర బుద్ధితో యుద్ధ వ్యూహాలను రచించి విజయం సాధించిన ప్రజ్ఞాధురీణ మంగమ్మ.

**మొగల్ పాదూషాకు బుద్ధి గర్పించడం!** ఔరంగజేబు తన అధికారం దక్షిణాపథానికి విస్తరించడానికి ప్రయత్నించాడు. మొగల్ పాదుషా ఆధిపత్యాన్ని ఒప్పుకోవడమంటే మన స్వాతంత్ర్యాన్ని చేతులారా కోల్పోడమే అని తలచింది మంగమ్మ. తనపుత్రుడి పాలనకాలంలో మొగల్ పాదూషా ఔరంగజేబుకు బుద్ధి చెప్పడం! ఆమెలోగల సమయ సందర్భ చాతుర్యానికి తార్కాణం. కానీ తన మనవడి పాలన వచ్చేసరికి ఇరుగు పొరుగు రాజ్యాలైన మైసూరు,



నగర మండపం



మీనాక్షి సుందరేశ్వరుల చిత్రం

తంజా వూరు పాలకులకు-మధురకు మధ్య శాంతి సౌఖ్యాలు లోపించాయి. వీరు పాదూషాకు విధేయులుగా ఉండేవారు. ఏకకాలంలో ఇరువురితో వైరం ఎందుకని తప్పని పరిస్థితుల్లో సంధి చేసుకొనేందుకు మంగమ్మ తలఒగ్గింది. మొగల్ దళపతికి కప్పంకట్టి, కానుకలు బహుకరించి ఏకోజి అనేవాడు కబళించిన తమ ప్రాంతాలను సమర్థతతో తిరిగి పొందగలిగిన చతుర!

**ప్రజాపనుల పట్ల మంగమ్మకు ఉన్న శ్రద్ధ అపారం :** గగన వీధులను తాకే సౌధాలను, గాలిగోపురాలను నిర్మించిన తన పూర్వులు వదలిపెట్టిన అభివృద్ధి బాటలో సామాన్య ప్రజల సౌకర్యార్థం బాటలను పటిష్టపరిచారు మంగమ్మ. వీటిని నిర్మించినందుకు ప్రజలపై క్రొత్త పన్నులు విధించలేదు. "కంచికామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి" అన్నమాట నాటికి, నేటికి, ఏనాటికీ ప్రసిద్ధమే. మధురమీనాక్షిని దర్శించడానికి దేశం నలుమూలల నుండి సామాన్య ప్రజలు వచ్చేవారు. మధుర మహారాణి తన పాలనాకాలంలో మారువేషాల్లో నగర సంచారం కావించే వారు. అలా ఒకసారి మారువేషంలో నగరసంచారం చేస్తుండగా, సరైన వసతులులేని శిథిలాలయంలో ఇబ్బంది పడుతున్న యాత్రికులు కనిపించారు. వారి బాధలను అర్థం చేసుకుని, యాత్రికుల కోసం మధుర చుట్టుపక్కల సత్రాలు, చావిళ్ళు సామాన్య ప్రజల కోసం నిర్మించారు. ఉదా. మధుర మీనాక్షి ఆలయానికి వచ్చే యాత్రికులకు విశ్రాంతి వసతికోసం సుమారు వెయ్యిమందికి సరిపడే విశాలమైన సత్రాన్ని కట్టించింది. మధురకు వచ్చిన యాత్రికులకు ఇది సేదతీర్చేది. ఆ సత్రానికి 'మంగమ్మసత్రమ'ని ప్రజలే నామకరణం చెయ్యడం విశేషం. నేటికీ తనపూర్వ వైభవానికి తార్కాణంగా 'మంగమ్మ సత్రం' పేరుతోనే మధుర మీనాక్షి గుడికి సమీపాన నిలిచి ఉంది.

**మంగమ్మ సాల (మంగమ్మ బాట) :** నగరపు వీధులు కూడా అతుకుల బొతుకులుగా ఉండడంతో బాటసారులకు మేలుచెయ్యాలనే ఉద్దేశ్యంతో ఆనాడు అడవులు కొట్టించి, కొండలు తొలిపించి ఎన్నో బాటలు వేసి, వాటికి ఇరువైపుల బాటసారులు సేదతీరేందుకు చెట్లను నాటించింది. అలా ఆమె వేయించిన బాటలే నేటికీ జాతీయ రహదారులుగా ఉపయోగపడుతున్నాయి. దీనికి సంబంధించి తమిళనాట పాండ్యమండలంలో మౌఖికగాథలు ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. అటువంటి వాటిలో ఆసక్తికరమైన ఒక కథనం.

*"ఒకసారి మంగమ్మ తన మంత్రులతో కొలువుదీరి పరిపాలన విషయాలను చర్చిస్తూ ఉంది. మంగమ్మది ఎడంజేయి వాటం (అలవాటు). ఆలోచనల నడుమ ఎడమచేతితో వక్కను తీసుకొని నోట్లో టక్కని వేస్కొన్నది. వక్కను ఎడంచేత్తో వేస్తే ఆ దినాలలో పెద్ద అపచారం. దీనిని అందరూ చూసేశారు. ఈ అపచారానికి పరిహారంగా ఏమి చేయాలని మంత్రులను అడిగింది. దానికి వారు బాటసారుల కోసం మధుర నుండి కన్యాకుమారి వరకు సాల (బాట) వేయించండి అని చెప్పినారట! అంతే వారిమాట ప్రకారం మంగమ్మ ఆ సాలను వేయించింది".*

సామాన్య ప్రజల నోళ్ళలో 'మంగమ్మఎడం చేత్తో వక్క ఏస్తే, మనకు సాల (బాట) తగిలె' అనే మాట వచ్చింది. కాలాగతిలో జనాల నోళ్ళల్లో నాని అదే 'మంగమ్మ సాల'గా స్థిరపడిపోయింది. ఆకాలంలో మధుర నుండి కన్యాకుమారి వరకు రాణి మంగమ్మ వేయించిన బాటనే



బంగారు పాలగిన్నెపై చెక్కిన తెలుగు అక్షరాలు

ఇప్పుడు మరికొంత అభివృద్ధి చేసి జాతీయ రహదారిగా తీర్చిదిద్దారు. మంచి పనులు సమకాలీనం వారు గుర్తించరు! అది గర్తించేనాటికి పుణ్యకాలం కాస్తా దాటి పోతుంది! ఒకప్పుడు రాణి మంగమ్మ నిర్మించిన విశ్రాంతి మందిరం ఒకదానిని ప్రస్తుతం ‘గాంధీజీ స్మారక మందిరం’గా మార్చడం జరిగింది. ఆకాలంలో ఇక్కడ మల్లయుద్ధ పోటీలు జరిగేవి. పోటీలు చూసేందుకు వచ్చే ప్రేక్షకులకోసం గరడి కూటంబు (గ్యాలరీ) ఉండేది. అది నేటికీ మనం మధురలో చూడవచ్చు. భవనంలోని కొన్ని ముఖ్యమైన శిల్పాలను పురావస్తు శాఖవారు మద్రాసుకు తరలించారు.

ప్రజల కష్టసుఖాల పట్ల ఎంతో శ్రద్ధ చూపే రాణి మంగమ్మ ఇంకా ప్రజలకు ఉపయోగపడే పనులు చెయ్యాలనే తలంపుతో తటాకాలను, బావులను తవ్వించింది. తన రాజ్యాన్ని అభివృద్ధి చేసింది. మధుర మీనాక్షి అమ్మవారికి దివ్యాభరణాలు, సుందరరాజస్వామికి అమూల్య ఆరణాలు, పట్టు చీనాంబరాలు మహారాణి మంగమ్మ, వారి మనవడు శ్రీ విజయరంగ చొక్కనాథుల వారు బంగారు పాలగిన్నెను సమర్పించారు.

చెట్టియప్ప నాయకర్ 1565 సంవత్సరంలో ఒక చిన్న మండపాన్ని నిర్మించారు. దీనినే ‘ఊంజల్ మండపం’ అని స్థానికులు వ్యవహరిస్తారు. మండపం వితానకంలో (పైభాగంలో) మంగమ్మ కాలంలో కనువిందు చేసిన వర్ణ చిత్రాలు, అందాలు దిద్దుకొని ఉన్నాయి.

**మధుర మీనాక్షి సుందరేశ్వరుల కళ్యాణ ఘట్టం :** మహారాణి మంగమ్మ తిలకిస్తున్న కుడ్యచిత్రం ఎడమపక్కలో ‘మహారాజశ్రీ దళవాయి రామప్పయ్య, కుడిపక్క ‘మహారాజమాన్య మహారాజశ్రీ మంగమ్మ గారు’ చెంతనే ‘మహారాజశ్రీ విజయరంగ చొక్కనాథులు’ వారి పేర్లు పైన తెలుగులో, క్రిందతమిళంలో చిత్రకారునిచే రాయబడి ఉండటం విశేషం. ఆనాటి పాలకుల ‘రాజభాషగా తెలుగు’ వెలుగులీనుతుందనడానికి ఇవి ఋజువులు.


మీనాక్షి చేతిలో ఉండే రాళ్ళు పొదిగిన చిలుక

**సమర్థవంతమైన పరిపాలన :** విపత్కర పరిస్థితుల్లో మధుర మహారాణి మంగమ్మ తనబుద్ధి బలంతో రాజ్యాన్ని శత్రువుల పరం కాకుండా శాంతిభద్రతలు సుస్థిరంగా ఉండేటట్లు చేసింది. రాజ్య పాలనకు సంబంధించిన ముఖ్య విషయాలలో మంత్రులు, ఉన్నతోద్యోగుల సలహాలు, సూచనలను స్వీకరించేది. రాత్రివేళల్లో వాటి గురించి క్షుణ్ణంగా ఆలోచించి తుది నిర్ణయం తానే తీసుకొనేది. న్యాయం చెప్పే విషయంలో తరతమ అన్న భేదాలు చూపేది కాదు. తప్పు చేసిన తన సోదరుడికి శిక్షవెయ్యడంలో వెనకాడలేదు. అయితే అయినవాళ్ళే శత్రువులైనారు. నీలాపనిందలు వేసి తమలో తాము తృప్తి పడేవారు. స్వార్థపరుల కుయుక్తులు చాలాకాలం మనలేవు.

**సర్వ మతసామరస్యమే మంగమ్మ అభిమతం :** అన్ని మతాలు సర్వసమ్మతమై న్యాయం చేకూర్చిన హైందవ నారీరత్నం! మధుర రాజ్యంలో విభిన్న మతాలవారు నివసించేవారు. మహారాణి మంగమ్మ అన్నీ మతస్థుల వారిని కూడా సముచితంగా ఆదరించారు. తిరునల్వేలి సమీపంలోని గ్రామాలను అన్యమతస్థుల వారికి దానం చేశారు. “ఎవరి మతం వారిది! మతప్రచారకులుగా వచ్చేవారు తమ సిద్ధాంతాలను బలవంతంగా ప్రజలపై రుద్దకూడద”ని మంగమ్మ అనేవారు. మహ్మదీయులకు కొన్ని గ్రామాలను ఇనాములుగా ఇచ్చినారు. మంగమ్మ వేయించిన సుమారు 16 శాసనాలలో 11 శాసనాలు తెలుగులో ఉండటం విశేషం.

మూడు శతాబ్దాలు దాటినా చోళ, పాండ్య నాడులలో ఆమె దానధర్మాలు అజరామరంగా నిలిచి పోయాయి. రాజరిక దశలో అనేక దశల్లో పరిపాలించిన ప్రభువులు మనవాళ్ళు. ప్రజాస్వామ్య సమయంలో ప్రజాప్రతినిధులు మనవాళ్లే! అనాది నుండి దక్షిణాపథంలో మమేకం అయిపోయారు. నేటి తమిళనాడులో గ్రామస్థాయి నుండి పార్లమెంటువరకు ప్రజాప్రతినిధులుగా తెలుగువారు పేరు తెచ్చుకోవడం విశేషం.

**మాతృభాషను మరచి పోవడం అసాధ్యం!**
మన తరం పిల్లలకు మాతృభాషాభిమానం కాస్త తక్కువే అని చెప్పవచ్చు. తమిళ నాట తెలుగువారు మాతృభాషను మరచి పోవడం అసాధ్యం. తమిళ విద్యార్థులతో పాటు భాషకానీ భాషను చదువు తున్నా, చుట్టూ తమిళవారితో కలసి జీవిస్తున్నా, తెలుగు చదవడం, రాయడం రాకపోయినా కూడా మనం తెలుగువారిని పలకరించగానే పులకరిస్తారు. మధురలో ఏ తెలుగువారిని పలకరించినా మధురంగా తెలుగే! తంజావూరులోని ఏ తెలుగువారితో తీయగా మాట్లాడినా తెలుగే! అక్కడి తెలుగువారు నేటికీ అన్నాన్ని అచ్చతెలుగులో 'కూడు' అనడం విశేషం. ఇన్ని వందల ఏళ్ళు గడచిపోయినా అక్కడ స్థిరపడిన తెలుగువారు నేటికీ నాయన, అమ్మ, అవ్వ, కూడు, సంకటి, ఇడ్లీ, చట్నీ, పులుసు, సంగటి (సంకటి) లాంటి పదాలు జలజల జాలు వారుతాయి. తెలుగువారు స్నేహ భావంతో తమిళ ప్రజలతో మమేకం కాగలగడం విశేషం. అక్కడి తెలుగు వారు నేటికీ తమ భాషా సంస్కృతులను ప్రేమిస్తున్నారు. తమ ప్రాచీన వారసత్వాన్ని పదిలంగా నిలుపు కుంటున్నారు. అదే సమయంలో పరాయి భాషనూ, సంస్కృతిని గౌరవిస్తూ, ఉత్కృష్టమైన ద్రావిడ సంస్కృతి పరిరక్షణకు కూడా అంకితభావంతో తమవంతు కృషి చేస్తుండడం విశేషం. అందుకే వారు ఇన్ని వందల సంవత్సరాలుగా అక్కడ సుఖశాంతులతో జీవిస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు.


మధుర మీనాక్షి సుందరేశ్వరుని కళ్యాణ ఘట్టం

డా. సగిలి సుధారాణి
ఫోన్ : 9490428825

## మహారాణి మంగమ్మ (నవల)

*తెలుగు వారికి తమ చరిత్ర అంటే ఆసక్తి తక్కువే. దక్షిణాపథాన తెలుగు రాజులు పరిపాలించిన ప్రాంతాలపై మనకు తెలిసింది తక్కువే అనటం ఆ వాస్తవాన్ని ధృవీకరిస్తుంది. ఈ నేపథ్యంలో రూపాబాయ్ మోతీలాల్ రచించిన మధుర మహారాణి మంగమ్మ వ్రాతప్రతిని సేకరించి పరిష్కరణ చేసి చారిత్రక ఆధారాలు జోడించారు. డా. సగిలి సుధారాణి ప్రముఖ పండితులు డా. శ్రీ రంగాచార్య వారి కృషిని పర్యవేక్షించారు.*

ఇంతకీ ఎవరా మంగమ్మ...



చరిత్ర, సృజన పడుగు పేకల్లా కలగల్సిన నవల మధుర మహారాణి మంగమ్మ (చంద్రగిరి నుండి మధుర దాకా...) మధుర నాయకరాజ్య స్థాపకుడు విశ్వనాథనాయకుడయితే విస్తరింపజేసిన వారు తిరుమలనాయకుడు. వారిలో మహారాణి మంగమ్మ పేరెన్నికగన్నవారు. ఆమె పరిపాలనా కాలంలో జరిగిన ఆయా సంఘటనల్ని కూర్చుతూ, చరిత్రకు ఆధారాలు చేకూరుస్తూ, సృజనాత్మక ప్రతిభని వెల్లడిస్తూ సాగిన ఈ నవల అపూర్వం. సంఘటనల కూర్పులో, పాత్ర చిత్రణలో, పాత్ర స్వభావాన్ని చిత్రించడంలో ఇది చరిత్రా! నవలా! అన్న మీమాంస రాదు. అంత అద్భుతంగా ఉంది నవలా రచన. ఇందులో విజయరంగ చొక్కనాథ నాయకుడు పుదుమండపంలో తనకు కాబోయే భార్యను చూసినపుడు చేసిన రతీమన్మథ విగ్రహాల వర్ణన, ఆ విగ్రహాలే విజయరంగ చొక్కనాథ మీనాక్షి కలయికని చర్చించుకొన్న తీరు కడురమ్యంగా, నవీనంగా ఉంది. చరిత్రను పూరిస్తూ, అపోహలను తొలగిస్తూ, పరిశోధనాత్మకతతో కూర్చిన చారిత్రక నవల మధుర మహారాణి మంగమ్మ

*వెల: 250/- పుటలు : 304, ప్రతుల కోసం -ఎమెస్కో బుక్స్- ఫోను- నెం. 0866-24366643*

*- మిసిమి*

# మొల్ల మహిళా దృక్పథం



కవయిత్రి మొల్ల

– మంగళ గౌరీ

శీర్షిక కొంత ఆశ్చర్యకరంగా అనిపించవ చ్చు. అందుకే మొల్లలో మహిళా దృక్పథాన్ని దర్శించాలంటే సృజనాత్మకతకి సంబంధించిన కొన్ని విషయాలు ప్రస్తావించు కోవాలి. కవులు,రచయితలు, సృజన కారులు ఎవరైనా మౌలికంగా వేర్వేరు వ్యక్తులు. (ఇండివిడ్యుయల్ పర్సన్స్) అందువల్ల ఎవరి దృక్పథం వారికి ఉంటుంది. అది అనివార్యంగా సృజనలో ప్రతిఫలిస్తుంది. అంటే వారి రచనలలో ఆత్మాభి వ్యక్తి తప్పక గోచరిస్తుంది. అందువల్ల ఏ రచననైనా పరిశీలిస్తున్నప్పుడు నాటి సమాజం.. రచయిత/ రచయిత్రి వ్యక్తిత్వం. వారి స్వీయ ఆత్మాభివ్యక్తి.. ఈ మూడింటి సంబంధాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

సర్ ఆర్థర్ కాజ్లర్ సృజనాత్మక ప్రక్రియను వివరిస్తూ' "ద్వి సంసర్గ చింతనం (Bissociative) అనే పదాన్ని వాడారు. అంటే సృజనాత్మక ప్రక్రియలో ఆలోచన ఒకేసారి రెండు స్థాయిలలో జరుగుతుంది. ఫ్రాయిడ్ సైకో ఎనాలిసిస్‌తో సాహితీ విమర్శ కొత్త పుంత తొక్కింది. సృజనాత్మక ప్రక్రియ నూతనార్థాన్ని సంతరించుకుంది. సాహిత్యంలో మనకు కనిపించే మార్మికతను అంతర్దృష్టిని స్వప్న సదృశశీలతను సైకో ఎనాలసిస్ విడమర్చి చెప్పింది. ఒక స్థాయిలో సమస్యను గురించి ఆలోచన నడుస్తూ ఉంటుంది. అదే సమయంలో మరో స్థాయిలో చేతన అచేతనలకు మధ్య మార్గం (సొరంగము) ఏర్పడుతుంది. ఈ రెండు స్థాయిలు ఏకం కావటమే సృజనాత్మకత. ఈ సత్యాన్ని దృష్టిలో ఉంచుకొని మొల్ల రచనను పరిశీలిస్తే... ఆవిడ మహిళా దృక్పథం స్పష్టమవుతుంది.

మొల్ల వైయక్తిక జీవితాన్ని గురించి మనకు అంతగా తెలియదు. అవతారికలో మొల్ల తనని తాను ఆతుకూరి కేశయ వరపుత్రిని అని పేర్కొంది. తండ్రి 'గురులింగ జంగమార్చనపరుడు" అంటూ.. తాను శ్రీ కంఠ మల్లేశు వరము చేత "కవిత్త్వము చెప్పగానేర్చిన దానను" అంది. తండ్రి పేరుని మాత్రమే పేర్కొవటం వల్ల ఆమె అవివాహిత అని తెలుస్తోంది. తన కవిత్వాన్ని గురించి కొంత ఆర్జవంతోనే పలికింది మొల్ల. కవిత్వం ఎలా ఉండాలి అని చెప్పే సమయంలో సమకాలిక పదాడంబరాన్ని సున్నితంగా అయినా కచ్చితంగా ఖండించింది. వినాయకుడి స్తుతిలో తన "ప్రథిత వాక్ప్రౌఢీ"ని పేర్కొంది.. దీనిని బట్టి మొల్ల మానవ సహజమైన భావోద్వేగాలకు అతీతురాలు కాదు అని తెలుస్తుంది. మొల్ల అవతారికలో త్రిమూర్తులను, వినాయకుడిని ప్రస్తుతించిన తర్వాత క్రమంగా పార్వతి, లక్ష్మి, సరస్వతి దేవిలను ప్రశంసించింది. ఆ ప్రశంసలోని తాత్విక అంశాలను పక్కన పెడితే స్త్రీలో సహజంగా ఉండే కొన్ని భావాలు ఈ పద్యాల్లో ప్రతిబింబిస్తున్నాయి.

పార్వతీదేవి జగన్మాత. ఆమెను "జగముల తల్లి" అని పేర్కొంటూనే "కరిముఖుడు కుమారుడు వికారపు చేతలతో ముద్దులు కుడుపుతూ, చిన్నచిన్న గంతులు వేస్తూ, కళ్ళతో శిరస్సు మీద రాస్తూ తల మీద పెట్టిన చంద్ర వంకను తీయటానికి చేతులు వేస్తుంటే, నవ్వుతూ ఆనందిస్తోంది" అని వర్ణిస్తుంది. ఈ వర్ణనలో పిల్లలతో ఆడుకునే సామాన్య ఇల్లాలే కనిపిస్తుంది.

మాతృత్వ భావన స్త్రీ సహజ తత్వం. బాల్యంలో వారితో తల్లి సాన్నిహిత్యం స్పష్టం. పిల్లల వ్యక్తిత్వం రూపుదిద్దుకోవటంలో బాల్యం ప్రధాన పాత్ర వహిస్తుంది. ఆ బాల్యంలో పిల్లలు అధికంగా ఆనందించేది ఆడుకునేది తల్లితోనే..సంతానం విషయంలో స్త్రీ ప్రాధాన్యాన్ని ఈ

పద్యం వెల్లడిస్తోంది. లక్ష్మీదేవి వర్ణనలో "సామజయుగ్మము లక్ష్మీదేవికి పసిడి కుండల నీటితో నిత్యము అభిషేకం చేస్తూ ఉంటుంది"అని చెప్తూనే కాముని తల్లి అనే విశేషణం వాడటం గమనార్హ మైనది. (హర నేత్రాగ్ని సందగ్ధ కామ సంజీవనౌషధీ). అని లలితా సహస్రనామం). శివుడి మూడో కంటితో భస్మం అయిపోయిన మన్మథుడి పాలిట ఔషధమైన తల్లి అని అర్థం. సంతాన పరిరక్షణలో స్త్రీ సామర్థ్యం ఈ వర్ణనలో ఉంది. వ్యాహ్యాళికి వెళ్లి వచ్చే బ్రహ్మకు, మేలిమి మంచుకొండను మించిన హంసను ఎక్కి చిరునవ్వుతో ఎదురు వెళ్లి "వాలిక సోగ కన్నుల నివాళి యొనర్చి" ముదంబు కూర్చిన సరస్వతి దేవిని వర్ణించింది మొల్ల. అలసిపోయిన పురుషుడికి సేద తీర్చి అతడి విజయానికి వెనక వుండే స్త్రీ" కనిపిస్తోంది. బాలకాండలో పరిశీలిస్తే మొల్ల చేసిన పాయస విభజన విలక్షణమైనది. గమనార్హ మైనది. యజ్ఞ పురుషుడు పాయసపాత్రను ఇచ్చిన తర్వాత దశరథుడు ఆ పాయసాన్ని పంచిన విధానం వాల్మీకి రామాయణంలో-పాయసంలో సగభాగం కౌసల్యకి ఇచ్చాడు. 1/2, అందులో సగభాగం 1/4 సుమిత్రకు ఇచ్చాడు. అందులో సగభాగం 1/8 కైకకి ఇచ్చాడు. ఇంకా మిగిలిన1/8 భాగం సుమిత్రకు ఇచ్చేశాడు. కౌసల్యకు 1/2, సుమిత్రకు 1/4+1/8, కైకకి1/8 వారికి పుట్టబోయే సంతానం (రాముడు, లక్ష్మణుడు భరతుడు శత్రుఘ్నుడు, మహత్వానికి అనుగుణంగా ఈ పాయస విభజన జరిగిందని చాలా మంది అభిప్రాయం.

మొల్ల రామాయణం బాలకాండ 65వ పద్యంలో, పాయసాన్ని రెండు భాగాలు చేసి అగ్ర సతులకు ఇచ్చాడని, వారిద్దరూ తమ తమ పాయసాలలోని సగభాగాన్ని సుమిత్రకు ఇచ్చారు అనిమొల్ల (అగ్ర సతులు అంటే పట్ట మనిషి కౌసల్య, ఇష్టసఖి కైక అని అర్థం చేసుకోవాలి )... రామాదుల మహత్వాన్ని అధిగమించి వాల్మీకి చెప్పిన దానికి విరుద్ధంగా మొల్ల చేసిన పాయస విభజన ఆంతర్యం సామాజిక నేపథ్యంలో పరిశీలించి చూస్తే అర్థమవుతుంది. మొల్ల రచన కాలము నాటికి (15శ: ఉత్తరార్ధం). బహుభార్యాత్వం సహజమైపోయింది. భర్తలు చూపించే వివక్షకి ఫలితంగా సవతి పోరు అనేది కూడా సర్వసామాన్యమైపోయింది. పురుషుడు స్త్రీల విషయంలో చూపించే ఈ వివక్షను సూచిస్తూనే, స్త్రీలు పరస్పరం గౌరవించుకోవాలనే భావాన్ని మొల్ల ఈ పాయస విభజనలో సూచించినట్లు తెలుస్తుంది. మొల్ల పాయస విభజనలోని ఈ మహిళా దృక్పథాన్ని గుర్తించే కావచ్చు. 1934లో చేబ్రోలు సరస్వతి దేవి అనే రచయిత్రి తను రచించిన సరస్వతీ రామాయణంలో ఈ విధంగానే పాయసవిభాగం చేశారు. గర్భవతులైన కౌసల్య సుమిత్ర కైకేయిలను మొల్ల రెండు సీస పద్యాలలో వర్ణించింది. అందులో రెండవ పద్యం అమూలకం. మొదటి పద్యంలో **'ధవళాక్షులు'అనే మాటని తథ్యం చేయటానికి కళ్ళు తేట తెల్లగా ఉన్నాయి.**

**'నీల కుంతలలు' అనే మాట నిలుప టానికి కురులు నల్లగా అయ్యాయి**

**గురు కుచలు అనే మాట నిజం అయ్యేటట్టు కుచాలు నీరు పట్టి పెద్దగా అయ్యాయి.**

**మంజుభాషిణులు అనే మాట తప్పకుండా పలుకులు మృదువుగా అయ్యాయి.**

గీత పద్యంలో కామినులు అను మాట కల్ల కాదు అన్నట్లు మేలైన రుచులపై కోరిక పుట్టింది. సవతి పోరు అనే మాట తథ్యం కావించేటట్లుగా ఓకిలింతలు, బెట్టు చిట్టుములు పుట్టేయి. మొదటి పాదాలలో మాతృమూర్తి కాగలగటం స్త్రీల సౌందర్యాన్ని అతిశయింప చేస్తుంది అని ధ్వని.. మాతృమూర్తి అవటమే అసలైన సౌందర్యం. ఆ క్రమంలో తొలిదశలో. 'మేలైన రుచులు కోరుతున్నారు' అని అనటంలో స్త్రీలకు మాత్రమే తెలిసే ఒక నిజం ఉంది. హార్మోనుల మార్పు వల్ల స్త్రీకి ఏమీ రుచించదు. అందువల్ల 'ఇది కాకపోతే అది' అని కోరుకుంటుంది. ఏదైనా నోటికి సహిస్తుందేమో అనే ఆశతో. ఓ కిలింతలు బెట్టు చిట్టుములు.. (వాంతులు వేవిళ్ళు) కూడా గర్భధారణ తొలి దశలో స్త్రీ అనుభవించే దుర్భర దశ.. రెండో పద్యంలో మలి దశను వర్ణిస్తుంది.

తను మధ్యలు అనే మాట తప్పించడానికి నడుములు పొరలు వేసి లావుగా అయ్యాయి

కుచములు బంగారు కుండలు అనే మాటని కాదనిపిస్తూ అగ్రభాగాలు నల్లనయ్యాయి.

చంద్రాస్యలు అనే మాటని కల్ల చేస్తూ ముఖంలో కళలు పలుచనయ్యాయి. సుందరులు అనే మాటలో సందేహం కలిగేటట్టు గర్భభారాల వల్ల కాంతి తగ్గింది.

అని చూసేవారు ఎల్లలు అందరూ ఆనందంగా మాట్లాడుకుంటూ ఉంటే కట్టు చీరల వ్రే కంబు పుట్ట కాంతలకు గర్భాలు కనిపించాయి.

సూక్ష్మంగా పరిశీలించి చూస్తే తల్లి కావటం మాతృత్వం ఈ రెండు. భిన్నమైనవి. మా తృత్వం ఒక భావన. అందమైనది. ఆనందకరమైనది. అమూల్యమైనది. తల్లి కావటం అనేది ఒక శారీరక చర్య. తల్లి కావటంలో ప్రారంభం నుంచి పిల్లల్ని కనే వరకు స్త్రీ ఎంతో ప్రయాస పడుతుంది. నిజానికి అది ప్రతి స్త్రీకి ఒక పునర్జన్మే. వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి పొందిన ఈనాడు కూడా అక్కడక్కడ అయినా ప్రసూతి మరణాలు తప్పడం లేదు. ఆ ప్రయాసను మరిపింప చేయడానికి పితృస్వామ్య సమాజం తల్లి అవటం మాతృత్వం రెండింటినీ ఒకటిగానే చేసేసింది. ఒక బయోలాజికల్ చర్య చుట్టూ అందమైన మిత్ ని కల్పించేసింది. ఈ పద్యంలో "కట్టు చీరల వ్రే కంబు పుట్ట" అనే ఒక్క మాటే స్త్రీ ప్రయాసకు అద్దం పడుతుంది. మొల్ల ఆనాడే గర్భవతిగా స్త్రీ పొందే కష్టాన్ని స్పష్టంగానే గుర్తించింది. ఆనాటి చారిత్రక నేపథ్యంలో ఒక స్త్రీ ఈ మాటలు మాట్లాడటం (ఈనాటికీ కొంత వరకు) కుదరదు. ఒక స్త్రీగా ఈ అంశాన్ని చెప్పకుండాను ఉండలేదు. అవాల్మీకంగా గర్భవతులైన కౌసల్య సుమిత్ర కైకలను వర్ణించి స్త్రీ ఔన్నత్యాన్ని ధ్వన్యాత్మకంగా చెప్పింది.

అహల్య శాపవృత్తాంతంలో విశ్వామిత్రుడి మాటలలో "ఈ భామిని రాయి మున్ను " అని ఆమె పూర్వ స్థితిని సూచనప్రాయంగా చెప్పి. రాయి స్త్రీగా మారటాన్ని "పదనై ఒప్పిదమై" రసవంతమై, అందంగా, కడుకదలుచు, బంగారు పూస కదలినట్లుగా లావణ్య స్థితిలో సురుచిర లీల సుదతిగా కన్పట్టె" అంటూ ఆమె పునర్జీవితురాలు అయిన తీరుని వర్ణించింది.

ఈ పద్యంలో ఆమె పునర్జీవితురాలు కావటమే మహిమాన్వితమైనదనే సూచన ఉంది. ఆమె సౌందర్యం చైతన్యం ఈ పద్యంలో సూచితాలు.

(బ్రాహ్మణేతర), స్త్రీ కావ్య రచన చేయుటవే అతిశయమైన ఆ రోజులలో, కావ్యరచన చేయుటం మాత్రమే కాకుండా ఇంత స్పష్టంగా మహిళా దృక్పథాన్ని కనపరిచిన మొల్ల ధన్య.

మంగళ గౌరి
ఫోన్ : 9177161811

## కమ్మతెమ్మెరలు

ప్రతినెలా మా ఇంటి తలుపులు తట్టే ***మిసిమి*** గోరువంక ఈరోజు కూడా డిసెంబర్‌లో తలుపు తట్టింది. పత్రిక చేతిలో పడగానే ***మిసిమి*** సంపాదకీయం చూడటం నాకలవాటు. ఈసారి ఎడిటోరియల్ చదివాక నాలో కలిగిన ఉత్సాహాన్ని మీతో పంచుకుంటాను. ***మిసిమి*** ఎడిటోరియల్‌లో నవ్యత, చైతన్యంతో జావగారే జీవికి చేవ కనిపిస్తాయి. అందుకే ప్రతినెలా ఎదురుచూస్తుంటాం. ఈసారి ఎడిటోరియల్‌లో మెట్రో రైలులో వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. వారిని విచిత్రంగా వర్గీకరించారు. ఇందులో చెప్పినట్లు రవీంద్రభారతిలోనో, త్యాగరాజ గానసభలో ఒక కార్యక్రమంలో పాల్గొని తరువాత రోజు పేపర్‌లో తాము పాల్గొన్న ఫంక్షన్ వార్త వెతికే వాళ్ళెందరో ఉంటారు. మిగిలిన వార్తలతో వారికి సంబంధం లేదు. ప్రస్తుతం సమాజం తీరిది. చింతనాత్మక సాహిత్యం చదవాలంటే ఒళ్లు నొప్పులుగా ఉన్న రోజులివి. ఇలా ***మిసిమి*** సంపాదకీయాలు అక్షర గవాక్షం మీద నిలబడి సత్యాలను విసురుతుంటే సమాధానం చెప్పుకోలేక ఇలా బయటపడుతోంది అంతరంగం ఈ పచ్చివాస్తవాలకు. పన్నెండు నెలల నుంచి ***మిసిమి*** పంచిన ఆప్యాయత చివర్లో ఒక మహాప్రసాదంగా ఈ ఎడిటోరియల్ మాకందించింది. మేం ఋణగ్రస్తులమైపోయాం. ఆనందమయ జీవితానికి ***మిసిమి***లోని ప్రతి అక్షరం దారి చూపిస్తోందంటే అసత్యం కాదు.




**– కోన రమణారావు, చీరాల**

# బోయి భీమన్న

– కొలకలూరి మధుజ్యోతి



పద్మభూషణ్ బోయి భీమన్న

**I.** కళా ప్రపూర్ణ బోయి భీమన్న విశిష్ట సాహితీ స్రష్ట. సమాజం దళిత సాహిత్య మూర్తిగా వీరిని గుర్తిస్తుంది. కాని తాను వీటికి అతీతంగా భావించారు, నిలిచారు. తాను హిందువునని, ఆర్షమతం ప్రతిపాదిత హిందూ సమాజ సభ్యుడినని నమ్మే వ్యక్తి బోయి భీమన్న. వీరి సాహిత్యం ఆ విశ్వాస ప్రతిఫలనమే. కాశీ విద్యాపీఠం, నాగార్జున విశ్వవిద్యాలయం, గౌరవ డాక్టరేట్ తో వీరిని సన్మానించాయి. 1975లో 'గుడిసెలు కాలిపోతున్నై' రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని, 1973లో పద్మశ్రీని, 2000లో పద్మభూషణ్ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం నుంచి పొందిన విశేషజ్ఞత వీరిది.

'పాలేరు, కూలి రాజు, పంచమస్వరం, అకాండతాండవం, రాగ వైశాఖి, జన్మాంతర వైరం, రాగ వాశిష్టం, మోక్షం నా జన్మహక్కు, బాలయోగీయం, అంబేద్కర్' వంటి 70కి పైగా రచనలు చేసిన డా.బోయి భీమన్న జీవిత చరిత్రను 'పాలేరు నుంచి పద్మశ్రీ' అని వరకు వారి శ్రీమతి హైమావతి రాసి అందించారు. వీరి సాహిత్యం హరిజన ఉద్ధరణ, వెతల విముక్తి గురించి ఉండడం ఎంత ప్రముఖంగా ఉందో, ఈ సమాజ మూలాల అన్వేషణ, తాను ఏ మూలాలు ప్రధానమైనవిగా భావించారో వాటిని ప్రకటించటం అంతే ముఖ్యంగా ప్రముఖంగా కనిపిస్తూ ఉన్నాయి. విశేషంగా ఇతిహాస పురాణాలను వేదోపనిషత్తులను, చరిత్రలను చదువుకొన్న వ్యక్తి. అలౌకిక ఆధ్యాత్మిక దృష్టి ఉంది.

**II.** 94 ఏళ్ళ జీవిత గమనంలో జాతీయోద్యమ తీవ్రతను, స్వాతంత్ర్య సముపార్జనను, స్వాతంత్ర్యోత్సాహాన్ని, ప్రజాస్వామ్య పాలనను, కమ్యూనిజం ప్రభావాన్ని చూశారు. రాజకీయార్థిక సామాజిక రంగాల పరిణామాన్ని గుర్తిస్తూ సాగారు. నిరంతర జ్వలిత చైతన్యంగా ఉన్న డా.బోయి భీమన్న, సమాజంలోని అంతరాల వల్ల కలుగుతున్న వికర్షణలకు సంఘర్షించారు. ఆ సంఘర్షణ సాహిత్యంలో విభిన్న సిద్ధాంతాల ప్రతిపాదనకు కారణం అయ్యింది. తన రచనల్లో ఎన్నో ప్రతిపాదనలు చేశారు. మరెన్నో ఊహ ప్రతిపాదనలు చేశారు. ఈ ఊహ ప్రతిపాదనలు అంగీకారమో కాదో ఆ తర్వాత ఎవరూ బలపరచలేదు నిరాకరించలేదు అసలు చర్చించినట్టు లేదు. ఎన్నో ఆలోచనలు నిరంతరం మధనానికి గురవుతున్న క్రమంలో అనేక వైరుధ్యాలు వారి రచనల్లో కనిపిస్తాయి.

**1.రసాద్వైతం:** వారు చేసిన ప్రతిపాదనలలో రసాద్వైతం ఒకటి. రెండుగా లేనిది అద్వైతం అంటే ఏకత్వం. స్త్రీపురుష ఏకత్వం. విశేషమైన పరమాత్మ శక్తి నుంచి ప్రకృతి పురుషుడు ఏర్పడ్డారు అనే భావాన్ని విశ్వసించారు. ఆ శక్తి నుంచే స్త్రీ పురుషులు ఏర్పడ్డారు. వారి కలయికే అద్వైతం. అది కేవలం శారీరకం కాదు ఆత్మైక్యత అన్నారు ఏక హృదయ సంసిద్ధే రసాద్వైతం అన్నారు. ఈ (స్త్రీ శక్తి, పురుష శక్తి)శక్తులు పరస్పరాకర్షణతో ఆనందంతో కలిసి కరిగిపోయి తిరిగి మూల చైతన్యంలో, మూల శక్తిలో అంటే పరమాత్మలో కలిసిపోతారు. ఈ ఆత్మైక్యతనే రసాద్వైతంగా పేర్కొన్నారు. దీనిని బలంగా ప్రతిపాదించారు. ప్రతిఫలాపేక్ష లేని ప్రేమను ప్రతిపాదించారు. 'రాగవైశాఖి' లేఖా కావ్యం. ఇది రసాద్వైత స్థితిని చాటే రచన. స్త్రీని గౌరవించే బోయ భీమన్న చాలా సందర్భాలలో దీనిని చాటారు.

**2. శివ సోషలిజం :** బోయ భీమన్న స్వాతంత్ర్య పోరాట కాలంలో జీవించిన వ్యక్తి. సమకాలీన ప్రభావాలు తనపై ఎక్కువే. గాంధీ ప్రభావమూ, కాంగ్రెస్ స్వభావమూ ఆ నేపథ్యం నుంచి వచ్చిన సర్వోదయ భావమూ బోయి భీమన్న పై ఉన్నాయి. ఈ సర్వోదయ భావమే శివ సోషలిజం. తనలో రాజకీయ ఇష్టాన్ని గాంధీ సర్వోదయ భావాలు కలిగించాయి. వీరికి రాజకీయాలు ఇష్టమే. 1952లో ఎన్నికల్లో పోటీ కూడా చేశారు. అర్ధనారీశ్వర తత్త్వం శివసోషలిజం తత్త్వానికి ప్రేరణ. ఈ తత్త్వాన్ని విశేషంగా ఇష్టపడిన భోయి భీమన్న, ప్రచారార్థం దీనికి అనుసంధానంగా 'భీమసేన'ను కూడా స్థాపించారు. సమాజం ప్రగతి పథం వైపుకు పయానించాలంటే శివసోషలిజం అవసరం అంటారు. 'మోక్షం నా జన్మ హక్కు'లో ఈ ప్రతిఫలనాలు బలంగా కనిపిస్తాయి.

**3. తిరుగుబాటు :** బోయి భీమన్న సమత లేని సమాజంలో, దానిని నడిపిస్తున్న అనేక విషయాల పట్ల వ్యతిరేకతను చూపారు. తిరుగుబాటు చేశారు. కర్మ సిద్ధాంతం పట్ల వర్ణ వ్యవస్థ పట్ల తిరుగుబాటు చేయడమే కాదు దేవుడు లేడన్నారు. ఉన్నది పరమాత్మ మాత్రమేనని ప్రకటించారు. ఈ సమాజంలో నెలకొని ఉన్నది మతం నిర్దేశిస్తున్న వర్ణ వ్యవస్థా కాదు, ఆధునిక కాలంలో ప్రభంజనంలా వచ్చిపడ్డ కమ్యూనిస్టులు పేర్కొనే వర్గ వ్యవస్థా కాదు, అది వన్య వ్యవస్థ అంటారు. ఇది ప్రతిపాదన. బలం ఉన్నవాడిని పులిగా, తెలివి ఉన్నవాడిని నక్కగా, వారిని విశ్వసించి వారికి బలైయిపోతున్న బడుగు అమాయక జీవులను మూర్ఖులను గొర్రెలుగా 'గుడిసెలు కాలిపోతున్నై'లో పేర్కొన్నారు. ఈ పోలికలు ఎప్పుడూ ఉన్నాయి. బోయి భీమన్న దీనిని ఒక వ్యవస్థగా స్థిరీకరించి గుర్తింప చేసే ప్రయత్నం చేశారు.

ఈ తిరుగుబాటు స్థిరీకృత వ్యవస్థలు, ఆలోచనల మీదే కాదు, సమకాలీన విషయాల పట్ల కూడా ఉంది. ఎన్నికలలో పోటీ చేసిన అనుభవం ఉన్న బోయి భీమన్న, ఎన్నికల నిర్వహణ తీరు పట్ల కూడా తిరుగుబాటు సరళిని వ్యక్తం చేశారు. యుపిఎస్సీ ఎన్నిక విధానంలా ఆభ్యర్థుల ఎంపిక ఉండాలని, అభ్యర్థికి ఏమాత్రం ఖర్చు ఉండకూడదు, ఖర్చు అంతా ఎలక్షన్ కమిషన్ భరించాలి అని అన్నారు. అంతేకాదు 10% కంటే తక్కువ ఓట్లు పడిన అభ్యర్థికి కఠిన శిక్ష వేయాలని కూడా ప్రతిపాదించారు.

**4. కర్మ సిద్ధాంతం :** బోయి భీమన్న కర్మ సిద్ధాంతాన్ని అంగీకరించారు. ఈ జన్మలో చేసిన కర్మ ఫలితం ఈ జన్మదే అంటారు. మరణానంతరం ఆత్మ అనంతమైన పరమాత్మలో లీనం అవుతుంది దానికి ఇక ప్రత్యేక అస్తిత్వం ఉండదు. ఈ జన్మలోని కర్మకు తరువాతి జన్మలో ఫలితం అనుభవించటమనే అంశే తల ఎత్తదు అంటారు. తర్వాత జన్మ కొత్తదే తప్ప పూర్వజన్మ ప్రభావం దానిపై ఉండదు, గత వ్యక్తిత్వాల సంబంధమూ ఉండదు. ప్రతి జన్మా నూతన సృష్టే అంటారు. దీని గురించి 'జన్మాంతర వైరం'లో ఎంతో చర్చ చేశారు. పాపం చేస్తే నరకం ప్రాప్తిస్తుందంటారు. పాపం చేస్తే మళ్లీ జన్మలో దుఃఖం తప్పదు అంటారు. ఈ రెండూ కర్మ సిద్ధాంతానుగుణంగా చెప్పేవే. బోయి భీమన్న ఒక్క నేరానికి రెండు శిక్షలు ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. నేడు ప్రజలు విశ్వసించే కర్మ సిద్ధాంతం, రాజకీయ, ఆర్థిక, సాంఘిక ప్రయోజనాల కోసం పరిపాలకులు, పన్నిన వ్యూహం అంటారు. తమ ప్రయోజనాల కోసం జనం మెదళ్ళల్లో చొప్పించిన తీరు అని పేర్కొన్నారు. కుల వివక్షతో కుంగ తీసే కొద్ది మనిషి కర్మ సిద్ధాంతం ఊబిలో కూరుకు పోతారు అంటూ 'పిల్లీ శతకంలో' అంటారు. కులం కర్మ సిద్ధాంతాల మధ్య ఉన్న అవిభాజ్య బంధాన్ని స్పష్టపరిచారు.

**5. ఆర్ష ధర్మం :** ఆర్ష ధర్మాన్ని సమాజం సరిగా అర్థం చేసుకోలేదనే బాధ బోయి భీమన్నది. హిందూ ఆర్ష మతాన్ని వైజ్ఞానిక మతం అన్నారు. ఆర్షధర్మం ప్రకారం కర్మ అంటే పని. కర్మ పనికి, పుట్టిన కులానికి సంబంధం లేదు. అర్షధర్మం చెప్పే వర్ణ వ్యవస్థ వేరు, ఆచరణలో ఉన్న వర్ణ వ్యవస్థ వేరు అంటారు. వర్ణాలు, ఆశ్రమ ధర్మాలు, పురుషార్థాలు, జీవిత గమనాలు పరస్పర అనుసంధాలని పేర్కొన్నారు. ఆర్ష జీవన ధర్మ ప్రణాళికగా దీనిని పేర్కొన్నారు. ఆర్షధర్మం మూడు సూత్రాలది. కాని గీత కాలం నాటికీ అది 4 సూత్రాలు కలిగినది అయ్యింది. నాలుగు వర్ణాలు, నాలుగు ధర్మాలు, నాలుగు పురుషార్థాలు, నాలుగు సాధనాలు(సామ దాన భేద దండోపాయాలు) ప్రధాన భేదాలు.

| | | | |
|---|---|---|---|
| బాల్యం, | బ్రహ్మచర్యం, | ధర్మం, | శూద్ర |
| యవ్వనం, | గార్హస్థ్యం, | అర్థం, | వైశ్య |
| కౌమారం, | విజయం, | కామం, | క్షత్రియ |
| వృద్ధాప్యం, | సన్యాసం/ వానప్రస్థం, | మోక్షం. | బ్రాహ్మణ. |

జీవితంలోని దశలు క్రమంగా ధర్మార్థ కామ మోక్షాలని, వాటికే శూద్రాది పేర్లు పెట్టారని అంటారు. ఆయా స్థితులలో ఆయా ధర్మాలతో జీవితం సాగుతుందే తప్ప, పుట్టిన కులంతో ఏ సంబంధమూ ఉండదు అంటారు. వ్యక్తి తాను పొందిన అర్హత ప్రకారం కులం మార్చుకోవచ్చని పేర్కొన్నారు. వేదకాలం నాటి ఆర్షధర్మం ఆపై కాలాలలో అదుపు తప్పింది అని భావించారు. అందుకే భోయి భీమన్న గో బ్యాక్ టు వేదాస్ అన్నారు. 'జన్మాంతర వైరం'లో దీనిని గురించి చాలా చర్చించారు. హిందూ ధర్మం పట్ల అనన్య మక్కువ కలిగిన బోయి భీమన్న అందులోని వివక్షను అంగీకరించలేదు. ఎవరు ఏ పనైనా చేయవచ్చు అనే దానిని ఆర్షధర్మానుగుణంగా ప్రకటించారు.

**6. ఆర్య అనార్య చరిత్ర :** ఆర్య ద్రావిడుల గురించి వివిధ చరిత్రలను అధ్యయనం చేసిన నేపథ్యం నుంచి నూతన ప్రతిపాదనలు చేశారు. చారిత్రకంగా ఉన్న సిరియన్లు అసిరియన్లు ఇతిహాసాలలోని సురులు, అసురులు అంటారు. వీరికి తండ్రి కాస్పియన్ సముద్రపు వాడైన కశ్యపుడిని పేర్కొన్నారు. అతడి పేరు మీదే ఆ నది ఉంది అని చారిత్రకాంశాన్ని పేర్కొన్నారు. ఈ దేశానికి మొదట ఆస్సిరియన్లు ఆ తర్వాత సిరియన్లు వచ్చారు. ఆర్యులంతా భారతదేశానికి ఉత్తర ప్రాంతం నుంచి వచ్చిన వారే. ఆర్యులు క్రమంగా ఈ దేశంలో స్థిరపడ్డారు. ముందు వచ్చిన ఆర్యులు దక్షిణ పథానికి ప్రయాణించి స్థిరపడ్డారు. వారే ద్రావిడులు. తరువాత వచ్చిన ఆర్యులు ఉత్తరాదిలో ఉండిపోయారు అన్నారు. ఆపస్తంభుడి వల్ల దక్షిణంలో వర్ణ వ్యవస్థ ఏర్పడింది అన్నారు. వీరి దృష్టిలో హరిజనులు అంతా ఆర్యులే. సహజ ధర్మమూ చారిత్రక సత్యమూ పెడదారి పట్టినప్పుడు వాటిని పునరుద్ధరించటవే సాంస్కృతిక విప్లవం (జన్మాంతర వైరం) అనే భోయి భీమన్న తామెవరో హరిజనులకు, వారిని వేధిస్తున్న వారికి తెలియదు. భారతీయ సంస్కృతికి తామే మూల పురుషులని హరిజనులకూ తెలియదని బాధ పడ్డారు. నిజానికి ఈ దేశానికి విశేష ఇతిహాసాలైన భారత రామాయణాలను ఇచ్చినవారు హరిజనులే అంటారు. కశ్యపుడు, ధర్మవ్యాధుడు, వాల్మీకి, వ్యాసుడు అందరూ దళితులే. ఈ దేశానికి సంస్కారం అలవర్చింది వీరే అంటారు. 'రాగవాశిష్ఠం'లో దీని గురించి ఎంతో చర్చ చేశారు.

**III ముగింపు :** బోయి భీమన్న ఎంతో విశిష్ట వ్యక్తి. విశేషమైన ఆలోచనాపరులు. విశేష సాహిత్య కృషి చేసిన వారు. సమాజం పట్ల బాధ్యత ఉన్నవారు. దళిత స్థితిగతుల పట్ల వేదన, వారి అభివృద్ధి పట్ల ఆకాంక్ష ఉన్నవారు. ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా నిలబడి, పరికించి, అవగాహన చేసుకొని, తనదైన ఆలోచనతో సాగిన వ్యక్తి. గాంధీ, అంబేద్కర్ ఆలోచనల ప్రభావం ఉన్నా, తన ధోరణితో వాటిని మమేకం చేసుకొన్న వారు బోయి భీమన్న. వారు ఏర్పరిచిన మార్గాలు కొన్ని వినూత్నం. వాటిని సమాజం స్వీకరించి బలపరిచి స్థిరీకరించాల్సి ఉంది. ఏది ఎలా ఉన్నా బోయి భీమన్న సాహిత్య లోకంలో, దళిత సాహిత్య ప్రపంచంలో చెరగని ముద్ర వేశారు, ఆత్మ స్థయిర్యం నింపే మార్గదర్శకులు అయ్యారు.


ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
(పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం)
తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి




## కమ్మతెమ్మెరలు

*మిసిమి డిసెంబర్ 2024 పత్రిక ఆనందంతో అందుకోవటం ఎప్పటిలాగే నాకు ఆనవాయితీ. ధన్యవాదాలు. మీ సూచికను త్రికరణశుద్ధిగా అనుసరించి చదువుతాను. మీ "మెయిన్ లైన్" "ఆనందమయ జీవితానికి" సంచిక ప్రారంభ రచనలు కావడంతో ఆత్రంగా చదివి తృప్తి చెందాను. "ఆనందమయ జీవితానికి" మీరు ప్రతిపాదించిన సూత్రాలు పచ్చి నిజాలు, పూర్తి అనుసరణీయాలు. మిసిమి మేధను చైతన్య స్థితిలో ఎప్పుడూ ఉంచుతుంది. అందుకే మిసిమికి సదా ఋణపడి ఉంటాను. శుభాకాంక్షలతో*

**– రాయవరపు సత్యనారాయణ, కాకినాడ**



రావూరి భరద్వాజ

# రావూరి భరద్వాజ భావుకత

– తలారి వాసు,

**నా**కింకా చిన్నతనం రాకముందే నేను నా చిన్నతనాన్ని చెరువు కట్టల మీద, పొలాల గట్ల మీద, చెట్ల మీద, దేవాలయాల మెట్ల మీద పారేసుకున్నాను. నాకు ఇంకా యవ్వనం రాకముందే నా యవ్వనాన్ని అంతులేని ఆకలి మీద, అనంతమైన దరిద్రం మీద, అసంఖ్యాకమైన అవమానాలు మీద, అజ్ఞానం మీద ఆరేసుకున్నాను. నేను ఇప్పుడు పాడడం మరిచిపోయిన మధుర గాయకుణ్ని. నా గుండె గదినిండా అద్భుతమైన పాటల దొంతరలున్నాయి. గొంతు విప్పితే విషాద భరితమైన ధ్వనులు తప్ప ఇంకేమీ రావడం లేదు... అంతరంగిణిలో భరద్వాజ గారు రాసుకున్న మాటలివి. ఆయన మొత్తం జీవితం ఈ మాటల్లో ఇమిడి ఉంది. బాల్యంలో పరమ దారిద్ర్యాన్ని అనుభవించారు. పశువుల కాపరిగా, కూలీగా, కార్మికునిగా జీవితం గడిపారు. తిండి లేక ఆకలితో నకనకలాడిపోయారు. ఆయన వ్యధాభరిత జీవితం ఆయన రచనల్లో కనిపిస్తుంది. రచయితగా తాను తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో భాగంగా "ఇంచుమించుగా శ్రీశ్రీ లాగానే ఇంతకాలంగా అక్షరాలకు, జీవితాలకు అతుకులు పెడుతున్నాను. జీవితాన్ని అక్షరాలలోనికి ఆహ్వానిస్తున్నానని" అంటూ ఇంకా కొంచెం ముందుకెళ్లి జీవితం అంకెల్లోకి ఇరుక్కుపోయిందన్న సత్యాన్ని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నానంటారు. "అన్నింటికన్నా మించి పాఠశాల జీవితం, అందరికన్నా మంచి ఉపాధ్యాయుడు "ఆకలి" అనే సందేశాన్నిచ్చిన మాక్సిం గోర్కి మాటలూ, ఆకలి మహా విప్లవాలను సృష్టిస్తుంది. ఆ విప్లవాలను ఆయుధాలు కానీ, సైనికులు కానీ అణచడం అసంభవం. ఆకలి లేకుండా చేయటం ఒక్కటే దానికి మంచి మందు" అని రూసో సన్నిహితుడైన మార్కిస్ గిరాడిన్ విసిరిన ఈటెలు భరద్వాజ గారి రచనా వ్యాసంగానికి ప్రధాన ఆధారాలైనాయి. ఈ నేపథ్యంలోంచే భరద్వాజ గారి రచనలు వచ్చాయి. అందుకే వారి రచనల్లో భావుకత, ఆవేశం, ఆర్ద్రత, దుఃఖం ప్రతి వాక్యంలో దర్శనమిస్తాయి. ముతక ఖద్దరు పంచె, చొక్కా భరద్వాజ గారి దుస్తులు. గెడ్డం, జుట్టుతోనే ఉండేవారు. ఆయన జీవితంలో ఆడంబరాలు లేవు. ఆభిజాత్యాలూ లేవు. నిరాడంబరమైన జీవితం.

తన జీవనయానంలో తనకు సహకరించిన ప్రతి వ్యక్తి పట్ల కృతజ్ఞతాభావం కలిగినవారు భరద్వాజ. "రవ్వలు" శీర్షికన రాసిన వాటిలో ఒకచోట "నేను దాహంతో ఆవురావురుమంటునప్పుడు నా దప్పికను తీర్చినవారు, నేను ఆకలితో నకనకలాడుతున్నప్పుడు నాకు ముద్ద అన్నం పెట్టిన వారు, నేను ఏకవస్త్ర ధారినైనప్పుడు నాకు వస్త్రాన్ని దానమిచ్చినవారు, నేను అవమాన భారంతో ఆవటిల్లిపోతున్నప్పుడు నన్ను ఓదార్చిన వారు, నేను నిరాశతో కునారిల్లిపోతున్నప్పుడు నన్ను ఉత్సాహపరిచిన వారు, నా కన్నీరు తుడిచినవారు నాకు దైవ సమానులు" అంటారు. ఒకప్పుడు తిండిలేక రోడ్డు మీద పడిపోయిన భరద్వాజ గారిని పద్దక్క అనే హరిజన స్త్రీ సేదతీర్చి అన్నం పెట్టింది. గుడిసెలోనికి తీసుకొని వెళ్లి ఆమె కొడుక్కి, భరద్వాజ గారికి కలసి భోజనం పెట్టింది. ఈయన శాకాహారినని చెప్పడంతో ఇంటిలో మరొకటి ఏదీ లేకపోవడంతో కుమిలిపోయింది. ఆయనకు అనుకూలమైన భోజనం పెట్టలేకపోయానని ఆవేదన పడింది. ఆమె పట్ల గౌరవంతో ఆయన తన పెద్ద కుమార్తెకి పద్మావతి అని

పేరు పెట్టారు. తనకు చాలా సందర్భాల్లో సహకరించిన వ్యక్తి శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ (**మిసిమి** పత్రిక వ్యవస్థాపకులు). పెద్ద కుమారునికి రవీంద్రనాథ్ అని పేరు పెట్టారు. రేడియో స్టేషన్ లో ఉద్యోగం ఇచ్చి ఆదుకున్నది త్రిపురనేని గోపీచంద్. రెండవ కుమారునికి గోపీచంద్ అని పేరు పెట్టారు. ఆలపాటి వెంకటరామయ్య, తండ్రి పేరు కోటయ్య కలిపి నాలుగో కుమారునికి వెంకట కోటేశ్వరరావు అని పేరు పెట్టారు. భరద్వాజ గారి కృతజ్ఞతకు ఇంతకన్నా మరో ఉదాహరణ ఏం కావాలి. ప్రతి వ్యక్తిని చిన్న పిల్లవాడు దగ్గర నుండి పెద్దవారి వరకు భరద్వాజ గారు చాలా గౌరవించేవారు. "బాబుగారు" అని సంబోధించేవారు. భార్య కాంతమ్మ గారి పట్ల విపరీతమైన అభిమానం. వంటి నిండా నగలతో వచ్చిన ఆమె నిరస్త భూషయై ఆయన పక్కన నిలిచింది. భార్యను ''కన్నా'' అని పిలవడం అలవాటు ఆయనకు. ఆమె మరణం భరద్వాజ గారిని ఒంటరిని చేసింది. తెరలు తెరలుగా ఆయన దుఃఖం లోంచి వచ్చిన రచనలన్నింటిలో మనకు కాంతమ్మ గారే కనిపిస్తారు.

పశ్చిమగోదావరి నరసాపురంలో "తెలుగు వెలుగు" కార్యక్రమానికి ఆయన వచ్చినప్పుడు (1997) సాహిత్య రంగం అనుభవాలు, జ్ఞాపకాలు అంశంపై మాట్లాడారు. ఉపన్యాసం మధ్యలో కాంతమ్మ గారి జ్ఞాపకాలతో ఉద్వేగానికి గురయ్యారు. ఆ సభకు వచ్చినప్పుడే ఆయన ఉండటానికి గెస్ట్ హౌస్, భోజనాలు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వాహకులైన అరిపిరాల నారాయణరావుగారితో "బాబుగారు! మీ ఇంట్లో గుప్పెడు చారు మెతుకులు పెట్టగలరా, అది నాకు చాలు!" అన్నారాయన. అలా నిరాడంబరంగా జీవించటం భరద్వాజ గారికి ఇష్టం. ప్రతిరోజు ఉదయం కాంతమ్మ గారి సమాధి దగ్గరకు వెళ్లి కూర్చొని రావడం ఆయనకు అలవాటు. ఆమె గురించి రాస్తున్న అంశాల్లో ఒకచోట "కన్నా! నీ సమాధి ప్రక్కన చిన్న మర్రి చెట్టునై పెరిగి ఎండా, వానా పడకుండా నిన్ను చూసుకుంటాను. ఊడల చేతులతో నీ సమాధిని నిమురుతుంటాను'' అంటారు. చాలా విశ్వవిద్యాలయాల్లో కాంతమ్మ గారి పేరుతో పురస్కారాన్ని నెలకొల్పారు. హైదరాబాదులో కూడా ప్రతి సంవత్సరం ఒక పురస్కారాన్ని కాంతమ్మ గారి పేరు మీద ఇచ్చేవారు. తనకు లభించిన ధనాన్ని అలా ఇవ్వటం ఆయనకు అలవాటు. ఎప్పుడూ ఎవరిని ఆశించి జీవించిన మనిషి కాదాయన.

"జీవన సమరం" పుస్తకంలో ఉన్నట్లుగా వేశ్య ఒకామె రోడ్డు ప్రక్కన చాలా దీనస్థితిలో ఉంది. ఆమెను కూతురిలా భావించి హైదరాబాద్ తీసుకుని వచ్చి కుట్టుపని నేర్పించి టైలరింగ్ షాప్ పెట్టించారు. ఇప్పుడు ఆవిడను చూపించగలరా? అని అడిగినప్పుడు "ఆమె జీవితానికి ఆటంకం కలిగించే పని ఏది నేను చెయ్యను. కాబట్టి ఆమెను నేను చూపించను. అది నేను ఆమెకి ఇచ్చిన వాగ్దానం" అన్నారు. ఇలా ఎందరో అణగారిన జీవితాలకు దిక్సూచి, ఆలంబన కల్పించారు. ఎంత అడిగినా పాకుడురాళ్ళు నవలలో కథానాయిక పేరు మాత్రం ఎవరికీ చెప్పలేదు. ఆయన డైరీలో ఉంది కానీ ఆ డైరీని ఎవరికీ చూపించలేదు. చిన్నతనంలో మేనమామ ఇంటిదగ్గర స్నానం చేస్తున్నప్పుడు సబ్బు అడిగారు. దానికి మేనమామ "నీకు సబ్బు కావలసి వచ్చిందా" అన్నారట. నాటి నుంచి జీవితాంతం ఆయన సబ్బు వాడలేదు. అది ఆయన కోపమో, ఇంక నా జీవితానికి సబ్బు అవసరం ఏముందిలే అనుకున్నారేమో! ఇది చాలా విచిత్రం. అరిపిరాల వారు భరద్వాజ గారి ఇంటికి వెళ్లినప్పుడు ఫోన్లో ఆటో అతనికి అడ్రస్ కష్టమవుతుంది నేను రోడ్డు మీద నిలబడి ఉంటానని అన్నారట. ఆయన అలాగే చేశారట కూడా. పైగా "మీరు మా ఇంటికి వచ్చారు. నేనేమీ ఇచ్చుకోలేను" అన్నారట. గొప్ప సాహితీ తపస్విగా ఎదిగిన భరద్వాజ గారి వెనుక ఎలాంటి బాధామయగాథలు, అశ్రుతప్త చరిత్రలు దాగి ఉన్నాయో తెలుసుకోవటం వల్ల ఆయన రచనల్లోని భావుకత, ఆర్ద్రత, స్వారస్యం మరింత సమగ్రంగా, సాంద్రంగా అవగాహన చేసుకోగలం.

కవి తన రచన ద్వారా మానవ జీవన చిత్రం చేస్తాడు అంటారు ఆర్నాల్డ్. రచనా వ్యాసంగంగల భావుకులు అప్పుడప్పుడు తమకు తట్టిన భావాల్ని దగ్గరున్న పుస్తకం మీదనో, డైరీలోనో ఎప్పటికప్పుడు రాసి పదులపరుచుకుని, అవసరమైనప్పుడు రచనా వ్యాసంగంలో తగిన చోట దానిని అతుకుతుంటారు. డైరీ వ్యక్తికి ఏకాంత మందిరం. తన మదిలో మెదిలే భావాలు, తన జీవితానికి చెందిన సన్నివేశాలు, జయాపజయాలు, అనుభవాలు సామాజికంగా నెలకొని ఉన్న అన్యాయాలు, అక్రమాలు అన్నింటికీ సతీస్మృతితో పాటు తన డైరీలో పొందుపరిచి "ఆ డైరీని మీరు కూడా చదవండి. నా జీవితంలో దాచుకోవలసినవి ఏవీ లేవు. నాది ఓపెన్ బుక్" అంటూ మన ముందుంచారు. సతీ వియోగ సంజనిత దుఃఖాగ్నిలో కాలిపోతూ కాంతమ్మ

గారికి అమృతత్వాన్ని కలిగించే ప్రయత్నంలో తన డైరీలన్నింటిని కావ్యాలుగా మన ముందుంచారు. వాటన్నిటిలోనూ సుకుమారమైన మార్మిక కవిత్వం పసిడిరెక్కలు విప్పి భావనాకాశంలో పరుగులు తీసింది. అన్నిటిలో ఆర్తి, ఆర్ద్రత, కరుణ, ఒక నివేదన అనర్గళ ధారా సదృశంగా ప్రవహించాయి. హృదయం నుంచి ఎగదన్నుకు వచ్చే కన్నీటి బిందువులకు బరువైన భావాలను మొలిపించే శక్తి, పలకరించే రక్తి ఉండి తీరుతుంది. అందుకనే భరద్వాజ గారు "ఒక బీజం మొలకెత్తాలన్నా, ఒక భావం పొటమరించాలన్నా ఆ బీజాన్ని, ఆ భావాన్ని ఒక నీటి చినుకో, ఒక కన్నీటి చినుకో తడిపి తీరాలంటారు. నీటి చినుకు తడిపిన బీజాలన్నీ మొలకెత్తలేకపోవచ్చు కానీ, కన్నీటి చినుకులు తడిసిన ప్రతి భావమూ పైకి పొటమరించ కుండా ఉండదు కదా.

ఒక ప్రాచీనమైన సుందరమైన శిల్పాన్ని చూసి, అయ్యో! శిల్పి పేరు తెలియలేదే... అని బాధపడతాం. ఆ శిల్పి పేరు తెలియకపోయినా, అందాలు శిల్పి నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటుతూనే ఉన్నాయి. నిజమైన శిల్పి అశాశ్వతమైన పేరులో కన్నా శాశ్వతమైన తన నైపుణ్యంలోనే జీవిస్తుంటాడు. ప్రతి మనిషి మనసూ నిరంతరం రసభావాలతో ఉంటుంది. ఆ రస భూమికలు తంత్రానలమై చీకటిలో తిరుగుతుంటాయి. సంస్కారం పెరిగే కొద్దీ వానరాంశపోతున్నట్లే, మానవాంశ మేల్కొంటూ ఉంటుంది. జీవితంలో ఎదురైన సమస్యలను బట్టి మనిషి స్పందిస్తాడు. ఏదైనా దుర్భర వేదన కలిగినప్పుడు మనిషి మొదట విపరీతంగా చలించిపోయినా, క్రమక్రమంగా ఆ ఉద్రిక్తత సడలిపోయి వైరాగ్యస్థితిలోనికి, తాత్వికత్వంలోనికి వెళ్లిపోవడం సహజం. ప్రకృతియే కాంతమ్మలాగా దివ్య రూపంలో సాక్షాత్కరించినట్లు కూడా వర్ణించటం జరిగింది.

నువ్వీ చెట్టు చేమల్లో ఎందుకు తిరుగుతున్నావు.. అందామె. ఆ చిరునవ్వుల్లోనూ మొగ్గల్లోనూ నిన్ను చూస్తున్నాను కనుక... అన్నాడతను. నువ్వీ కొండల్లో కోనల్లో ఎందుకు తచ్చాడుతున్నావ్... అందామె. ఈ రాయిలోనూ, ఆ రప్పల్లోనూ నువ్వు కనపడుతున్నావ్ కనుక... అన్నాడతను. మరి నువ్వీ దుమ్ములో ఎందుకున్నావ్ కన్నా... అన్నదామె. నువ్వు ఇందులోనే కలిసి పోయావు కనుక... అన్నాడతను ఏడుస్తూ!

ఈ వర్ణనలో అన్వేషణ తీవ్రతతో పాటు ప్రకృతి తాదాత్మ్యం, ప్రకృతితో సంభాషించినట్లు కూడా కనిపిస్తుంది. జీవితాన్ని కావ్యంతో పోలుస్తూ ఒకచోట "జీవితం జానపద గీతంలా, సరళంగా, హాయిగా ఉండాలి కానీ, నాలుగర్థాల కావ్యంలా, పరమ క్లిష్టంగా ఉండకూడదు. కానీ ఇప్పుడలాగే ఉంటున్నది"

భరద్వాజ గారు ఒక చోట కాంతమ్మ గారిని స్మరిస్తూ మనసు భగవంతుని వైపు మళ్ళించాలనుకుని "భగవంతుడు కూడా నీ రూపంలో కనపడితే తప్ప నేను ఇప్పుడు గుర్తించలేను కాంతమ్మా!" అంటారు భరద్వాజ. తన ప్రతిబింబాన్ని కాంతమ్మగారిలో చూసుకొనగలిగారు. శివున్ని అర్ధనారీశ్వరునిలా గుర్తించినట్లుగా తన ఉనికిని పూర్తిగా భార్యలో లీనం చేయగల భాగ్యశాలి భరద్వాజ గారు. సతీస్మృతి వలన ఏకాంత పథంలో పడి కొట్టుకుంటున్న భరద్వాజను చూసి బాధగా నవ్వింది స్మశానంలో చెట్టు. బాబుగారూ! మనిషి చచ్చిపోయినందుకు మీరంతా ఏడుస్తున్నారు కానీ, బతికున్న వారి బాధలను చూసి మీరు ఎప్పుడైనా ఏడ్చారా? మనిషిలోని కుత్సితాన్ని, కుళ్ళును, రక్త పిపాసను, పాశవికతను, క్రూరత్వాన్ని, అజ్ఞానాన్ని, పిరికితనాన్ని, స్వార్థాన్ని, సమరోన్మాదాన్ని, ఇంకా సవాలక్ష అవ లక్షణాలను చూసి మీరు ఎప్పుడైనా ఏడ్చారా? ఇవేవీ విచారించదగిన అంశాలు కావా? కళ్ళు కార్చే నీళ్ళే చూస్తారు కానీ మనసు కార్చే అశ్రువులను మీరెప్పుడన్నా చూశారా? అని ప్రశ్నించింది. చిన్నతనం నుండే ఏ సామాజిక న్యాయం కోసం ఆయన అలమటించారో దానికి భంగం వాటిల్లనివ్వలేదు ఆయన సతీస్మృతి. స్త్రీపరంగా తన దృష్టికి, ఇతరుల దృష్టికి మధ్య చాలా తేడాలు ఉన్నాయని చెబుతూ... మీరు ఆమె ఒంటిమీద శృంగారం చూస్తారు. నేనామె మనసులోని బంగారం చూస్తాను. మీరామెను బొమ్మలా చూస్తారు. నేనామెను అమ్మలా చూస్తాను.. అంటారు. నేనిప్పుడు పరమేశ్వరునికి ఎంత నిష్కల్మషంగా నమస్కరిస్తానో అంత నిష్కల్మషంగానూ సమస్త మహిళాలోకానికి నమస్కరిస్తానని, ఉత్తమ సృష్టి కోసం పరమేశ్వరుడు పడుతున్న మథనకు, స్త్రీ పడుతున్న మథనకు ఇప్పటి నా దృష్టిలో ఏమీ తేడా లేదంటారు. అంతేకాదు మనం అనుకుంటున్నట్లుగా యాంత్రికమైన స్త్రీపురుష సంయోగం వలన మాత్రమే సంతాన సృష్టి జరగదని, స్త్రీకి పవిత్ర సంకల్పమే లేనప్పుడు సంతానం లభించే అవకాశమే లేదు కనుక, ఈ సృష్టిని అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తున్న స్త్రీ జాతికి ఈ సమాజమూ, ఈశ్వరుడూ చాలా రుణపడి ఉన్నాడంటారు.

స్త్రీ ఔన్నత్యాన్ని వివరిస్తూ యుగయుగాలుగా తన భర్త, అన్నదమ్ములు తనను మోసం చేస్తున్నారని తెలిసినా, తన తండ్రి ఏదో రకంగా తనను వదిలించుకోవడానికే చూస్తున్నట్లు తెలిసినా, రేపు తన కొడుకులు తనను తన్ని తరిమేస్తారని తెలిసినా తాను మాత్రం వీరందరికి ప్రేమాభిమానాల్ని పంచిపెడుతూనే ఉంటుందంటారు. ఓ మూల కుప్పలా పడివున్న పేగుల దగ్గరకెళ్ళి "అమ్మా!" అని పిలిస్తే చాలు అవి కదులుతాయంటారు. భరద్వాజ గారి రచనలు జీవితం నుంచీ, హృదయం నుంచీ పలికాయి. అవి అందించే ఆవేదనతో పఠిత హృదయంలో అంతర్గతంగా నిద్రాణంగా ఉండే సహృదయ భూమిక లొక్కసారిగా చివ్వుమని స్పందిస్తాయి. ఆలోచనలు సక్రమంగా ప్రవహిస్తాయి. వ్యక్తి హృదయాన్ని మరింత స్వచ్ఛంగా మార్చివేస్తాయి. ఎందుకంటే భరద్వాజ గారు జీవితమనే బడిలో చదువుకున్నారు. స్వయంగా శ్రమించి ఎన్నో జీవిత సత్యాలను గమనించగలిగారు. సునిశిత దృష్టితో యదార్థాన్ని అంగీకరించగల వాస్తవ వాది ఆయన. మనసును మనసుగానే వడబోసి మాటల్లోకి పిండారు. అందుకనే ఆయన రచనల్లో ఆర్ద్రత ఎక్కువగా కనిపిస్తుంది. భరద్వాజ జీవితం – సాహిత్యంలో త్రిపురనేని సుబ్బారావు గారు రాసిన మాటను ఈ సందర్భంలో ప్రస్తావించుకోవాలి. "భరద్వాజ వాక్యాలు కొన్ని పచ్చిగా ఉంటాయి. ఇంకొన్ని పచ్చగాను, వెచ్చగాను ఉంటాయి. అవి తరచూ ఆకలి వాసన వేస్తాయి. దరిద్రం వాసన వేస్తాయి. అప్పుడప్పుడు నిప్పు వాసన వేస్తాయి. ఎల్లప్పుడూ లోతుకు చొచ్చుకొని పోతాయి."

"జీవన సమరం" రచన నిండా అన్నీ వ్యాధార్త జీవుల యదార్ధ గాథలే కనిపిస్తాయి. తెల్లారి లేచిన తర్వాత గంజినీళ్ళకైనా డబ్బులు దొరుకుతాయనే గ్యారెంటీలేని తాళం కప్పలు బాగు చేసేవాళ్లు, గొడుగులు బాగు చేసేవాళ్ళందరి కష్టగాథలు మనకు కనిపిస్తాయి. వినిపిస్తాయి. దరిద్రం చాలామందికి పిరికిపాలు పోసింది. నాకూ పోసింది. కానీ నేను ఆ పాలు తాగే రాటుదేలాను. నా చిన్నతనంలో అన్ని కష్టాలూ, బాధలు, అవమానాలు, ఈసడింపులు అనుభవించకపోతే నేను అసలు రచయిత నయ్యేవాడినే కాదంటారు భారద్వాజ.

భరద్వాజగారి హృదయంలో ఆర్ద్రతే కాదు ఆక్రోశం కూడా ఉంది. సహస్రాబ్దాలుగా మూగబోయిన సామాన్యుల గొంతుకల తలుపులు తెరుస్తానంటారు. శ్రామికుల కంఠాల్లో, దురదృష్టవంతుల గుండెల్లో ఆశా నినాదంగా తానుండాలంటారు. తన పిలుపు దేశ దేశాలకు పాకి మారుమూలల దాకా విస్తరించి సూర్య కాంతిలా అందరిని మేలుకొల్పాలంటారు. దానికి "అంతరంగిణి"లో ఆయన కాంక్షించిన సమ సమాజ స్వరూపం ఇలా ఉంది..

**ప్రభూ!**

**ఎక్కడ కర్షకుని శ్రమ ఫలం కర్షకునికే లభిస్తుందో,**
**ఎక్కడ కార్మికుని శ్రమ ఫలం కార్మికునికే లభిస్తుందో,**
**ఎక్కడ అన్నపురాసులు పక్కనే ఆకలి చావులు ఉండవో,**
**ఎక్కడ దారిద్ర్య భూత వికటాట్టహాసాలు వినబడవో, ఎక్కడ హీనాతి హీనమైన యాచనావృత్తి ఉండదో,**
**ఎక్కడ విద్యార్జనావకాశాలు కొందరికే పరిమితమై ఉండవో,**
**ఎక్కడ పసిపాపల చిన్నారి చేతులు పనులతో తాకవో,**
**ఎక్కడ పడుచుదనం పిడికెడు మెతుకుల కోసం వ్యభిచరించదో,**
**ఎక్కడ న్యాయవాది న్యాయం పక్షాన్నే నిలబడతాడో,**
**ఎక్కడ వైద్యం డబ్బునిబట్టి కాక జబ్బునుబట్టి లభిస్తుందో,**
**ఎక్కడ అధికార తాపత్రయాలు కట్టలు తెంచుకొని ప్రవహించవో,**
**ఎక్కడ శుష్క వాగ్దానాల ఝరులు హోరెత్తించవో,**
**ఎక్కడ అసూయా ద్వేషాలుండవో,**
**ఎక్కడ కపట సన్యాసులు దాంబిక యోగులు ఉండరో,**
**ఎక్కడ యుద్ధ ప్రేలాపనలు వినపడవో,**
**ఎక్కడ విద్యా విజ్ఞాన వాహినులు సమస్త ప్రజల ముంగిట నిలచి ఉంటాయో,**
**ఎక్కడ ఆకలి, అజ్ఞానం, దారిద్రం, నిరుద్యోగం, వ్యాధి వ్యాపారం ఉండవో,**
**ఎక్కడ దేశదేశాల ప్రజలు సుఖశాంతులతో, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవిస్తారో,**
**ఓ ప్రభూ! అలాంటి సమాజ నిర్మాణానికై**
**నా సోదరీ సోదరులను సమాయత్తం చేసే మహాయత్నంలో నన్ను నిమగ్నుడను కానీ!**

ఇది 1987లో రాశారు. ఇది చదువుతున్నప్పుడు టాగోర్ మహాశయుని "వేర్ ద మైండ్ ఈజ్ విౌట్ ఫియర్" గుర్తుకు వస్తుంది. ఒక బుద్ధుడు, ఒక క్రీస్తు, ఒక మహాత్ముడు ఒకేసారి అవతరించవలసిన అవసరం ఇప్పుడెంతైనా ఉంది. అయితే ఈసారి వారు దయా హృదయాలతో కాక డైనమేట్స్‌తోను, అహింసాత్మక బోధనలకు బదులుగా ఆయుధాలతోనూ రావలసి ఉంటుందంటూ సమాజంలోని దుస్థితికి ఆక్రందించే సహృదయ కవిగానే కాక కర్తవ్య బోధకుడైన విప్లవ నాయకునిగా కూడా కనిపిస్తారు భరద్వాజ.

"ఒంటినిండా కన్నులున్న వేణువులాంటివాడు భరద్వాజ. పైనుంచి చూస్తే అన్ని కన్నాలే కనపడతాయి. గాలిని నింపి అందులోకి ఊదితే అద్భుతమైన సంగీతాలు పలుకుతాయి" అన్నారు శ్రీశ్రీ. భరద్వాజ గారు ఒక ఇంటర్వ్యూలో "నా ఆఖరు శ్వాస ఆరేంతవరకూ రాస్తాను. ఆమె నా ఊపిరి. ఊపిరి పీల్చుకోకుండా ఎలా ఉండలేనో కాంతమ్మ గారిని తలుచుకోకుండా అలాగే ఉండలేను. రచయితగా నేను ఇంకా పుట్టవలసి ఉంది. ఒకటి సాధించానన్న సంతృప్తి నాకెప్పుడు వస్తుందంటే పర్టిక్యులర్ సబ్జెక్టును గురించి నేను మాత్రమే రాయగలగాలి. నేను తప్ప ఇంకెవరు రాయలేనంత బాగా నేను మాత్రమే రాయగలిగితే అప్పుడు మాత్రమే నేను రచయితనని పించుకుంటాను. ఎవరూ రాయనంత బాగా రాసిన రచనల ద్వారా నాకు ప్రత్యేకమైన గౌరవం రావాలి" అన్నారు. విశ్వ శ్రేయస్సు కోసం, మన కోసం ఆయన గొప్పగానే రాశారు. జ్ఞానపీఠ పురస్కారానికి ఆస్కారం కలిగే రచనల్నే చేసి మనకందించి శాశ్వతులయ్యారు.

**డా. తలారి వాసు**
**సహాయాచార్య, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,**
**ఫోన్ : 9949294254**

## కమ్మతెమ్మెరలు

***మిసిమి*** *చదువరలకు - ఎడిటర్ గారి ద్వారా క్షమాపణలతో నమస్కరిస్తూ : COP-29- కార్తీక దీపం-నా మేను" వివరణ-రిఫరెన్స్ Theme:: Climate Change*

*41.6 billion tonnes more carbon pumped into atmosphere this year: Report Last year, the figure was 40.6 billion tonnes*

*నేను క్రితం నెల-డిసెంబర్24* ***మిసిమి****లో వ్రాసిన 'సిమ్మెంట్ తయారు-గేటెడ్ కమ్యూనిటి-సుస్థిరాభివృద్ధి'-కేవలం-Climate change-కేస్ స్టడీలుగా పరిగణించమనవి-"కార్బన్ బ్లాకులు-ఎవరో ఏసుకి కొట్టిన మేకులు కావు- మనం మన పిల్లల-పిల్లలకు మేకులుగా కొడుతున్నామేమో!" ఏదో నా డెమాన్షియా మడుగులో-పీడ పిడుగుల అదురు-బెదురులోనా ముసలి అడుగులతో-మనందరం అలర్ట్ కాలేని ఆత్రుతతో-COP 29-నెట్ జీరో-అందరి పౌరుల బాధ్యత-ఎరుక కై-ఏదో అర్దం కాని తప్పు చేసిన నేరస్థుడి భాషలో రాశాను-AMITAV GHOSH అమితవ్ ఘోష్- ప్రత్యేక రచయిత - సాహిత్యంలో Sustainability-సుస్థిరతా ముత్యం మెరవాలని ఘోషిస్తున్నాడు- విశ్వవేదికలో- అప్పుడెప్పుడో శ్రీ ఆలపాటి రవీంద్రులు-ఆల్టర్ నేటివ్/ ఇన్నోవియేటివ్ / క్రియేటివిటి కళామిశ్రమంగా- తెలుగు* ***మిసిమి*** *పత్రిక - ప్లాట్ ఫారం ఎప్పుడో ఇవ్వడం-ఇప్పుడు మన పదరసాలు పంచుకోవడం-మన అదృష్టం- సుస్థిరాభివృద్ధి-ప్రపంచ తెలుగు పంచె-కుంచెలతో నడుముకి దోపుకొని మనమనవలు/మనవరాంద్రుల మనుగడకు - కొత్త కర్భనరహిత గుడులు కట్టగలము-* ***మిసిమి****లో మొదటగా Sustainability/సుస్థిరతపై 'వ్యాసంగా లేక ఓ దోషంగా' భావించి-ఓ కొత్త పరిశోధనగా ప్రతిపౌరుడు పాటించి - తమతమ పరిధిలో పోరాడ మనవి.*

*అలాగే-సిమ్మెంట్ తయారు కేస్-కార్బన్ డేటా-ఒక్కటే కారణం కాదు-41,6 బిలియన్ టన్నుల కర్భన ఉద్గారాలకు? ఆకాశ హర్మ్యాలు ఒక్కటే కావు-పక్కనే ఉన్న-పతి ధారావి-స్లం-మురికివాడలో నున్న రిఫ్రజేటర్/ ఏ.సిల గ్రీన్ హౌస్ గ్యాస్ ఉద్గారాల భారాల భాద్యత ఎవరవిగా మోయాలి? ఇక్కడ- ఇలీట్ (Elite)-డి.లిట్ (D.lit)-మాస్/క్లాస్-లిస్ట్ కావు-అన్నీ డిలీటు (Delete) చేసి మన పిల్లల-వారి పిల్లలను గ్లోబల్ వార్మింగ్ కోరలనుండి కాపాడే ఓ తాతయ్య తపనగా-COP-29- కార్తీక దీపం-నా మేను"గా తెలుగు కోకిల తియ్యని-చేదు పదాలను-డీ-కోడింగ్ తమ తమ మస్తిష్కాలలో పాఠకదేవుళ్ళు-తమ వీలునామాలను తిరగరాసి-తమ తదుపరి తరాల మనుగడలకు దివ్యప్రసాదాలుగా పంచగలరు.*

*ఈ Sustainability Lens-Guns-Pens గత డిసెంబర్ 24 వ్యాసం- నా వ్యక్తిగతం-సొంతం కాదు! మన భేతాలుడు ఎవ్వరనీ వదలా: ఓ చిగురించిన 'చెగురేవా'- పరిపాలకుడిగా- వన కళ్యాణం నుండి ,జగనన్నా,రెండు తెలుగు చందమావయ్యలు, మరల రగిలే రవ్వంత, దాగని గని-గుజరాత మోత-ఓడని మోడి- తెలియని గాంధి దండి దాడి-ఇంకా పరోక్ష పరిపాలనారాటపు రాహుల్ గ్రాంధి(కం) వరకు గ్రహించగలరు-ఇంకా పుష్పా-3 కొనసాగించలేను-ఎవరి తోటలో వారి పుష్పాలు పెంచగలరు, పుష్పవిలాపాలు లేని మన సుస్థిరతకై!*

**- ఐ.వి.రామరాజు, పిప్పర**

# వేల్స్ లో ఒక వేసవి వారాంతం

– నిమ్మగడ్డ శేషగిరి రావు



వేల్స్ రాజధాని కార్డిఫ్ నగరం

**యు**నైటెడ్ కింగ్డమ్ నా పుట్టిల్లు కాకపోయినా, నా జీవితంలో సింహ భాగమంతా ఇక్కడే గడిచింది. జన్మభూమిని మరపించేటంత ఏముంది ఇక్కడ? విమానంలో, "లండన్ చేరుకున్నాము" అని వినిపించిన వెంటనే కిటికీలో నుండి బయటకు చూస్తే.. కనుచూపుమేర అంతా పచ్చదనం, పచ్చదనపు దుప్పటి మడతలలో ఎర్రమట్టి రంగు పైకప్పులతో ముచ్చటైన ఇళ్ళు. ఆకాశ హర్మ్యాలు, కాంక్రీటు అరణ్యాలు ఊహించుకున్నవారికి, ఆశాభంగమేమో కాని నాకు కాదు.

నైసర్గికంగా పచ్చదనం, చల్లదనం, చదునైన నేల మీద రంగులద్దినట్లు పర్వత శ్రేణులు, చిన్న చిన్నా పెద్దా నదులు, రంగవల్లుల లాంటి తీర్చిదిద్దిన రోడ్లు, వీటన్నిటి మధ్యా ఇంగ్లీషు వారు పోగొట్టుకోనిది ప్రకృతి పట్ల ప్రేమ, కాలుష్యపు అదుపు, వాతావరణ సమతూకం. వృత్తి పరంగా, పదోన్నతి, సాఫీ అయిన కుటుంబ జీవితం, మర్యాద పూర్వకమైన సామాజిక ప్రవృత్తి, ఇవన్నీ నాకు అందచేసిన ఈ దేశం నా రెండవ పుట్టిల్లు.

మొదట్లో ఈ దేశం ఇంత పచ్చగా ఎట్లా ఉందబ్బా? అని ఆశ్చర్యపోతుంటే, ఎవరో అన్నారు, "ఏముందండీ గాడ్ హాజ్ గివెన్ రెయిన్". నిజమే ఎప్పుడూ వర్షం కురుస్తూనే ఉంటుంది. పైగా చలికాలం ఆకులు రాల్చేసుకునే చెట్లన్నీ, వసంత కాలం వచ్చే సరికి, పులకరించి పోయి క్రొత్త చివుళ్ళతో అందాలు సంతరించు కుంటాయి. ఈ కాలంలో గడ్డి పరక కూడ ప్రేమగా పలకరిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆకులు రాల్చకుండా నిలబడి ఉన్న చెట్లైతే తళతళలాడుతూ మంచుకడిగిన మంచి పచ్చల హారాల్లా కళకళలాడుతూ ఉంటాయి. కొన్ని సంవత్సరాలు ఈ ప్రకృతి సౌందర్యపు మైకంలో పడి మైమరచిపోయినా, ఇంకొంచెం వెసులు బాటు అయ్యాక, దేశపు నలుమూలలా తడిమి చూడాలనే కాంక్ష మొదలౌతుంది నాలాంటి వారికి.

బయటి ప్రపంచంలో చాలా మంది, యునైటెడ్ కింగ్డమ్ అన్నా ఇంగ్లండ్ అన్నా ఒకటే అనుకోవటం కద్దు. కాని, నిజానికి యునైటెడ్ కింగ్డమ్, ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్ లాండ్, నార్తర్న్ ఐర్లాండ్ అనే నాలుగు ప్రాంతాల రాజకీయ కలయిక. భౌగోళికంగా నాలుగూ ప్రధానమైనవే. కాని, ఇంగ్లాండు అన్నిటికన్నా పెద్ద ప్రాంతమే కాకుండా, ఇక్కడ జనసాంద్రత కూడా ఎక్కువ. ఇంగ్లాండ్, వేల్స్, స్కాట్లాండ్ మూడిటిని కలిపి బ్రిటిష్ ఐల్స్ అంటారు. నార్తర్న్ ఐర్లాండ్, ప్రక్కనే ఉన్న ద్వీపానికి ఉత్తర దిశగా, ఐర్లాండుకు ఎగువన ఉంటుంది. ప్రకృతి సౌందర్యం దృష్ట్యా ఈ నాలుగూ వేటికవే సాటి. కాని ముందుగా వేల్స్ నన్ను ఆకట్టుకుంది.

దాదాపు 25000 సంవత్సరాలుగా మానవజాతి నివసించిన ఈ ప్రాంతం, హిమనీనదాలు క్రమేణా తీసిపోవటంతో, పర్వత ప్రాంతంగా మిగిలిపోయింది. ఒకప్పుడు ఐర్లాండ్‌తో కలిసిపోయిన భూభాగమని చెప్పబడే ఈ ప్రాంతం, ఏళ్ళ తరబడి సముద్రజలాల మట్టం పెరగటంతో, ఐర్లాండ్ నుండి విడిపోయి ఉన్నట్లు కనపడు తుంది. యునైటెడ్ కింగ్డమ్‌కు పశ్చిమ దిశగా ఉన్న భూభాగం ఇది. 21218 చదరపు కి. మీ. వైశాల్యంతో, 2700 కి.మీ. తీర రేఖతో, 3 మిలియన్ల పైచిలుకు ప్రజానీకానికి మాతృభూమి ఇది. కార్డిఫ్ నగరం వేల్స్ రాజధాని.

శతాబ్దాలుగా అనేకానేక రాజకీయ మార్పులకు గురైన ఈ ప్రాంతం ప్రస్తుతం యునైటెడ్ కింగ్డమ్‌లో ఒక

భాగమైనా, కొన్ని విషయాల వరకు స్వతంత్ర నిర్ణయాధికారం నిలబెట్టుకుంది. వీరికి ప్రత్యేకమైన పార్లమెంటు కూడ ఉంది. దీనిని డివాల్వ్ పార్లమెంటు (పై ప్రభుత్వ అంతిమ నిర్ణయానికి లోబడిన, స్వతంత్ర నిర్ణయాధికారం కలిగి ఉన్న పార్లమెంటు) అంటారు. వెల్ష్ భాషలో దీనిని సెనెడ్ అంటారు. వెల్ష్ భాష ఇంగ్లీషు లిపిలో ఉన్నా, పలకటం మాత్రం చాలా తేడాగా ఉంటుంది. వేల్స్‌లో చాలా మంది ఇంగ్లీషు భాషను వాడినా, వెల్ష్ మాట్లాడేవారు అయిదారు లక్షల మంది ఉంటారు. ఇక్కడ ఈ రెంటినీ అధికారికంగా భాషలుగా గుర్తించారు.

వేల్స్ అనగానే మనసుకు తోచేది, పరచుకు పోయిన పర్వతాలు, పచ్చగడ్డి మైదానాలు, నదులు జలపాతాలు, పచ్చని వనాలతో కూడిన విలక్షణమైన ప్రకృతి సౌందర్యం. 'చాలా బాగుంటుంది' అని అందరూ అనుకుంటారు. మొత్తం యునైటెడ్ కింగ్డమ్‌లో గుర్తింపు పొందిన 15 జాతీయ ఉద్యానవనాల్లో, మూడు ఇక్కడ ఉన్నాయి. వీటిలో ఒకటి, బ్రెకన్ బీకన్స్ జాతీయ ఉద్యానవనం. బ్రిటన్లో 'అత్యుత్తమ సహజ సౌందర్యవంతమైన ప్రదేశాలు' (Areas of Outstanding Natural Beauty-AONB) గా ఇక్కడ గుర్తించ బడిన ప్రదేశాలలో ఇది కూడ ఒకటి. ఇక్కడి బ్రెకన్ బీకన్స్ పర్వతాలు నాలాంటి వారిని ఆకర్షించుకుంటాయి. సహజంగా సాహసికులైన బ్రిటిష్ వారికి, మనదేశపు హిమాలయాల అధిరోహణ ఒక ప్రత్యేకమైన లక్ష్యం. కాని దానికి శారీరకంగా చాలా సన్నద్ధం కావాలి. గతం నుండీ, ఆ విధమైన ఆసక్తి ఉన్నవారికి, వారితో పాటు మిలటరీ శిక్షణ పొందేవారికి కూడా, కఠినమైన ఎగుడు దిగుడు బండరాతి ప్రదేశమైన, బ్రెకన్ బీకన్స్ ఒక మంచి శిక్షణా స్థావరం. అంతే కాకుండా వారమంతా తలమునకలుగా పనిచేసి, వారాంతంలో విభిన్నమైన అనుభూతి కోరుకునే చుట్టుపక్కల పట్టణ వాసులను కూడ ఈ ప్రదేశం పిలిపించుకుంటుంది.

నా ఇంగ్లాండ్ జీవితంలో ఎన్నో సార్లు, నేను ఇటుగా ప్రయాణం చేశాను. ప్రతిసారి ఆ కొండలు నన్ను పిలుస్తూనే ఉండేవి. పని వత్తిడి, బాధ్యతలు ఇవన్నీ సాకులు అవ్వచ్చు కాని కోరిక బలపడటాన్ని మాత్రం ఇవేమీ ఆపలేక పోయాయి. కాలక్రమంలో నాలాంటి మిత్రులు 17 మంది జత కలిశారు. మరీ ముఖ్యంగా, నా మిత్రుడు తిరు,



మేము ఎక్కిన కొండలు, మేము నడిచిన దారులు

సౌత్ వేల్స్‌లో ఉండటం మాకు బాగా కలసి వచ్చింది. తిరుకు ఈ ప్రాంతమంతా బాగా తెలుసు. ఒక మంచి వారాంతపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు తిరు. శనివారం నాడు నాలుగు శిఖరాలను అధిరోహించటం, ఆదివారం నాడు ఒక పూటలో నాలుగు జలపాతాలను దర్శించటం..ఇదీ లక్ష్యం. ఇది మాకు మరో విధంగా కూడా అవసరం. త్వరలోనే నేపాల్ వెళ్ళి, హిమాలయాలలో, అన్నపూర్ణ శిఖర పరిక్రమణ చేసే కార్యక్రమం ఉంది. దానికి మమ్మల్ని మేము సంసిద్ధం చేసుకోవటానికి, మా దీక్షను, మానసిక, శారీరక శక్తులను పరీక్షించుకోవలసిన అవసరం ఇప్పుడు ఉంది. దీని కోసం ఆగస్టు నెల మొదటి వారాంతాన్ని, అంటే 2023 ఆగస్టు 5వ తేదీని ఎంచుకున్నాము. అది ఎండా కాలం. సాధారణంగా వర్షం పడదనుకునే కాలం. కొండలెక్కటానికి అనువైన కాలం అది. మరి మా అదృష్టం ఎట్లా ఉందో!! అయిదవ తేదీ, శనివారం నాలుగు శిఖరాలను కలుపుతూ గుర్రపు డెక్క (హార్స్ షూ) ఆకారంలో ఉండే పర్వత మార్గాన నడవాలి. వీటిలో 'పెన్ వై ఫాన్' అనే శిఖరం కూడ ఉంది. 874 మీటర్ల ఎత్తుతో ఇది దక్షిణ వేల్స్ ప్రాంతంలో ఎత్తైన శిఖరం. మిగిలిన దోవంతా మిగతా మూడు శిఖరాలను కలుపుతూ, శిఖరపు అంచులలో సాగే మార్గం. ఇటువంటి నడక అలవాటైన వారికి, ఇది మరీ అంత కష్టమేమీ కాదు. కానీ బ్రిటన్ వాతావరణాన్ని, ఓపల్ అనే విలువైన రత్నంలో క్షణక్షణం రంగులు మారటంతో పోల్చటం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. మంచి ఎండాకాలపు వారాంతపు రోజు, మిగతా ప్రపంచమంతా సూర్య రశ్మిలో ఓలలాడుతుంటే ఇక్కడ ఈ వేల్స్ కొండల మీదకు వర్షం దిగిపోయింది. దారి కూడ సరిగ్గా కనపడటం లేదు. ప్రకృతితో కలసి మెలగాలంటే అన్ని వైపరీత్యాలకు సిద్ధంగా ఉండవలసిందే. ముందే వాతావరణం గురించి తెలుసుకుని



'పెన్ వై ఫాన్' పర్వతము (గుర్రపు డెక్క ఆకారం)

ఉన్నాము కనుక, నీరు పీల్చని కోట్లు, పాంటులు, మోకాళ్ళ వరకూ సాగే బూట్లతో తయారై వచ్చేశాము. మధ్యాహ్నానికి వర్షం తగ్గి, కొంచెం ఎండ వచ్చినా, గాలి ఉధృతం ఉంటుందట. ఎంత తయారుగా వచ్చినా, వీటన్నిటితో నడవటం మరీ కష్టం. మా రాబోయే హిమాలయ యాత్రలో ఇటువంటి కష్టాలు ఎన్నో ఉండొచ్చని విని ఉండటంతో, ఇదీ ఒకందుకు మంచిదేలే అనుకున్నాము. మా నడక మొదలు పెట్టే సరికి ఉదయం 9.30 అయింది.

మా మొదటి లక్ష్యం 'కోర్న్ డు' శిఖరం. కార్ పార్క్ నుండి కొండ ఎక్కటానికి మార్గం ఉంది. దాదాపు నిలువుగా. శిఖరం చేరటానికి 873 మీటర్లు ఎక్కాలి. ఆరంభోత్సాహం బలంగా ఉండటంతో ఇట్టే ఎక్కేశాము. అక్కడ పేర్చిన ఒక రాళ్ళ గుట్ట, శిఖరం చేరుకున్నారని తెలిపింది. అక్కడ నుండి 'పెన్ వై ఫాన్' చేరటానికి గంట లోపే పట్టింది. రెండు శిఖరాల మధ్య క్రిందికి దిగి, మళ్ళీ పైకి సాగిన మార్గం దూరానికి అర్ధ చంద్రాకారంలో కనపడుతుంది. ఒకే కొండకు రెండు శిఖరాలున్నట్లుగా కనపడుతున్నాయి ఇవి. పెన్ వై ఫాన్ శిఖరాగ్రాన ఇంకొంచెం వైనంగా ఒక రాతి ఫలకం ఉంది. దాని మీదున్న వివరాలు చదివితే, ఎంత ఎత్తు ఎక్కి వచ్చామో తెలిసి ఇంకొంచెం తృప్తిగా అనిపించింది. ఇక్కడి నుండి కనిపించే దృశ్యాల నేపథ్యంతో అందరూ ఫోటోలు తీసుకోవటం పరిపాటి. మళ్ళీ మళ్ళీ వచ్చేసేటంత తేలికేమీ కాదు ఈ పని. కష్టపడి పైకి ఎక్కి వచ్చినందుకు బ్రెకన్ బీకన్స్‌లో ఆ మాట కొస్తే దక్షిణ వేల్స్ లోనే ఉన్నతమైన శిఖరం అధిరోహించామనే విలువైన అనుభవం మా స్వంతమయింది. ఇది సగర్వంగా చెప్పుకోగలిగినది కూడ.

అయితే, వేల్స్‌లో దీనికంటే ఎత్తైన శిఖరం 'స్నో డోన్'. వేల్స్ ఉత్తర భాగాన స్నోడోనియా జాతీయ వనంలో భాగం ఇది. వెయ్యి మీటర్ల దాటిన ఎత్తుతో స్నో డోన్, వేల్స్ మొత్తానికి అత్యున్నత శిఖరంగా నిలుస్తుంది.

ఈ రోజు మేము చేసుకోవలసిన మూడవ శిఖరం, 'క్రిబిన్'. దోవంతా రాళ్ళ మయం. వర్షం వలన అక్కడంతా బురద బురదగా ఉంది. ఆ దోవ వెంట మరో గంట నడిచాము. అంత వరకూ ఎడ తెరపి లేకుండా కురిసిన వర్షం, మధ్యాహ్నానికి, జల్లులు జల్లులుగా మారి తగ్గు ముఖం పట్టింది. కాని అప్పటికే మా బూట్లు వర్షపు ధాటి ముందు తలొంచేశాయి. నీరు లోపలికి పోయి అవి ఇంకా బరువెక్కాయి. గమనం అంత తేలికగా లేదు. కాని మా నడక ఆగలేదు.

క్రిబిన్ శిఖరం వైపు మా ప్రయాణం మూడు గ్రూపులుగా సాగింది. 18 మందిలో 10 మంది ముమ్ముందుకు సాగిపోతున్నారు. ఒక ముగ్గురు వెనుకగా నడుస్తున్నారు. నేను మధ్యలో ఉన్న అయిదుగురిలో ఒకడిని. దోవ నిర్దిష్టంగా లేదు. కొన్ని చోట్ల వేర్వేరు దోవలు దీనితో కలసి పోవటంతో, ఎటు వెళ్ళాలో తెలుసుకోవటం కష్టమయింది. దోవ తప్పటం జరిగితే, తప్పిపోవటమే. దానికి తోడు, ఆ రోజున్న వాతావరణం వలన, కనుచూపు మేర చాలా తక్కువగా ఉంది. అదృష్టవశాత్తూ మా అయిదుగురి గ్రూప్‌లో, రవిశంకర్‌కు ఆ ప్రాంతమంతా కొట్టిన పిండి. ప్రసాద్, మాప్‌లు అర్థం చేసుకోవటంలో దిట్ట. వీరిద్దరి సాహచర్యంతో మేము సరైన మార్గాన సాగిపోయాము.

క్రిబిన్ శిఖరం తాకిన తరువాత, మా నాలుగో లక్ష్యం, 'ఫాన్ వై బిగ్' శిఖరం చేరటానికి, మళ్ళీ క్రిందకు దిగాలి. దీని ఎత్తు 719 మీటర్లు. దిగే దోవంతా కొంత రాళ్ళతోనూ, కొంత గడ్డితోనూ, జారుడుగా ఉంది. మిగిలిన మూడు శిఖరాలు ఒక వరుసలో ఉంటే, ఇది మరో దిక్కుగా ఉంది. అంటే ప్రయాణ మార్గంలో ఒక చోట వేరొక దిశగా సాగి, ఎక్కినంత దూరం మళ్ళీ దిగి అక్కడికే చేరాలి. అంటే మిగతా మూడు శిఖరారోహణలకంటే ఎక్కువ శ్రమ అన్నమాట. దానికి తోడు, మా శక్తి కూడ కొంత తగ్గిందేమో! క్రింద నుండి చూసినప్పుడు శిఖరాగ్రం అసలు కనపడలేదు. ఒక నీడ అంచులా కనపడుతున్నదే



క్రిబిన్ శిఖరం

శిఖరాగ్రమనుకన్నాము. కాని అక్కడకు చేరిన తరువాత శిఖరపు కొన దూరంగా కనపడుతూ మమ్మల్ని ఆటపట్టిస్తున్నట్లు కనపడింది. అక్కడికి మేము ఎక్కి వచ్చిన దూరం సగం మాత్రమే. మా దోవ కొండల అంచు మీద సాగుతోంది. పొగ మంచులో కూడ ప్రమాదకరమైన కొండ చరియల అంచుల నుండి ఒక మీటరు దూరంలో ఉన్నామని కనపడింది. పొరపాటున కూడ దోవ నుండి కాలు అటూ ఇటూ వేయకూడదని మాకు మేమే హెచ్చరికలు చేసుకున్నాము. తరువాత అరగంట ప్రయాణం ఉద్విగ్నభరితం. శిఖరం చేరుకుని తేలికగా ఊపిరి పీల్చుకున్నాము. కాని ఏం లాభం? శిఖరాగ్రాలు చేరటంలో ఉన్న ఒక గొప్ప అనుభూతి, అక్కడి నుండి కనిపించే దృశ్యాలను చూడగలగటం. ఒక్కో సారి అద్భుత దృశ్యాల అదృష్టం వరిస్తుంది. కొన్నిసార్లు అలా జరగకపోవచ్చు. ఆ రోజు మాకు అది లభించలేదు. చుట్టూ పొగమంచు. ఏమీ కనపడలేదు. ప్రయాణాలకు సంబంధించి ఇటువంటి జీవిత సత్యాన్ని స్వీకరించ వలసిందే.

అక్కడక్కడా ఆహారాన్ని వెతుక్కుంటున్న గొర్రెలు కనపడ్డాయి. 'వెల్ష్ లాంబ్' రుచి ఈ దేశంలో ప్రసిద్ధి. కాని ఆ రోజు ఈ చిన్న జంతువులు మా తిరుగు ప్రయాణాన్ని మరింత జటిలం చేశాయి. వాటి వ్యర్థ పదార్థం వలన అందరమూ జారపడినవారమే. కాని పెద్ద దెబ్బలేమీ తగలకుండా తప్పించుకున్నాము. ఎలాగో మేము కొండ దిగి, బయలుదేరిన చోటు చేయగలిగాము. అక్కడ మిత్రుడు తిరు, ఇంకో ఇద్దరు ఉన్న ముగ్గురి గ్రూపు పైకి ఎక్కటం మొదలు పెట్టింది. అప్పటికి మధ్యాహ్నం రెండు గంటలయింది. నాలుగు శిఖరాలు ఎక్కటం పూర్తి చేసిన తృప్తి కలిగినా.. మధ్యాహ్న భోజనపు గంట మ్రోగటంతో.. అక్కడే ఆ బండల మీద కూర్చుని లంచ్ చేసేసి, మళ్ళీ నడక మొదలు పెట్టేశాము. ఇంకా చేద్దామనుకున్న పని చాలా ఉంది. ఎట్టకేలకు వర్షం ఆగిపోయింది. చుట్టూ దృశ్యం తేటగా కనపడుతోంది. దీనితో ప్రొద్దున లేని ఉత్సాహం మమ్మల్ని చురుకుగా నడిపించటం మొదలయ్యింది. దూరాన, నీటి రంగుల చిత్రంలా ఒక జలాశయం కనపడుతోంది. అంతవరకు మంచు మేలి ముసుగు వేసుకున్న బ్రెకన్ బీకన్ పర్వత శ్రేణులు, పచ్చగా, నునుపుగా, సహజ సౌందర్యం చిందించటం మొదలు పెట్టాయి. మా నడక దారిని మొత్తంగా చూడటానికి ఇప్పటికి వీలయింది. చుట్టూ కొండలు. మధ్యలో లోయ. లోయ మధ్యలో జలాశయం. ఒక చోట క్రింద ఉన్న కార్ పార్క్ నుండి పైకి ఎక్కి 'కోర్న్ దు' శిఖరం చేరిన తరువాత, తరువాత రెండు శిఖరాలు చేరుకోవటానికి, వాటి మధ్య ఉన్న పర్వత శ్రేణి అంచు వెంబడి సాగి పోయే మార్గాన నడవటమే. ఈ మార్గం మొదటి మూడు శిఖరాలను కలిపిన గొలుసులా ఉంది. నాలుగవ శిఖరం మాత్రం ఈ గొలుసులో ఇమడలేదు. దీర్ఘ చతురస్రాకారంలో సాగిన మా ట్రెక్, ఒక వైపు మొదటి మూడు శిఖరాలుంటే, దానికి వ్యతిరేక దిశలో జలాశయం ఉంది. పొడవుగా సాగిన రెండు వైపులలో, ఒక వైపు. ఫాన్ వై బిగ్ ఉంది. దానికి ఎదురుగా కొండల అంచు మీద ఎత్తు మీద సాగిన 'రిడ్జ్ వాక్' ఉంది. ఫాన్ వై బిగ్‌ను తడిమి చూసుకుని, అక్కడి నుండి మరో గంట నడచి, అప్పర్ న్యూయాడ్ రిజర్వాయర్ దాటాము. ఈ రిజర్వాయర్, దాని చుట్టూ మేము నడచిన నాలుగు శిఖరాల పర్వత శ్రేణి మీద కురిసి, జాలు వారిన వర్షపు నీటితో ఏర్పడిన టాఫ్ ఫెచాన్ నదికి అడ్డుకట్ట కట్టటం వలన ఏర్పడింది.

అక్కడి నుండి మా దోవ, అంతకు ముందు దారితో పోలిస్తే బల్లపరుపుగా ఉంది. కొంత దూరం సాగాక, కుడి వైపుకు మళ్ళటంతో, అక్కడ శిధిలావస్థలో ఉన్న 'న్యూయాడ్ హౌస్' కనిపించింది. రవిశంకర్ దీనికోసమే చూస్తున్నాడు. ఇది కనిపించిందంటే మేము సరైన దోవలోనే వెళుతున్నట్లు. అక్కడున్న అల్యూమినియం బ్రిడ్జ్ మీద టాఫ్ ఫెచాన్ నది దాటాము. అక్కడి నుండి నది, రిజర్వాయర్ నుండి లోతట్టుగా ప్రవహిస్తోంది.

ఇక్కడ నుండి, దాదాపు ముందు మేము ఎక్కిన నాలుగు శిఖరాలకు తగ్గని ఎత్తులో సుదీర్ఘంగా కొండ

అంచు మీదగా సాగే మార్గం చేరుకోవటం మాకు మరొక సవాలు. దీనిని అయిదో శిఖరారోహణగా అనుకోవచ్చు. ఆ పాటికి అలసట కమ్ముకు రావటంతో ఇది మరీ కష్టంగా తోచింది. ఎలాగో అక్కడికి చేరుకున్న తరువాత కూడ మార్గం సుగమం కాలేదు. అనుకోని మరో సమస్య ఎదురయింది. నిరాఘాటంగా వీస్తున్న గాలిలో వలన మా కాళ్ళు తేలిపోతున్నాయి. మా అందరి దగ్గరా వాకింగ్ పోల్స్ ఉన్నాయి. వాటిని నేలకు గుచ్చి నిలబడటానికి చేసే ప్రయత్నాలు చాలాసార్లు వాయు దేవుడి శక్తి ముందు తలవంచ వలసి వచ్చింది. అక్కడి నుండి చతురస్రాకారపు ట్రెక్ పూర్తి చేయటానికి పెన్ వై ఫాన్ వైపుకు సాగి పోయాము. వేగంగా వీచే గాలి సమస్య లేకపోతే, ఈ ప్రయాణపు దశ సులభంగానే ఉండేది. దిగంతాల వరకూ కనిపిస్తున్న అద్భుతమైన దృశ్యాలు, ఆకాశంలో అప్పుడప్పుడూ కిరణాలు సారిస్తున్న ప్రసన్న సూరీడు మమ్మల్ని అలరిస్తూ ఉన్నాయి. ఆ మైమరపులో అలసట తెలియకుండానే, కార్న్ డు వద్ద ఉదయం మేము బయలుదేరిన చోటుకు 400 మీటర్ల దూరంలో ఉన్న నేషనల్ ట్రస్ట్ కార్ పార్కు లోకి తిన్నగా దిగిపోయాము.

ఇక్కడ, నేషనల్ ట్రస్ట్ గురించి కొంచెం తెలుసు కోవాలి. తమ దేశపు చరిత్రను, భౌగోళిక, నైసర్గిక విశేషాలను కాపాడుకుంటూ, వాటి గురించి వీలైనంత మంది ప్రజలకు తెలియ చేయటానికి బ్రిటిష్ వారు చాలా ప్రాధాన్యతనిస్తారు. కేవలం ఇదే పని మీద ఉండే రెండు సంస్థలలో నేషనల్ ట్రస్ట్ ఒకటి. రెండవది ఇంగ్లీష్ హెరిటేజ్. వీటికి సభ్యత్వ రుసుము నెల వారీగా కాని, సంవత్సరానికి ఒకసారి కాని చెల్లించ వచ్చు. దాదాపు దేశంలో చూడదగిన ప్రదేశాలన్నీ వీటి పరిధిలో ఉంటాయి.

సభ్యులకు ఈ ప్రదేశాల గురించిన వివరాలు, అక్కడ జరిగే ప్రత్యేక కార్యక్రమాల గురించిన సమాచారం ఈ సంస్థలు పంపుతూ ఉంటాయి. సభ్యత్వం ఉన్న వారికి ప్రవేశ రుసుము కొన్నిసార్లు ఉండదు. కొన్నిచోట్ల రాయితీలు ఉంటాయి. ముఖ్యంగా సభ్యులకు అనువైన కార్ పార్కింగ్ సదుపాయం ఉంటుంది. చాలా చోట్ల, ముఖ్యంగా వేసవి కాలంలో, సెలవు రోజులలో యాత్రికుల రద్దీ సహజంగా ఎక్కువగా ఉంటుంది. మేము అక్కడ చూసిన నేషనల్ ట్రస్ట్ కార్ పార్క్ నిండి పోయి ఉంది.

ప్రసాద్ వాచీ ప్రకారం, 1200 మీటర్ల వరకు పైకి ఎక్కుతూ, 23.5 కి.మీ. దూరం తిరిగి రావటానికి, అక్కడక్కడా విశ్రాంతి తీసుకున్న సమయంతో పాటు, 9 గంటలు తీసుకున్నామని తెలిసింది. మొదటి సగంలో, పర్వత శ్రేణుల పై అంచు చేరటానికి ఎత్తు ఎక్కటం తప్పిస్తే, మిగతా అంతా నడకే. రెండవ భాగంలో ఈ వలయాకారపు ట్రెక్‌లో ఎత్తు ఎక్క వలసినదంతా ఉంది. ఇదే ఎక్కువ కష్టం. వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో ఇది మరింత కష్టతరమయింది.

మా గ్రూప్‌లో 10 మంది సభ్యులున్న గుంపు, ఫాన్ వై బిగ్ మీద దోవ తప్పారట. చుట్టూ తిరిగే నడక దోవ నుండి విడివడటం వలన మొత్తం 28 కి.మీ. నడవ వలసి వచ్చిందట. ఈ క్రమంలో మళ్ళీ ఒక సారి పెన్ వై ఫాన్ శిఖరం ఎక్కవలసి వచ్చిందట. శ్రమ ఎక్కువయింది కాని, వారు అక్కడికి రెండవసారి వెళ్ళేసరికి, మంచు విడి పోవటంతో, మాకు కనపడని దృశ్యాలు వారికి కనువిందు చేశాయట. విజయవంతంగా మా ప్రయాణం ముగించుకుని, బ్రెకన్‌లో మేము ఏర్పాటు చేసుకున్న అతిథి గృహం చేరుకునేటప్పటికి సాయంత్రం 7.30 అయింది. యునైటెడ్ కింగ్డమ్‌లో, వేసవి కాలపు సూర్యాస్తమయం సాయంత్రం 11 గంటలకు కాని అవదు కనుక, ఇంకా బాగా వెలుతురుగానే ఉంది. మాలో కొంత మంది ఇక్కడ రెండు రాత్రులు బస ఏర్పాటు చేసుకున్నారు. ఈ అతిథి గృహం, ఊరు మధ్యలో, కార్ పార్కింగ్ సౌకర్యంతో, బస చేయటానికి అన్ని విధాల అనువుగా ఉంది.

ఇటువంటి వసతి గృహాలలో రాత్రి బస మాత్రమే కాకుండా, ఉదయం లేచిన తరువాత నిత్యకృత్యాలకు అవసరమైన సౌకర్యాలతో పాటు, మంచి ఉదయపు ఉపాహారం కూడ అందిస్తారు. దీని యజమానులు కాథలీన్, డేవిడ్‌ల కుటుంబం. వారి వయసు అరవైలలో ఉంటుందేమో. ముందు రాత్రి కూడ వారు నన్ను చక్కగా ఆదరించారు. అప్పుడే నాకు వారు అందిస్తున్న ఆతిథ్యం ప్రత్యేకంగా అనిపించింది. హోటల్స్.కామ్ అనే అంతర్జాల సంస్థ ద్వారా ఈ బస ఏర్పాటు చేసుకున్నాము. ఈ రోజులలో, వ్యాపార పరంగా, పరిమితమైన సౌకర్యాలు అందించే సంస్థలు కోకొల్లలు. కాని, ఈ గ్రేంజ్ గెస్ట్ హౌస్ విభిన్నంగా, సాంప్రదాయబద్ధంగా ఉంది. వాళ్ళు దీనిని

నడుపుతున్న తీరు చూస్తే కేవలం జీవనోపాధి కోసమే కాకుండా, ఈ పని ద్వారా ఉత్తమ స్థాయి బ్రిటిష్ ఆతిథి మర్యాదలను అందచేస్తూ, ఆనంద పడుతున్నట్లు నాకనిపించింది. అక్కడికి వెళ్ళగానే దేవిడ్ స్వయంగా తనే నన్ను రూమ్ వరకూ తీసుకెళ్ళి, ఆ చుట్టు ప్రక్కల ఉన్న రెస్టారెంట్లు, చూడవలసిన విశేషాల గురించి సమాచారాన్ని స్నేహ పూర్వక సంభాషణ ద్వారా తెలిపాడు. మామూలుగా మాట్లాడుతూనే ఎదుటి వారి మనసుకు దగ్గరయ్యే శక్తి చాలా కొద్ది మందికి ఉంటుంది. అందులో దేవిడ్ ఒకడు. ఆ ప్రదేశం మాకు క్రొత్త కాబట్టి, మేమడిగిన అనేకానేక ప్రశ్నలకు వాళ్ళు విసుగు లేకుండా సమాధానాలిచ్చారు. ఆ వృత్తిలో చాలా కాలం పాటు ఉండటం వలన, ఎంత మంది మాలాంటి వారిని వారు చూసి ఉన్నారో అనిపించింది. స్థానికులు గనుక ఆ ప్రాంతం మీద పూర్తి అవగాహన ఉన్న నమ్రతతో కూడిన ధీమా వారి మాటల్లో కనిపించింది. దేవిడ్ సలహా మీద మేము, బుట్టీ బాచ్, వై వాలీ బిట్టర్ అనే రెండు పానీయాలను రుచి చూశాము. వీటిలో మొదటి దాని గురించి దేవిడ్ మరీ గొప్పగా చెప్పాడు.

గ్రేంజ్ గెస్ట్‌హౌస్‌ను అందమైన, నాణ్యమైన పాతకాలపు వస్తువులతో చక్కగా అమర్చారు. అక్కడున్న పుస్తకాల అలమరలన్నీ పాత పుస్తకాలతో నిండిపోయి ఉన్నాయి. నాకైతే మరొకసారి, ఈ పుస్తకాలు చదవటం కోసమే, కుటుంబ సభ్యులందరితో కలసి వచ్చి ఒక వారమన్నా ఇక్కడ గడపాలని అనిపించింది. ఆ ప్రాంతం గురించి అక్కడ ఎంతో సమాచారం ఉంది.

రోజంతా ప్రకృతిలో పంచ భూతాలతో జత కలిపి, రకరకాల అనుభవాలతో, బాగా అలసిపోయి ఉండటంతో, మనసు మంచి పానీయాన్ని కోరుకుంటోంది. ఇంగ్లీషు పబ్ (ఆల్కహాలిక్ డ్రింకులను ఎవరికి కావలసిన విధంగా వారికి అందిస్తూ వాటితో పాటు, తాజాగా వండిన సంప్రదాయిక ఆహారాన్ని కూడా అందచేస్తూ, స్థానికులంతా ఒకచోట చేరి సంఘ జీవనాన్ని అనుభవించటానికి అనువుగా ఉండే చోట్లు ఈ పబ్‌లు)ను వెతుక్కుంటూ బయలుదేరిపోయి, ఒక పైంట్ (568ml) 'బుట్టీ బాచ్', ఇంకో పైంట్ 'వై వాలీ బిట్టర్' తీసుకున్నాము. అక్కడ పని చేసే జార్జ్, ఈ పానీయాల గురించి మరింత సమాచారం ఇచ్చాడు. ఈ రెండూ కూడా, వేల్స్, ఇంగ్లాండ్ సరిహద్దులో ఉండే హెరిఫోర్డ్ అనే ప్రాంతంలో తయారవుతాయట. హెరిఫోర్డ్‌లో లభించే, కఠినమైన ఖనిజలవణాలు లేని మృదుజలం వలన ఈ పానీయాలకు మంచి రుచి వస్తుందట. వెల్ష్ భాషలో, బుట్టీ బాచ్ అంటే చిట్టి స్నేహితుడని అర్థమట. ఈ పానీయం మృదువుగా గొంతు జారిపోతుంటే, వై వాలీ బిట్టర్ కొంచెం వగరుగా ఉంది. ఈ రెంటిని స్థూలంగా 'ఏల్' అంటారు. ఏల్ తయారీ బ్రిటిష్ వారికే ప్రత్యేకం.

పానీయాలు ముగించి, బ్రెకన్ ఊరి ప్రధాన వీధుల్లో కాసేపు తిరిగి, రాత్రి భోజనానికి ఒక థాయ్ రెస్టారెంటు చేరాము. బ్రిటన్‌లో థాయ్ రెస్టారెంట్లలో భోజనం మొత్తంగా బాగానే ఉంటుంది. థాయ్ రెడ్, గ్రీన్, యెల్లో కర్రీలు ఏ థాయ్ రెస్టారెంటుకు వెళ్ళినా ఒకే విధంగా ఉంటాయి. అందుచేత, అవి ఎట్లా ఉంటాయో అని భయపడవలసిన అవసరం లేదు. పైగా అవన్నీ అన్నంతో పాటు వడ్డించుతారు. చివరకు మా ప్లేటు చూసి, మా భోజనం ఎంత రుచిగా ఉందో ఊహించవచ్చు. చివరి మెతుకు కూడ మిగల్చకుండా తినేశాము. అలసిన శరీరాలు, ఆ పైన ఏల్ ప్రభావం, చక్కని బస ఆ రాత్రి ముందెప్పుడూ అనుభవించని సుఖ నిద్ర ప్రాప్తించింది. రేపు మరోరోజు, మరో అనుభవం.

ఉదయాన్నే దేవిడ్, కాథ్‌లీన్‌లు ఏర్పాటు చేసిన బ్రిటిష్ బ్రేక్ ఫాస్ట్ ముందుగా కనువిందు చేసింది. మా బ్రేక్‌ఫాస్ట్‌కు ఏమి కావాలో ముందు రోజే వాళ్ళకు తెలపాలి. దేవిడ్ ఉదయం 7 గంటలకు మార్కెట్‌కు వెళ్ళి, తాజాగా కావలసినవన్నీ తెస్తాడట. వాటిని తయారు చేయటం కాథ్ లీన్ పని. ఒక్కొక్కరికీ పేరు పేరునా వడ్డించే పని మళ్ళీ దేవిడ్ ది. బ్రేక్ ఫాస్ట్ దగ్గర, మేము కాక మరో రెండు జంటలు ఉన్నారు. బ్రిటన్‌లో క్రొత్త వారితో మాటలు కలపటానికి, వాతావరణం గురించి మాట్లాడితే సరిపోతుంది. ఇప్పుడు వాతావరణంతో పాటు, మేము చేసిన, చేయబోయే ట్రెక్‌ల గురించిన మెళకువలు కూడ మా సంభాషణల్లో చోటు చేసుకున్నాయి. మధ్య మధ్యలో దేవిడ్ మా సంభాషణల్లోకి ఒక చెణుకు విసురుతున్నాడు. చాలా కాలం తరువాత, ఒక మంచి ఆతిథ్యం లభించిన అనుభూతి కలిగింది. హొటల్.కామ్ లో గ్రేంజ్ గెస్ట్ హౌస్‌కు అయిదు నక్షత్రాలు ఎందుకు ఉన్నాయో నాకు

అప్పుడు అర్థమయింది. మాకు ముందు ఇక్కడికి వచ్చిన అతిథులు వ్రాసిన అభిప్రాయాలు, అభినందనలన్నింటిలో ఏ మాత్రం అతిశయోక్తులు లేవనిపించింది కూడ. నా మటుకు నేను ఇటువంటి ప్రదేశాలకు వెళ్ళినప్పుడు, అవి ఎంతో బాగుంటే తప్ప, పొగడ్తలు ఇవ్వను. సరైన అభిప్రాయం వ్రాయటం, మన తరువాత రావాలనుకునే వారి పట్ల మన బాధ్యత అనుకుంటాను కూడ. కాని.. ఇక్కడి నుండి వెళ్ళిపోయే సమయంలో డేవిడ్, కాథ్‌లీన్‌లను మనస్ఫూర్తిగా అభినందించి, మరోసారి మా కుటుంబంతో కలసి ఇక్కడికి వస్తానని చెప్పాను. బ్రెకన్ ఒక మంచి మార్కెట్ ప్రదేశం. అస్క్ నది ఒడ్డున ఉంది. ఇది మిలటరీ కేంద్రం కూడ. బ్రేక్ ఫాస్ట్ అయ్యాక మరోసారి అక్కడ తిరిగి చూశాము. అక్కడ కొన్ని పాత కాలపు చర్చ్‌లు, భవనాలు ఉన్నాయి. ఆది వారం ఉదయం కాబట్టి పెద్దగా జన సందోహం లేదు. ప్రశాంతంగా ఉంది.

**నాలుగు జలపాతాలు**

మా వారాంతపు ఆశయంలో రెండవ భాగం, ఒక రోజులో నాలుగు జలపాతాలను కాలి నడకన వెళ్ళి దర్శించుకోవటం. చుట్టూ ఉన్న కొండల మీద నుండి క్రిందికి ఉరికే జల పాతాలు ఇక్కడ చాలా ఉన్నాయి. అందుకే దీనికి జలపాతపు ప్రాంతం అని మరో పేరు. ఇదంతా వన ప్రాంతం. బ్రెకన్‌బీకన్స్‌లో అధిక జనాకర్షణ కలిగిన ట్రెక్‌లలో ఇదొకటి. సరాసరిన ప్రతి సంవత్సరం 160,000 మంది ఇక్కడకు వస్తారట. ఇక్కడ కనిపించే జన్యు వైవిధ్యం విశేషంగా ఉంటుంది. యునెస్కోవారి జియో పార్కులలో ఒకటిగా ఈ ప్రాంతం గుర్తించబడింది కూడ.

బ్రెకన్ వెళ్ళిన మొదటి రోజు రాత్రి, భోజనానికి, 'గూర్ఖా కార్నర్' అనే ఒక నేపాలీ రెస్టారెంటుకు వెళ్ళాము. అక్కడున్న వారితో మాట్లాడుతున్నప్పుడు, అక్కడ కొన్ని నేపాలీ గూర్ఖా కుటుంబాలు స్థిరపడి ఉన్నట్లు మాకు తెలిసింది. బ్రిటిష్ సైనిక శక్తికి గూర్ఖా దళం అందించిన సేవలు చెప్పుకోదగినవి. సేవా కాలం పూర్తయిన తరువాత, వారికి బ్రిటన్‌లో ఉండిపోయే అవకాశం లభ్యమవటంతో, చాలామంది ఇక్కడ ఉండి పోయారు. అందువల్లనేమో, ఇంత చిన్న ఊరుకు రెండు నేపాలీ రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రత్యేకంగా చెప్పుకోవలసినదేమిటంటే, అక్కడున్న ఒక చిన్న



స్గూడ్ క్లట్ గూ-ఉన్ జలపాతం

సమాచార పత్రం నుండి మేము ఎంపిక చేసుకున్న 8 కి.మీ. ట్రెక్ పేరు, 'ది గూర్ఖా వాక్'. ఇది చూసి నేను ఆశ్చర్య పోయాను. నేను చిన్నప్పుడు ఉన్న ప్రదేశాలలో రాత్రుళ్ళు అందరూ నిద్ర పోయాక, కర్రను నేలకు తాటిస్తూ, పారా హుషార్ అంటూ ఊరికి కాపలా కాసే నేపాలీ పేరుతో ఇక్కడొక యాత్రా విశేషమా! అని. నా ఆశ్చర్యాన్ని గమనించిన డేవిడ్, ఈ కథంతా నాకు చెప్పాడు. 2015లో నేపాల్‌లో సంభవించిన ఘోర భూకంపానికి గురైన వారికి ఇక్కడి వారంతా సహాయ నిధిని సేకరించి పంపారట. అందుకు కృతజ్ఞతగా, స్థానిక నేపాలీలు ఈ గూర్ఖా ట్రెయిల్‌ను ఏర్పాటు చేశారట. పరాయిదేశం నుండి వచ్చి, ఈ దేశానికి సేవలందించిన వారితో స్థానికులు కలసి మెలసి ఉండటం వేల్స్ ప్రజల సౌమ్యతకు ఒక నిదర్శనం.

ఈ రోజు ఆకాశం మేఘావృతమై, ఎండ తీక్షణతకు గొడుగు పట్టింది. వర్షం లేదు. అందు వల్లనేనేమో మా అడుగులు ఉత్సాహంగా పడుతున్నాయి. ఒక గంట కారు ప్రయాణం తరువాత ఉదయం పదింటికల్లా అందరం ఒక చోట కలుసుకున్నాము. దోవ పొడుగునా కొండ వాలులలో లెక్కలేనన్ని గొర్రెలు కనిపించాయి. వేల్స్‌లో మనుష్యుల కంటే గొర్రెల సంఖ్యే ఎక్కువని ఒక ఛలోక్తి. రోడ్లు మాత్రం దిట్టంగా ఉన్నాయి. దూసుకు పోవాలనే ఉత్సాహం సహజంగానే కలిగింది. సైకిళ్ళమీద చాలా మంది రయ్యిన వెళ్ళిపోతున్నారు. సైకిల్ మీద యాత్రలు చెయ్యటం కూడ చాలా మందికి ఇష్టం. మా అందరి ఉత్సాహాన్ని నియంత్రించటానికి చాలా చోట్ల 'గొర్రెలు, గుర్రాలు రోడ్లు దాటుతుంటాయి. నెమ్మదిగా వెళ్ళుము' అని హెచ్చరికలను ఉంచారు. అందరూ కలుసుకున్న

ప్రదేశంలో, అప్పటికే తిరు వచ్చేసి ఉన్నాడు. మా నడక మొదలు పెట్టాము. తరువాత నాలుగు గంటలలో, ఎనిమిది కి.మీ. నడచి, నాలుగు జలపాతాలను చూశాము.

**మొదటిది : స్గూడ్ క్లబ్ గూ–ఉన్.** బోర్డుల మీద Sgwd Clun Gwyn అని ఉంటుంది. వెల్ష్ పేర్లు ఇంగ్లీషు లిపిలో ఉన్నా, పలకటం వేరుగా ఉంటుంది. స్గూడ్ అంటే మెట్లు మెట్లుగా ఎగువ నుండి దిగువకు పలుచని తెరలు వేలాడ గట్టినట్లు పడే జలపాతమని అర్థమట. ఈ జలపాతం పేరుకు అర్థం, ఇంగ్లీషులో, Fall of the White Meadow. జారుతున్న తెల్లపచ్చిక బయలు అన్నమాట. దానిని చూసినప్పుడు దేనిని తలపింపచేస్తుందో అదే పేరన్న మాట.

**రెండవది :** స్గూడ్ ఈ సాఫ్వ్ క్లిన్ గూ–ఉన్. బోర్డు మీద కనిపించేది.. Sgwd Isaf Clun Gwyn. దీని అర్థం, Lower fall of White Meadow అంటే ముందు చూసిన జలపాతానికి దిగువ భాగం అని.

**మూడవది :** స్గూడ్ వై పాన్వర్. (Sgwd y Pannwr). వెల్ష్ భాషను ఇంగ్లీషు చదివినట్లు చదివితే, అచ్చులు లేని పదాలుగా వింతగా అనిపిస్తాయి. దీని అర్థం, నిండు జలపాతంలో వూల్ ఉతుకుతున్నట్లని.

ఈ మూడు జలపాతాలు మెల్ట్ నదిలో భాగాలు. ఒక్కొక్క జలపాతం చేరుకునే జలాశయం చేరటానికి, చాలా లోతు క్రిందికి దిగవలసి వచ్చింది. ఆ దోవంతా చెదరని వనసంపద మధ్యగా సాగింది. పర్యావరణాన్ని, సహజ సౌందర్యాన్ని గౌరవించటం ఆ దోవంతా ప్రస్ఫుటంగా కనపడింది. మళ్ళీ దిగినంత దూరం ఎక్కవలసి వచ్చింది కూడ. అలవాటు లేని వారికి ఇది కష్టమే. మేము వెళ్ళిన రెండవ జలపాతం చుట్టూ ఉన్న దృశ్యం నాకు ప్రత్యేకంగా నచ్చింది. తడిస్తే మార్చుకోవటానికి వేరే దుస్తులు లేనందున, ఎవరమూ నీళ్ళ క్రిందికి వెళ్ళలేదు. కాని నాకైతే, సన్నటి తుంపర మీద పడుతుంటే, పై నుండి పాల నురగలా పడుతున్న నీటి ప్రవాహపు మేలి ముసుగులను చూస్తూ, అవి సృష్టిస్తున్న జల తరంగిణి నాదాలను వింటూ, రోజంతా అక్కడే కూర్చోవాలని అనిపించింది.

మూడవ జలపాతానికి వెళ్ళినప్పుడు అక్కడ కొందరు సాహస కృత్యాలు చేయటం కనిపించింది. దీనిని ఘిల్ స్క్రాంబ్లింగ్ అంటారట. జలపాతపుపై అంచుకు వెళ్ళి, పడే నీటితో పాటు క్రిందికి జారటం, లేదా దూకటం, మళ్ళీ పైకి వెళ్ళటం ఇలా సాగుతోంది ఆ వినోదం.



'స్గూడ్ అర్ ఎఫ్రా–ఉ' జలపాతం

మామూలుగా అది శిక్షణ పొందిన గైడు ఆధ్వర్యంలో చేస్తారట. శరీరాలకు జలపాతపు జలం అనుభూతిని ఇవ్వటంలో ఆనందం వెతుక్కుంటున్నారేమో వీళ్ళు అనిపించింది. ఆకులో ఆకునై, పూలలో పూలనై.. అన్నట్టే, ఇదొక వెతుకులాట.

ఆఖరుదయిన నాలుగవ జలపాతం, మనకు కనపడే బోర్డు మీద, Sgwd Yr Eira. దీనిని 'స్గూడ్ అర్ ఎఫ్రా–ఉ' అని పలకాలి. జలపాతం అన్నిటికన్నా పెద్దది. అద్భుతంగా ఉంది. ఇది హెప్టే నది మీద ఉంది. దీని అడుగు భాగం చేరటానికి, నిలువుగా చాలా మెట్లు (170) దిగి వెళ్ళ వలసి వచ్చింది. వెళ్ళాక జలపాతం వెనుక వైపుకు వెళ్ళటానికి కూడ వీలుంది. తడిచిపోయినా ఫరవాలేదు అనుకున్న మిత్రులు కొందరు అలా వెళ్ళారు.

మొదటి రోజు కొండలెక్కటం శారీరకంగా మమ్మల్ని పెట్టిన కష్టాన్ని, తామే పడుతూ.. మమ్మల్ని మా మనసులను అలరించాయి ఈ జలపాతాలు. పైనుండి పడేటప్పుడు ఉరుకుల పరుగుల ఉరుముల శబ్దం, జలాశయం నుండి వాలు వెతుక్కుంటూ జాలు వారే సెలయేరుగా, స్థిమిత పడిన గలగల శబ్దం రెండూ ఏక కాలంలో అద్భుతమైన పాటకు బాణీ కడుతుంటే వినగలగటం మా అదృష్టం. సేదతీరిన మనఃశరీరాలతో, ఏదో సాధించామన్న తృప్తితో ఆ వారాంతం అలా గడచిపోయింది. ఇదంతా ఏర్పాటు చేసిన మా నాయకుడు తిరుకు మరొకసారి కృతజ్ఞత తెలుపుకుని ఇంటి దోవ పట్టాము.

**అబర్గావెనీ**

తిరుగు ప్రయాణంలో, బోర్డుల మీద 'అబర్గావెనీ' అనే పేరు చూడగానే, చిరకాల మిత్రులు, నా కంటే ఎంతో ముందు నుండి, అంటే 50 సంవత్సరాలుగా యునైటెడ్ కింగ్డమ్ ఆరోగ్య సంక్షేమ విభాగం, NHS (నేషనల్ హెల్త్ సర్వీస్)లో



డాక్టరు బాపూజీ రావు గారితో డాక్టర్ శేషగిరి రావు

సైకియాట్రిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టరు బాపూజీ రావు గారు మనసులోకి వచ్చారు. చాలా కాలంగా ఆయనను కలుద్దామను కుంటున్నాను. ఆయన మూడున్నర దశాబ్దాలుగా వేల్స్ నివాసి. తన సుదీర్ఘ సేవా కాలంలో ఎంతోమంది రోగులకు మానసిక వైద్యాన్ని, మానసిక వైద్యులకు శిక్షణను అందించిన ఘనత ఈయన సాధించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి ఈయన. హాస్యం పండించటంలో వీరికి వీరే సాటి. ఈ దేశంలో గత కొన్ని దశాబ్దాలుగా నివసిస్తున్న తెలుగు వారిని సంస్కృతీపరంగా కలిపి ఉంచటానికి ఈయన అందించిన సేవలు శ్లాఘనీయం. ఈయనతో మాట్లాడటం నాకు ఎప్పుడూ సంతోషకరమే. ఆ ప్రక్కనుండే వెళుతూ, కలవకుండా వెళ్ళటానికి మనస్కరించ లేదు.

'ది గేబుల్స్' (డా. బాపూజీ రావు గారి ఇంటి పేరు) నాలాగే, ఎందరికో సుపరిచితం. కారు అబర్గావెనీ వైపు మళ్ళింది. ముందుగా మెర్థిర్ టిడ్ఫిల్ అనే ఊరు దాటాలి. ఆ ఊరి బయట, పెండెరిన్ డిస్టిలరీ కనపడింది. అంటే నేను ఇంకా బ్రెకన్ బీకన్స్ నేషనల్ పార్కులోనే ఉన్నానన్న మాట. బహుశా మంచి వెల్ష్ సింగిల్ మాల్ట్ విస్కీ ఇదొక్కటేనేమో. బ్రెకన్ బీకన్స్ నదులలోని తేట నీటి రుచే దీని రహస్యమేమో. ఈ మధ్య నా విస్కీ మిత్రులు చాలా మంది దీనినే ఎంచుకుంటున్నారు. రుచే కాకుండా, సరసమైన ధర కూడా ఒక కారణమేమో!

కొంచెం సేపట్లోనే అబర్గావెనీ వచ్చేశాను. ఊరు మొదట్లో 'బ్లేనవాన్ బిగ్ పిట్' కు వెళ్ళే దారి చూపిస్తూ బోర్డు కనపడింది. ఇది ఒకప్పుడు బొగ్గు గని. ప్రస్తుతం వేల్స్ పరిశ్రమల అనుక్రమణాన్ని తెలిపే మ్యూజియం. ఇది యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపదలో భాగంగా గుర్తింపు పొందింది. చూడవలసిన ప్రదేశం. కాని నేను సమయాభావం వలన అక్కడ ఆగలేక పోయాను.

ది గేబుల్స్‌లో నా రాక కోసం చూస్తున్న డా.బాపూజీ రావు గారు, నేను వెళ్ళగానే, మధ్యాహ్నామవటంతో, వారింటి నుండి కొద్ది నిముషాల దూరంలో ఉన్న సుగర్ లోఫ్ మౌంటెన్ వాలులో ఉన్న విన్ యార్డులో ఉన్న రెస్టారెంట్లు తీసుకెళ్ళారు. వారున్న ప్రాంతంలో, వృక్షాల మధ్య ఒదిగి ఉన్న పెద్ద ఇళ్ళు ఉన్నాయి. కంచెలుగా పెంచిన చెట్ల వలన, ఇళ్ళు పూర్తిగా కనపడలేదు. ఆ వీధులలో కేవలం ఒక కారు మాత్రమే పడుతుంది. ఎదురుగా వచ్చే కార్లకు దోవ ఇవ్వటానికి అక్కడక్కడా రోడ్డు పక్కన కొంత చోటు వదిలారు. ఎదురు బొదురుగా వచ్చే కార్లలో ఏది ఈ ఖాళీ ప్రదేశానికి దగ్గరలో ఉంటుందో వారు అక్కడ ఆగుతారు, రెండవ కారు వెళ్ళే వరకూ. ఇక్కడి వారిది, చెట్లను కూల్చి పెద్ద రోడ్లు వేయకుండా కొంచెం సర్దుకు పోయే తత్వమేమోనని అనిపించింది.

మేము వెళ్ళిన రెస్టారెంటు నుండి చుట్టూ ఉన్న కొండలు అందంగా కనపడుతున్నాయి. తాపీగా లంచ్, తరువాత కాఫీ త్రాగుతూ, చాలా కాలం నుండి చెప్పుకోవలసిన కబుర్లతో సత్కాలక్షేపం చేశాము. అక్కడ తయారు చేసే రెడ్, వైట్ వైన్‌లను అమ్మటానికి ఒక షాపు కూడా అక్కడ ఉంది. అక్కడ ఉన్నంత సేపూ ఫ్రాన్స్‌లో ఉన్న భావం కలిగింది. కొంచెంసేపు విన్ యార్డ్ చుట్టూ నడిచాము. అబర్గావెనీ చుట్టూ ఉన్న ఏడు కొండలను బాపూజీరావు గారు చూపించారు. ఎంతో కాలం పాటు ఆ ప్రాంతంతో పెనవేసుకున్న ఆయన జీవితంలో, ఆహ్లాదకరమైన విషయాలను ఆయన ప్రస్తావించారు. తనున్నాననే కాకుండా, అబర్గావెనీ చూడవలసిన ప్రదేశమని, ముఖ్యంగా ఇక్కడ జరిగే ఫుడ్ ఫెస్టివల్ కు తప్పక రావాలని ఆయన సూచించారు. ప్రశాంతంగా ఉన్న 'ది గేబుల్స్'లో, బాపూజీ రావు గారి పుస్తకాల మధ్య, ఆయన విజ్ఞానాన్ని పంచుకునే ప్రయత్నంలో మరో గంట గడిపి, ప్రస్తుతానికి వేల్స్‌కు 'గుడ్ బై' చెప్పి, వారాంతపు విశేషాలను నెమరు వేసుకుంటూ ఇంటి దారి పట్టాను.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: జయశ్రీ అట్లూరి (స్టోక్ ఆన్ ట్రెంట్)
e-mail: jayasreeatluri@hotmail.com

# రాజ్యాంగ శాసనసభ చర్చ

– ఎ. బి. సాయిప్రసాద్

**డా.** బి.ఆర్. అంబేద్కర్ ద్వారా అధ్యక్షుడి హెూదాలో తయారు చేయబడిన మన రాజ్యాంగం 75 వసంతాలను పూర్తి చేసుకుంది. హేమా హేమీలతో కూడుకున్న రాజ్యాంగ శాసనసభ (CONSTITUENT ASSEMBLY) క్లాజు (CLAUSE) వారిగా చర్చించి తొలుత పీఠికను ఆ తరువాత మొత్తం ముసాయిదాను ఆమోదించింది. తృతీయ పఠనంలో నవంబరు 26,1949న సవరణలకు అధికార ముద్రపడింది. 42వ రాజ్యాంగ సవరణ ఆక్ట్ 1976లో చేర్చబడిన మాటలను–లౌకిక (SECULAR) సామ్యవాద (SOCIALIST)–తొలగించలేమని 25–11–2024న మనదేశపు సుప్రీంకోర్టు కీలకమైన తీర్పునిచ్చింది. 16,17,18 (అక్టోబరు నెల, 1949) తారీఖులలో జరిగిన చర్చలో దేవుడు, మహాత్మాగాంధి, లౌకిక విధానం (SECULARISM), సమాజవాదం లాంటి అంశాలను విపులంగా చర్చించి వాటిని రాజ్యాంగ శాసనసభ స్వీకరించ లేదన్న సంగతి మనలో చాలా మందికి అసలు తెలియదు.

రాజ్యాంగ శాసనసభ నిపుణ సలహాదారుడుగా నియమింపబడిన శ్రీ బెనగల్ నరసింహరావు (B.N.RAU) రాజ్యాంగపు మొదటి ముసాయిదాను ఫిబ్రవరి 1948లో తయారు చేసారు. (1947లో శ్రీ బి. యన్. రావు, బర్మా (ప్రస్తుతపు మయన్మార్) రాజ్యాంగాన్ని తయారు చేసారు) దీనిని రాజ్యాంగ శాసనసభ, ప్రథమ పఠనము (FIRST READING)గా స్వీకరించింది. దీనిపై చర్చ 1948వ సంవత్సరపు 4,9 తారీఖులలో జరిగింది. శ్రీ. బి. యన్. రావుగారు సమర్పించిన ముసాయిదాలో పీఠిక యిలా ఇవ్వబడింది. "భారతీయులమైన మేము, సమష్టి శ్రేయస్సు (COMMON GOOD) ను పెంపు చేయడానికి, మా ద్వారా ఎన్నుకోబడిన రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ మాకు మేము అందజేసుకుంటున్నాము". 1 బాధ్యత అప్పజెప్పబడిన శ్రీ. బి.యన్.రావు, ఒక నెల రోజుల లోపునే ఈ ముసాయిదాను తయారుచేసారు.

16.10.1948న ద్వితీయ పఠనాన్ని స్వీకరించారు. ఈ సభలో రాజ్యాంగ కమిటి ఛేయిర్‌మెన్ అయిన డా.బి.ఆర్. అంబేద్కర్ తాను, యితర సభ్యులతో–సర్వశ్రీ కె. యమ్. మున్షీ, మహమ్మద్ సాదుల్లా, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్. గోపాలస్వామి అయ్యంగార్, యన్. మాధవరావు (ఆరోగ్యం కారణంగా రాజీనామా చేసిన బి. యన్. మిత్తర్ స్థానంలో) టి.టి. కృష్ణమాచారి (1948లో కీర్తిశేషులైన డి.పి. ఖైతాన్ స్థానంలో) కలిసి తయారు చేసిన రాజ్యాంగ




ముసాయిదాను ప్రవేశ పెట్టారు. ద్వితీయ పఠనం చర్చ 16.10.1948 న ప్రారంభమైనది. ఇందులో ముసాయి దాను భాగభాగాలుగా (CLAUSE BY CLAUSE) సభ్యులు చర్చించారు. ఈ సభ ఆరంభంలో ఒక సభ్యుడు రాజ్యాంగ ప్రామాణిక ముసాయిదా ఇంకా పూర్తిగా తయారు కాలేదు కాబట్టి పీఠికకు సంబంధించిన చర్చను తృతీయ పఠనంకు వాయిదా వేయాలని సూచించాడు. ప్రముఖ ఉర్దూకవి, ఇన్‌ఖిలాబ్ జిందాబాద్ అన్న నినాదాన్నిచ్చిన కాంగ్రెస్ సభ్యుడు శ్రీ మౌలానా హసరత్ మోహాని, ఆ సభ్యుడి ప్రతిపాదనను తీవ్రంగా ఖండించాడు. మౌలానా హసరత్ మోహానీను ఎప్పుడూ సమర్థించని శ్రీ కే. యమ్. మున్షీ లేచి నిలబడి "జీవితంలో ఒకసారి నేను మౌలానా హసరత్ మోహానీను సమర్థిస్తున్నాను" అని అన్నారు. రాజ్యాంగ శాసనసభ అధ్యక్షుడు డా. రాజేంద్ర ప్రసాద్ కూడా శ్రీ మౌలానా హసరత్ మోహానీను సమర్థించారు. అంతటితో వాయిదా ప్రతిపాదన వీగిపోయింది. చర్చ ప్రారంభంలో రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైయిర్ మన్ డా. బి. ఆర్. అంబేద్కర్ ముసాయిదా పీఠికను ప్రవేశపెట్టారు. "భారత దేశాన్ని ఒక సార్వభౌమ (SOVEREIGN) ప్రజాస్వామిక (DEMOCRATIC) గణతంత్ర (REPUBLIC) దేశంగా పరిగణించాలని భారతీయులమైన మేము సత్యనిష్ఠాత్మకంగా (SOLENNLY) తీర్మానించు కుంటున్నాము." 2 బి.ఆర్. అంబేద్కర్ ఈ ప్రస్తావనను శ్రీమౌలానా హసరత్ మోహాని ప్రతిఘటించారు. 22–01–1947న ఆమోదింపబడిన ఆబ్‌జెక్టివ్ రెసెల్యూషన్ (OBJECTIVE RESOLUTION)ను ప్రస్తావిస్తూ అందులో స్వతంత్ర (INDEPENDENT) సార్వభౌమ అధికారం (SOVEREIGN) గణతంత్ర (REPUBLIC) అన్న అతి ముఖ్యమైన మాటలున్నాయి. కాని రాజ్యాంగ నిర్మాణ కమిటి సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రను మాత్రం వాడింది. బహుశా వారి దృష్టిలో సార్వభౌమ అన్నమాటలోనే స్వతంత్ర అన్న అర్థం ఉన్నందువల్లవారు దానిని వదిలి వేసారను కుంటాను అని మోహానీ తమ సవరణగా మూడు వాక్యాలను సూచించారు.

- సార్వభౌమ, స్వతంత్ర, గణతంత్ర (రాజ్యం)
- సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర
- సార్వభౌమ ప్రజాస్వామ్య ప్రభుత్వం

వాదోపవాదాలను విన్న తరువాత సర్వ సమ్మతితో సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర (రాజ్యం) వాక్యాన్ని స్వీకరించడం జరిగింది.

**1949వ సంవత్సరపు అక్టోబరు నెల 17వ తారీఖున రాజ్యాంగపు పీఠిక పరమైన చర్చను ప్రారంభిస్తూ :** మన రాజ్యాంగపు పీఠిక దేవుడి పేరుతో (IN THE NEME OF GOD) ప్రారంభంకావాలని శ్రీహెచ్. వి. కామత్ తమ సవరణను ప్రవేశపెట్టారు. శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా (SHBBAN LAL SAKSENA) పండిట్ గోవింద మాలవ్యాలు హెచ్.వి. కామత్ గారిని సమర్థించారు. తమ వాదనను కొనసాగిస్తూ శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా ఐరిష్ రాజ్యాంగం దేవుడి పేరుతోనే మొదలవుతుందని చెప్పారు. అధ్యక్షుడు కోరగా తమ సవరణను–దేవుడి పేరుతో–వాపసు తీసుకొన్నారు. బీహారు నుండి ఎన్నుకోబడిన శ్రీ గుప్తనాథ్ సింగ్ (GUPTHANATH SING) చర్చలో పాల్గొంటూ: "దేశము, అన్ని దేవుళ్ళకంటే గొప్పది. దేశము దేవుళ్లకే దేవుడులాంటిది. దేశము ప్రజల ప్రతినిధి అన్నప్పుడు దాని అర్థం అది దేవుడే అని సూచిస్తుంది." అన్నారు. దేవుడి పేరు పీఠికలో చేర్చడమంటే ఏదోఒక మత విశ్వాసాన్ని ప్రోత్సహించడమవుతుంది. ఇది ప్రాథమిక హక్కులను (FUNDAMENTAL RIGHTS) ధిక్కరించడం అవుతుందని ఒక సభ్యుడు తన అభిప్రాయాన్ని తెలిపాడు. చాలా గంభీరంగా జరుగుతున్న చర్చ వాతావరణాన్ని చల్లబరచేందుకు అస్సాము నుండి ఎన్నికైన సభ్యుడు రోహిణీ కుమార్ చౌధరి కలుగజేసుకుంటూ అయ్యా! మీరు దేవుడి పేరును చేర్చే పక్షంలో 'దేవత' అన్న మాటను కూడా చేర్చండి. నేను కామాఖ్యా దేవి భక్తుడను అని అన్నాడు. శ్రీమతి పూర్ణిమా బెనర్జీ, హెచ్.వి కామత్ గారిని తమ సవరణను వాపసు తీసుకొమ్మని అభ్యర్థించింది. మద్రాసు నుండి ఎన్నుకోబడిన శ్రీ వి. యల్. మునిస్వామి పిళ్ళై, హెచ్.వి. కామత్‌ను బలపరచడంతో వోటు ద్వారా నిర్ణయించ వలసిందిగా అధ్యక్షుడు. డా. రాజేంద్రప్రసాద్‌ను కోరారు. తప్పనిసరి పరిస్థితులతో ఓటింగు జరిగింది. దేవుడి పేరుకు అనుకూలంగా 41 వోట్లు ప్రతికూలంగా 68 ఓట్లు పడడంతో, 'దేవుడి పేరుతో'ను పీఠికలో చేర్చకుండా వదిలేసారు. హెచ్.వి. కామత్ గారు ఎంతో బాధపడ్డారు. సభాధ్యక్షుడితో, అయ్యా ఇది వార్షిక సంఘటనలలో (ANNALS)ని బ్లాక్‌డే. (BLACK DAY) దేవుడు దేశాన్ని రక్షించుగాక అన్నారు. హెచ్.వి. కామత్ గారు దేవుడి పేరుతో మన రాజ్యాంగ పీఠిక మొదలవ్వాలని సవరణను ప్రతిపాదించారు. శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా శ్రీ గోవింద మాలవ్యాలు మరో అడుగు ముందుకు వేస్తూ రాజ్యాంగ పీఠికలో దేవుడితో పాటు జాతిపిత మహాత్మాగాంధి గారి పేరు ఉండాలని పట్టుపట్టారు. శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా తన సవరణను ఇలా ప్రవేశపెట్టారు. "సర్వశక్తి సంపన్నుడైన (ALMIGHTY) ఆ భగవంతుడి పేరుతోనూ, ఏ భగవంతుడి ప్రేరణ, మార్గదర్శకత్వంతో తన చిరంతనమైన అహింసా సత్యాల సిద్ధాంతం ద్వారా బానిసత్వం నుండి, స్వాతంత్ర్యం వైపు దేశాన్ని తీసుకు వెళ్ళాడో ఆ మహాత్మగాంధి పేరుతోనూ, లక్షలాదిమంది త్యాగధనుల, అమర వీరుల పేరుతోనూ.."3. ప్రారంభకావాలని కోరారు. ఇదే తరహాలో పండిట్ గోవింద మాలవ్యాతన సవరణలో ఇలా పేర్కొన్నారు.

''సర్వాధికారి (SUPREME BEING) జగత్ రక్షకుడైన (LORD OF THE UNIVESE) ఆ పరమేశ్వరుడి దయతో, మా భక్తి శ్రద్ధలను సవినయంగా సమర్పించు కుంటూ మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధి అనే గొప్ప నాయకుడిని స్మరిస్తూ, దేశ స్వాతంత్ర్యం కోసం. శ్రమపడిన, పోరాడిన, అనేక బాధలను సహించిన ప్రజలను గుర్తు చేసుకుంటూ, భారతీయులమైన మేము...4 దేవుడి పేరుతో మాటను తొలగించిన తరువాత గాంధిగారి పేరును గురించి రాజ్యాంగ శాసన సభలో వాదోపవాదాలు జరిగాయి. బీహారు నుండి ఎన్నికైన శ్రీ బ్రజేశ్వర ప్రసాద్, శ్రీ శిబ్బన్ లాల్ సక్సేనా ప్రతిపాదనను ఆక్షేపించారు. తమ వాదనను కొనసాగిస్తూ: "అయ్యా మన రాజ్యాంగంలో మహాత్మగాంధి గారి పేరును చేర్చడానికి నేను ససెమిరా ఒప్పుకోను. కారణం శ్రీ బి. ఆర్. అంబేద్కర్ గారు ప్రవేశపెట్టిన రాజ్యాంగం అమెరికా వారి సుప్రీంకోర్టు నిర్ణయాల ఆధారంగా, భారత ప్రభుత్వ 1935వ ఆక్టను అనుసరించి తయారు చేయబడింది. మన రాజ్యాంగం గాంధిగారి సిద్ధాంతాల ఆధారంగా తయారుచేయబడి వుంటే దానిని సమర్థించే వారిలో మొదటి వాడుగా ఉంటాను. ఇది కుళ్ళిన (ROTTEN) రాజ్యాంగం. ఇందులో గాంధిగారి పేరును లాగడం సముచితం కాదు" అన్నారు.

రాజ్యాంగ శాసన సభ రెండవ పఠనం (SECOND READING) లో దేవుడు, మహాత్మాగాంధి తరువాత దేశం పేరుకు సంబంధించిన చర్చ జరిగింది. మౌలానా హసరత్ మోహాని చర్చలో పాల్గొంటూ దేశం పేరు అప్పటి U.S.S.R (UNION OF SOVIET SOCIALIST REPUBLICS) లాగా UISR (UNION OF INDIA SOCIALISTIC REPULICS)గా ఉండాలన్నారు. మన రాజ్యాంగం సోవియట్ రష్యా రాజ్యాంగంలాగా ఉండాలని, ఆ రాజ్యాంగం నుండి మనం ప్రేరణను పొందాలని మౌలానా వాదించారు. శ్రీ దేశబంధు గుప్తగారు మౌలానా ప్రతిపాదనను ఖండించారు.

అంతటితో ఆ చర్చ ముగిసింది. సరిగ్గా అప్పుడే మద్రాసు ప్రెసిడెన్సీ నుండి ఎన్నికైన శ్రీ కల్లూరు సుబ్బారావు లేచినిలబడి ఋగ్వేదంలో భారత్ అన్న పదం ఉందని తెలిపారు. (సాక్షి, 26-11-2024) భారత్ అన్న మాట ఎంతో విశిష్టమైనదని భావించి సభ్యులు ఇండియా దట్ ఈజ్ భారత్‌ను స్వీకరించారు. బీహారు నుండి కాంగ్రెస్ టికట్ పై ఎన్నుకోబడిన శ్రీ కె.టి. షా (కుషాల్ తలక్సి). రాజ్యాంగ ముసాయిదాకు క్లాజువారిగా జరిగిన చర్చలో చాలా చురుకుగా పాల్గొన్నారు. అందరి కంటే ముందు రాజ్యాంగ పీఠికలో లౌకిక (SECULAR) అన్నమాటను చేర్చాలని వాదించారు. తమ సవరణను వారు ఇలా ప్రతిపాదించారు. భారత దేశము లౌకిక కేంద్ర (FEDERALIST) సమాజవాద (SOCIALIST) సమితి (UNION) రాజ్యం (STATE) అవుతుంది. ఈ మాటలు పరిపాలనా విధానాన్ని సూచిస్తాయన్నారు. అదేవిధంగా సమాజవాద (SOCIALIST)మాట అందరికి సమన్యాయం సమ అవకాశాలను తెలియబరుస్తుందన్నారు. శ్రీ బ్రజేశ్వర్ ప్రసాద్ కూడా 'సెక్యులర్' అన్న మాటను చేర్చాలన్నారు. దేశం విధానం (POLICY) ఏమై ఉండాలి. సమాజ ఆర్థిక పక్షపు రూపురేఖలు ఎలా ఉండాలి అన్నవాటిని ప్రజలే సమయం, పరిస్థితులకు అనుగుణ్యంగా నిర్ణయించాలి. అంతేకాని వాటిని రాజ్యాంగంలో చేర్చకూడదు.

ఆ విధంగా చేయడం అన్నది ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడం అవుతుందని రాజ్యాంగ నిర్మాణ కమిటి అధ్యక్షుడైన డా.బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అంతేకాదు సమాజవాద సంస్థకన్నా మెరుగైన సామాజిక సంస్థను ప్రజలే ఏర్పరుచుకోగలరు అని కూడా అన్నారు. హెచ్.వి. కామత్ గారు శ్రీ. కే.టి. షా ప్రతిపాదనను ప్రతిఘటించారు. మత సహనం భారతీయుల జీవన శైలిలో ఒక అంతర్భాగం. ఆకారణంగా లౌకిక (SECULAR) అన్న మాటను పీఠికలో చేర్చరాదని మన దేశపు తొలి ప్రధానమంత్రి భావించారు. కాని, అత్యవసర పరిస్థితి (EMERGENCY) ని విధించి 42వ సవరణ ఆక్ట్ 1976 ద్వారా సామ్యవాద (SOCIALIST) లౌకిక (SECULAR) నైతిక నిష్ఠ (INTEGRITY) అన్న మాటలను పీఠికలో శ్రీమతి ఇందిరాగాంధి గారు చేర్చారు. ఆనాటి సుప్రీమ్ కోర్టు అత్యంత సీనియర్ జడ్జి జస్టిస్ హన్స్ రాజ్ ఖన్నా 1976లో ఎమర్జెన్సీకు తమ అసమ్మతిని తెలియ జేసిన ఏకైక వ్యక్తి (ADM JABALPUR V SHIV KANY SHUKLA CASE DURING 1975-1977) ఆకారణంగా అతనికి దక్కవలసిన చీఫ్ జస్టిస్ పదవి దక్కలేదు. (ప్రస్తుత సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ జిస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా సోదరుడి పుత్రుడు)

రాష్ట్ర ప్రభుత్వాలు- గుజరాత్ జమ్ము&కాశ్మీర్, తమిళనాడు ఆనాటి కేంద్ర పాలిత ప్రభుత్వాలు మేఘలయా, నాగాల్యాండ్‌లు తమ శాసనసభలలో, ఆమోదాన్ని తెలియ బరచలేదు. అత్యవసర పరిస్థితి తరువాత శ్రీ మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో పీఠికలో చేర్చబడిన మాటలను తొలగించాలన్న ప్రతిపాదనను తీసుకువచ్చారు. కాని ఎగువసభలో తమ పార్టీకు ఆధిక్యం లేకపోవడం వల్ల అది జరగలేదు 250 మంది సభ్యులున్న ఎగువ సభలో అప్పుడు కాంగ్రెసు పార్టీకు 163 మంది సభ్యులుండడం వల్ల ఆ బిల్లుపాసు కాలేదు తరువాత ప్రధానమంత్రి శ్రీ వి. పి. సింగు కూడా ప్రయత్నించారు. అప్పుడు కూడా పూర్తిగా కుదరలేదు. రాజ్యాంగపు 43, 44వ సవరణల ద్వారా కొంత సఫలతను సాధించడమైనది.

పండిత్ లక్ష్మీకాంత మిశ్ర ముసాయిదాలో వాడబడిన యూనియన్ ఆఫ్ స్టేట్స్‌ను గురించి చర్చిస్తూ రాజ్యాంగ సాహిత్యంలో స్టేట్ అన్నమాటలో సార్వభౌమత్వమూ, స్వాతంత్రమూ అన్న అర్థాలున్నాయి. ప్రావిన్స్ (PROVINCES) ప్రదేశ్, దేశం అన్నమాటలు గందర గోళాన్ని సూచిస్తాయన్నారు. శ్రీ జవహార్ లాల్ నెహ్రూగారు కలగజేసుకుని ప్రాంతాలు (PROVINCES) ప్రదేశ్ ఈ రెండూ స్టేట్స్ (రాష్ట్రాలను)ను సూచిస్తూయన్నారు. దాంతో స్టేట్స్‌కు బదులుగా ప్రావిన్స్ లేదా ప్రదేశ్ అన్న మాటను పండిత్ లక్ష్మీకాంతం మిశ్ర ఉపసంహరించుకున్నారు. కేశవానంద భారతి కేసులోనూ, యల్.ఐ.సి. ఇండియా కేసులోనూ, బొమ్మాయి కేసులోను తమ సంచలనాత్మక తీర్పులలో రాజ్యాంగపు పీఠిక రాజ్యాంగపు అంతర్భాగం అని సుప్రీంకోర్టువారు నొక్కి వక్కాణించారు.

దేశపు అత్యున్నత అధికారాన్ని రాజ్యాంగంగా పరిగణించవచ్చును. దేశపు సుపరిపాలనకు కావలసిన నియమాలను రాజ్యాంగంలో క్రోడీకరించడం జరుగుతుంది. మన రాజ్యాంగం యునైటెడ్ కింగ్‌డమ్ రాజ్యాంగంలా అలిఖితమైనది కాదు. మనది లిఖిత రాజ్యాంగం. మన రాజ్యాంగం ప్రపంచపు లిఖిత రాజ్యాంగాలలో అది సుదీర్ఘమైనది (LENGTHIEST). మన రాజ్యాంగపు పీఠికలోని తొలివాక్యం -We the people of India- అతిసార గర్భిత వాక్యం. ఈ వాక్యం ప్రత్యేకతను లేదా గొప్పతనాన్ని శ్లాఘిస్తూ...మాటల గొప్పతనాన్ని శ్లాఘిస్తూ ప్రముఖ న్యాయవాది కీర్తిశేషులు నానీ పాల్కీవాలా యిలా అన్నారు: it is a power of attorney given by freedom, not a charter of freedom given by power.

డా. ఎ.ఐ. సాయిప్రసాద్
బెంగుళూరు, ఫోన్ : 9980567541.

# తిరుక్కురళ్

– యన్. లక్ష్మీ అయ్యర్

తిరుక్కురళ్లోని ఎనిమిదవ అధ్యాయము అణ్బుడమై. ఇందులో ప్రేమ యొక్క మహిమను తిరువళ్ళువర్ పదేపదే చెప్తున్నారు. ఇందులోని మొదటి కురళ్ళ్ లో తిరువళ్ళువర్ చెప్పడమేమిటంటే "ప్రేమ అనేది హద్దులు లేనిది. దానికి ఎల్లలు సమయాలు షరతులు ఉండవు. ఆ ప్రేమ ఒకసారి లోపల ఎవరి మీదన్నా కలిగితే అది మనసులోనే గూడు కట్టుకొని ఉండిపోతుంది. ఆ మనసులోని ప్రేమ బయటికి కనబడేది ఎప్పుడు? అలా ప్రేమించబడే వ్యక్తిని చూసిన వెంటనే ఎన్ని సంవత్సరాల తర్వాత అయినా కూడా కళ్ళ నుంచి భాష్పాలుదానంతట అవే రాలుతాయి. లోపల ఉండి ప్రేమ బయట దాన్ని కళ్ళు కన్నీటి చుక్కల ద్వారా వ్యక్తపరుస్తుంది. ఆర్వెలర్ పూసలు తరుణ్ ఇదే అధ్యాయంలో ఆయన ప్రేమ లేని శరీరాన్ని, ప్రేమలేని మనసుతో ఉన్న వ్యక్తులను తూలనాడారు. అలాంటి వ్యక్తులు ఒకవేళ ఉంటే ఈ లోకంలో అది అస్తిపంజరంతో మాంసంతో కూడుకున్న దేహం మాత్రమే. అది ప్రాణం ఉండి కూడా జీవచ్ఛవంతో సమానమని హేళన చేస్తున్నారు. వ్యక్తికి ముఖ్యంగా మనిషికి కావలసింది ప్రేమ అని ఆయన జాటి చెప్పారు

**అణ్బిర్కుమ్ఉండోఅడైక్కుమ్తాఱ్ఱాఆర్వలర్**
**పుణ్కణీర్పూసల్తరుమ్**

ఇక తొమ్మిదవ అధ్యాయము విరున్దోమ్ బల్ అంటే అతిధి సత్కారం. ఇక్కడ వళ్ళువర్గారు అతిధి సత్కారాన్ని గురించి చక్కగా వివరిస్తున్నారు. భారతీయ సనాతన సంప్రదాయంలోని ఒక భాగంగా అతిధి దేవోభవ అనే సిద్ధాంతాన్ని మనం నమ్ముతాము. దాన్ని గురించి చక్కగా ఇందులో వళ్ళువర్ గారు వివరించారు కుటుంబంలో నిర్వహించే పెద్ద ఘనకార్యం ఏంటంటే "ఇంటికి వచ్చే అతిధులను చిరునవ్వుతో వారిని పలుకరించి, స్వాగతం పలికి, వారికి సత్కారం చేసి, అన్నం పెట్టి, సహాయం చేసి పంపడమే అని మొదటి కురళ్లోవళ్ళువర్చెప్పారు

**ఇరుణదొణ్బీఇల్వాఱ్ఱ్వదెల్లాంవిరుణ్దొణ్బీ**
**వేళాణ్మైసెయ్దర్పొరుట్టు**

ఇంట్లో ఉన్న వస్తువులు మనకు సంపాదించే సొమ్ము యొక్క విలువ ఆ ఇంటి అతిథి సత్కారం ద్వారానే వ్యక్తపరుస్తుంది అని ఆయన అంటున్నారు. **ఇక 82 కురళ్** అత్యధిక అత్యద్భుతమైనది

**విరున్దు పుర క్కాత్తాణ్ఉండల్సావా**
**మరున్దేణుమ్వోణ్డా పా ట్ ట్రాణ్ రు**

చాలా మంది అతిథులకు చేయ వలసిన మర్యాదలు చెయ్యక స్వార్ధ పరులుగా వుంటారు అలాంటి వారిని కవి హేళన చేస్తున్నారు . అంటే ఇంటికి వచ్చిన అతిధిని వదిలేసి విడిగా కూర్చుని తాను మాత్రం భుజించడము చాలా నీచమైన కార్యం అంటున్నారు. అతిథిని వదిలి విడిగా తాను అమృతమైనా కూడా విడిగా తీసుకోడం సరియైనది కాదు. అంటే వచ్చిన అతిధి ఇవ్వకుండా ఏమిపెట్టకుండా తాను భుజించడం చాలా తప్పు. అది అమృతమైన కూడా అలా చేయకూడదు అనిపదేపదే చెప్పారు. వళ్ళువర్ దాన్ని చావు నుండి తప్పించే మందైనా కూడా ఏదైనా కూడా సరే అందరికీ ఇచ్చి భుజించాలి. అంతేగాని ఇంటికి వచ్చిన వారిని వదిలి విడిగా గోప్యంగా గదిలో తను మాత్రం భుజించడం చాలా నీచమైన స్వభావంగా పేర్కొన్నారు.

**ఇక 84 కురళ్లో** అతిథి సత్కారం ఎలా చేయాలని చక్కగా వివరించారు.

**అగన్మర్నుసెయ్యాళ్ ఉ తైయుంముగణ్మర్న్ను**
**నల్ విరున్దోమ్బువాణ్ ఇల్**

ఈకురళ్ విశేషమేమిటంటే ‘‘వచ్చిన అతిధిని చిరునవ్వుతో పలకరించి వారికి అతిథి సత్కారము చేసి వారిని తృప్తిపరిచి ఆ ఇంట్లో ఉన్నంతసేపు వారిని సంతోషంగా ఉంచితే ఆ మహా విష్ణువు ధర్మపత్ని శ్రీ మహాలక్ష్మి సంతోషించి ఆ ఇంటిలో కొలువై ఉంటుంది అని చక్కగా వివరిస్తున్నారు. అంటే ఎక్కడైతే అతిథి సంతోషంగా ఆతిథ్యం పొంది సంతోషంగా వుంటారో అక్కడ సిరిసంపదలు సదా వర్ధిల్లుతాయి అన్న భావం.

**ఇక 86వ కురళ్**

**సెల్విరిందోమ్బివరువిరుందుపార్తిరుప్పాన్**

**నల్ విరుందువానత్తవర్కు**

ఇంటికి వచ్చిన అతిథిని అతిధి సత్కారం చేసి వారు వెళ్లిన పిదప ఇంకా వచ్చే అతిథులను కూడా ఆసక్తితో ఎదురుచూసి సంతోషంగా వాళ్లని సంతృప్తి పరిచేవారు దేవ లోకంలో దేవతలకు పెద్ద అతిధిగా మిగులుతాడు అంటే వాళ్ళు చేసే దానధర్మాలు ఇహ లోకంలోనే కాక పరలోకానికి కూడా కీర్తిని కలిగిస్తాయి అలాంటి వారికి స్వర్గము తెరిచి ఉంటుందని భావము.

ఇక పదవ అధ్యాయము మృదుభాషణం. ఇందులో వళ్ళువర్గారు ప్రియంగామాట్లాడాలని మాటల మృదుత్వాన్ని గురించి చెబుతున్నారు మనం ఎవరితో మాట్లాడినా కూడా చాలా మృదువుగా ప్రేమతో ఇతరులకు నచ్చేలా ఎవరి మనసు నొప్పి పెట్టకుండా మాట్లాడాలని పదే పదే చెబుతున్నారు. ప్రేమతో మాట్లాడే మాటలు మాత్రమే ఇతరులకు ప్రేమను పంచిస్తాయి. మాటల ద్వారానే మనసు యొక్క ప్రేమ భావాలు వెలువడుతుందని వళ్ళువర్గారు ఖచ్చితంగా నమ్ముతున్నారు.

**మొదటి కురళ్**

**ఇణ్సొలాల్ఈరంఅళైఇప్పడిఱిలవాం**

**సెంపొరుళ్కండార్వాయ్ సెల్**

ఇందులో ప్రేమతో నిండిన మాటలలో ఎప్పుడు మోసం ఉండదు. అవి సత్యానికి ప్రతిరూపాలు. నిండు హృదయంతో స్వచ్ఛమైన మనసుతో ఇతరుల మీద ప్రేమతో మాట్లాడే మాటలే ప్రియంగా అనిపించి వారిని మంచి వారిగా తయారుచేస్తాయి. ఇందులో ఉన్న పది కురళ్ళో వళ్ళువర్గారు "వ్యక్తి ఎప్పుడూ ఇతరులతో మాట్లాడేటప్పుడు ప్రేమగా మాత్రమే మాట్లాడాలని ప్రేమతో శాసిస్తున్నారు. ఎవరితో మాట్లాడినా కూడా ప్రేమతో మాట్లాడాలని పదేపదే చెబుతున్నారు. మనం మాట్లాడే శబ్దాలలోనే ప్రేమ నిండి వుండాలని అవి ఎదుటి వ్యక్తిని ఇట్లే ఆకట్టుకుంటాయని వళ్ళువర్ చెబుతున్నారు.

**99వ కురళ్ లో**

**ఇణ్సొల్ఇణితీన్రల్కాణ్బాన్ఎవనోక్లో**

**వణ్ సెల్ వజ్జంగువదు**

ప్రేమపూరిత మాటలు ఇతరులకు సుఖాన్ని ఇస్తాయి వాటిని వదిలి ఇతరులకు కోపం ద్వేషము కలిగించే కఠినపు మాటలను ఎందుకు మాట్లాడాలి? అని ప్రశ్నిస్తున్నారు.

ఇక ఈ అధ్యాయంలోని **ఈ 100 కురళ్** చాలా ప్రసిద్ధమైనది.

**ఇనియఉళవాగఇన్నాదకఅల్**

**కనిఇరుప్పకాయ్కవర్న్రట్టు**

ఇందులో వళ్ళువర్గారు నోటి ద్వారా ప్రేమతో ప్రియంగా మాట్లాడే శబ్దాలు పండిన తియ్యటి పండులా వుండంగ వాటిని ప్రయోగించకుండా, ఇతరుల మనస్సు నొప్పించే విధంగా చేదుగా కాయగా వున్న చెట్టు ఫలాన్ని కొరకడంతో సమానం అన్నారు . దేవుడు ఇచ్చిన నోటితో మంచి తీపి మాటలు మాట్లాడి ఈ లోకాన్నే వశపరచుకోవచ్చు. కాబట్టి ప్రియంగా మాట్లాడండి అన్నారు. దీనినే గీతాచార్యులైన శ్రీ కృష్ణ పరమాత్మ వాచిక తపస్సుగా పేర్కొన్నారు (గీత–అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం)


ఆచార్య యన్. లక్ష్మీ అయ్యర్

హిందీశాఖాధిపతి, రాజస్థాన్ కేంద్రీయ విశ్వవిద్యాలయం,

జైపూర్, రాజస్థాన్, ఫోన్ : 9680276038


## కమ్మతెమ్మెరలు

*డిసెంబర్ మాసపు **మిసిమి**లో శ్రీమతి వంగరి త్రివేణి గారి నవంబరు నెలలో ప్రచురిత వ్యాసంపై, రవికృష్ణగారి విమర్శ చదివాను. చాల సమగ్రంగా, సమంజసంగా సద్విమర్శ అనిపించింది. రవికృష్ణలాంటి నిత్య సాహితీ విద్యార్థులు చేస్తున్న కొందరి కృషి ప్రశంసనీయం.*

*విమర్శలు నిర్మొహమాటంగా ప్రచురిస్తున్న మీకు, మీకు శుభం భవతు!*

***– యమ్. వెంకటశాస్త్రి, గుంటూరు***



# సూక్తి సురభి

– రెంటాల సాంబశివరావు

*రాజవత్ పుత్ర దారా శ్చ*
*స్వామివ న్మిత్ర బాంధవాః*
*ఆచార్యవత్ సభా మధ్యే*
*భాగ్యవంతం స్తువంతి హి॥*

**ఈలోకంలో మిక్కిలి సంపన్నుడైన వానిని భార్యయును, బిడ్డలును మహారాజు వలెను, మిత్రులు, బంధువులు స్వామీజీవలెను, సభా మధ్యన గురువు గారి వలెను పొగుడుతారు గదా॥**

– – – –

*యస్యాఽర్థా స్తస్య మిత్రాణి*
*యస్యాఽర్థా స్తస్య బాంధవాః*
*యస్యాఽర్థా స్స పుమాన్ లోకే*
*యస్యాఽర్థా స్స చ పండితః॥*

**ఈలోకంలో మహా సంపన్నుడే యెక్కువ మిత్రులు, బంధువులు కలవాడౌతాడు. అతడే మగాడు, మహా జ్ఞానియు నౌతాడు॥**

– – – –

*సుభిక్షం కృషకే నిత్యం*
*నిత్యం సుఖ మరోగిణః*
*భార్యా భర్తృ ప్రియా యస్య*
*తస్య నిత్యోత్సవం గృహమ్॥*

**ఈలోకంలో కష్టపడి పని చేసే వాడికి ఎల్లప్పుడూ సుసంపన్నంగానే ఉంటుంది. ఆరోగ్యవంతునికి సదా సుఖమే. ఇంటిలో భార్య భర్తకి ఇష్టంగా ఉంటే ఆ యిల్లు "నిత్య కళ్యాణం పచ్చ తోరణమే"॥**

– – – –

*పరివర్తిని సంసారే*
*మృతః కో వా న జాయతే*
*స జాతో యేన జాతేన*
*యాతి వంశ స్సమున్నతిమ్॥*

**మార్పే సహజ లక్షణంగా గల ఈలోకంలో (ధ్రువం జన్మ మృతస్య) అని మరణించిన ఎవ్వడైనా మళ్ళీ పుడుతూనే ఉంటాడు. అలా తన పుట్టుకతోనే వంశానికి పేరు తెచ్చిన వాడి జన్మయే సార్థకము॥**

– – – –

*సదా ప్రసన్నం ముఖ మిష్ట వాణీ*
*సుశీలతా చ స్వజనేషు సఖ్యమ్*
*సతాం ప్రసంగో గుణ హీన హానం*
*చిహ్నాని దేహే త్రిదివ స్థితానామ్॥*

**ఈ శ్లోకంలో దైవ లక్షణాలు చెప్పారు –అవి సదా ప్రసన్న ముఖమూ, వినా వినిపించే మాటలూ, సత్ప్రవర్తనయునూ, తన వారితో మైత్రియునూ, సజ్జనులతోడి సంభాషణమునూ, దుష్టులకు దూరంగా నుండుటయునూ అనేవి॥**

– – – –

*క్వచి ద్రుష్టః క్వచి త్తుష్టో*
*రుష్ట స్తుష్టః క్షణే క్షణే*
*అవ్యవస్థిత చిత్తస్య*
*ప్రసాదోఽపి భయంకరః॥*

**సుస్థిరమైన మనస్సు లేని వాడు విపరీతంగా ప్రవర్తిస్తాడు. ఓసారి కోపిస్తాడు. మరోసారి సంతోషిస్తాడు.అలాంటివాడి అనుగ్రహం కూడా ప్రమాదభరితమే॥**

– – – –

*పఠతో నాఽస్తి మూర్ఖత్వం*
*జపతో నాఽస్తి పాతకమ్*
*జాగృత స్తు భయం నాఽస్తి*
*కలహో నాఽస్తి మౌనినః॥*

**చదువుకున్న వానికి తెలియనిది ఉండదు. జపము చేసే వానికి పాపము రాదు. జాగ్రత్త పడే వానికి భయము లేదు. అస్సలు ఏమీ మాట్లాడని వానికి వాదులాట లేదు॥**

– – – –

*న సా సభా యత్ర న సంతి వృద్ధాః*
*వృద్ధా న తే యే న వదంతి ధర్మమ్*
*ధర్మో న వై యత్ర చ నాఽస్తి సత్యం*
*సత్యం న త ద్య చ్ఛలనానువిద్ధమ్॥*

**ఈలోకంలో జ్ఞాన వయోవృద్ధులు లేకపోతే అది సభయే కాదు. ధర్మబద్ధంగా బోధించని వారు పెద్దలు కారు. సత్యాన్ని వదిలిన ధర్మమే లేదు. మోసపూరితమైతే అది ధర్మమే కాదు**

రెంటాల సాంబశివరావు
కొవ్వూరు, ఫోన్ : 7893855174

# అడుగుజాడలు

**– భమిడిపాటి జగన్నాథరావు**

రాయటం కన్నా, ఎక్కువగా చదవటమే ఇష్టం అని చాలామంది అంటుంటారు. కానీ తన ఎనభైఎనిమిదేళ్ళ జీవితాన్ని అలాగే గడిపిన చదువరి, రసపిపాసి భమిడిపాటి జగన్నాథరావు గారు. ఆయన రాసినవి ముప్పైరెండు కథలు. కొన్ని వ్యాసాలు, రివ్యూలు. కానీ చదివినవి వందల, వేల రచనలు. రచనలోని అన్ని ప్రక్రియలపట్లా ఆయనకి అభిమానమే. చదివిన వాటిలో మంచిని ఆయన గుర్తుపెట్టుకునేవారు. అది రాసిన రచయితని వెతికి పట్టుకుని, ఆయన గ్రహించిన మంచిని మాత్రమే ఎంతో స్ఫూర్తిదాయకంగా చెప్పేవారు. ఆ రచయిత దాంతో హుషారుగా మరిన్ని రచనలు చేసేవాడు. అంతటితో జగన్నాథరావు గారు ఊరుకునేవారు కాదు. ఆ రచయిత సాహితీ గమనాన్ని పరిశీలిస్తూ, ఆ నడక ఓ దారికి వచ్చాక సంతృప్తిపడేవారు. అలా అజ్ఞాతంగా ఎందరో రచయితలకి దారిదీపం అయ్యారాయన. ఎందరో రచయితల్ని మంచి రచయితలుగా తీర్చిదిద్దిన అజ్ఞాత గురువు.

దుర్భిణీలోంచి చూసినట్టు చూసి కొత్త రచయితల్ని పట్టుకునేవారు. ప్రోత్సహించి, మరింత మంచి దారిన నడపించేవారు. దానికి నేనే ఉదాహరణ. ఎన్నో గొప్ప కథలు రాసిన జగన్నాథరావు గారు, ఆయన కథల గురించి ఆయన మాట్లాడింది అరదు. ఎంతసేపూ మంచి కథ, మంచి రచన అన్న ఇతర రచనల ధ్యాసే. 'జీవితం పట్ల ప్రేమ, మనిషి పట్ల ఆదరణ, అవీ ఆయన నిర్దిష్ట లక్ష్యాలు' అంటారు ప్రఖ్యాత రచయిత విహారి ఆయన గురించి. 'జగన్నాథరావు గారితో కొన్ని గంటలు గడిపితే, ఆయన్ని.... ఆ సమయాన్నీ ఎన్నటికీ మరువలేం. అంతదాకా నిగూఢంగా తమకే తెలియకుండా ఉన్న బలమైన జీవశక్తులు తమలో మేల్కొనడాన్ని గమనిస్తాం' అంటాడు శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు. సాహిత్యపు వెలుగులాంటి ఆయన గొప్ప కథలు రాశారు. వాటిలో మరింత గొప్పది 'అడుగుజాడలు' కథ. ఆంధ్ర సచిత్ర వారపత్రిక 7.2.1964లో అచ్చయింది. అంటే అరవై ఏళ్ళ క్రితపు అపురూప కథ. ఇప్పటికీ ఆ కథలోని వాక్యాలూ, భావ వ్యక్తీకరణ, వస్తు సాంద్రత అనితర సాధ్యం అనిపిస్తాయి. ముఖ్యంగా ఆ దృష్టికోణం, తాత్విక గాఢత ప్రతి రచయితకి ఓ పాఠం లాంటివి. ఈ కథ ప్రధానంగా, కేరళ అయ్యరు, అతని కుటుంబానికి చెందినది. కానీ దాని పరిధి చాలా విస్తృతమైనది. మానవ జీవితపు ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించిన కథ.

కేరళలో అన్నిరకాలుగా బాగానే బతికాడు అయ్యరు. అటువంటి సమయంలో, అతనికో తీవ్ర సమస్య ఎదురైంది. కూతురు పెళ్ళికాకుండానే గర్భవతి అయింది. ఆ విషయం మూడోనెల దాటాక తెలియటం వల్ల, గర్భవిచ్ఛితి చేయించలేకపోయాడు. ఎంత అడిగినా ఎలా జరిగిందో, కారణం ఎవ్వరో ఆ పిల్ల చెప్పలేదు. మౌనంగానే బాధ భరించింది. కుటుంబ గౌరవం, సంప్రదాయం ప్రాణసమం అయ్యరుకి. అయ్యరు కేరళలోని ఆస్తి అంతా అమ్మేసి, నెల్లూరు వలస వచ్చేశాడు. కూతురి పురిటి వరకూ అక్కడే ఉన్నాడు. ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్లకి లక్ష్మి అని పేరు పెట్టారు. ఆ తర్వాత భార్య, కూతురు, మనవరాలితో కలిసి కొవ్వూరుకి వలస వచ్చాడు. తమ గురించి, గతం గురించి తెలియకూడదని అంతదూరం రావటం. వచ్చేముందు కూతురి నుదిటి బొట్టు చెరిపేసి, బలవంతంగా వైధవ్యం అంటగట్టాడు. అంతేకాక లక్ష్మి తమ మనవరాలన్న విషయం ఎవ్వరికీ తెలియకూడదన్న ఆంక్ష పెట్టాడు. లక్ష్మిని మనవరాలిగా కాక, తమ చిన్న కూతురిగా ప్రచారం చేశాడు. కొవ్వూరులో భోజన హొటలు తెరిచాడు. హొటల్ బాగా నడిచింది. సంపాదనా బావుంది. కానీ హొటల్‌కి వచ్చీ వెళ్ళేవాళ్ళూ, అయ్యరు కూతుర్ని సూటీ పోటీ మాటలతో ఒకటే వేధింపు. ఆ మాటల్ని అయ్యరు భరించలేకపోయాడు. గొడవ లయ్యాయి. కిట్టని వాళ్ళ ద్వేషంతో హొటల్‌కి నిప్పుపెట్టి, బుగ్గిపాలు చేశారు. మళ్ళీ చిన్నగా హొటలు ప్రారంభించి, తన మానాన తను బతకాలనుకున్న అయ్యరుని లోకులు అలా బతకనివ్వలేదు. కాకుల్లా పొడిచారు. వాళ్ళ హింసని తట్టుకోలేని అయ్యరు ప్రతిగా ఇంట్లోవాళ్ళని హింసించే వాడు. ముఖ్యంగా అతని వెర్రి కోపానికి నరకం అనుభవించింది కూతురు, అభం శుభం తెలియని పసిది లక్ష్మి. అయ్యరు మొరటుతనం, బండవైఖిరి, పిచ్చికోపం అసహ్యం అనిపిస్తాయి. అయినా అతనిమీద జాలి వేస్తుంది అంటారు జగన్నాథరావు గారు. రచయిత ఈ అసామాన్య దృష్టే ఈ కథకి ప్రత్యేకత. ప్రతిక్షణం, బాహ్య, అంతరంగ వేదనామయం అయ్యరు జీవితం. దాన్ని పట్టుకున్నారు రచయిత. చుట్టూ ఉన్న వాళ్ళ బాధ తట్టుకోలేక, ఇంక అక్కడ ఉండలేక, పొట్ట చేత్తో పట్టుకుని, తన కుటుంబంతో మరో ఊరికి పయనమవుతాడు అయ్యరు. అంతటి మొరటు అయ్యరుకి సంసారం మీద ప్రేమ మాత్రం అపురూపం. 'అడుగుజాడలు' కథ ముగింపు అసామాన్యం.

నాకు నమస్కరించి అయ్యరు బస్సు ఎక్కాడు. అతను నిలుచున్నచోట, అతని వికృతమైన పెద్ద పాదాలు ఆ దుమ్ములో ముద్రలు వేశాయి. జీవితంలో కన్న బంగారు కలలు మసి అయిపోగా, ఛిన్నాభిన్నమైపోయిన వ్యక్తి విడిచి వెళ్ళిన అడుగులవి. అయితేనేం? వాటి విలువ ఎనలేనిది. గమ్యం లేకుండా, ఏదో గమ్యానికి పోతున్నామన్న ఊహతో ముందుకు సాగిపోతున్న నిత్య ప్రయాణీకుని ముద్రలవి. అతడు నిరంతర అన్వేషి. మానవుని తాపత్రయం తాలూకు చిహ్నాలైన ఈ అడుగుజాడలు పృథ్వంతా ఆవరించు కున్నాయి' అన్న ఈ చివరి పేరాతో ఈ కథ విస్తృతి అనంతం అయింది. అయ్యరు మొరటుతనం వెనక ఉన్న అతని అసహాయత, అశక్తత చూడగలగాలి. సంసారం పట్ల వ్యక్తి మమకారం సృష్టి నైజం అని సారూప్యం చేసిన కథ అడుగుజాడలు. పూర్తి జీవిత తత్వాన్ని ఓ కథగా కూర్చగలగటం అరుదుగా జరిగే అద్భుతం. జగన్నాథరావు గరి విశిష్ట ముద్ర ఈ కథ. కథా జగతిలో కలకాలం నిలిచేది.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

# జననాయక జయహే

– వంకిరెడ్డి రెడ్డప్ప రెడ్డి

“రాజకీయ భావాల చేత, రాజకీయాల చేత ప్రభావితం కాని వ్యక్తి సమాజంలో ఉండదు. ఒకవేళ వ్యక్తి రాజకీయాలనొదిలినా రాజకీయాలు వ్యక్తిని వదలవు” అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య నవలా శిల్పం (పుట 110) లో అంటాడు. నేటి సమాజంలో ఎక్కడ చూసినా రాజకీయం ప్రవేశించని రంగమే లేదు.




సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తర్వాత రాజకీయరంగం అన్ని వర్గాల ప్రజలకు మరింత దగ్గరయింది. ఇక్కడ రాజకీయమంటే తెలియని వ్యక్తి లేదు. ప్రతి మనిషీ ఏదో విధంగా రాజకీయ కూలీగా మారిపోతున్నాడు. అందువల్లే రాజకీయ వ్యవస్థ ప్రజాసేవను దాటి సామాజిక హోదాగా మారిపోతోంది. ఇలాంటి సందర్భంలో ప్రజలు రాజకీయగుర్తింపు కోసం పరితపిస్తున్నారు. ప్రతి వ్యక్తి రాజకీయ ప్రభావానికి లోనవుతూనే ఉన్నాడు. దీనిని ఆధారంగా చేసుకుని రాజకీయనాయకులు ఆర్థిక నేర రాజకీయంతో పడగల పాములాగా మారిపోతున్నారు. ప్రజలు బలిపశువులవుతున్నారు. ఒక మనిషి రాజకీయ నాయకుడిగా తన రూపాన్ని మార్చుకోవడానికి ఎంతో మంది జీవితాలను బలవంతంగా తన అధీనంలోకి లాక్కుని తనకు సేవకులు గానూ, బానిసలుగానూ మార్చుకుంటున్నాడు. ఈ మార్పు మానవజాతి మనుగడకు ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదాన్ని పసిగట్టి కవులు, రచయితలు, ప్రజలకు, ప్రజానాయకులకు కనువిప్పు కలిగే మార్గాలను అన్వేషించి, ఆచరణలో పెట్టగలిగే రచనల్ని బాధ్యతగా చేయాల్సి వుంది.ఇటువంటి కోవలోనిదేవంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి రచించిన ‘జననాయక జయహే’ నవల. ఇది రాజకీయ వైజ్ఞానిక నవల. తెలుగులో రాజకీయ నవలలు 1920 నుంచి వున్నాయి.“రాజ్యానికి వ్యక్తికి మధ్య వున్న సంబంధాలపట్ల అసమ్మతిని తెలియజేయడం రాజకీయ నవల ప్రధాన లక్ష్యాలలో ఒకటి” అని నవలా శిల్పంలో వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాజకీయ నవల గురించి చెప్పాడు. అయితే తెలుగు నవలా విమర్శకులు గానీ, పరిశోధకులు గానీ రాజకీయ వైజ్ఞానిక నవల గురించి తెలియజేసినట్లు ఎక్కడా లేదు. జననాయక జయహే నవల రాజకీయ విజ్ఞానాన్ని బోధించిన నవల. నవలలో ప్రజలకు ప్రభుత్వానికి అసమ్మతి ఎక్కడా కనిపించదు. రాజకీయాన్ని నడిపే నాయకుడే రాజకీయం పైన తిరుగుబాటు చేస్తాడు. రాజకీయ వ్యవస్థలోని లోపాలు, ఆర్థిక నేర రాజకీయం, నోటుకు ఓటు రాజకీయం లాంటి సామాజిక తిరోగమన అంశాలను రూపుమాపటానికి తనవంతు కృషి చేస్తాడు. తన జీవితాన్ని ఆచరణలో పెట్టి, ప్రజాసేవకు ప్రతిరూపమైన నాయకత్వం రాజకీయానికి పునాది కావాలని కోరుకొని జీవితమంతా రాజకీయ జ్ఞాన చైతన్యం కోసం పరితపిస్తాడు.అందుకే ఈ నవలలను రాజకీయ వైజ్ఞానిక నవల అనటం సమంజసం. రాజకీయరంగంలో ఎమ్మెల్యే స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగి, ఐదువేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి, రాజకీయ ఆర్థిక నేరాలతో పండిపోయిన రత్నసభారాధ్య శారీరకంగా, మానసికంగా వీర మహిళ ఎర్రమ్మ చేతిలో ఓడిపోయి, ఆమెకు బిడ్డగా, శిష్యునిగా, భక్తునిగా మారిపోయి, రాజకీయ రంగంలో మార్పు తీసుకురావడానికి ఎర్రమ్మ చారిటీస్ సంస్థ ద్వారా ప్రజా సేవతో పాటు, నోటుకు ఓటు ముడిని విప్పే ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసి, దుర్మార్గపు వ్యక్తిత్వం నుంచి పరిశుద్ధవ్యక్తిత్వానికి మారిన రత్నసభారాధ్య ఆదర్శ రాజకీయ జీవిత ప్రస్థానమే ‘జననాయక జయహే’ నవలా ఇతివృత్తం.

చెరువు గండి నవల పొడిగింపే జననాయక జయహే నవల. ఇందులో కథానాయకుడు రత్నసభారాధ్య. దేవస్రష్ట అగ్నిస్రష్ట కాలంలో చెరువు పల్లె చెరువు గండిగా మారిపోయి ఉండేది. ప్రజలు బానిసలుగా బతుకుతూ ఉండేవాళ్ళు. అగ్నిస్రష్ట ఇద్దరి కొడుకుల్లో రత్నసభారాధ్య ఒకడు. మొదట రత్న సభారాధ్య కూడా వర్ణించలేని

దుర్మార్గుడు. చెరువు గండికి కోడలుగా వచ్చిన ఎర్రమ్మ రత్నసభారాధ్యను మార్చిన వీర మహిళ. రత్న సభారాధ్యకు బుద్ధిని ప్రసాదించిన తల్లి. ఎర్రమ్మ మాట అంటే రత్నసభారాధ్యకు వేదం. అందుకే అక్రమంగా సంపాదించిన నాలుగువేల కోట్ల రూపాయలు ఎర్రమ్మ చారిటీస్ సంస్థ ద్వారా ప్రజల కోసం ఖర్చు పెడతాడు. చెరువు గండిని ఆధునిక నాగరిక చెరువు పల్లెగా మారుస్తాడు. చెరువుపల్లెతో పాటు చుట్టూ ఉన్న యాభై గ్రామాలను కూడా అభివృద్ధి పథంలో నడిపిస్తాడు. వ్యవసాయం, చేతివృత్తులు నీటివసతి పనులు, విద్యాలయాలు మొదలైన వాటిని ఆధునికరిస్తాడు. చెరువు పల్లెలో ఎకరా జాగాలో కట్టుకున్న తన ఇంటిని ఎర్రమ్మ చారిటీస్ సంస్థగా మార్చేసి, మాలవాడలోని ఎర్రమ్మ ఇంటికి వెళ్తాడు. ఎర్రమ్మ చారిటీ సంస్థ ద్వారా ప్రజలకు అనేక రకాలైన సేవలు చేసి చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శ పురుషుడౌతాడు. రత్న సభారాధ్య సేవలకు ముగ్ధులైన ప్రజలు రత్నసబారాధ్యకు పద్మశ్రీ ఇవ్వాలని భారత ప్రభుత్వానికి అర్జీ పెడతారు. భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇస్తుంది.

"ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ వ్యభిచారం, రాజకీయ ఆర్థిక నేరం కలిపి సమాజాన్ని ఎంతగా కుల్లబొడుస్తున్నాయో గ్రహింపుకొచ్చాక అదే విషయాన్ని ఎందుకు గ్రంథస్తం చేయకూడదు అనే ప్రశ్న నన్ను నేను వేసుకున్నాను. ఫలితమే ఈ నవల." ఇది నవలా రచయిత అభిప్రాయం. నేటి రాజకీయ వ్యవస్థపై రచయితకున్న నిరసన భావజాలం. ఆర్థిక నేర రాజకీయంతో పండిపోయి విచ్చలవిడిగా వ్యభిచరించే రాజకీయరంగం రచయితను కదిలించింది. అందుకే రాజకీయ వ్యవస్థలోని లోపాలను రూపుమాపి ప్రజాసేవకు పూనుకొనే నాయకత్వాన్ని, రాజకీయ రంగాన్ని పునర్నిర్మించాలనే దృఢమైన సంకల్పదీక్షకు ప్రతిరూపమే వంకరెడ్డి రెడ్డెప్పరెడ్డి 'జననాయక జయహే' నవల. రచయిత నవల ద్వారా ఆశించింది రాజకీయ సంస్కరణ. ఆర్థికనేర రాజకీయ ప్రస్థానంలేని సరికొత్త రాజకీయ వ్యవస్థ. ఇది ఇప్పటికి అసాధ్యమే. అయినా ఆశాజీవైన రచయిత అసాధ్యాలను సుసాధ్యం చేసే ప్రయత్నంగానే రచన చేస్తుంటాడు. ఈ నవలా రచన ఇందులో భాగమే. ఈ నవలలో చెప్పుకోవాల్సిన అంశాలు రెండు. ఒకటి వ్యక్తిగతం, రెండు సామూహికం. ఆర్థికనేర రాజకీయాన్ని రూపుమాటం కోసం రత్నసభారాధ్యను వ్యక్తిగతంగా ప్రజాసేవకుడిగా మార్చి ఆదర్శ రాజకీయనేతగా చూపించటం వ్యక్తిగతం. ఇది మొదటి అంశం. నోటుకు ఓటు అనే విధానాన్ని రద్దుచేయించి ప్రజలు తమకు సేవచేసే నికార్సైన నాయకుణ్ని తమ ఓటు హక్కు ద్వారా ఎన్నుకోవటం సామూహికం. ఇది రెండవది. ఈ రెండు అంశాలు నేటి రాజకీయరంగంలో ఫలవంతం కావాలని కోరుకోవటమే నవలా సారాంశం.

రాజకీయరంగాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థికనేరాలతో అడ్డగోలుగా డబ్బు సంపాదించిమితిమీరిన నేరాలలో మునిగిపోయిన రాజకీయ నాయకుల స్వభావం ఎలా ఉంటుందో నవలాంతర్భాగంలో రత్నసభారాధ్య ఇలా చెబుతాడు."వీళ్ళకు తెలిసి రాజకీయ ఆర్థిక నేరం లేదు. ఆ నేరవిద్యలో వీరి తర్వాతే ఎవరైనా. కానీ వీళ్ళు చెప్పినన్ని నీతి వాక్యాలు మరొకరు చెప్పరు. రాత్రంతా దేవుడు దీపం చుట్టూ చేరిన పురుగుల్ని ఆరగించి, తెల్లారగానే దేవుడి పటం వెనుక జేరి జపం చేసే బల్లి బ్రతుకు వీరిది." ఇలాంటి ఆర్థిక నేరరాజకీయ నాయకుల్ని సంస్కరించకుంటే దేశం నష్టపోతుందన్న అభిప్రాయం రత్నసభారాధ్యలో కలుగుతుంది. అందుకే ఆర్థిక నేర రాజకీయ రంగంలో సంస్కరణ జరగాలని ఆశిస్తాడు. అందుకు తానే మొదటి అడుగుతాడు. తాను అక్రమంగా సంపాదించిన నాలుగువేల కోట్ల రూపాయలు ఎర్రమ్మ ఛారిటీస్ సంస్థ ద్వారా ప్రజాసేవ కోసం ఖర్చు చేస్తాడు. ఆర్థిక నేరాలతో పండిపోయిన ఒక రాజకీయ నాయకుడు ప్రజాసేవకుడిగా మారిపోతే చరిత్ర తనకోసం ఎలా పరితపిస్తుందో, సమాజం ఎంతగా అభిమానిస్తుందో తెలియజెప్పడానికిరత్నసభారాధ్య తన జీవితాన్నే ఆచరణలో పెట్టి చూపిస్తాడు. అయితే ఈ ఆచరణ కేవలం యాభై గ్రామాలకే పరిమితం కాకూడదని దేశమంతటా విస్తరించాలని, అందుకు రాజకీయమే సరైందని ఇంటిల్లిపాది రత్నసభారాధ్యకు తెలియజేస్తారు. దీనితో రత్నసభారాధ్య వద్దనుకున్న రాజకీయంలోకి తిరిగి ప్రవేశిస్తాడు. ఆర్థికనేర రాజకీయాన్ని రాజకీయంతోనే జయించడానికి పూనుకుంటాడు.

నవలలో జనం మెచ్చిన నాయకుడు రత్నసభారాధ్య మాత్రమే. ఇంత గొప్ప సంస్కరణవాద నవలా చిత్రణలో మరే ఇతర రాజకీయంగానీ, రాజకీయనాయకుడుగాని సంస్కరింపబడలేదు. ఆర్థికనేరం నుంచి తప్పించుకోనూలేదు. రత్నసభారాధ్యలో వచ్చిన మార్పు ఏ ఆర్థికనేర రాజకీయ నాయకున్ని మార్చలేదు. పైగా ఆర్థికనేర రాజకీయ వ్యవస్థ

ఇప్పట్లో మారదనే అనుమానాన్ని రచయిత కథానాయకుడు రత్నసభారాధ్య ద్వారానే చెప్పించడం నవలా రచనలో రచయితకున్న అనుభవాన్ని తెలియజేస్తుంది. అందువల్లే రచయిత జనంచేత ఒక్క రత్నసభారాధ్యనే జనం మెచ్చిన నాయకుడిగా చిత్రించగలిగాడు. ఆర్థికనేర రాజకీయ ప్రయాణాన్ని అడ్డగించే ప్రయత్నం నవలలో ఎక్కడా రత్నసభారాధ్య ద్వారా ప్రత్యక్షంగా జరగలేదు. ఇవి చిన్నచిన్న పొరపాట్లే. సాధారణంగా ఇది మొదటిగా రచనలు చేస్తున్న రచయితలో కనపడే రచనా విధానమే. కానీ ఒక్కొక్క బిందువు సింధువును రూపొందించినట్టు ఒక్క రత్నసభారాధ్యతో మొదలైన ఆర్థికనేర రాజకీయ పతనం భవిష్యత్తులో విప్లవంగా మారి వేలకొలది రత్నసభారాధ్యులు తయారై, వారిచేత ఆర్థికనేర ప్రమాదకారిణిని సంస్కరించగలదనే అభిప్రాయం ఈ పాత్ర ద్వారా పాఠకులకు అవగతం అవుతుంది. ఆర్థికనేర రాజకీయాన్ని రూపుమాపటానికి రచయిత ఈ నవల ద్వారా చేసిన కృషి అభినందనీయమే.

నవలలో రెండవ అంశం నోటుకు ఓటు ముడిని విప్పటం. దేశంలో ఆర్థికనేర రాజకీయం తామరతంపరగా పెరిగి పోవడానికి కారణం ప్రతిచోట నోటుకు ఓటు బలి కావడమే. ఇది సామూహికంగా సంస్కరించాల్సిన అంశం. ఈ అంశాన్ని కూడా రచయిత రత్నసభారాధ్యతోనే పూర్తి చేయించాలి అనుకున్నాడు. ఆర్థికనేరస్తులు ఎలా తయారవుతున్నారో రత్నసభారాధ్యకు తెలుసు. “అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది. ఓట్లు కొన్న నాయకులు పదింతలు సంపాదిస్తే తప్ప ఆ తర్వాత ఎన్నికలలో నిలబడలేరు. రాబోయే ఎన్నికలలో ఏ రేటు పెట్టి ఓటు కొనాల్సి వస్తుందోననే సమస్య రాజకీయ నాయకులను పీడించటం సాధారణమవుతోంది. ఇక వాళ్లు సంపాదనకు పూనుకోక తప్పనిసరి పరిస్థితి నెలకొంటుంది.” ఆర్థికనేర రాజకీయానికి ఈ ఓటుకు నోటు విధానమే పునాది. దీనివల్ల రాజకీయనాయకులు ఆర్థిక నేరస్తులుగా తయారవుతున్నారు. కాబట్టి నోటుకు ఓటు అమ్ముకోవడాన్ని ఆపాలి. ఒకరిద్దరిని ఆపితే ఇది అంతం కాదు. దేశం మొత్తం మీద ఎక్కువ మంది ఎవరికి వారుగా నోటుకు ఓటునుఅమ్ముకోవటం అపాయకరమని భావించాలి. సాధారణ మనిషిలో కూడా ఈ భావజాలం నాటుకుపోవాలి. ఇది జరగాలంటే, జాతీయోద్యమమంత ఉధృతంగా నోటుకు ఓటు వద్దనే ఉద్యమం దేశమంతా సాగాలి.దీనికోసం రచయిత నవలలో సూచించిన మార్గం గాంధీయిజం. అంటే నిరాహారదీక్ష ద్వారా ఈ ఉద్యమాన్ని ఉధృతం చేయాలనుకోవడం. నవలలో దీనికొక పథక నిర్మాణం కూడా రచయిత కల్పించాడు. రత్నసభారాధ్య ఈ ఉద్యమ ఉధృతి కోసం వంద మంది చదువుకున్న యువతీ యువకుల్ని ఎన్నుకుంటాడు. ప్రజాసేవకే జీవితాలను అంకితం చేసిన కొంతమంది మేధావుల ద్వారా యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి, వారిని దేశంలోని పలు రాష్ట్రాలకు పంపిస్తాడు. వారి ద్వారా ఆయా రాష్ట్రాలలో ప్రజలు నోటుకు ఓటును ఎలా అమ్ముకుంటున్నారో, ఇందులో ఎవరెవరి పాత్ర ఎలా ఉందో, అసలు పంపిణీ విధానం ఎలా కొనసాగుతుందో తెలుసుకుంటాడు. సమాచారాన్నంతా తెలిసుకొన్న తర్వాత ఉద్యమాన్ని నడపడానికి తన ఇంటిల్లిపాదినీ, తన సేవతో బాగుపడిన ప్రజలను ఒకచోట కలిపి, ఉద్యమ విధానాన్ని వివరిస్తాడు. నోటుకు ఓటువల్ల ప్రజలకు కలిగే కష్టనష్టాలను, నాయకులకు లభించే లాభ సుఖాలను వివరించేలా ప్రతి ప్రాంతంలో నిరాహార దీక్షలు చేపట్టాలి. ఒకచోట చేసే నిరాహార దీక్షను నాయకులు ఆపేస్తే, వెంటనే మరో పదిచోట్ల మనవాళ్ల నాయకత్వంలో నిరాహార దీక్షలు కొనసాగాలి. ఇలాగైతేనే ఈ ఉద్యమం ద్వారా ప్రజలలో నోటుకు ఓటు రద్దుపై పూర్తి అవగాహన ఏర్పడి, నోటుకు ఓటును అమ్ముకోకుండా తమ ఓటును నిజాయితీగా ఉపయోగించుకుంటారు. అప్పుడు దేశంలో ఆర్థికనేర రాజకీయం అంతమవుతుంది. ఇలా నిర్ణయించుకొనే రత్నసభారాధ్య తన పథకాన్ని ఆచరణలో పెడతాడు. కేంద్రంలో రాజకీయపార్టీలు నిజాయితీపరులైనవారికే పార్టీ సీట్లు కేటాయించాలని అభిప్రాయానికి రావటంతో నవలలో చివరికి ఇది విజయవంతం అవుతుంది.

ఇది నవల వరకు అయితే సరే. మరి వాస్తవ జీవితంలో ఇది సాధ్యమేనా? అని పాఠకులు ఆలోచించుకున్నప్పుడు మాత్రం నవలా సంకల్పం కొంత ఇబ్బందికి గురౌతుంది. ఎందుకంటే సాంకేతిక పరిజ్ఞానం విచ్చలవిడిగా పొంగిపొర్లుతున్న ఈ కాలంలో ఇలాంటి సత్యాగ్రహాలు నిలుస్తాయా? విప్లవాత్మకంగా సమాజంలోకి అతిపెద్ద రాజకీయ ఆర్థికనేర సునామితో కలిసిచొచ్చుకొనివచ్చిన నోటుకు ఓటును నిరాహారదీక్షల ద్వారా సంస్కరించాలనుకోవటం విజయవంతం అవుతుందా? దీనిని రచయిత పునరాలోచనలో మదించాలి. ఈ విషయాన్ని పక్కన పెడితే,

ఆర్థికనేరాలను రూపుమాపటానికి ఒక మార్గాన్ని రచయిత నవల ద్వారా ప్రవేశపెట్టడం కొత్తదనమే. సాంకేతికత పరిజ్ఞానంతో జీవితాలు వేగంగా కదులుతున్న నాగరిక కాలంలో గాంధీజీ నడిపించిన సత్యాగ్రహం, నిరాహార దీక్షలు ఇంత గొప్ప విపత్తును ఎదుర్కొని విజయాన్ని సాధించగలవనే రచయిత సంకల్పాన్నిఓటు హక్కుధారులైన ప్రజలు, పాఠకులు అనుకూల దృక్పథంతో స్వాగతించాల్సిందే. ఆర్థికనేర రాజకీయాలతో దేశం ఎంతగా దిగజారిపోతుందో మాటలు చాలవు. రాజకీయనాయకులు డబ్బును అడ్డగోలుగా సంపాదించి విర్రవీగుతున్నారు. ఎన్నెన్నో దుర్మార్గాలు చేస్తున్నారు. వారికి అవసరమైంది సమాజానికి కంటకమని తెలిసినా దాన్ని చట్టం చేస్తున్నారు. మరీ చిత్రంగా జీతం తీసుకుంటూ సేవ చేస్తున్నామని గొప్పలు పోతున్నారు. ఇలాంటి నాయకుల వివరాల చిట్టాలన్నింటితో రచయిత ఈ నవలను చిత్రించినట్లు తెలుస్తోంది. నవలలో ప్రతి రాజకీయ నాయకుడు ఆర్థిక నేరస్థుడే. పార్టీలు మారే నాయకులను రచయిత నాయకప్పలంటాడు. ప్రభుత్వంలో ప్రతిపక్ష పార్టీలుగా మారిన పార్టీలు ప్రజా శ్రేయస్సును మరచి అధికార పార్టీపై దుమ్మెత్తి పోస్తూ కాలాన్ని వెల్లబుచ్చటం లాంటి వాటిని రచయిత నవలలో హెచ్చరించాడు. వార్తా వాహకులైన మీడియా పార్టీలకు చేసే వెట్టిచాకిరిని ఉన్నది ఉన్నట్లు వెల్లడిచేసాడు. ఆర్థిక నేరరాజకీయ విధానాలను రాజకీయం ద్వారానే నశింపజేయాలన్న విషయం నవలలో గొప్పగా చిత్రించబడింది. ఇంత మంచి సంస్కరణ నవలలో ఎర్రమ్మను దేవతను చేసి, పూజలు చేయించటం నవల సహజత్వాన్ని దెబ్బతీసినట్లు అనిపిస్తుంది. సంఘటనల కన్నా సంభాషణలు అధికంగా ఉన్నాయి. నవల సినిమా రచనలా ఉంది. నవల వాస్తవిక జీవితాన్ని చిత్రించాలి. దీనికోసం కల్పనను ఆశ్రయించవచ్చు, కానీ నవలంతా ఊహలతో అల్లిన బుట్టలా ఉండటం ఉత్తమ నవల ప్రతిభకు ఆటంకం. అయితే సాహిత్యం సమాజాన్ని సంస్కరించాలి అన్న విషయానికి ఈ నవల దగ్గరగా ఉంది. నవలలోని లోపాలురచనా విధానానికి మెరుగులే అవుతాయి కానీ తరుగులు కానే కావు. నవలంతా రత్నసభారాధ్యదే. అతని ఆలోచన, ఆచరణ విధానాలే నవలకు ప్రధానాంశాలు. నవలలో ప్రజలంతా రత్నసభారాధ్య లాంటి నాయకుడినే కోరుకున్నారు. దేశం అతని ఆదర్శవంతమైన ప్రజాసేవకు ముగ్ధులైపోతుంది. ఆచరణలో తన జీవితాన్ని త్యాగం చేసిన రత్నసభారాధ్యను చూసి పార్టీలు, న్యాయస్థానాలే నివ్వెరపోతాయి. అలాంటి నాయకుని పాలనలోనే పాలితులం కావాలని ప్రజలు ఆశిస్తారు. అతని భావజాలాలకు తీహారు జైలు ఖైదీలు కూడా ఆకర్షితులై ఆదర్శభావాలను నింపుకుంటారు. ఇంత గొప్ప వ్యక్తిత్వంతో నవలంతా నడయాడిన రత్నసభారాధ్య జయహో జననాయక అనే ప్రజా నినాదానికి సేవకుడు. ఇటువంటి నాయకుడే దేశానికి అవసరమైనవాడు అని గుర్తించిన 'జననాయక జయహే' నవల పాలితుడైన ప్రతి పాఠకుడు అందిపుచ్చుకోవాల్సిన నవలే.

## శ్రీ శూద్రగంగ




**వి**ష్ణుపాదాల నుండి జనియించడం వలన గంగ కూడా 'శూద్రగంగ' అని నిశ్చయించుకున్నదంటారు గేయకవి సుద్దాల అశోక్ తేజ. తన తోబుట్టువులైన శూద్రులకు మేలు చేయాలన్న తలంపులో మాత్రమే భారతావనికి గంగ అరుదెంచిందని త్రికరణ శుద్ధిగా విశ్వసించాడు. ఆవిధంగా శ్రీ *శూద్రగంగ* కావ్యానికి శ్రీకారం చుట్టారు. అశోక్ తేజ ఈ పుస్తక రచనకు పూనుకోవడానికి స్ఫూర్తి ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి "మకర హృదయం". అందెశ్రీ తలపెట్టిన వాక్కులమ్మ వంద పుస్తకాల్లో ఇది మూడవది. పుస్తకాన్ని ఎంతో అందంగా ఆర్ట్‌పేపర్ మీద రంగుల్లో ప్రచురించారు.

*వాక్కులమ్మ ప్రచురణలు, వెల : రూ. 100/-, పుటలు : 112, ప్రతులకు : ఆంధ్ర, తెలంగాణ అన్ని పుస్తక కేంద్రాలలో లభించును.*

## విషాదాంత జీవిత వి'శారద'

**జీ**వితమనే రాస్తా మీద సమాజ గమనంతో అడుగులు కలుపుతూ అవిశ్రాంతంగా పరుగెత్తి.. ఆదరణకు నోచక.. సాహిత్యాన్ని నమ్ముకొని, 'అమ్ముకొని' చివరి నెత్తుటి బొట్టు వరకు వ్యవస్థ మారాలని, మారుతుందని ఆశించి మూడు పదుల వయసుకే 'అందనంత దూరం' వెళ్ళిపోయిన సాహిత్య బాటసారి 'శారద'– ఎస్.నటరాజన్. నటరాజన్ అంటే ఎవరికి తెలియకపోవచ్చు 'మంచి–చెడు' శారదంటే సాహితీలోకం టక్కున గుర్తిస్తుంది.

జననం 1924సం. తమిళనాడుకు చెందిన పుదుక్కోటులో జన్మించాడు నటరాజన్. అతి బీద కుటుంబం. తండ్రి సుబ్రహ్మణ్య అయ్యర్, తల్లి భాగీరథి. పన్నెండేళ్ళ ప్రాయంలో మద్రాసు నుంచి వచ్చి 'ఆంధ్రా పారిస్' తెనాలి రైల్వేస్టేషన్ లో అడుగు పెట్టాడు. తల్లి అతని రెండో ఏటనే మరణించింది. ఎర్రగా, సన్నగా, రివటలా, పలుచటి ముఖం, తీర్చిదిద్దినట్లు కళ్ళు, తీక్షణమైన చూపులు, అరచేతుల చొక్కా, తెల్లటి పంచె అడ్డ కట్టు.. 'మధూకరం', వారాలు చేసుకుంటూ తనను, తండ్రిని పోషించేవాడు. దేవాలయాల దగ్గర గంధం తీసి అమ్మేవాడు. చిన్న వయసులోనే తమిళ సాహిత్యాన్ని బాగా చదివాడు. దీనివలన తమిళ జీవన విధానంలోని సునిశిత హాస్యం అతని దృష్టిని ఆకర్షించింది. తల్లి ప్రేమ తెలియనివాడు. కంటి నిండా నిద్ర, కడుపు నిండా తిండి లేనివాడు. పెద్దవుతున్న కొద్దీ అతని సమస్యలు పెద్దవిగా మారాయి. అతని పదిహేనవ ఏట తండ్రి మరణం, దహన సంస్కారాలు దగ్గరుండి చూడటం చేత మూర్ఛ వచ్చి పడిపోయాడు. ఆ జబ్బే చివరకతని ప్రాణం తీసింది..

**జీవనం :** తెనాలిలో అక్క భర్త భీమారావు కాఫీ హొటల్‌లో సర్వరుగా కుదిరాడు. సర్వరుగా పని చేస్తూనే పుస్తకాలు చదవటం విస్తృతం చేసాడు. తెనాలిలో బ్రతకాలంటే తెలుగు అవసరమనుకున్నాడు. తురగా వెంకటేశ్వరరావు గారనే వీధి బడిపంతులు దగ్గర 'ఓనమాలు' నేర్చుకొన్నాడు. మూడవ తరగతి వరకు అక్కడే చదివాడు. 'గజేంద్ర మోక్షం' 'శ్యామలా దండకం' కంఠస్తం చేసాడు 'శారద నీరదేందు' అనే భాగవత పద్యమే కాదు.. 'చెయ్యెత్తి జైకొట్టూ తెలుగోడ' అనే గీతం నిత్య స్మరణీయాలయాయి.. పాడకుండా ఉండలేని 'నటరాజన్'ను చూసినవారు లేరనేది మిత్రులు వ్యాఖ్యానం. తెలుగు భాషపట్ల నటరాజన్‌కు ఎంతో మమకారం, ఆప్యాయత. క్రమేపి పెద్దయినా.. అతని ఈతి బాధలు పోలేదు.. ఒక ప్రక్క రచనలు చేస్తూనే మరో చేత్తో గారెలు, బజ్జీలు వేస్తూ 'జీవనం' చేసిన 'గొప్ప సాహితీకారుడు'.. తెలుగులో గొప్ప రచనలు చేయటం వలన 'గుర్తింపు పొందని'వాడు..

**రచనలు :** నటరాజన్‌కు మొదటి నుంచి రచనా ప్రవృత్తి ఉంది. ఆంగ్ల, ఫ్రెంచి భాషలను నేర్చుకున్నాడు. ఆ భాషలలోని కథలను తమిళంలోని అనువదించేవాడు. తనలోని రచయితను మేల్కొలిపాడు. ఆంగ్ల పత్రికలలోని పజిల్స్ పూర్తి చేసి బహుమతులు గెలుచుకున్నాడు. నటరాజన్ 1948–55ల మధ్య కేవలం ఏడు సంవత్సరాలు మాత్రమే రచనలు చేసారు. ఏది సత్యం, మంచీ–చెడూ, అపస్వరాలు, మహీపతి అనే నవలలు రాశారు. ఆ రోజుల్లో స్త్రీల పేరుతో రచనలు చేస్తే వెంటనే పత్రికలలో అచ్చయేవి. 'శారద' అనే పేరుతో రచనలందుకే చేసారని అనుకున్నారు. కాని.. అది నిజం కాదని ఆయనే చెప్పుకున్నారు. అన్నపూర్ణ అనే యువతిని వివాహం చేసుకున్నారు. 1946లో ఆయన మొదటి రచన 'ప్రపంచానికి జబ్బు చేసింది' ప్రజాశక్తిలో ప్రచురితమయింది. 'జ్యోతి' తెలుగు స్వతంత్ర' 'హంస' వంటి పత్రికలు 'శారద' రచనలు ప్రచురించాయి. ఆ రోజుల్లోనే 'ప్రజావాణి' అనే వ్రాత పత్రికను ప్రారంభించారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అని తెలిసినా 'అల్లూరి సీతారామరాజు' 'కన్నెగంటి హనుమంతు' అనే సినిమాలను కలర్ తీద్దామని ప్రణాళికలు వేసుకున్నారు. రావూరి భారద్వాజ్, ప్రకాశం, మల్లిఖార్జునరావు, ఆలూరి భుజంగరావు 'శారద'కు ఆస్తులు. ఎంతటి దారిద్ర్యం వెంటాడినా 'రచనలు' చేయటం మానలేదు. ఆయనదో విభిన్నమైన శైలి. చలం, బుచ్చిబాబు రచనలంటే ప్రాణం. 'కొడవటిగంటి కుటుంబరావు, రా.వి.శాస్త్రి గార్ల రచనలకు వారధి వంటివాడు శారద'ని ఆరోజులలో సాహితీకారుల మన్ననలందుకొన్న సాహితీ సృజనకారుడు 'శారద' 'శారద నీరదేందు ఘనసార 'శారద' జీవితం 17.08.55 తన 31వ ఏట శాశ్వత నిద్రలోనికి జారిపోయింది. నటరాజన్ కథ ఓ జీవిత సత్యాన్ని సాహితీలోకానికి.. సమాజానికి ఎలుగెత్తి చాటుతుంది. కష్టాల కొలిమి నుండి ప్రజలకు ఉపయోగపడే సజీవ సాహిత్యం ఉద్భవిస్తుంది. ఆకలి దప్పులు, దారిద్ర్యం సృజనను ఆపలేవు. శారద– కేవలం రచయిత కాదు.. తత్వవేత్త, క్రాంతిదర్శి, దార్శనికుడు. తెనాలి శారదను ఒక తల్లిగా ఆదరించింది. చివరి వరకు అతను తెనాలిని వదిలి పెట్టలేదంటే అతిశయోక్తి కాదు.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తమవంటి వారి జీవితాలు మారుతాయనే అతని ఆశ నిరాశగా మారింది 'ఈ పద్ధతిలో నేను స్వతంత్ర భారత పౌరుణ్ణని భావించలేకపోవటంతో తప్పేమీ లేదనుకుంటాన'ని ఆయనే వాపోయారు. "నూరు కథలను వ్రాసిన శారద, ఐదారు నవలల్ని రచించిన శారద, ప్రతీ రచన ద్వారా పాఠకుణ్ణి పలకరించిన శారద మృతుడు కాదు. అమరుడు" అనే నార్ల చిరంజీవిగారి మాట అక్షర సత్యం.

***– భమిడిపాటి గౌరీశంకర్, ఫోన్ : 94928 58395.***

## దాశరథి సాహిత్యాన్ని సమగ్రంగా ఆవిష్కరించిన గ్రంథం

సాధారణంగా పరిశోధనా సిద్ధాంత గ్రంథాలు (పిహెచ్‌డి థీసెస్‌లు) అంతగా కొరుకున పడవు. అవి సాహిత్యం మీద చేసిన పరిశోధన అయినా కూడా సామాన్య పాఠకుడికి మింగుడు పడవు. దానికి కారణం పరిశోధనలోని సంక్లిష్టత అయి ఉండొచ్చు. కానీ ప్రతి నిబంధనకు ఒక మినహాయింపు ఉన్నట్టు కొన్ని పాఠకుడికి చేరువవుతూ ఉంటాయి. అలాంటి విమర్శనాత్మక అధ్యయనం ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్యపై చేశారు దాశరథి విజయలక్ష్మి. అసలు కవులందరిలోకి భిన్నమయిన మార్గం దాశరథిది. పండిత వంశం కావడం వలన వారసత్వంగా విద్వత్తు ఆయనకు అబ్బటంలో ఆశ్చర్యం లేదు. కానీ సంప్రదాయ కుటుంబాల్లో ఉండే ఛాందసం ఆయనకు అబ్బలేదు. స్వతంత్రభావాలు కలిసి నిజాం రాష్ట్ర వ్యతిరేకతను తన కవిత్వంలో నింపి అక్షర ఫిరంగులను పేల్చి ఆయన అనేక కష్టాలు పడ్డాడు. జైలు జీవితం అనుభవించాడు. ఆ జైలు గోడల నుంచే 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని నినదించాడు. నిజాం కబంధ హస్తాల నుంచి స్వేచ్ఛకై పోరాడుతూనే సాహిత్యపరంగా దాశరథి చేసిన కృషి అపారం. మరే సమీప కవి చేయలేనంత సాహిత్య సృజన ఆయన చేశారు. దాశరథి తనపై పరిశోధన వద్దని విజయలక్ష్మి గారిని వారించినా పట్టుదల పెరిగిన దాశరథి విజయలక్ష్మి గారు 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఈ సిద్ధాంత వ్యాసం ఇప్పుడు పుస్తక రూపంలో వెలువడటం ఎంతో సమంజసంగా ఉంది. సమంజసంగా ఎందుకంటే ఇది దాశరథి శత జయంతి సంవత్సరం... ఆ సిద్ధాంత వ్యాసం (పి.హెచ్.డి. థీసెస్) గ్రంథ రూపంలో వెలుగుచూడటానికి ఇంతకు మించిన సందర్భమేముంటుంది. విజయలక్ష్మిగారి కుటుంబ సభ్యులు ఈ గ్రంథాన్ని దాశరథి శతజయంతి సందర్భంగా తీసుకురావటం దాశరథి పట్ల వారికున్న గౌరవాన్ని సూచిస్తుంది.



దాశరథిపై పరిశోధన చేయాలన్న కోరిక వారికెందుకు కలిగింది?

*"అలనీలగగనాన వెలిగే నీ రూపు*
*ఆనందభాష్పాల మునిగె నా చూపు*
*మనసార నిను చూడలేనైతి స్వామి*
*కరుణించి ఒకసారి కనిపించవేమి"*

అన్న దాశరథి పద్యం వారికి దాశరథి సాహిత్యంపై మక్కువ పెంచింది. "కప్పుకొన దుప్పటీ లేని కవి కలాన గప్పుమని నిప్పుమంటలు క్రమ్మునంట" అని కవి వెదజల్లిన నిప్పుమంటలను పరిశోధించాలనే కోరికతో దాశరథి సాహిత్యాన్ని మథించారు. అందుకు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు మార్గదర్శకులుగా నిలిచి ఆ ప్రయత్నానికి చక్కని ముగింపునిచ్చారు. అదీనాడు గ్రంథమై మనలను అలంకరించింది. అధ్యాయాలకు ఎంచుకున్న శీర్షికలు కూడా సందర్భోచితంగా ఉన్నాయి. మొదటి అధ్యాయం 'దాశరథి – జీవితధుని' ఆయన జీవిత అంశాలను, జీవన యానాన్ని స్పృశిస్తుంది. ఆయన కవిత్వాన్ని ప్రతిబింబిస్తూ, రెండో అధ్యాయం దాశరథి – కవితారథి అంటూ సాగుతుంది.

అలా దాశరథి కవితావేశాన్ని మనకు అందిస్తారు. దాశరథి సినీగేయ ప్రస్థానం కన్నా ముందు అనేక లలితగీతాలు వెలువరించారు. అనేక వేదికల మీద ఆలపించే ఆ చల్లని సముద్ర గర్భం పాటకానీ, రేడియోలో ప్రసారమయిన పిల్లల్లారా... పాపల్లారా.. రేపటి భారత పౌరుల్లార... వంటి అనేక పాటలు గుర్తుకొస్తాయి. దాశరథి గీతిక రవళి అధ్యాయం ఆ అంశాలను చక్కగా స్పృశిస్తుంది. అలాగే దాశరథి అనువాదాలకు కూడా పెట్టింది పేరు.

ఆయన అనువాదం చేసిన గాలిబ్‌గీతాలు అందుకు నిదర్శనం. ఆనాటి కవిగా దాశరథి దృక్పథమేమిటో వివరించే దాశరథి కవితా వివేచన అధ్యాయం దాశరథి కవిత్వ శక్తి, దాశరథి కవితా వస్తువుని వివరిస్తుంది. ఇలా దాశరథి విమర్శనాత్మక అధ్యయనం మనకు దాశరథి సాహిత్య విశ్వరూపాన్ని చాలా హాయిగా, చదువుకోవటానికి వీలుగా మనముందుంచుతుంది. దాశరథి పిహెచ్‌డి థీసెస్‌ను చదువరులకు ఆసక్తి కలిగించే విధంగా రూపొందించటంలో ఎంతో శ్రద్ధ చూపిన విజయలక్ష్మి గారి కుమార్తె, అల్లుడు, సుదర్శన్ – వినీలలకు అభినందనలు. దాశరథిని ప్రేమించేవారందరికీ చక్కటి కానుక ఈ గ్రంథం. ఈ గ్రంథానికి పెమ్మరాజు రవికిషోర్ ముఖచిత్రం మరింత వన్నెలద్దింది.

**– సి.ఎస్. రాంబాబు**

# ఐరోపా శిల్ప - చిత్రకళా వైభవం

చిత్రకళా చరిత్ర పరిధి చాలా విస్తృతమైనది. ఆదిమానవుని గుహారేఖా చిత్రాలతో మొదలు నేటి ప్రయోగాత్మక చిత్రకళ వరకు అవగాహన, సింహావలోకనం కలిగించేదే చిత్రకళా చరిత్ర. సంస్కృతి సంప్రదాయాలను, నూతన పోకడలను కలుపుకుని గతం నుండి వర్తమానంలోకి సాగే నిరంతర ప్రక్రియ, వర్తమానం నుంచి భవిష్యత్తులోనికి ప్రవహించే మహానది చిత్రకళ అంటారు విమర్శకులు.

ఇటువంటి చిత్రకళలో ఐరోపా చిత్ర-శిల్ప కళలపై విస్తృతంగా పరిశోధన చేసిన తెలుగువారిని వేళ్లపై లెక్కపెట్టవచ్చు. అటువంటి వారిలో ప్రథములు కోడూరు పుల్లారెడ్డి. వారు రచించిన *ఐరోపా శిల్ప చిత్రకళా వైభవం* గ్రంథాన్ని వెలుగులోకి తీసుకురావటానికి ఆయన తన ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టారు. ఆరు సంవత్సరాలు కృషిచేసి చిత్రాలను వర్ణసంచితం చేసి ఉద్గ్రంథంగా వెలువరించారు. పుల్లారెడ్డి వృత్తిరీత్యా - విద్యుత్ శాఖలో ఇంజనీరుగా చాలాకాలం పనిచేసి ఉన్నత పదవిలో రిటైర్ అయ్యారు. ప్రవృత్తి రీత్యా ఆంధ్రాంగ్ల హిందీ సాహిత్యాన్ని కూలంకషంగా, తులనాత్మకంగా అధ్యయనం చేసిన ప్రతిభ పుల్లారెడ్డి గారిది.




అయిదు వందల పేజీలలో ఈ గ్రంథంలో ఉన్నదేమిటా అని పరిశీలిస్తే - ఇటలీ పునరుజ్జీవన కాలంలో శిల్ప, చిత్రకళల ప్రభావం ఎలా ఉందో వివరిస్తారు. ఇందుకు ఆయన ఆకాలం నాటి శిల్పాల్ని, చిత్రకారుల్ని అధ్యయనం చేసి వ్యాసాలుగా అందించారు - ఈ గ్రంథంలో లియనార్డో ద వించి, మైఖెలాంజెలో, రాఫెల్ శాంజియో, టిషన్ వంటి ప్రముఖుల శైలులు మనకు అనుభవంలోకి వస్తాయి. ఇంకా కొన్ని శిల్పాల సమాచారం మనకు కొత్త విశ్లేషణతో అందించారు. మరో అధ్యాయంలో ఉత్తర ఐరోపాలోని పునరుజ్జీవన కాలంనాటి చిత్రకళ ఎలా వికసించిందో విశ్లేషించారు. మరోచోట చిత్రకళను వాస్తవికతతో ఉజ్వలోపేతం చేసిన 17వ శతాబ్దాన్ని ప్రస్తావించారు. అంతేకాక కారవాజియో, రెంబ్రాంట్ వంటివారు చేసిన విశేష కృషిని తెలియజేసారు. అదేవిధంగా రొకొకొ, బొరొకొ నుండి విలియం హొగార్త్, నికోలస్ పౌసిన్, థామస్ గైన్స్‌బరోలతో పాటు ఆ కాలంనాటి ప్రముఖ చిత్రాలను నూతన ప్రామాణికతత్వ అధ్యాయంలో కొత్త కోణంలో విశ్లేషించారు. ఈ గ్రంథంలో ప్రముఖంగా మనకు తెలియవచ్చేవి ఆధునిక ప్రపంచ చిత్రకళ ఔన్నత్యానికై కృషి చేసిన వ్యక్తుల పరిచయం వివరణాత్మకంగా సాగుతుంది. అలాగే సాధారణ చిత్రాకళలో భావ ప్రకటన - ఆ తదనంతరం కృషి చేసిన వారిని స్మరించుకోవడం మనం గమనించవచ్చు.

చివరి అధ్యాయంలో ఆధునిక సమకాలీన ప్రపంచం అంశంలోని విశిష్టతను గుర్తుచేసే ప్యాబ్లో పికాసో, హెన్రీ మ్యాటిసి, సాల్వడార్ డాలి, ఎడ్వర్డ్ మంక్ వంటి ప్రముఖుల కృషిని వివరించే వ్యాసాలతో ఈ గ్రంథం ముగుస్తుంది.

ఇంతటి ఉద్గ్రంథం వెనుక పుల్లారెడ్డి అకుంఠిత దీక్ష, అధ్యయనశీలత, వారి శారీరక ఇబ్బందులను అధిగమించి చేసిన పరిశోధన ఉన్నది. మనందరికీ విభిన్న అభిరుచులు ఉంటాయి. అయితే వాటినొక ఎజెండాగా తీసుకుని అత్యంత విలువైన పుస్తకంగా మార్చే తలంపు అందరికీ ఉండదు. ఆ తలంపు ఉన్నా అందుకవసరమైన కఠోర శ్రమ, దీక్ష ఉండవు. అనారోగ్యాన్ని లెక్కచేయకుండా వారు తెచ్చిన ఈ గ్రంథం ఒక పరిశోధక గ్రంథమని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఆయన కృషి, పట్టుదల మనకు ఆదర్శం. చిత్రకళను, శిల్పకళను ప్రేమించే వారి దగ్గర తప్పక ఉండవలసిన పుస్తకం. ఈనాటి ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులకు ఈ వర్ణచిత్ర శోభిత గ్రంథం ఒక దీప స్థంభం.

- **మిసిమి**

*వెల : 1999, పుటలు : 545, ప్రతులకు : కోడూరి పుల్లారెడ్డి, ఫోన్ : 9550818495*

## సైనికుడి త్యాగాన్ని చెప్పే వీరగాథలు

తెలుగులో భారత సైనికుల వీరోచిత పోరాటాలపై అనువాదాలు కానీ, మూల రచనలు గానీ అరుదుగా వస్తాయి. అలాంటి ఒక పుస్తకం "భారత సైనికుల వీరగాథలు' ఈ శీర్షికతో యువ రచయిత్రి అఖిల కొనకంచి తెలుగులోకి తెచ్చారు. దీని మూల రచయిత లెఫ్టినెంట్ జనరల్ సతీష్ దువా (రిటైర్డ్) గారి అనుభవాలే ఈ పుస్తకం. వీరు ఎమ్.బి.బియస్ ఒక సంవత్సరం చదివి సైన్యంలో చేరాలన్న బలమైన కాంక్షతో డాక్టర్ చదువు మానేసి ఎన్.డి.ఎలో చేరారు. ఆయన ముప్పై తొమ్మిది సంవత్సరాల మిలటరీ జీవితంలో ఎన్నో గెలుపోటములు చూశారు. నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. ఆర్మీలో జమ్మూ & కాశ్మీర్ వైట్ ఇన్ఫాంట్రీలో సొంత బెటాలియన్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా బాధ్యత నిర్వహించారు. ఆయన ఆ బాధ్యతలో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలను ఈ పుస్తకంలో కథలుగా రాశారు. ఒక సైనికుడి జీవితం ఎలా ఉంటుందో ఈ పుస్తకం ద్వారా మనకు తెలుస్తుంది. ఆర్మీ జీవితం తనకు గొప్ప పాజిటివ్ థింకింగ్ నేర్పిందని దువా గర్వంగా చెబుతారు. అనేక కష్ట సందర్భాల్లో అదే ఆదుకుందని కూడా పేర్కొంటారు. మొత్తం పన్నెండు అధ్యాయాలున్నాయి. ఒక్కో అధ్యాయం ఒక్కో పోరాట గాథను మన ముందుంచుతుంది. ఇందులో వీరోచితమైన సర్జికల్ స్ట్రైయిక్స్, ఉత్కంఠభరితమైన మిలిటరీ ఆపరేషన్, సైనికులకుండే కఠినమయిన శిక్షణ, దేశంకోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలు మనలను ఆశ్చర్యపరుస్తాయి.




'India's Brave Hearts' పేరుతో వచ్చిన ఈ ఆంగ్ల గ్రంథాన్ని చక్కని శైలితో, చదివించే భాషలో తెలుగులోకి అనువాదం చేశారు యువరచయిత్రి అఖిల. ఏ అనువాదానికైనా మూల రచనలోని ఆత్మను పట్టుకోగలిగితేనే ఆ అనువాదం పాఠకుడికి చేరుతుంది. ఆ విధంగా రచయిత్రి విజయం సాధించారు. గడ్డకట్టే చలిలో, దేశ సరిహద్దుల్లో పహారాకాస్తూ శత్రుదాడిని ఎదుర్కొని నిరంతరం జాగరూకులై ఉండే భారత వీరజవాన్‌ల సంతోషాలు, ఉద్విగ్నభరిత క్షణాలు, దుఃఖ సమయాలు తెలియాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే. పుస్తకానికి ఎడిటర్ ఉపయోగం ఎంతుందో ఈ పుస్తకం మనకు తెలియజేస్తుంది.

*-సి. ఎస్. ఆర్.*

వెల : 200/-, పుటలు : 130, ప్రతులకు : అజు పబ్లికేషన్స్, ఫోన్ : 9912460268

---

## కమ్మతెమ్మెరలు

**మిసిమి** డిసెంబర్ సంచికలో ఆనందమయ జీవితానికి కొన్ని మార్గాలు చెప్పారు. చాలా సంతోషం. ఈనాటి యువత చదవడమే మర్చిపోయింది. ఇప్పటి **మిసిమి** పాఠకులంతా విశ్రాంత జీవితం గడుపుతున్నవారే కనుక మాతరం పాఠకులం **మిసిమి**ని చదివి బాగా ఆనందిస్తున్నాం. అప్పుడప్పుడు ఇటువంటి విషయాలు పాఠకులకు గుర్తు చేయడం అవసరంగా భావిస్తున్నాను. ఈ మాత్రమైనా మీరు గుర్తు చేయకపోతే మా కర్తవ్యాలను మా పిల్లలకు చెప్పటానికి మర్చిపోతుంటాము. ఉమాసుందరి గారు యథాలాపంగా ఇప్పుడు ఇవన్నీ ఎవరికి కావాలండి అని అన్నారే కాని లోకం పోకడ చూస్తున్నవారు కనుక బాధతో అన్నమాట అది. సీరియస్‌గా తీసుకోకండి. శ్రీరామచంద్రరావు గారి వేలుపిళ్ళై కథ విశ్లేషణ బాగుంది. 50 సంవత్సరాల తరువాత వేలుపిళ్లైని పరామర్శించడం ఆనందంగా ఉంది. మానవ స్వభావాల్ని అందంగా, రసరమ్యంగా దిద్ది తీర్చిన కథ. ఈ కథకు బాపు వేసిన బొమ్మ ఇప్పటికీ కళ్ళముందు కదుల్లాడుతూ ఉంటే అగ్గిపుల్ల వెలుగులో శృందామరైని చూపించడం బాపుగారి భావుకతకు పట్టంకట్టినట్లుగా ఉంది.




ఇంత గొప్ప కథను విశ్లేషించిన విధానం బావుంది కాని, కథా రచయిత సుకుమారంగా అందించిన భావాలను విశ్లేషణలో మరింతగా చెప్పలేకపోయారు. నవల, కథా పరిచయాలు మరికొంత వివరంగా ఉంటే బాగుంటుందనుకొంటున్నాను. 85 ఏళ్ల వయస్సులో వేలుపిళ్ళై విశేషణ చూసాక భానుమతి పాట ఎన్నాళ్ళకి ఈ బ్రతుకు పండెనో మదిలో మెదిలింది. ఎడిటర్ గారికి, రామచంద్రరావు గారికి, రామ్మోహన్ రావుగారికి అభినందనలు. ఇదంతా వేలుపిళ్ళై కథలు కునేగా మరికొళిందు పరిమళాల్ని ఆస్వాదిస్తూ 60 ఏళ్ళ క్రిందనే చదివానని చెప్పటానికి, ఆనందించానని చెప్పడానికి మాత్రమే ఈ లేఖ.

***– గుడిపాటి సుబ్బారావు***

# చదవండి...

– *మిసిమి*

**మలుపు - డా. కొప్పరపు నారాయణమూర్తి:** చదివి ముగించిన తర్వాత ఆలోచనను రగిలించేది మంచి కథకు ఉండవలసిన ముఖ్య లక్షణం. ఈ సంపుటంలో కథలకు ఈ మాట వర్తిస్తుంది. స్త్రీ జాతి పక్షాన ధిక్కార స్వరాన్ని వినిపించిన కథలలోని నారాయణమూర్తి చైతన్యాన్ని తెలుగు కథాలోకం తప్పక గుర్తిస్తుందని ఆశిద్దాం.




పేజీలు : 220, వెల : 225, ప్రతులకు : ఫోన్ : 7671909759

**పిల్లలూ... పెద్దలూ... ముళ్ళున్నాయి జాగ్రత్త ! (పిల్లల నవలిక ) - డా. కొప్పరపు నారాయణమూర్తి :** డా. నారాయణమూర్తి నవలలోని విద్యకు సంబంధించిన విషయం లడ్డులోని జీడిపప్పులాంటిది. ఉండలో ఉండేది ఒక్కటే అయినా ఎక్కడో దాక్కుని ఉంటుంది. కానీ చాలా రుచిగా ఉంటుంది. ఈ నవలన చదివి, తెలుసుకున్న టీచరూ, స్టూడెంటూ మధ్యన ఉండే మమకారప్పూస రుచిని మీరు మరిచిపోరు! ఇందులోని అక్షర మక్షరంలో ఎంతో బాధ, ఆవేదన మనకు కనిపిస్తాయి. ముఖ్యంగా నైతిక విలువలు, గురుశిష్య సంబంధం, అనుబంధాలు, వంటివాటి పట్ల రచయితకున్న అనేక అభిప్రాయాలు ఇందులో చూడొచ్చు.



పేజీలు : 63, వెల : 80, ప్రతులకు : ఫోన్ : 7671909759.

**వేమన అనుభవ సారం - అనుమాండ్ల భూమయ్య :** కాలాను గుణంగా మార్పులకు లోనయ్యేది, తనది కానిది, తల్లిదండ్రుల నుండి సంక్రమించినదైన శరీరం, సమాజ మందించిన విజ్ఞానాన్ని తనదిగా చేసుకొని నిరంతరం ఆలోచనలు చేసే మెదడు, ఏ మార్పునూ పొందకుండా ప్రాణులన్నింటిలోను ఉండే ఆత్మ మనిషిలో ఉంటాయని పెద్దలు చెప్పిన మాట. ఇహపరాలకు సంబంధించి ఉన్న వేమన పద్యాల్లో ఆత్మదర్శనం దిశగా సాగిన ఈ భావ పరిణామం కన్పిస్తుంది. ఈ క్రమ పరిణామాన్ని వారికి తోచిన విధంగా 15 విభాగాల్లో పొందుపరచి 'వేమన అనుభవసారం' పేరుతో ఈ గ్రంథాన్ని వెలువరించారు రచయిత.




పేజీలు : 123, వెల : 75/–, ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు.

**మడకెద్దులు - పేరూరు బాలసుబ్రమణ్యం:** సమకాలీన సామాజిక వ్యవస్థ పేరూరు బాలసుబ్రమణ్యంలాంటి దిగువ మధ్య తరగతి జీవితాన్ని తన స్వార్థం కోసం, పేరూరు బండను తొలిచి చిన్న శకలం చేసినట్టే వాడుకుని, కొంత భాగాన్ని మాత్రమే వదిలిపెట్టింది. అలాంటి చిన్న జీవిత శకలంపైన బాలసుబ్రమణ్యం కట్టుకున్న చిన్న కథల గుడిలా యిప్పుడీ పుస్తకం వెలువడు తోంది. పేరూరు కట్టుకున్న యీ చిన్న కథల గుడికి సహృదయులైన పాఠకు లందర్నీ ఆహ్వానించే అవకాశం దొరికినందుకు సంతోషించాలి.



పేజీలు : 141, వెల : 150/–, ప్రతులకు : ఫోన్ : 9849224162, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

**శ్రీ వైష్ణవ కవి-పండిత కుటుంబాలు - డా. శ్రీ రంగాచార్య :** శ్రీ వైష్ణవ కుటుంబాల వారిని గూర్చి విశేషంగా శ్రమించి గ్రంథాన్ని సిద్ధం చేసిన శ్రీమాన్ శ్రీ పెరుంబూదూరు శ్రీ రంగాచార్య స్వామి ప్రస్తుతానికి 28 కుటుంబాల గూర్చిన వివరాలే మనకందించినారు. ఇది – నేటితరానికి చెందిన శ్రీ వైష్ణవయువత – తమతమ వంశ మూలాలను ఇంటి పేర్లను – వాటి నేపథ్యాన్ని క్షుణ్ణంగా తెలుసు కోవటానికి – పరిశోధనాత్మకమైన ఈ కృషి ఎంతగానో ఉపకరిస్తుంది. ఇదొక ప్రయోగాత్మక పరిశోధన.




పేజీలు : 104, వెల : 150/–, ప్రతులకు : ఫోన్ : 9299451266

# మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి  బహుమతిగా పంపండి

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపేతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ–మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**